# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక మే, 2012 ₹ 20

2556 బుద్ధ జయంతి సంచిక




వజ్రయాన దేవత  తార

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 23 　 మే 2012 　 సంచిక 5**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 　 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 　 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*



మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు

సిద్ధార్థ గౌతముని జీవన గాథ ................................ 5
*– చెన్నూరు ఆంజనేయ రెడ్డి*

బ్రహ్మవాదం – బుద్ధుడు ................................ 11
*– భదంత ఆనంద కౌసల్యాయన్*

శ్రమణ సంప్రదాయం ................................ 20
*– డి. చంద్రశేఖర్*

బౌద్ధం కోర్కెల్ని చంపుకోమంటుందా ? ................................ 29
*– శ్రీకృష్ణార్జున బోధి*

బుద్ధుని మౌనం ................................ 34
*– వేదాంతం లక్ష్మీప్రసాద రావు*

బౌద్ధంలో స్త్రీల ప్రతిపత్తి ................................ 37
*– ఇల్లిందల సరస్వతీ దేవి*

పునర్భవం ................................ 40
*– వల్లభనేని అశ్వినీకుమార్*

బోధిధర్మ ................................ 48
*– డాక్టరు ఫజులుల్లా ఖాన్*

మేధావుల దృష్టిలో బౌద్ధం ................................ 52
*– ఎస్. టాంగ్*

యథాభూత జ్ఞానదర్శనం ................................ 56
*– అన్నపరెడ్డి బుద్ధఘోషుడు*

బుద్ధం శరణం గచ్ఛామి ................................ 61
*– డాక్టరు కాలువ మల్లయ్య*

ఆచార్య పరంపర ................................ 63
*– ఈమని శివనాగిరెడ్డి*

కళావాహినికి ఊటపట్టు సిద్ధార్థుని జీవితం ................................ 67
*– కృష్ణ చైతన్య*

అగాధం ................................ 72
*– ఆస్కార్ వైల్డ్ – అశ్విని.కె*

చదవండి (పుస్తక పరిచయం) ................................ 77


*ముఖచిత్రం* : ధర్మచక్ర ప్రవర్తన

*రెండవ అట్ట* : తార

*మూడవ అట్ట* : ఆమ్రపాలి

*నాల్గవ అట్ట* : మహాభినిష్క్రమణ


(*వివరాలు :* 51వ పుటలో.....)


*2556 బుద్ధ జయంతి సంచిక* ✦

గాంధీ విద్యార్థి దశలో లండన్‌లో ఉన్నప్పుడు మాథ్యూ ఆర్నాల్డ్ వ్రాసిన "లైట్ ఆఫ్ ఏషియా" గ్రంథాన్ని ఒకటికి రెండు సార్లు చదివి ఎంతో ప్రభావితుడయ్యాడు. "కార్య కారణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఏకైక ఆచార్యుడు, గౌతముడే"నని గాంధీ వక్కాణించాడు.

ఇరవైయవ శతాబ్దపు ప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్త, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడా బౌద్ధధర్మాన్ని "ఆధునిక శాస్త్ర విజ్ఞాన అవసరాలకు సరితూగే ధర్మం ఏదైనా ఉందంటే అది బౌద్ధమే" అని ప్రశంసించారు.

ఆధునిక జీవితంలో విజ్ఞాన పరిశోధనకు ఎంత ప్రాముఖ్యత ఉన్నదో బౌద్ధంలో సత్యశోధనకూ అలాంటి ప్రాముఖ్యతే ఉంది. ఈ విషయానికి కాలామ సుత్త లో ఒక ఉదాహరణ: కాలాములు నివాసమున్న కేసపుత్త అనే నిగమాన్ని భగవానుడు దర్శించినపుడు కాలాములు ఆయన వద్దకు వచ్చి ఇలా అడిగారు: "భగవాన్! ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణులు, శ్రమణులు ఇతరుల సిద్ధాంతాలను, విశ్వాసాలని ఎండకడుతూ, తమ ధర్మాలను ఘనమైనవిగా ఘోషిస్తున్నారు. మరొక వర్గీయులైన బ్రాహ్మణులు, శ్రమణులు కూడా వారి వారి సిద్ధాంతాల ప్రాముఖ్యతను ప్రశంసిస్తూ ఇతరుల ధర్మాన్ని నిరసిస్తున్నారు. ఈ సంఘటన మమ్ములను సంశయంతో, సంఘర్షణతో నింపివేస్తోంది. వీరిలో ఎవరు సత్యాన్ని చెబుతున్నారు, ఎవరు అసత్యాన్ని చెబుతున్నారు?"

కరుణాసముద్రుడైన భగవానుడు ఇలా అన్నాడు. "అవును కాలాములారా, మీరు లోనైన సందిగ్ధతలో ఈ సందేహం రావడం సహజమే. ఒకరు చెప్పింది కానీ, మరొకరు చేరవేసింది కానీ, సంప్రదాయంలో ఉన్నదని కాని, మీరు దేనినీ విశ్వసించి గుడ్డిగా అనుసరించకండి. మత గ్రంథాలలో పేర్కొన బడిందని, తర్కంతో లేదా సూచనల వలన, ఊహాజనిత విషయాల వలన, సాధ్యాసాధ్యాల వలన, అభిప్రాయాల వలన ప్రేరేపితులు కాకండి. కానీ, మీ విజ్ఞతతో మీరు కొన్ని విషయాలు సర్వజన సమ్మతం కావని తెలుసుకొన్నపుడు వాటిని వదిలివేయండి; మీ విజ్ఞతతో మీరు కొన్ని విషయాలు సర్వజన సమ్మతమని తెలుసుకొన్నపుడు వాటిని గ్రహించి ఆచరించండి."

ముఖ్యంగా ఈ ప్రాథమిక అంశాల సంయోగ సహకారాల వలననే బౌద్ధం శాస్త్ర పరిశోధనకు సమాంతరస్థాయిలో ఉంటుంది. విశ్వాసం కంటే పరిశోధనా ప్రమాణాలే బౌద్ధానికి ప్రధానాంశాలు. ఈ ముఖ్యలక్షణమే బౌద్ధాన్ని ప్రపంచంలో ఇతర మతాలనుంచి భిన్నంగా ఉంచుతోంది. బౌద్ధం ఒక దైవదత్తమైన మతవిశ్వాసం కాదు. దీనికి దైవప్రోక్తమైన గ్రంథమేదీ లేదు. ఒక ప్రవక్త లేడు, అందువలన మూఢనమ్మకాలనూ, పిడివాదాన్ని ఆశ్రయించదు. వీటిపై ఆధారపడిన మతవిశ్వాసాలు, ఈనాటి సాంకేతిక సమాచార ప్రభావంతో పేకమేడల్లా కూలిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో బౌద్ధం ఒక్కటే శాస్త్రవిజ్ఞానం, హేతుసంకేత పరంగానే ఉన్నదని, ఇప్పటి ప్రాచ్య, పాశ్చాత్య దేశ ప్రజలు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా అక్షరాస్యత అధికంగా ఉన్న పాశ్చాత్య దేశాలలో బౌద్ధానికి గుర్తింపు ఎక్కువగా లభిస్తున్నది.

2556 బుద్ధ జయంతి సంచికలో బౌద్ధ ధర్మంలోని లోతుపాతులను పరిశీలించి చిక్కని రచనలందించిన రచయితలకు మా కృతజ్ఞతలు.



**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'అంతర్వీక్షణం'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "...*ఆస్కార్ వైల్డ్‌*ని బైబిల్‌లా చదివాను. DE PROFUNDIS –*అగాధం:* రెండు మాటల్లో–అద్భుతం–పరమాద్భుతం!..."

**– జి.వి. కామేశ్వరరావు,** Clinical Phycologist , రాజమండ్రి.

✶ "... *డాక్టరుగారులో* 'అనుభవించవలసిన వయసును హారతి ఇచ్చి, నాకు వెచ్చని జీవితాన్నిచ్చారు' ఈ వాక్యం చదువుతుంటే ఎండిపోయిన నా కళ్ళు చెమర్చాయి. నాకు 84 ఏండ్లు. బెంగుళూరు దగ్గర్లో, నేలమంగళంలో వుంటాను..."

**– పెద్ది సత్యనారాయణ,** నేలమంగళం.

✶ "...సుశీలా రాణి పటేల్ ఉత్తరం చూసి నేను చాలా సంతోష పడ్డాను. ఆమె మీకెలా కలిసిందోనని చాలా ఆశ్చర్యపోయాను. 10 సంవత్సరాల క్రితమనుకుంటాను నేను బాబూరావు పటేల్ ఫిల్మ్ ఇండియా చదివేదానిని. ఆ వయసులో నేను, నా సోదరి ప్రశ్నలు–జవాబులు చదవటం అంటే ఇష్టపడే వాళ్ళం. సుశీలారాణి పటేల్‌ను, బాబూరావు పటేల్ అనుభూతులను గురించి తెలియజేయమనగలరా? ఆమె అంగీకరించినట్లైతే నేను చాలా అదృష్టవంతురాల్ని..."

**– మంగళా కందూర్,** చెన్నై.

✶ "...ఈ మార్చి నెల ***మిసిమి*** లో *చరిత్రగర్భంలో...* నండూరి పార్థసారథి ఉత్తర, దక్షిణ సంగీత పద్ధతులు రెండింటికీ నూటికి 99 వంతులు శాస్త్రం ఒక్కటే అని వ్రాసి స్వరాల భేదాన్ని మాత్రమే ముచ్చటించి కర్ణాటక సంగీతంతో ఏ మాత్రమూ పొంతనలేని తాళ విషయాన్ని మాత్రం పూర్తిగా వదిలేశారు. ఈ రెండు సంగీత పద్ధతులకూ కొన్ని సారూప్యాలు ఉన్నాగాని తాళ విషయంలోనూ గమకాల వినియోగశైలుల విషయాలలోనే ఉంది అసలు తేడా అంతా... కర్ణాటక సంగీతంలో ఒక్క కైశికి నిషాదమే 27 రకాలుగా వినియోగింపబడుతూండగా యిదే స్వరం హిందూస్థానీ సంగీతంలో ఎన్నిరకాలుగా వినియోగింపబడుతోందో తెలుసుకొందామని వుంది..." **– ఆకెళ్ళ మల్లికార్జున శర్మ,** హైదరాబాదు.

✶ "...మార్చి 2012 ***మిసిమి***లో సారథి చిత్రం *రైతుబిడ్డ* పుట్టుపూర్వోత్తరాలు, ప్రభుత్వం జమీందారి బిల్లు పెట్టకపూర్వమే రైతుల బాధలు కీ.శే. గూడవల్లి రామబ్రహ్మం తీసిన *రైతుబిడ్డ* గూర్చి వ్రాశారు. 1939 ఆగష్టులో తెలుగుదేశంలో విడుదలైన *రైతుబిడ్డ* సినిమాలో, రైతుల కష్టాలు విడమర్చి చూపారు...

...అందులో వేషం వేసిన ప్రకాశంపంతులు సోదరుని కూతురు టంగుటూరి సూర్యకుమారి రైతు బిడ్డగా నటించారని తెలుసుకుని చాలా సంతోషించాను. రైతుగా బళ్ళారి రాఘవ, ఆయన భార్యగా కొమ్మూరి పద్మావతి నటించారు...

...నేను 1932లో పుట్టాను. మావూరికి 2 కి.మీ. దూరంలో కీ.శే. వత్సవాయి సుబ్బరాజు రైతుకొడుకుగా వేషం వేశారని నాకు 10,12 సం॥ల వయసులో మా వారంతా చెప్పుకునేవారు. ఆయన్ను చూడాలని చాలా ఉబలాటంగా వుండేది – మీరు రైతుబిడ్డ సినిమాను గూర్చి యింతగా తెలియచెప్పారు. మీకు వీలయితే రైతు కొడుకుగా నటించిన వత్సవాయి సుబ్బరాజు గారి ఫోటో ఒకటి ప్రచురిస్తారని ఆశ. లేదా ఆయన గూర్చి వివరంగా ఎవరన్నా తెలియపరిస్తే యింకా ఆనందం. నా కోరికను మన్నిస్తారని ఆశతో మీకు రాస్తున్నాను..." **– పి. హరిశ్చంద్రరావు,** హైదరాబాదు.

✶ “...*మిసిమి* చదువుతున్నాను. అందులోని అన్ని సంగతులు నాకు నచ్చుతున్నాయి. ఉదాహరణకి కుర్రవాని కథ (*డాక్టరుగారు*). ఇలాంటివి ఇంకా ఆహ్వానించండి...వీరే జాతిని నిర్మించే నిజమైన హీరోలు... ...అల్లం రాజయ్యలాంటి వాళ్ళతో రాయించండి. ఒక పుస్తకంగా తీసుకురావచ్చు...”

**– డా॥ రంగారావు,** ప్రశాంతి నిలయం, పుట్టపర్తి.

✶ “...*మిసిమి* మార్చి సంచికలో *రావిచెట్టు రాంగారావు*గారిని గూర్చిన వ్యాసం ప్రచురించారు చాలా సంతోషం. నాటి తరం భాషాసేవకుల పాండిత్యాన్ని నేటి తరంవారికి గుర్తుండేలా రచయిత వ్రాసారు. ఆ నాడే తెలుగుకు వెలుగు తెచ్చిన వారు కీర్తిశేషులయ్యారు. తెలుగుభాష కాదరణలేని రోజుల్లో రావుగారి భాషాసేవ అమూల్యమయ్యింది. నిజాం ఇలాకాలో ఉండి మున్సబుగిరిచేస్తూ భాషోద్యమానికి పాటుబడ్డారు. తెలుగును మరచిన తెలుగు వారికి భాషాద్వారాలు తెరిచారు. మన సంస్కృతీ పునర్జీవనానికి నడుంబిగించారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయానికి చేయూతనందించారు. కొమఱ్ఱాజువారి భాషోద్యమానికి బాసటగా నిల్చారు. ఇంటిపేరు రావిచెట్టును సార్థకం చేసిన మేధావి...”

**– గెల్లి రామమోహనరావు,** గుంటూరు.

✶ “...*మిసిమి* మార్చి సంచికలో *డాక్టరుగారు* చదువుతుంటే కళ్ళమ్మట నీళ్ళు వొస్తున్నాయి. ఎంత గొప్ప జీవితం. ఎంత సింపుల్‌గా చెప్పారు. *యాత్ర* బొమ్మ ఎంత బాగుందో అంత దుఃఖ భూయిష్టంగా ఉంది...”

**– అన్నపూర్ణ,** (ఎస్.ఎమ్.ఎస్.)

✶ “...*యాత్ర* కవితకు వేసిన బొమ్మ చాలాచాలా ఆర్ద్రంగా వుంది. కన్నుల్లో నీరు తిరుగుతుంది...”

**– చాట్ల శ్రీరాములు,** హైదరాబాదు.

✶ “...ఏప్రిల్ 2012 సంచికలో *చీకటంతా చీల్చి పాడిన ఊట్లకొండయ్య* ఆత్మకథ ప్రచురించారు. దానిని గురించి... ఈ ఆత్మకథ ఆయన (కవి) జీవితం చరమాంకంతో ముగింపు పలకలేదు. ఆ వివరాలు లేవు. ఆయన *కవిపితామహ*, సహజకవి మొదలైన బిరుదులు... ఆయన కవిత్వానికి, కావ్యానికి, నేను, నా మిత్రులు అబ్బురపడి ఆయన కావ్యగ్రంథానికి ఆవిష్కరణ సభ అంబేద్కర్ భవన్ (లోయర్ ట్యాంక్ బండ్) లో జరిపి, సన్మానం చేశాము...

...భగవాన్ సత్యశాయి చావుమాదిరిదే ఈయన చావుకూడ. కవిత్వం మిగిలింది. కవులకు అదేమి శాపమో, మరేమో తెలియదుగాని, వీరి బిరుదులు, గండపెండేరాలు బువ్వ పెట్టలేదు. శ్రీనాథకవి కూడ జీవితం చివరి దశలో ఇక్కట్ల పాలై మరణించాడు...

... కాటూరి కవితా పీఠాన్ని పోషించిన ఆయనకు అన్నం దొరకలేదు. ఆయన మాటల్లోనే: “శ్రీనాథ వ్యవసాయం చేశాను. నే కొన్న ప్రెస్ నాకు ఆధారం కాలేదు”. ఎంతవ్యధ...

... ఎంతటి వాడైనా గృహోన్ముఖుడు, కార్యోన్ముఖుడు కావలిసిందేనని ఋజువు చేస్తుంది. కవిపితామహ *ఊట్లకొండయ్య* కవి జీవితం. కవిలోకం కూడుపెట్టలేకపోయింది...” **– ఎస్.టాంగ్,** హైదరాబాదు.

✶ “...*అగాధం* ఇప్పటికి మూడుసార్లు చదివాను. ఇది రాయటం సాహసమే. శైలి చనుకట్టు కాఠిన్యం! ఇది సాధించటం ఒక యోగమే. ఒక సంవత్సరం పొరపాటుగా అచ్చయింది...” **– విజయ,** రామచంద్రాపురం.

✶ “...సాయికృష్ణ బొమ్మలు మనోహరంగా వున్నాయి. జయదేవుని కావ్యసౌందర్యాన్ని ఎంతో కమనీయంగా కన్నుల ముందుంచారు...” **– సుందరాచారి,** మంగళగిరి.

✶ “...*ఆస్కార్ వైల్డ్* (DE PROFUNDIS) ఇంతవరకు తెలుగులో వచ్చిన దాఖలాలు లేవు. వైల్డ్ లాంటి ప్రతిభాశాలిని తెలియజేయటం, వందేళ్ళ తర్వాత అయినా వెలికి తెచ్చి తెలుగువారికి తెలియజేయటం, అదీ చిక్కని శైలిలో, ప్రశంసనీయం. పూర్తిసారం అందిస్తారని ఆశిస్తున్నా...” **– రామారావు,** మద్రాసు.

# సిద్ధార్థ గౌతముని
# జీవన గాథ

– చెన్నూరు ఆంజనేయ రెడ్డి

ప్రాచీన భారతీయులకు చారిత్రక దృష్టి దాదాపు శూన్యమనే చెప్పాలి. ఆనాటి మేటి రచయితలకూ, సాహిత్యకారులకూ సమకాలీన ప్రముఖుల జీవిత విశేషాలను భావితరాలకు అందించాలన్న ఉద్దేశ్యమున్నట్లే అగుపించదు. వేదఋషుల విశ్వాసాలనూ, వారుసాగించిన ఆధ్యాత్మిక సాధనలను, నిర్వహించిన యజ్ఞయాగాదులను మాత్రమే బ్రాహ్మణాలూ, ఉపనిషత్తులూ వివరించాయి. ఆ మహర్షుల జీవితాలకు సంబంధించిన విశేషాలు ఛాయామాత్రంగానైనా అందులో అగుపించవు. బోద్ధల కన్నా వారి బోధనలే ముఖ్యమన్న ఆనాటి సామాజిక విశ్వాసమే బహుశా అందుకు కారణమై ఉండవచ్చు. వేదకాలపు ఋషులంతా తమ బోధనల ద్వారానే ప్రసిద్ధిచెందారు. వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అస్పష్ట రూపురేఖలు మాత్రం ప్రాచీన భారతీయ సాహిత్యంలో మనకు గోచరిస్తాయి. కానీ బుద్ధ భగవానునికీ మనకూ మధ్య దాదాపు 26 శతాబ్దాల అంతరం ఉన్నప్పటికీ పాళీ ధార్మిక సాహిత్యంలో వెల్లడించిన వివరాలు ఆ మహనీయుని విశిష్టజీవిత చిత్రాన్ని ప్రస్ఫుటంగా చూపగలుగుతున్నాయంటే ఆయన విలక్షణ వ్యక్తిత్వ ఔన్నత్యమే అందుకు కారణం అనుకోవలసి ఉంది.

సమగ్ర సత్య ద్రష్టలయిన బుద్ధులు మానవకోటికి ముక్తి మార్గం చూపేందుకు ఆయా కాలాల్లో అవతరిస్తుంటారన్న విశ్వాసం కూడా ప్రాచీన భారత వర్షంలో ప్రబలంగా ఉండేది. బుద్ధుల లక్షణాల గురించి, గుణగణాల గురించి కూడా ప్రాచీన భారతీయులకు కొన్ని నిశ్చితాభిప్రాయాలుండేవి. అందుచేత బుద్ధ జీవితగాథ రెండు రకాలుగా ఉండే అవకాశం ఉంది. ఒకటి బుద్ధుని యథార్థ జీవిత ప్రాతిపదిక మీద ఆధారపడితే, రెండవది బుద్ధుడు ఎలా ఉండాలన్న విశ్వాసాల మీద రూపొందింది. తొలి బౌద్ధ సాహిత్యంలో మొదటి ధోరణి అగుపించగా, ఆ తర్వాత వెలువడిన బౌద్ధ గ్రంథాల్లో ద్వితీయ ధోరణి కనిపిస్తుంది. వీటిలో బుద్ధుని జీవిత విశేషాలూ, బోధనలూ చాలా వివరంగా వర్ణనాత్మకంగా కనిపిస్తాయి. అయితే ఈ చిత్రణ అంతా బుద్ధుడెలా ఉంటాడన్న ఆనాటి జనవిశ్వాసానికి అనుగుణంగా వాస్తవ జీవితానికి దూరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పౌరాణిక, ప్రబంధ ధోరణులకు దగ్గరగా ఉంది.

త్రిపిటకాల్లో వినయపిటకం, సుత్తపిటకం గౌతముని బోధనలకూ కార్యకలాపాలకూ సంబంధించిన వివరాలను తెలియజేస్తాయి. ఆయన ఏయే నియమాలను ఎందుకు విధించాడు? ఏయే బోధనలను ఏ సందర్భంలో ప్రవచించాడన్న వివరాలను కూడ అవి అందిస్తాయి. వినయ పిటకం సంఘ నియమావళిని సహేతుకంగా తెలుపుతుంది. సుత్తపిటకం బుద్ధుని బోధనలను సందర్భసహితంగా వివరిస్తుంది.

పాళీ ధార్మిక గ్రంథాల్లో బుద్ధుని జీవిత విశేషాలు క్రమబద్ధంగా కనిపించకపోయినా, ఆయన జీవితానికి సంబంధించిన అనేక ముఖ్య ఉదంతాలను, ఆనాటి సామాజిక పరిస్థితులను కూడా అవి చాలా వరకు ప్రతిబింబిస్తాయి.

గౌతముడు శాక్యవంశ క్షత్రియుడైన శుద్ధోదనుని పుత్రుడు. పొరుగు రాజ్యమైన కోసల లాగా రాచరిక వ్యవస్థను కాకుండా శాక్యులు గణతంత్ర పాలనను పాటించారు. అయినా శాక్యులు కోసల రాజ్యాధిపత్యంలోనే ఉండేవారు. ఈ గణతంత్ర సమాజ పాలనా వ్యవహారాలను ఒక


ఆంగ్లం నుంచి అనువాదం : గజ్జెల మల్లారెడ్డి

సమాలోచన సభ నిర్వహించేది. దానికి రాజు అధ్యక్షత వహించేవాడు. గౌతముడు జన్మించే నాటికి శుద్ధోదనుడు సభాధ్యక్షుడుగా ఉన్నాడు. శాక్యులను ఆత్మాభిమానం, సమరశీల స్వభావంగల జాతిగా త్రిపిటకాలు వర్ణించాయి. గౌతముడు ఎంత సాధుమూర్తి, సంయమనశీలి అయినా స్వతంత్ర భావ వ్యక్తీకరణలోనూ, వైదిక కర్మకాండలను ఖండితంగా నిరసించడంలోనూ, సాధికారధోరణిలోనూ ఆయన జాతి సహజ లక్షణాలు ప్రస్ఫుటమవుతాయి.

శాక్య రాజధానియైన కపిలవస్తుపురం భారత – నేపాల్ సరిహద్దుల్లో కాశికి ఉత్తరాన వందమైళ్ల దూరంలో ఉంది. వరిపంట, పశుపాలనలే ఆ రాజ్య ఐశ్వర్యానికి మూలం. దాని చుట్టూ ఉన్న దట్టమైన అడవులు దారి దోపిడీలు చేసే దొంగల ముఠాలకు ఉనికి పట్టుగా ఉండేవి.

బుద్ధుని కన్నతల్లి మాయకూడా శాక్యవంశీకురాలే. ఆమె నిండు చూలాలుగా ఉన్న సమయంలో తన పుట్టినిల్లయిన దేవదహాకు వెళ్లుతూ మార్గమధ్యంలో ఉన్న లుంబినీ వనంలో సిద్ధార్థుని ప్రసవించింది. ఆ తర్వాత ఏడు రోజులకే తల్లి మాయ మరణించడంతో, ఆమె చెల్లెలు, శుద్ధోదనుని ద్వితీయ కళత్రమైన మహా ప్రజాపతి ఆ బిడ్డను పెంచి పెద్దజేసింది. అసితుడనే ఋషి బాల సిద్ధార్థుని సందర్శించి ఆ బాలుని భవిష్యత్తు మహోజ్వలమని చెబుతూ, అయితే అతని అపూర్వ సందేశాన్ని ఆలకించి తరించే మహద్భాగ్యం వార్ధక్యంలో ఉన్న తనకు లేదని ఆవేదన చెందినట్టు *సుత్తనిపాతం* చెబుతుంది.

బుద్ధునికి తల్లిదండ్రులు పెట్టిన పేరు సిద్ధార్థుడు. అంటే లక్ష్యాన్ని సాధించినవాడు. అయితే ఈ పేరు బౌద్ధసాహిత్యంలో అరుదుగానే అగుపిస్తుంది. గౌతముడు, శాక్యముని, శాక్యసింహ, తథాగతుడన్న నామ సముదాయమే తరుచుగా కనిపిస్తుంది. కానీ అన్నిటి కన్నా బుద్ధుడన్న పేరే ఎక్కువగా వాడుకలో ఉంది. భగవాన్ అన్న సంబోధన కూడా విరివిగానే ఉపయోగించబడింది.



కరుణామయ బుద్ధుడు
(సారనాథ్ శిల్పానికి రేఖాచిత్రం)

కుటుంబాన్నిత్యజించి – అనికేతనుడై – ఏకాంత వాసంలో, సత్యాన్వేషణ చేయడమే గౌతముని కాలంలో ధార్మిక జీవన అత్యున్నత లక్ష్యంగా పరిగణించబడేది. ధార్మిక జీవనం గడిపేందుకు పరివ్రాజకులుగా మారడం గొప్ప ఆదర్శంగా ఆనాటి సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ వర్గాలు భావించేవి కాగా ధార్మిక ప్రవృత్తి గల సిద్ధార్థుని దృష్టి ఆ వైపు మరలడం సహజమే.

బాధావహమైన జీవిత సత్యాలకు దూరంగా, కేవలం ఆహ్లాదకరమైన కల్పిత వాతావరణంలో ఎంతో జాగ్రత్తగా సిద్ధార్థుని పెంచారనీ, అయినా యాదృచ్ఛికంగా అగుపించిన రుజా, జరా, మరణ దృశ్యాల వల్ల ఆయన కలత చెందారని బహుళ ప్రచారంలో ఉన్న బౌద్ధ ధార్మిక గాథలు బోధిస్తున్నాయి. ఈ మనఃపరివర్తనోదంతాన్ని ప్రాచీన గ్రంథాలు నిరాకరించక పోయినా, గట్టిగా ధ్రువీకరించకపోవడం గమనార్హం. *అంగుత్తరనికాయం* లో ఒక చోట బుద్ధుడు గతంలో ఒకప్పుడు తాను గడిపిన సుఖభోగవిలాస భూయిష్ఠమైన జీవితాన్ని వర్ణిస్తూ జరా రుజా మరణ దృశ్యాలు చూడడానికే జనం ఎలా వైముఖ్యం వహిస్తారో చెబుతాడు. ఇది సరైనదేనా? "నేను కూడా నశించి పోయేవాడినే కదా? వార్ధక్యం, వ్యాధులు, మరణాల నుంచి నేను కూడా తప్పించు కోలేను కదా? అలాంటప్పుడు ఇతరులను ఆ స్థితిలో చూసి నేను వ్యధా, భయగ్రస్తుడిని కావడం వైముఖ్యం వహించడం సముచితమా? భిక్షువులారా! నేను ఇలా ఆలోచించినప్పుడు నాజీవితానందమంతా లోలోపలే ఇంకిపోయింది అన్నాడు."

పదహారేళ్ల వయస్సులో సిద్ధార్థుడు తన బంధువర్గంలోని యశోధరను అర్థాంగిగా స్వీకరించాడు. ఆ దంపతులకు రాహులుడనే కొడుకు పుట్టాడు. ఇరవైతొమ్మిదేళ్ళ ప్రాయంలో సిద్ధార్థుడు అందాల రాశియైన అర్ధాంగినీ, ముద్దులు మూటగట్టే పసికందయిన కుమారునీ, అపారమైన ఐశ్వర్యాన్ని, సకల విధ సుఖభోగాలను పరిత్యజించి ఇల్లు వదలి అనికేతనావస్థకు

నిష్క్రమించాడు. ఆకాలంలో గంగా నదీలోయలో జ్ఞాన నిధులుగా, పవిత్రులుగా ప్రసిద్ధికెక్కిన గురువు లెందరో ఉండేవారు. ఆరేళ్లపాటు సిద్ధార్థుడు వారిని ఆశ్రయించి జ్ఞాన సముపార్జన చేశాడు. సుప్రసిద్ధ గురువులయిన అలారకలామ, ఉద్దక రామపుత్రుల వద్ద కొంత కాలం శిష్యరికం చేసి, వారి బోధనలను ఆకళించుకున్నాడు. కానీ, అవి పరిపూర్ణ జ్ఞానాన్నీ, ముక్తి మార్గాన్ని చూపలేవని గ్రహించి, వాటిని తిరస్కరించి వెళ్ళిపోయాడు. తదనంతరం ఆరేళ్లపాటు మగధ రాజ్యంలో పరివ్రాజక జీవితం గడిపి చివరకు ఉరువేల (ఇప్పటి బుద్ధగయ)కు చేరుకున్నాడు. స్వచ్ఛమైన నదీజలాలతో, సానుకూలమైన స్నాన ఘట్టాలతో, నలువైపులా నయన మనోహరమైన హరితమైదానాలూ, పల్లెపట్టులూ ఉన్న ఆ ఆటవీ ప్రాంతం సిద్ధార్థునకు చాలా ఆహ్లాదకరంగా తోచింది. అక్కడే తీవ్ర తపస్సమాధిలో నిమగ్నం కావాలని సంకల్పించాడు.

ఉరువేలలో సిద్ధార్థుని తపోదీక్ష సత్యసాధనకు ఆయన సాగించిన అవిశ్రాంత సమరంగా ప్రఖ్యాతిగాంచింది. త్రిపిటకాలు ఆ తపస్సును హృదయానికి హత్తుకొనేట్లు వర్ణించాయి. నిప్పుపుట్టించాలంటే పచ్చి కట్టెలతోకాదు. ఎండుకట్టెలతో రాపిడి చేయవలసి ఉంటుంది. అలాగే జ్ఞానోదయం కావాలంటే శరీరాన్ని శుష్కింపచేసి నిర్మలంగా ఉంచాలని గౌతముడు పళ్లు బిగించి, నాలుకను అంగిటికినొక్కిపట్టి ధ్యానమగ్నుడయ్యాడు. ఈ తపస్సాధనలో ఆయన బాహుమూలాల నుంచి స్వేద జలం సెలయేళ్లలా ప్రవహించింది. ఆ తర్వాత శ్వాసను నియంత్రించి, క్లిష్టతర ధ్యానముద్రను కొనసాగించాడు. ఈ వేదనా భరితమైన సాధనలో ఒక స్థితి నుంచి మరో స్థితికి పురోగమించే కొద్దీ శిరస్సులో రక్తం పరవళ్ళు తొక్కుతున్నట్లు, కపాలం రెండుగా చీలుతున్నట్లు ఎవరో కరకు కత్తితో కడుపు చీల్చుతున్నట్లు, చివరకు కణకణమండే నిప్పుల గుండంలో పడికాలిపోతున్నట్లు సిద్ధార్థునికి అనిపించింది. క్రమ క్రమంగా ఆహారాన్ని తగ్గించుకుంటూ చివరకు రోజుకు ఒక ధాన్యపు గింజను మాత్రమే తినే స్థితికి చేరుకున్నాడు. కొంత కాలం కందమూలాలు, పచ్చిగడ్డి, విత్తనాలు తిని జీవించాడు. కేశ కంబళ్ళు, జుగుప్స కలిగించే ఇతర దుస్తులు ధరించాడు. జుట్టు, గడ్డంలో ఒక్కొక్క వెంట్రుక చొప్పున పీకివేశాడు. రోజుల తరబడి నిలబడి, ముళ్లకంపమీద పండుకొని గడిపాడు. దేహం మీద దుమ్ము, ధూళి పొరలు పొరలుగా పేరుకొని ఎండిన మోడు లాగా కనిపించసాగింది. తరుచుగా శ్మశానానికి వెళ్ళి కుళ్లి కంపుగొడుతున్న శవాల మధ్య పండుకొనేవాడు. ఇన్ని అసహ్యయాతనలను అనుభవించినా జీవిత చిక్కుముడిని విడదీసే మార్గం చూచాయగా కూడా అగుపించలేదు. శరీరం చిక్కిశల్యమై, మృత్యువు అంచుల్లోకి చేరి, కదలాడే నీడలా మారిపోయాడు. "నేను కడుపు తాకితే వీపు, వెన్నుతాకితే కడుపు తగిలేవి. కఠిన ఉపవాస దీక్షల వల్ల పొట్ట వెన్నుకు అంటుకుపోయింది." అని సిద్ధార్థుడే అప్పటి దైన్య స్థితిని గురించి ఒక 'సూత్రం'లో స్వయంగా వివరించాడు.

కఠోరసాధనలతో దేహశోషణలో అంతిమ స్థాయికి చేరుకున్నా తాను ఆశించిన జ్ఞానసిద్ధి కాకపోవడంతో జ్ఞాన సాధనకు మరో మార్గమేదైనా ఉండాలని ఆయన భావించాడు. ఈ సందర్భంలో బాల్యావస్థలో జంబూవృక్షం కింద ధ్యానమగ్నుడైనప్పుడు పొందిన ఆనంద పారవశ్యానుభూతి స్మృతి పథంలో మెదిలింది. కానీ, దానికి దేహ పటుత్వం కావాలి. అందుకు ఆహారం అత్యవసరం. అందుచేత కొంచెం అంబలి తాగాడు. ఈ దృశ్యాన్ని ఆ పరిసరాల్లో ఉన్న ఐదుగురు సన్యాసులు చూశారు. తపోదీక్షలో ఉన్న సిద్ధార్థునికి జ్ఞాన సిద్ధి కలిగితే దాన్ని తమకు కూడా అందజేస్తాడని అంత వరకు ఎదురు చూస్తూ శుశ్రూషలు చేసిన ఆ యతి పంచకం సిద్ధార్థుడు ఆహారం తీసుకోవడం చూసిన తర్వాత ఆయన మీద నమ్మకం నశించి నిరాశతో దూరంగా వెళ్ళిపోయింది.

ఆహారం తీసుకున్న తర్వాత సిద్ధార్థుడు మళ్లీ ధ్యానంలో లీనమై అందులో నాలుగు దశలను అధిగమించి శుద్ధ స్వానుభవాన్ని, సమచిత్తతనూ సాధించి సుఖదుఃఖాల నుంచి విముక్తుడయ్యాడు. పూర్వజన్మ పరంపరను మనోనేత్రంతో అవలోకించాడు. ఆ తర్వాత శాక్యమునికి మరింత విస్తృత దర్శనం లభించింది. సమస్త విశ్వం కర్మ, పునర్జన్మల నియమానుసారం సాగుతున్న వ్యవస్థగా గోచరించింది. అల్పజీవులూ, ఉత్తమజీవులూ, సుఖ సంతృప్త, బాధాసంతప్త ప్రాణులూ – మొత్తం ప్రాణికోటి అంతా వాటి కర్మానుసారం మరణించి, మరో రూపంలో మళ్లీ జన్మించడాన్ని ఆయన ఆ దివ్య దర్శనంలో వీక్షించాడు.

చివరకు సిద్ధార్థుడు సార్థక నామధేయుడై లక్ష్యాన్ని సాధించగలిగాడు. తృష్ణ, దుఃఖాల స్వభావాన్నీ, దుఃఖోపశమన

మార్గాన్నీ తెలుసుకున్నాడు. ఆ విధంగా పరిపూర్ణ జ్ఞానోదయమైంది. ఆ స్థితిని గురించి వివరిస్తూ ఒక సందర్భంలో ఆయన ఇలా అన్నాడు. "అలా విముక్తుడినైన నాకు జన్మరాహిత్యం సిద్ధించిందనీ, ఈ లోకంలో చేయవలసిందంతా చేశాననీ, ఇక నిర్వర్తించవలసిన కర్తవ్యాలేవీ మిగల్లేదనీ, ఆధ్యాత్మిక జీవితంలో అంతిమ ఘట్టాన్ని అందుకున్నాననీ తెలిసిపోయింది. ఈ పరిపూర్ణజ్ఞానం నాకు రాత్రి చివరి జాములో కలిగింది. అజ్ఞానం సాంతం అంతరించింది. కాంతి కిరణాలు సోకగానే గాఢాంధకారం పటాపంచలైంది. సుస్థిర, సుదృఢ చిత్తంతో అలాగే కూర్చుండి పోయాను."

జ్ఞానోదయానంతరం తానుగ్రహించిన సత్యాన్ని ఇతరులకు బోధించినా ప్రయోజనం శూన్యమనే నిర్లిప్తభావం సిద్ధార్థుని ఆవహించింది. ఈ సిద్ధాంతం చాలా జటిలమైంది. తృష్ణా నిబద్ధమైన మానవాళి కార్యకారణ సంబంధాన్నీ, వాంఛలనూ అధిగమించి నిర్వాణ పదం సాధించాలన్న బోధలను అర్థం చేసుకోవడం సాధ్యమా? అని ఆలోచించి, ఎలాంటి బోధలు చేయకుండా మౌనంగా ఉండాలని ఆదిలో అనుకున్నాడు. అయితే తన బోధనను గ్రహించగలిగిన వారు కొంతమందైనా ఈ పెడదారి బడిన లోకంలో ఉంటారన్న ఆలోచనతో సత్యాన్ని బోధించాలనే ఎట్టకేలకు బుద్ధుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆ తర్వాత ఆయన తన మనోనేత్రంతో ప్రపంచాన్నంతా ఒకమారు అవలోకించి "కొలనులో నీల, లోహిత, శ్వేత వర్ణ కమలాలుంటాయి. వాటిలో కొన్ని నీటి అడుగున పుట్టి అక్కడే ఉండిపోతాయి. కొన్ని నీటి ఉపరితలం వరకూ పెరుగుతాయి. మరికొన్ని నీరు తగలనంత ఎత్తుకు చేరుతాయి. లోకంలో జనం కూడా అలాగే వివిధ స్థాయీభేదాలతో ఉన్నారు." అని బుద్ధుడు భావించాడు. అంతేగాక "అమృత పద ద్వారాలు తెరుచుకున్నాయి, ఈ సత్యాన్ని వినగలిగిన వాళ్లంతా విని విశ్వసింతురుగాక" అని అనుకున్నాడు.

తాను గ్రహించిన పరమసత్యాన్ని మొదట ఎవరికి వివరించాలని బుద్ధుడు ఆలోచించినప్పుడు తన తొలి గురువులు ఆయన దృష్టికి వచ్చారు. అయితే వారు అప్పటికే మరణించినట్లు జ్ఞాన చక్షువులతో గ్రహించాడు. తాను కఠోర తపస్సాధనలో ఉన్నప్పుడు తనకు శుశ్రూషలు చేసి, తాను ఉపవాస దీక్ష విరమించగానే నిరసన భావంతో నిష్క్రమించిన అయిదుగురు సన్యాసులు ఆయనకు గుర్తుకొచ్చారు. వాళ్లు ప్రస్తుతం 'ఇసి పతన'లో ఉన్నట్లు దివ్యదృష్టితో తెలుసుకున్నాడు. కొంతకాలం తనకు జ్ఞానోదయం కలిగిన ఉరువేలలో ఉన్న తర్వాత ఆ యతి పంచకాన్ని అన్వేషిస్తూ బయలుదేరాడు. మార్గమధ్యంలో తారసిల్లిన ఒక దిగంబర సన్యాసి ప్రశ్నలకు సమాధానం ఇస్తూ మొట్టమొదటిసారి తనను బుద్ధుడుగా ప్రకటించుకుని "నేను పరిపూర్ణజ్ఞానాన్ని పొందాను. నిశ్చల ప్రశాంత చిత్తుడనై నిర్వాణ పదాన్ని అధిరోహించాను. ధర్మచక్ర పరివర్తనార్థమై కాశికి వెళ్లుతున్నాను. అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న లోకంపై జ్ఞాన కిరణాలను ప్రసరింపజేస్తాను" అన్నాడు.

బుద్ధుడు శ్రమణులు నివసిస్తున్న మృగదావనం చేరినప్పుడు అక్కడ ఆయన అన్వేషిస్తున్న అయిదుగురు సన్యాసులు అగుపించారు. సిద్ధార్థుడు తపోధర్మాన్ని పరిత్యజించి సుఖమయ జీవితం గడుపుతున్నాడు కాబట్టి అతనికి అభివాదం చేయకూడదని వారు నిర్ణయించుకున్నారు. కాని బుద్ధభగవానుడు దగ్గరికి రాగానే ఆయన ప్రభావానికి లోనై అప్రయత్నంగానే ఎదురేగి పాద్యానికి నీరుతెచ్చారు. అలా గౌరవిస్తూనే వారు బుద్ధుని మిత్రమా, గౌతమా, అని సంబోధించారు. తథాగతుని ఇలా పేరు పెట్టి, మిత్రమా అని సంబోధించడం సముచితం కాదనీ, తాను జ్ఞానసిద్ధి పొంది బుద్ధుడినయ్యాననీ, వారికి సత్యబోధచేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నాడు. అయితే తీవ్ర తపస్సాధనను విడనాడి, సాధారణ జీవితం గడుపుతున్న వారికి జ్ఞానోదయమయ్యే అవకాశమే లేదని ఆ సన్యాసులు అన్నారు. బుద్ధుడు వారి సందేహ నివృత్తి చేసి, ధర్మోపదేశానికి ఉపక్రమించాడు.

### ధర్మ చక్ర ప్రవర్తన

బుద్ధుడు యతి పంచకానికిచ్చిన తొలి సందేశంలో ఇలా అన్నాడు:

"జీవితం పట్ల రెండు పూర్తి భిన్న దృక్పథాలున్నాయి. ఇంద్రియ సుఖాలకోసం ఆరాటపడుతూ బ్రతకడం మొదటిది. ఇది చాలా హేయమైంది. ఎంత మాత్రం శ్రేయస్కరం కాని మార్గం. సంపూర్ణంగా ప్రాపంచిక విషయాల్లో మునిగితేలేవారు దీన్ని అనుసరిస్తారు. రెండవది దేహశోషణకు సంబంధించింది. ఇది చాలా బాధావహమేకాదు పూర్తిగా నిష్ప్రయోజనకరమైంది కూడా. తథాగతుడు కనుగొన్న మధ్యేమార్గం మానవాళి

కళ్లుతెరిపిస్తుంది. అది సదవగాహనను, శాంతిని, సమున్నత జ్ఞానాన్ని సమీక్షించే అంతర్ దృష్టిని ప్రసాదిస్తుంది. నిర్వాణపదానికి పథనిర్దేశం చేస్తుంది. సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం, సమ్యగ్వచనం, సమ్యక్ కర్మ, సమ్యక్ జీవనం, సమ్యక్ కృషి, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి, అన్న అష్టాంగ మార్గం ఇదే.

దుఃఖానికి సంబంధించిన ఆర్యసత్యం ఇది: జన్మదుఃఖం, జరాదుఃఖం, మరణ దుఃఖం, ప్రియవియోగం దుఃఖం, అప్రియ సంప్రాప్తం దుఃఖం – క్లుప్తంగా చెప్పాలంటే రూప, వేదనా, సంజ్ఞా, సంస్కార, విజ్ఞానాలన్న పంచస్కంధాలూ దుఃఖాలే.



ధర్మచక్ర ప్రవర్తన

దుఃఖహేతువుకు సంబంధించిన ఆర్య సత్యమిది: సుఖాపేక్ష, కామవాసనా భూయిష్టమైన తృష్ణే పునర్భవానికి మూలకారణం. తృష్ణ ఆశ, భయం, క్రోధం, ద్వేషం– ఇవి దుఃఖ కారణాలు. దుఃఖోపశమనానికి సంబంధించిన ఆర్య సత్యమిది: వాంఛలనుండి విముక్తి సాధించి తృష్ణా రాహిత్యాన్ని పొందడమే దుఃఖో పశమనం.

దుఃఖోపశమన మార్గానికి సంబంధించిన ఆర్య సత్యమిది: ఇదే సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ జీవనం, సమ్యక్ కృషి, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి అనే ఆర్య అష్టాంగ మార్గం" ఈ ఉపదేశాన్ని విన్న ఐదుగురు సన్యాసులూ కొత్త మార్గాన్ని స్వీకరించి తమ పాత సాధనలకు స్వస్తిచెప్పారు. ఈ ఆదిభిక్షు వర్గంలో కొండన్నకు మొదటి మార్గఫలం తక్షణమే లభించింది. ఆ తర్వాత నాలుగు రోజులకు మిగతా నలుగురు ఆ ఫలాన్ని పొందారు. ఐదవ రోజున బుద్ధుడు భిక్షుక పంచకాన్ని తన దగ్గరకు ఆహ్వానించి అనాత్మ సందేశం ఇచ్చాడు.

“భిక్షువులారా! నశ్వరమైన శరీరం శాశ్వతమైన ఆత్మకాజాలదు. అలాగే సంకల్ప, రూప, వేదనా, సంజ్ఞా, సంస్కార, విజ్ఞానాలు కూడా శాశ్వత ఆత్మ కాలేవు. మిగతా అన్నిటిలాగే చైతన్యం సైతం నశించిపోయేదే. రూపం, ఇంద్రియానుభూతులూ, అనుభవాలూ, మనసూ, చైతన్యం ఇవన్నీ శాశ్వతాలా? అశాశ్వతాలా? మీరే మనుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు అయిదుగురు భిక్షువులూ అవి అశాశ్వతాలని బదులు చెప్పారు. అశాశ్వతమైంది మంచిదా? చెడ్డదా? అంటే చెడ్డదే అన్నారు. అశాశ్వతమూ, పరివర్తనా శీలమూ అయిన దాన్ని, దుష్టమైన దాన్ని 'ఇది నాది. ఇదేనేను. ఇది శాశ్వతమైన ఆత్మఅనవచ్చునా?' అంటే 'లేదు. అలా చెప్పడానికి వీల్లేదు' అన్నారు ఆ భిక్షువులు. దానిపై బుద్ధుడు ఇలా అన్నాడు. 'కాబట్టి భిక్షువులారా, భౌతిక రూపాలు గతానివైనా, వర్తమానానివైనా, మానసికమైనవైనా, బాహ్యసంబంధమైన వైనా, దగ్గరివైనా, దూరానివైనా, నీచమైనవైనా, ఉన్నతమైనవైనా, ఇది నేను కాదు. ఇది శాశ్వతమైన ఆత్మకాదు' అని చెప్పాలి. అలాగే సకల ఇంద్రియానుభూతులూ, సమస్త అనుభవాలూ సంకల్పాలూ, చైతన్యాన్ని గురించి కూడా ఇదే మాట చెప్పాలి.

“భిక్షువులారా, ఈ విషయాలను గ్రహించిన సత్యాన్వేషి, పైన పేర్కొన్న పంచస్కంధాల పట్లవైముఖ్యం వహించి తృష్ణారహితుడై, ముక్తుడై తనకు పునర్భవం ఇకలేదనీ, తాను పవిత్ర జీవితం గడిపానని, మృత్యువును శాశ్వతంగా జయించానని తెలుసు కుంటాడు.” ఈ ప్రబోధంతో ఐదుగురు భిక్షువుల మనస్సుల్లో పూర్ణజ్ఞానో దయమైంది. పంచవర్గీయ భిక్షువులుగా ప్రసిద్ధికెక్కిన ఈ మొదటి ఐదుగురు అర్హతులకూ బౌద్ధ సంప్రదాయంలో విశిష్టస్థానం ఉంది.

బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన రెండవ బృందం కాశిలోని సంపన్న వాణిజ్య కుటుంబాలకు చెందింది. యశుడు, అతని యాభైనాలుగుమంది మిత్రులూ భిక్షువులుగా మారినందువల్ల అర్హతుల సంఖ్య అరవై ఒకటి అయింది. ఇంద్రియ బంధాలను ఛేదించుకొని, పరిపూర్ణజ్ఞాన సిద్ధి పొందిన వారినే అర్హతులంటారు. అర్హతుడీలోకంలో నిస్సంగుడై, ఆనందంగా పరోపకారియై జీవిస్తాడు.

తన అనుచరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ బుద్ధుడు ఇలా అన్నాడు. "భిక్షులారా! నేను మానవ, దైవిక బంధాలన్నిటి నుంచి విముక్తుడినయ్యాను. నాలాగే మీరు కూడా ముక్తులయ్యారు. ఇక మీరు కరుణోపేతులై బహుజన హితం కోసం, బహుజన సుఖం కోసం, దేవతల, మానవుల మంచి కోసం ఉద్యమించండి. మీలో ఏ ఇద్దరూ కలిసి ఒక మార్గంలో సంచరించవద్దు. ఆద్యంత విశిష్టమూ, శ్రేష్ఠమూ అయిన ఈ ధర్మాన్ని మీరు బోధించండి. సమగ్ర, సంపూర్ణ పవిత్ర జీవితాన్ని గురించి ప్రబోధించండి". బుద్ధుడు కొత్తగా సంఘంలో చేరే వారికి దీక్ష ఇవ్వడానికి కూడా భిక్షువులకు అనుమతిచ్చాడు. తదనంతరం ఆయన తనకు జ్ఞానోదయం కలిగిన ప్రదేశం ఉరువేలకు తిరిగివెళ్లాడు. అక్కడ వెయ్యిమంది జటిలులను తన నూతన పంథాకు మార్చాడు. గృహస్థ జీవితాన్ని త్యజించి సన్యాసం స్వీకరించిన తర్వాత కూడా యజ్ఞయాగాదులను నిర్వహించే బ్రాహ్మణులను 'జటిలు' లంటారు. వారికి బుద్ధుడు ఆదిత్య పరియాయ సూత్రాన్ని బోధించాడు.

**"భిక్షువులూ! చూశారా!**
**సర్వస్వం జ్వలిస్తోంది.**
**ఆ మండే సర్వస్వం**
**ఏమిటి భిక్షువులారా!**
**కళ్లూ, రూపం రెండూ**
**కణకణమని మండినాయి**
**చక్షుయుగ్మ చైతన్యం,**
**స్పర్శ కూడా జ్వలిస్తోంది.**
**చక్షు స్పర్శకు చెందిన**
**సంవేదన రగులుతోంది**
**బాధా ఆహ్లాదం ని**
**ర్లిప్తత ఏదైనా సం**
**వేదనా సుఖమూ దుఃఖం**
**అదుఃఖం అసుఖమూ**
**అన్నీ ఆ మంటల్లో**
**అవిగో జ్వలియిస్తున్నవి**
**భిక్షువులూ ఆ మంటలు**
**రాగమోహ విద్వేషాలే**
**జన్మ మృత్యువ్యాధి**
**దుఃఖ పరిదేవనా**
**శోక నిస్పృహలతో**
**ఆ మంట ఎడతెగక**
**మండిపోతున్నాది."**

బుద్ధుడు తన శిష్యులతో రాజగృహకు వెళ్ళి నగరానికి బయట వేణువనంలో బసచేశాడు. అక్కడ మగధ సమ్రాట్ బింబిసారుడు ఆయనను దర్శించి తన భవనానికి భిక్షకు ఆహ్వానించాడు. బోధనానంతరం బుద్ధుని ధర్మ ప్రబోధం విన్నాక వేణువనాన్ని బింబిసారుడు భిక్షు సంఘానికి కానుకగా సమర్పించుకున్నాడు. అదే సమయంలో సంజయుడనే గురువు రెండు వందల యాభై మంది శిష్యులతో రాజగృహలో విడిది చేసి ఉన్నాడు. ఆయన శిష్యుల్లో, ఇద్దరు – సారిపుత్ర, మౌద్గల్యాయనులు – భిక్షాటన చేస్తున్న బుద్ధ శిష్యుడు అశ్వజిత్ తేజో గాంభీర్యలను గమనించారు. సారిపుత్రుడు అతని దగ్గరికి వెళ్లి మాటా మాటా కలిపి నీగురువెవరు? ఆయన బోధనలేమిటి? అని ప్రశ్నించాడు.

అశ్వజిత్ సమాధానం చెబుతూ "సోదరా శాక్యమునిని అనుసరించేందుకు నేను ప్రపంచాన్ని పరిత్యజించాను. బుద్ధుని ధర్మాన్ని స్వీకరించి ఇంకా ఎక్కువ కాలం కాలేదు అయినా నాకు తెలిసిన మేరకు ఆ ధర్మసూత్రాన్ని వివరిస్తా" నంటూ ఇలా అన్నాడు. ''ఆ సత్యదర్శి (అయిన బుద్ధభగవానుడు) హేతుబద్ధమై జన్మించే వాటన్నింటికీ కారణాలు వివరించాడు. పునర్భవాన్ని అంతం చేసే మార్గాన్ని చూపించాడా మహాజ్ఞాని" అన్నాడు. దానితో సారిపుత్ర, మౌద్గల్యాయనులు సహశిష్య గణంతో పాటు బుద్ధుని ధర్మాన్ని స్వీకరించి సంఘంలో చేరారు.

బుద్ధుని బోధనల వల్ల రాజ వంశాలకు చెందిన చాలా మంది యువకులు భిక్షుసంఘాలలో భిక్షువులుగా చేరసాగారు. దానితో ప్రజల్లో గౌతముడు యువకులను భిక్షువులుగా మారుస్తూ సంతానం కలుగకుండా చేసి క్షత్రియ వంశ వినాశకుడవుతున్నాడన్న విమర్శలు వినిపించసాగాయి. ఇతడు సంజయుని శిష్యులందరినీ సంఘంలో చేర్చుకుని గిరివ్రజానికి వచ్చాడు.


పూర్ణకుంభం

ఇక్కడ ఇంకెందరిని లోబరుచుకుంటాడో అన్న గుసగుసలు కూడా బయలుదేరాయి. ఈ విషయాన్ని బుద్ధుని దృష్టికి తెచ్చినప్పుడు ఈ సంచలనం ఓ వారం రోజులుంటుందని, అయినా ఆ ఆరోపణలకు సమాధాన మివ్వాలనీ చెబుతూ అదెలా ఉండాలో వివరిస్తూ :

**"బుద్ధులు సద్ధర్మంతో**
**ప్రజకు దారిచూపుతారు**
**సత్యవాక్కుతో జనులు**
**సత్పథాన నడిపించే**
**బుద్ధుల నాక్షేపించే**
**జడ బుద్ధులు ఒక లెక్కేమిటి?"**

అని శిష్యుల్లో ఆత్మ విశ్వాసాన్ని ఉదీప్తం చేశాడు.


# బ్రహ్మావాదం - బుద్ధుడు

- భదంత ఆనంద కౌసల్యాయన్

ఉపనిషత్తులు- వేదాలు, బ్రాహ్మణ గ్రంథాల తర్వాత వచ్చినవి. ఉపనిషత్తులు వేదాలననుసరించే ఉన్నాయని, అన్ని ఉపనిషత్తుల్లో ఒకే ప్రతిపాదనను, అంటే 'బ్రహ్మసత్యం, జగన్మిథ్య', బ్రహ్మ తప్ప మరేదీ లేదు' అనే ప్రతిపాదనను సమర్థించడమే ఉందని సాధారణంగా అందరు నమ్ముతారు.

వేదాల్లో 'కవుల' కల్పనాలోక విహారం ఎంత ఉన్నా అందులో వ్యవహార భాషలో మనం 'దర్శనశాస్త్రం' అని దేన్ని అంటామో, అలాంటి 'దర్శనశాస్త్రం' ఏ విధంగా లేదో, అదే విధంగా ఉపనిషత్తుల్లో దర్శనశాస్త్రలోక విహారం ఎంత ఉన్నా వాటి దిశ, గమ్యంగానీ ఒకటి కాదు. ఉపనిషత్తులు వేర్వేరు అభిప్రాయాలు కలిగిన ఋషి-మునుల డైరీల్లాంటివి. వాటిలో ఏ ఒక్క అభిప్రాయాన్ని ఏకగ్రీవ సమర్థనను వెదకడం వృథా.

ఉపనిషత్తుల సంఖ్య చాలా ఎక్కువే. వాటి రచన మధ్యకాలం దాకా జరుగుతూ వచ్చింది. అందుకు నిదర్శనం - 'అల్లోపనిషత్తు.' ఈ ఉపనిషత్తుల్లో వచ్చే చాతుర్వర్ణ వ్యవస్థను వ్యతిరేకించే 'వజ్ర భేదిక' లాంటి ఉపనిషత్తులు కూడా చేరి ఉన్నాయి. అయితే ప్రాచీనమైనవిగా విశ్వసించబడే ఉపనిషత్తులు చాలా తక్కువే ఉన్నాయి. బౌద్ధ వాఙ్మయంలో వాటి గురించిన స్పష్టమైన ప్రస్తావన ఎక్కడా లేనప్పటికీ అవి బుద్ధునికంటే చాలా కాలం మునుపటివి కాకపోయినా బుద్ధుని కంటే మునుపువే అని అంగీకరించవచ్చు.



### ప్రసిద్ధ ఉపనిషత్తులు

ప్రసిద్ధి చెందిన ఉపనిషత్తుల్లో 'కేనోపనిషత్తు' ఒకటి. దాని ఆరంభమే ఇలా ఉంది. ఎవరి ప్రేరణతో ఈ మనస్సు విషయాల పట్ల తీవ్రమైన ఆకర్షణ చూపుతుంది? ఎవరి ద్వారా నియమించబడిన ప్రథమ ప్రాణశక్తి గతిశీల మవుతుంది? ఎవరి ప్రేరణతో మనం మాట్లాడుతాము? ఏ దేవుడు కళ్ళను, చెవులను వాటికి సంబంధించిన విషయాల్లో సంలగ్నం చేస్తాం?

దార్శనిక ఊహాగానాల, ఊహాపోహల నేపథ్యం ఇదే. ఇదే సమస్త దర్శనశాస్త్రానికి జన్మనిచ్చింది.

ఎలా ఉండాలి? ఎలా జరగాలి? అనే దాన్ని గురించి 'ఏ దార్శనికుడు ఆలోచించ లేదు, చింతించలేదు. మార్క్స్ వాద దార్శనికులను తప్పించి మరెవరు ఏది జరగాలో, దాన్ని చేయడం - చేయించడం గురించి పెద్దగా ప్రయత్నం కూడా చేయలేదు. ఏది ఎలా ఉన్నా దార్శనికుల మొదటి జిజ్ఞాస, చివరి జిజ్ఞాస అంతా కూడా 'ఏమిటి ఉంది?' 'అది అలా ఎందుకు ఉంది?' అనే వరకే పరిమితమైపోయాయి. ఈ రెండు జిజ్ఞాసలకు సరైన జవాబు వెదకడానికే 'దర్శనశాస్త్రం' అని పేరు వచ్చింది.

### కేనోపనిషత్తు

'కేనోపనిషత్తు' తను లేవదీసిన ప్రశ్నకు జవాబు కూడా మనముందుంచుతుంది. 'వాణి ఎవరినుంచి లేదా దేన్నుంచి వెలువడుతుంది?' అనేది ప్రశ్న. "బ్రహ్మ నుంచి" అనేది జవాబు. 'బ్రహ్మ అని ఎవరిని అంటారు?' ఇది తర్వాతి ప్రశ్న. "ఎవరినైతే వాణి వెలువరించలేదో, ఎవరినుంచి వాణి వెలువడుతుందో, అదే బ్రహ్మ." ఇది ఆ ప్రశ్నకు జవాబు.

హిందీ నుంచి అనువాదం : డాక్టరు జనపన లక్ష్మిరెడ్డి, ఫోన్ : 09811589430

క్లుప్తంగా చెప్పాలంటే, ఇందులోని సూత్రం ఇంతే ఉంటుంది– "వాణి ఎవరినుంచి వెలువడుతుంది?" అని అడిగితే జవాబు "బ్రహ్మ నుంచి" అని, "బ్రహ్మ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు "ఎక్కడి నుంచి వాణి వెలువడుతుందో అది." అని జవాబు ఇవ్వడం జరుగుతుంది. "మనసు ఎవరి ద్వారా మననం చేస్తుంది?" అనే ప్రశ్నకు "బ్రహ్మద్వారా" అనే జవాబు, "బ్రహ్మ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు "దేని ద్వారా మననం చేయడం జరుగుతుందో, అది" అనే జవాబు ఇవ్వడం జరుగుతుంది.

"కన్ను దేన్ని చూడదు?" అనే ప్రశ్నకు "బ్రహ్మను చూడదు" అనేది జవాబు, "బ్రహ్మ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు "దేన్నైతే కన్ను చూడలేదో అది" అనే జవాబు ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా చెవి, ఊపిరి గురించి కూడా ప్రశ్నలు అడగడం జరిగింది. అయితే అన్ని ప్రశ్నలకు ఒకటే కుదురు నిలకడలేని జవాబు, పళ్ళెంలో వంకాయ అటు–ఇటు దొర్లినట్లు!

**బహుగట్టి సమాధానం**

ఈ ప్రశ్నే బుద్ధభగవానునితో అడిగినప్పుడు, అంటే "స్పృశించేది ఎవరు?" (కోఫుసతి భంతే!) అని అడిగినప్పుడు ఆయన "స్పృశించేది బ్రహ్మ" అని సమాధానం చెప్పలేదు. ఆయన తన గట్టి సమాధానం ఇలా చెప్పాడు, "స్పృశించేది ఎవరు?'' అనే నీ ప్రశ్నే తప్పు ప్రశ్న. 'షడాయతన పచ్చయాఫస్స' అని సమాధానం. ఆరు ఇంద్రియాలు, వాటి విషయాలు ఉన్నప్పుడు స్పర్శ కలుగుతుంది. డా॥ రాధాకృష్ణన్ లాంటి కొందరు దార్శనికులు బౌద్ధధర్మాన్ని ఉపనిషత్తుల విదేశీ కూర్పు (Edition)గా భావిస్తారు. అలాంటివాళ్ళు పాపం ఉపనిషత్తులనూ సరిగా చదవలేదు, బౌద్ధధర్మాన్ని సరిగా చదవలేదు!

ఉపనిషత్తుల్లోని ఋషులు 'బ్రహ్మ' విషయంలో చీకట్లో తడబడుతూ నడిచేవారనేది మాత్రం సత్యం. అయితే వాళ్ళు మొదటి తరగతికి చెందిన సత్యవాదులు. అందుకే ఇలా అన్నారు–

"నేను బ్రహ్మను తెలుసుకున్నానా? అంటే అది నాకు తెలియదు. మాలో ఎవరైనా తెలుసుకున్నాను, అని అంటే, అతనికి తెలుసుననీ తెలుసు, తెలియదని కూడా తెలుసు." కఠోపనిషత్తులోని నచికేతుని కథలో మనిషి చనిపోయిన తరువాత ఏమీలేదు అని నచికేతుడు యమునికి వేసిన ప్రశ్నకు... దీనికి యముడు సులభంగానే సమాధానం చెప్పి ఉండవచ్చు– "చనిపోయిన తర్వాత మనిషి నా వద్దకు వస్తాడు" అని.

అలా చెప్పకుండా యముడు ఏమేమో డొంక తిరుగుడు ఉపదేశం ఇచ్చాడు. అదంతా ఉపనిషత్తుల ఆకారాన్ని పెంచడం మాత్రమే. నిజానికి యముడు చెప్పిన సమాధానంలోని సారాంశం ఇది–

**యమధర్మరాజు సమాధానం**

"ఏ పదాన్నైతే వేదాలు మాటిమాటికి వర్ణిస్తున్నాయో, ఆ పదం– 'ఓమ్' ఈ **ఓం** ఒక **అ ఓ రం**. ఇదే బ్రహ్మ. ఇదే అన్నింటికి అతీతమైంది. ఈ అక్షరాన్ని తెలుసుకొనే మనిషి తాను కోరుకున్నదాన్ని పొందగలుగుతాడు."

డా॥ మంగళదేవ శాస్త్రి 'ఈశ్వర్' అనే పదాన్ని గురించి ఏ విధంగా ఒక పరిశోధక వ్యాసం రాశారో, అదేవిధంగా 'ఓమ్' అనే పదాన్ని గురించి కూడా తటస్థభావంతో పరిశోధన చేయవలసిన అవసరం ఉంది. ఎందుచేతనంటే కొందరు స్వతంత్ర చింతకులు 'ఓమ్' అనే పదం బుద్ధుని తర్వాతి కాలానికి చెందిందని భావిస్తున్నారు. బౌద్ధ గ్రంథాల్లోని సూక్తులన్నీ కూడా 'ఏవం మే సుతమ్' (ఈ విధంగా నేను విన్నాను) అనే మాటతో ఆరంభమవుతాయి. 'ఓమ్' అనేది 'ఏవం మే' యొక్క సంక్షిప్తమైన, మార్పుచెందిన రూపం. ఇక్కడ సహజంగానే ఒక అభ్యంతరం రావచ్చు– 'ఓమ్'ను బుద్ధుని తర్వాతి కాలానికి చెందినదని భావిస్తే బుద్ధునికి మునుపటిదని భావించబడే వైదిక వాఙ్మయంలో దీని ప్రయోగానికి ఏ కారణాలు చెప్పాలి? పరిశోధనకు తీసుకోవలసిన అంశం ఇదే–

బుద్ధునికి మునుపటిదిగా భావించబడే సాహిత్యంలో పడేది నిజంగా బుద్ధునికి మునుపటిది? ఏదైతే నిజంగా బుద్ధునికి మునుపటిదో, దాని అతిప్రాచీన వాచిక లిఖిత సంప్రదాయాల్లో 'ఓమ్' అనే పదం ఎప్పుడు, ఏఏ స్థానాల్లో చేర్చడం జరిగింది? అనేది. కొన్ని విశిష్టమైన వాడుకలు ఎంత ఇటీవలివిగా భావించబడుతాయో, అంత ఇటీవలివిగా ఉండవు. అలాగే కొన్ని ఎంత ప్రాచీనమైనవిగా భావించ బడుతాయో, అంత ప్రాచీనమైనవిగా కూడా ఉండవు. ఆ తర్వాత నచికేతుని ప్రశ్నకు కొంత వాస్తవమైన సమాధానం

ఉంది– "చైతన్యంతో కూడిన ఈ జీవితం ఉత్పత్తి చెందదు, మరణించదు. చంపేవాడు నేను చంపుతున్నాననీ, చచ్చేవాడు నేను చచ్చిపోతున్నాననీ భావిస్తే వారిద్దరికి అసలు విషయం తెలియనట్లే. అతడు చంపడమూలేదు, ఇతడు చావడమూ లేదు."

ఇక్కడ తలెత్తే ప్రశ్న 'ఈ జీవాత్మ ఏమిటి?' అనేది. ఉపనిషత్తులు బ్రహ్మ విషయంలో ఎలాంటి అసంతృప్తికరమైన సమాధానం చెప్పాయో, అలాంటి సమాధానమే 'ఆత్మ' గురించి కూడా చెప్పాయి. 'బ్రహ్మ అంటే ఏమిటి?' 'ఎవరైతే నిజంగా చూస్తాడో, వింటాడో, రుచిచూస్తాడో' అతడే బ్రహ్మ. ఈ చూసేది, వినేది, రుచిచూసేది ఎవరు? అనే ప్రశ్నకు "బ్రహ్మ" అని సమాధానం చెప్పినట్లే. "జీవాత్మ అంటే?" అదే ప్రశ్నకు "ఏదైతే చావదో, నశించదో అదే జీవాత్మ. మనిషి చనిపోయిన తర్వాత చనిపోని, చంపబడని చైతన్యమే జీవాత్మ" అనే సమాధానం ఇవ్వడం జరుగుతుంది.

'ఆత్మ' అస్తిత్వానికి రుజువుల వెతుకులాటలో ఉపనిషత్తులను చదవవలసిన పనిలేదు. వేదాలు స్వతఃప్రమాణాలు. అంటే వాటికి రుజువులు అవే. ఇక ఉపనిషత్తులు చెప్పేదేమిటంటే, పెద్ద–పెద్ద ఉపన్యాసాల ద్వారాగానీ, నిరంతరం అధ్యయనం చేస్తూ, వింటూ ఉండడం ద్వారాగానీ, 'ఆత్మ' లభించదు అని. అది ఎవరినైతే వరిస్తుందో, వాళ్ళే దాన్ని పొందగలుగుతారు అని. అతని ఎదుటే 'ఆత్మ' తన స్వరూపాన్ని తెరిచి చూపుతుంది అని.

**ఆత్మ స్వయంవరం**

పై మాటకు స్పష్టమైన అర్థం– ఆత్మాన్వేషణాక్రమంలో ఉపన్యాసాలు ఇవ్వడం, వినడంగానీ, చదవడం, రాయడం గానీ, ప్రయత్నించడంగానీ వ్యర్థమని. ఎందు చేతనంటే ఎవరినైనా వరించేది ఆత్మే కాబట్టి, అది ఎవరిని వరిస్తుందో, వారే 'ఆత్మ' స్వరూపాన్ని తెలుసుకోగలుగుతారు కాబట్టి. అలాంటప్పుడు ఇది 'ఆత్మజ్ఞానం' కాక, 'ఆత్మయొక్క స్వయంవరం మాత్రమే అవుతుంది. అది ఎప్పుడు, ఎవరిని వరిస్తుందో, తెలియదు! ఉపనిషత్తుల్లో పిండం ఉంది, బ్రహ్మాండమూ ఉంది, జీవాత్మ ఉంది, పరమాత్మ కూడా ఉంది. బ్రహ్మ జీవాత్మకంటే సూక్ష్మమైంది కాబట్టి అది జీవాత్మలోనే ఇమిడి ఉంది. ఉపనిషత్తుల్లో 'బ్రహ్మ' సృష్టికర్త కాదు. సృష్టికర్త అయిన భగవంతుడు అప్పుడప్పుడే మెల్లమెల్లగా నిర్మించబడడం ఆరంభమైనట్లు తోస్తుంది.

**సత్యవాది**

అన్ని ఉపనిషత్తులు లేదా ఉపనిషత్కాలంలోని ఋషులు– మునులు అందరు బ్రహ్మవాదులే, అని భావించడం పొరపాటు. వాళ్ళంతాకూడా తమ బుద్ధియొక్క రెపరెపలాడే దీపం తీసుకొని చీకట్లో దారి వెతుకుతూ ఉండేవారు, ఎవరికి ఎలా తోస్తే అలా నిస్సంకోచంగా చెప్పేవారు. వాళ్ళు ఎలాంటి భయంకరమైన సత్యవాదులో సత్యకామ జాబాలి కథద్వారా మనకు తెలుస్తుంది.

**రైకవ ఋషి**

ప్రాచీన కాలంలో జానశృతి అనే రాజు ఉండేవాడు. అతని తండ్రి, పితామహుడు, ప్రపితామహుడు ముగ్గురు జీవించి ఉండేవారు. అందువల్ల అతణ్ణి 'పౌత్రాయణుడు,' అంటే పుత్రులు, పౌత్రులు కలిగినవాడు అని అనేవారు.

ఆ రాజు బండిని వెంటపెట్టుకొని తిరిగే రైకవ ఋషి ప్రసిద్ధి విన్నాడు. అప్పుడు జానశృతి పౌత్రాయణుడు ఆరువదందల ఆవులు, ఒక రత్నమాల, కంచర గాడిదల రథం వెంట తీసుకొని బయలుదేరి, ఋషివద్దకు చేరి ఇలా అన్నాడు–

"రైకవ ఋషీ! ఈ ఆరువందల ఆవులు, ఈ రత్నమాల, కంచరగాడిదల ఈ రథం మీకోసం తెచ్చాను. మీరు ఏ దేవుణ్ణి ఆరాధిస్తారో, ఆ దేవుని ఉపదేశం నాకివ్వండి." ఈ కానుకలు రైకవ ఋషికి చాలవని అనిపించింది. ఆయన ఇలా అన్నాడు– "ఓరీ శూద్రుడా! ఈ హారం, ఈ ఆవులు నీ దగ్గరే ఉంచుకో." ఋషి రాజును శూద్రుడా! అని పిలవడం ఉపనిషత్కాలంలోనే 'శూద్రుడు' అనే పదం నిందావాచకంగా మారిన తర్వాతి కాలానికి చెందింది అని సూచిస్తుంది. అప్పుడు జానశృతి పౌత్రాయణుడు మరికొన్ని కానుకలు, ముఖ్యంగా అందాల రాశి తన కుమార్తెను వెంటతీసుకొని వెళ్ళాడు.

ఋషి రాకుమార్తె ముఖం పైకెత్తుతూ ఇలా అన్నాడు– "ఓ శూద్రుడా! నీవు తెచ్చిన ఈ వెయ్యిగోవులు, రత్నమాల, కంచర గాడిదల రథం మొదలైనవి కాదుగానీ, ఈ సుందరి ముఖం నీకు ఉపదేశించడానికి నన్ను వివశుణ్ణి చేస్తుంది." అంటూ...

రైకవ ఋషి రాజుకిచ్చిన తల, తోక లేని ఉపదేశం దాదాపు ఇలా ఉంది– "అగ్ని ఆరిపోయినప్పుడు అది

వాయువులోకే తిరిగి వెళ్ళిపోతుంది. సూర్యుడు అస్తమించి నప్పుడు వాయువులోకే తిరిగి వెళ్ళిపోతాడు. చంద్రుడు అస్తమించినప్పుడు అతడు కూడా వాయువులోకే తిరిగి వెళ్ళిపోతాడు."

ఇక్కడ ఉపదేశం ముఖ్యంకాదు. ఏ మానవ లక్షణం లేదా స్వభావం కారణంగా రైకవుడు రాజుకు ఉపదేశం ఇవ్వడానికి అంగీకరించాడో, అది ముఖ్యం. రాజు రూపవతి అయిన తన కూతురును తీసుకొని వెళ్ళకుండా ఉండి ఉంటే, ఋషి అతనికి ఉపదేశం ఇచ్చేవాడు కాదు!

## బ్రహ్మమయం

ఉపనిషత్తులు పూర్తిగా బ్రహ్మమయంగా ఉన్నాయని అంగీకరించకపోయినా, అవి ప్రధానంగా బ్రహ్మమయంగా ఉన్నాయి, అనే విషయాన్ని మాత్రం అంగీకరించక తప్పదు.

'బ్రహ్మ' స్వయంగా ఏమిటి? అనే చిన్న ప్రశ్నకు సమాధానం ఉపనిషత్తుల్లోనే కాదు, ఎవరి దగ్గర కూడా లేదు. అయినా ఉపనిషత్తులు 'బ్రహ్మ'ను అర్థం చేసుకోడానికి, వివరించి చెప్పడానికి ప్రయత్నం చేశాయి– *బ్రహ్మ సందర్శనం ఆత్మలోకం, పితృలోకం, గంధర్వలోకం, బ్రహ్మలోకాల*లో జరుగుతుంది.

1. మనిషి 'ఆత్మ'లో బ్రహ్మసందర్శనం అద్దంలో ప్రతిబింబం చూసినట్లు కలుగుతుంది.

2. *పితృలోకంలో,* అంటే పూర్వజుల లోకంలో దాని సందర్శనం మనిషి కలలో ఏదైనా ఒక వస్తువును చూసినట్లు కలుగుతుంది.

3. *గంధర్వలోకంలో,* అంటే జ్ఞానుల లోకంలో దాని సందర్శనం ఏదైనా వస్తువు అలల్లో వేరువేరు రీతుల్లో కనిపించే విధంగా కలుగుతుంది.

4. *బ్రహ్మలోకంలో,* అంటే ధ్యానులైన పురుషుల లోకంలో దాని సందర్శనం మనిషి ఏ విధంగా ఎండను, నీడను వేరు–వేరుగా చూస్తాడో, ఆ విధంగా కలుగుతుంది.

## బ్రహ్మ–అంటే ఏమిటి?

పైన ఇంత చర్చ జరిగిన తర్వాత కూడా 'బ్రహ్మ' అంటే ఏమిటి? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం రాలేదు. ఇంతవరకు తెలిసిందేమిటంటే–

*1. బ్రహ్మకు అస్తిత్వం ఉంది, 2. ప్రాణం బ్రహ్మ, 3. మనసు బ్రహ్మ, 4. విజ్ఞానం బ్రహ్మ, 5. ఆనందం బ్రహ్మ.*

బ్రహ్మను అర్థం చేసుకోడానికి ఎంత ఎక్కువ ప్రయత్నం చేస్తూపోతామో, అది అంత ఎక్కువ చిక్కుముడిగా మారి అర్థం కాకుండా పోతుంది. 'బ్రహ్మ' యొక్క భౌగోళిక స్థితికి సంబంధించిన ఒక నమూనా–

"పురుషుని హృదయ ప్రదేశంలో ఏ ఆకాశమైతే ఉందో, అది వెలుపల ఉన్న ఆకాశమే. వెలుపలి ఆకాశం శూన్యంలాగా ఉన్నా కూడా ఏ విధంగా 'బ్రహ్మ'తో నిండి ఉందో, అదే విధంగా హృదయాకాశం కూడా శూన్యంలాగా ఉంటూ కూడా 'బ్రహ్మతో నిండి ఉంది. గాయత్రి ఈ బ్రహ్మనే స్తుతిస్తుంది. ఈ ఆకాశం శూన్యం కాదు. పరిపూర్ణమైంది బ్రహ్మ ద్వారా పరిపూర్ణమైంది. ఎల్లప్పుడు ఒకే రూపంలో ఉంటుంది." ఏది శూన్యమో అది పరిపూర్ణంగా ఎలా ఉండగలుగు తుంది? బ్రహ్మవాదుల 'బ్రహ్మ' బీజగణతంలోని 'X' అక్షరంలాంటిది. దానికి ఎక్కడ, ఎలాంటి అర్థం కావాలనుకుంటే ఆ అర్థం ఇవ్వవచ్చు!

గాయత్రి 'ఏ బ్రహ్మను కీర్తిస్తుందో, 'ఓమ్' ను కూడా ఆ బ్రహ్మకు పర్యాయంగా భావించడం జరుగుతుంది. "ఈ 'ఓమ్' ఒక అక్షరం. అయితే ఇదే బ్రహ్మ. ఇదే అన్నింటికి అతీతమైంది. ఈ అక్షరాన్ని తెలుసుకున్న తర్వాత ఏమి కావాలని కోరుకుంటే అది పొందవచ్చు."

(కఠోపనిషత్తు, రెండవ వల్లి16)

ఉపనిషత్తుల్లో ఒకచోట 'బ్రహ్మ' ఆత్మలో కలిసిపోయి ఉంటే మరోచోట ఆత్మ 'బ్రహ్మ'లో కలిసిపోయి ఉంటుంది. ఈ రెండింటి ద్రావణాన్నే సమిష్టిగా *ఆత్మతత్వం* అని అంటారు. ఈ *ఆత్మతత్వాన్ని* ఈ విధంగా వివరించారు–

"అక్షరాల్లో, మాత్రల్లో ఆ ఆత్మతత్వాన్ని వర్ణించినప్పుడు దాన్ని *ఓంకారం"* అంటారు. అక్షరానికి, మాత్రకు మధ్య పెద్ద తేడా లేదు. అక్షరమే మాత్ర, మాత్రే అక్షరం. ఆ అక్షరాలు, మాత్రలు– *అకారం, ఉకారం, మకారం.*

దార్శనికులకు 'ఏమిటి?' అనే ప్రశ్నతో పాటు 'ఎలా?' అనే ప్రశ్నకూడా ప్రధానమైందే. సృష్టి ఉంది, జీవుడు, బ్రహ్మ ఉన్నారు. ఇదంతా సరే, అయితే ఇవన్నీ అస్తిత్వంలోకి ఎలా వచ్చాయి? ఇవి ఆరంభం, అంతం లేనివా? ఆరంభం ఉండి అంతం లేనివా? లేక ఆరంభం లేనివి, అంతరించి పోయేవీనా? లేక ఆరంభము, అంతము రెండూ ఉన్నవా? బృహదారణ్యకోపనిషత్తు ఇలా చెప్తుంది–

'బ్రహ్మాండం' యొక్క సృష్టి జరగడానికి మునుపు 'పురుషుడు' ఉన్నాడు. అంటే 'బ్రహ్మ' ఉన్నాడు. 'పిండం' యొక్క సృష్టి జరగక మునుపే 'ఆత్మ', అంటే జీవుడు ఉన్నాడు.

**బ్రహ్మ, ఆత్మ**

ఇక్కడ ఈ రెండింటికీ ఆరంభం ఉన్నట్లుగానీ, లేనట్లుగానీ చెప్పడం జరగలేదు. రెండింటి అస్తిత్వం, బ్రహ్మాండం, పిండం ఈ రెండు అస్తిత్వంలోకి రాక మునుపు నుంచే ఉందని మాత్రమే చెప్పడం జరిగింది.

అప్పుడు ఏం జరిగింది? 'పురుషుడు' తన చుట్టూ చూసినప్పుడు తను తప్ప మరేదీ కనిపించలేదు - పృథ్వీ, సూర్యుడు మొదలైన దేవతల సృష్టి అప్పటికి ఇంకా జరగలేదు. 'ఆత్మ'కూడా తనచుట్టూ చూసినప్పుడు తను తప్ప మరేమీ కనిపించలేదు - మనిషి, పశు-పక్షులు, మొదలైనవాటి సృష్టి అప్పటికి ఇంకా జరగలేదు.

'బ్రహ్మ'ను 'పురుషుడు' అని అన్నట్లే 'ఆత్మ'ను కూడా 'పురుషుడు' అని అంటారు. 'పురుషుడు' అంటే పాపాలను దహించివేసేవాడు, అని అర్థం. 'బ్రహ్మాండం'గానీ, 'పిండం'గానీ లేనప్పుడు, కేవలం ఒక్క 'పురుషుడే' ఉన్నప్పుడు అతడు మొట్టమొదటగా దహించివేసిన పాపం ఏదై ఉంటుంది?

**సృష్టి ఆరంభం**

సృష్టి ఆరంభంలో అతడు ఒకడే ఉన్నాడు. అందువల్ల అతనికి భయమేసింది!

ఆహా! ఏమిబ్రహ్మ!

ఆ తర్వాత అతడు ఇలా ఆలోచించాడు- "నేను తప్ప మరెవరూ లేనప్పుడు నేనెవరికి భయపడాలి?' ఇలా ఆలోచించగానే అతని భయం తొలగిపోయింది.

దీనికి అర్థం ఏమిటి? బ్రహ్మ ఉన్నప్పుడు భయం కూడా ఉండింది, అనే కదా! బహుశా రెండూ సహజన్ములేమో!

'బ్రహ్మ' ఒంటరిగా ఉన్నప్పుడు అతనికి ఏమీ తోచలేదు. అందువల్లనే ఏకాకి 'పురుష'నికి ఏమీ తోచదు. ఒంటరిగా ఉన్నప్పుడు 'బ్రహ్మ'కు కూడా భయమేసినప్పుడు, ఒంటరి మనిషికి కూడా ఏమీ తోచకుండా పోయినప్పుడు బ్రహ్మకు, సామాన్య మానవునికి తేడా ఏమిటి?

ఆ తర్వాత 'అతడు మరొకరు కావాలని కోరుకొని అందుకోసం తన శరీరాన్ని రెండు భాగాలుగా విడిపోయేట్లు విదిలించేశాడు. సృష్టే లేనప్పుడు శరీరం ఎక్కడి నుంచి వచ్చినట్లు? విదిలించినంత మాత్రాన్నే స్త్రీ లింగం, పురుష లింగం వేరుగా ఏర్పడడానికి ఆ శరీరం ఉభయ లింగాలు కలిగి ఉండిందా? అది కేవలం పురుషలింగం మాత్రమే కలిగి ఉండిందయితే అందులోంచి స్త్రీలింగం ఎలా ఏర్పడింది? సరే, ఏదో విధంగా పురుష తత్వం, స్త్రీతత్వం రెండింటి కలయిక జరిగింది, దాని ద్వారా మానవజాతి నిర్మాణం జరిగింది, అనుకుందాం.

అప్పుడు స్త్రీతత్వం ఇలా అనుకుంది- "నన్ను తన శరీరంలోంచే ఉత్పత్తి చేసి ఈ పురుషతత్వం నాతోనే సంభోగం చేస్తూంది! అయ్యో! నేను దాక్కోవాలి!" ఇలా అనుకొని అది గోవుగా మారిపోయింది. అప్పుడు పురుషతత్వం ఎద్దుగా మారిపోయింది.

తర్వాత స్త్రీతత్వం ఆడగుర్రం రూపాన్ని ధరించింది. పురుషతత్వం మగ గుర్రంగా మారి వెళ్ళింది. ఆ తర్వాత ఆడగాడిద, మగ గాడిద తయారయ్యాయి. ఆ తర్వాత మేక, మేకపోతు, ఇలాగే చీమల దాకా ప్రపంచంలోని అన్ని జంటలు ఏర్పడ్డాయి. వీటిని పురుషతత్వం, స్త్రీతత్వం కలిసి ఉత్పత్తి చేశాయి.

సృష్టి నిర్మాణానికి సంబంధించిన ఈ కథపైన ప్రశ్నల వర్షం కురిపించవచ్చు. ఒక్క ఈ కథపైనే ఎందుకు? ఏ కథపైనైనా కూడా! అందుకే బుద్ధ భగవానుడు అన్నాడు- ప్రపంచం ఒక ఆది అంటూ లేనిది.

"భిక్షువులారా! ఈ ప్రపంచానికి ఒక ఆది అంటూ లేదు. దీని అంతం ఎక్కడుందో తెలియదు." ముందు ఆది తెలుసుకున్నా కూడా లాభమేమిటి? ముఖ్యప్రశ్న ముల్లు ఎలా గుచ్చుకుంది? అనేది కాదు. గుచ్చుకున్న ముల్లును బయటికి ఎలా తీయాలి? అనేది. ఉపనిషత్తుల్లో కేవలం అదృశ్య బ్రహ్మతప్ప మరేమీ లేదనడానికి వీల్లేదు. అనేకచోట్ల హేతుబద్ధమైన, ఉపకారకమైన మాటలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు- 'ఓ ఉపాసకా! ప్రపంచంలో మూడు లోకాలున్నాయి- 'మనుష్యలోకం', 'పితృలోకం', 'దేవలోకం!' తింటూ-తాగుతూ, సంతానోత్పత్తి చేస్తూ జీవించే సాధారణ ప్రజలు 'మనుషులు'గా పిలవబడతారు. స్వప్రయోజనాలను

వదిలిపెట్టి ప్రపంచాన్ని రక్షించడంలో లీనమై ఉండేవారు 'పితరు'లనబడతారు. ప్రపంచానికి జ్ఞానం ఇచ్చి, దాన్ని ముందుకు తీసుకెళ్ళేవారు 'దేవతలు' అనబడతారు."

**యాజ్ఞవల్క్యుడు - మైత్రేయి**

మైత్రీయీ-యాజ్ఞవల్క్యుల సంవాదం ఉపనిషత్తుల్లోని అతి ఆకర్షణీయమైన, అర్థవంతమైన కథ-

యాజ్ఞవల్క్యుడు స్నేహితురాలు వంటి తన భార్య మైత్రేయితో ఇలా అన్నాడు- "నేనిక గృహస్థాశ్రమంలోనే పడి ఉండదలచుకోలేదు. రా, నేనిప్పుడు కాత్యాయని (యాజ్ఞవల్క్యుని మరోభార్య) తో నీ పరిష్కారం చేసేస్తాను."

మైత్రేయి ఇలా అంది- "ఈ భూమి అంతా కూడా ధనంతో నిండి ఉండి నాదైపోతే దానిద్వారా నేను అమరత్వం పొందుతానా?" యాజ్ఞవల్క్యుడు అన్నాడు- "పొందలేవు. అప్పుడు సంపన్నుడైన ఒక వ్యక్తి ఏ విధంగా సుఖ-శాంతులతో జీవిస్తాడో, అలాగే నీవు కూడా జీవిస్తావు. ధన-ధాన్యాలతో అమరత్వం పొందాలనే ఆశ పెట్టుకోవడం వృథా."

మైత్రేయి అంది- "దేనిద్వారా నేను అమరత్వం పొందలేనో, అది నాకెందుకు?"

యాజ్ఞవల్క్యుడు అన్నాడు- "నీవు నాకు ప్రియమైనదానివి. రా, కూర్చో, నీకు అంతా విశదంగా తెలియపరుస్తాను." తన కోరిక కోసమే...ఆ తర్వాత యాజ్ఞవల్క్యుడు తన ప్రవచనం ఇలా ఆరంభించాడు.

"మైత్రేయీ! విను, భర్త ప్రేమ పాత్రుడుగా ఉండేది భర్త కోరికలు తీరుతాయని కాదు, భార్య కోరికలు తీరుతాయని. భార్య ప్రేమ పాత్రురాలుగా ఉండేది భార్య కోరికలు తీరుతాయని కాదు, భర్త కోరికలు తీరుతాయని. పుత్రులు ప్రేమ పాత్రులుగా ఉండడం వారి కోరికలు తీరుతాయని కాదు, తండ్రి కోరికలు తీరుతాయనే. ధనం యొక్క కోరికలు తీరుతాయని ధనంపట్ల ప్రేమ కలగదు, ధనవంతుని కోరికలు తీరుతాయనే దానిపట్ల ప్రేమ నెలకొని ఉంటుంది. బ్రహ్మశక్తి కోరికలు తీరుతాయని బ్రహ్మపట్ల మనకు ప్రేమకలగదు, మన కోరికలు తీరుతాయనే దానిపట్ల మనకు ప్రేమ కలుగుతుంది. దేవతల కోరికలు తీరుతాయని దేవతలపట్ల ప్రేమ పుట్టదు, మన కోరికలు తీరుతాయనే వారిపట్ల మనకు ప్రేమ కలుగుతుంది. ఇలాగే అన్నింటిపట్ల కూడా. ఏదయితే మనకు ఇదంతా ప్రియమైందిగా కనిపిస్తోంది, అది స్వతహాగానే చూడదగిందా, వినదగిందా, అంగీకరించదగిందా, నిరంతరం ధ్యానించదగిందిగా ఉంటుంది. దాన్నేచూడు, దాన్నేవిను, దాన్నే తెలుసుకో, దాన్నే ధ్యానించు. ఓ మైత్రేయీ! మనిషి తన్ను తాను చూసుకోవడం ద్వారా, తెలుసుకోవడం ద్వారా, అర్థం చేసుకోవడం ద్వారా అన్ని ముడులు విడిపోతాయి."

**సామంజస్యం లేదా ఔచిత్యం**

సంస్కృత దార్శనిక వాఙ్మయంలో ఎక్కడెక్కడైతే 'ఆత్మ' అనే పదం వచ్చిందో, అక్కడంతా దానికి ఒకే అర్థం- జీవాత్మ సంబంధమైన అర్థం- చెప్పడం పరిపాటయింది. ఈ యాజ్ఞవల్క్యుడు - మైత్రేయి సంవాదంలో వచ్చిన 'ఆత్మ' అనే పదానికి కూడా జీవాత్మ సంబంధమైన అర్థమే చెప్పడం జరిగింది. కానీ, అలా చెప్పడం వృథా. ఇక్కడ 'ఆత్మ'కు స్పష్టంగా కనిపించే అర్థం - 'స్వంతగా తను' అని. ఈ అర్థం చెప్పుకున్నప్పుడే మొత్తం ఈ సంవాదంలో సామంజస్య పూరితమైన, ఔచిత్యంతో కూడిన అర్థం కనిపిస్తుంది. అలా కానప్పుడు 1. ఆత్మ కోరికలు తీరడానికే భర్త ప్రేమపాత్రుడుగా ఉంటాడు. 2. ఆత్మ కోరికలు తీరడానికే భార్య ప్రేమపాత్రురాలుగా ఉంటుంది. 3. ఆత్మకోరికలు తీరడానికే పుత్రులు ప్రేమపాత్రులుగా ఉంటారు. 4. ఆత్మకోరికలు తీరడానికే ధనం ప్రియమైందిగా ఉంటుంది... ఆత్మ కోరికలు తీరడానికే అన్నీ ప్రియమైనవిగా ఉంటాయి... అని అర్థం చెప్పుకున్నప్పుడు అందులో ఔచిత్యం ఉందని ఎలా చెప్పగలం? ఒకే విధంగా ఔచిత్యం ఉందని చెప్పగలం- జీవాత్మే భర్త, భార్య, పుత్రుడు, ధనం... ఇలా అన్నింటిని కోరుకుంటుంది, అని భావించినప్పుడు!

**సత్యము-బ్రహ్మ**

ఉపనిషత్తుల ఋషుల్లో యాజ్ఞవల్క్యుడు యథార్థవాది అయిన ఋషి. ఆయన ఇలా అంటాడు- 'ఈ 'హృదయం' ఉందే, అందులోకే వచ్చి 'సత్యం' కూర్చొని ఉంది. సర్వప్రాణుల ఈ సత్యమే 'బ్రహ్మ', 'సత్యబ్రహ్మ' అతి గొప్పది, పూజించదగింది, అన్నింటికంటే ముందు సాక్షాత్కరించేది. సర్వప్రాణుల హృదయంలో నివసించే 'సత్య-బ్రహ్మ'ను ఎవరైతే తెలుసుకుంటారో, వారు ఈ లోకాలను జయిస్తారు. ఎవరైతే పూజనీయమైన, అతిగొప్పదైన, అన్నిటికంటే ముందు సాక్షాత్కరించే, ఈ 'సత్యబ్రహ్మ'ను మిథ్య అని భావిస్తారో,

వారు పరాజితులై పోతారు." సత్యమే బ్రహ్మ, అనేమాట మాత్రం సరైందే. అంగీకరించతగిందే. కానీ, దేన్నైతే మిథ్యగా భావించినప్పుడు ఇంత పెద్ద పరాజయం పొందే భయం చూపడం జరుగుతుందో, ఆ అన్నిటికంటే ముందు సాక్షాత్కరించే బ్రహ్మ ఎవరో, మాకు తెలియదు.

ఉపనిషత్తులన్నింటిలో చాలావరకు బ్రహ్మవాదమే నిండి ఉంది. అవి 'బ్రహ్మ'కు సంబంధించిన గీతాల సంకలనాలు మాత్రమే. యాజ్ఞవల్క్యుడు అందరిని మించిన బ్రహ్మవాది. 'బ్రహ్మ'ను మాత్రమే సత్యంగా భావించి, మిగతా అంతటిని మిథ్య అని ప్రకటించేవాడు. ఈ నేపథ్యంలో ఈ పంక్తులు చూడండి–

"ప్రాచీన కాలంలో విదేహరాజు జనకుడు 'బహు దక్షిణ' అనే యజ్ఞం చేశాడు. విదేహ రాజ్యంలోని బ్రాహ్మణులేకాక కురు, పాంచాల దేశాల బ్రాహ్మణులు కూడా అక్కడికి వచ్చారు. ఆ బ్రాహ్మణులందరిలో పరమజ్ఞాని అయిన బ్రాహ్మణుడెవరో తెలుసుకోవాలనే కోరిక విదేహరాజుకు కలిగింది. ఈ ఉద్దేశ్యంతో ఆయన ఒక వెయ్యి ఆవులను తెప్పించి, ప్రతి ఆవు రెండు కొమ్ములకు పది–పది తులాల బంగారం కట్టించాడు. అంటే వెయ్యిగోవుల కొమ్ములకు మొత్తం ఇరవైవేల తులాల బంగారం అన్నమాట!

అలా చేయించి విదేహరాజు ఇలా అన్నాడు– "గౌరవనీయులైన బ్రాహ్మణులారా! మీలో సర్వశ్రేష్ఠుడైన బ్రహ్మజ్ఞాని ఎవరైతే ఉన్నారో, వారు ఈ గోవులను తన ఇంటికి తోలించుకొని పోవచ్చు." బ్రహ్మజ్ఞాని అయిన యాజ్ఞవల్క్యుడే ఆ ఇరవైవేల తులాల బంగారం కట్టిన గోవులను తన ఆశ్రమానికి తోలించుకొని వెళ్ళిపోయాడు! ఆయన బ్రహ్మజ్ఞానం ఇతరులకోసమే, ఇరవైవేల తులాల బంగారం కట్టిన జనకుని గోవులు మాత్రం ఆయనకోసం!

**వెలుగు కిరణం–బౌద్ధధర్మం**

వేద సంహితలు ఏ యుగానికి ప్రాతినిధ్యం వహిస్తాయో, ఆ యుగంలో 'దర్శనశాస్త్రం' లాంటిది ఏదీ లేదని మనం ఇందాకా చూశాం. ఈ ఆర్యులు ఎలాంటి జీవితం జీవించేవారో, దాన్నే ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణవేదం పేరుతో ప్రసిద్ధి చెందిన ఋక్కులు వ్యక్తీకరిస్తున్నాయి. దేవతలను స్తుతిస్తే వారి కోరికలు తీరతాయని వేదకాలంనాటి ప్రజలు నమ్మారు. అందువల్ల దేవతల ప్రార్థనలు, కీర్తనలు చేసేవారు. తర్వాత కొంతకాలానికి పురోహిత వర్గం పుట్టింది. పుట్టి పురోహిత వర్గం యొక్క మధ్యవర్తిత్వం ద్వారా అశ్వమేధ యజ్ఞం మొదలైన అనేక విధాల యజ్ఞాలు చేయిస్తే చేయించేవారి కోరికలన్నీ తీరుతాయనే విశ్వాసాన్ని ప్రజల్లో ప్రచారం చేసింది. యజ్ఞం చేసే, చేయించే ప్రత్యేకాధికారాన్ని తన చేతుల్లోనే ఉంచుకొని పురోహితులు యజ్ఞం చేయించడానికి సూక్ష్మమైన ఎన్నో విధి–విధానాలను రూపొందించారు.

**పురోహిత వర్గం**

క్షత్రియులు యుద్ధాలు చేసేవారు, వైశ్యులు వ్యాపారం చేసేవారు, శరీర శ్రమ చేసేవారు 'సేవ' చేసేవారు, ఇక పురోహితులు యజమానులు ఇచ్చిన 'దక్షిణ' ఉపయోగించే వారు, పెద్దసంఖ్యలో వారు తెచ్చే అమాయక పశువులను బలి ఇచ్చి వాటి మాంసం కడుపునిండా తినేవారు. ఇందుకు వాళ్ళను మనం తప్పుపట్టడానికి వీల్లేదు, ఎందుచేతనంటే ఇదే వాళ్ళ 'వృత్తి' కాబట్టి. ఏ విధంగా పశువులను చంపడం కసాయివాని వృత్తిగా ఉంటుందో, అలాగా.

**ఋషుల, మునుల అన్వేషణ**

ప్రకృతితో, సమాజంతో ప్రత్యక్షమైన, అతి సన్నిహితమైన సంబంధం ఎవరికైతే ఉంటుందో, వాళ్ళ మస్తిష్కం నుంచే యథార్థమైన దర్శనశాస్త్రం ఉత్పత్తి చెందాలి. కానీ, అలాంటి వాళ్ళకు తీరికగా కూర్చొని దీర్ఘాలోచన చేసేందుకు తగినంత 'తీరిక' ఉండదు. పురోహిత వర్గానికి అలాంటి పనులతో సతమతం కావలసిన అవసరం లేదు కాబట్టి దార్శనిక చింతన చేస్తూ ఉండడానికి వారికి తగినంత తీరిక ఉండేది. ఉపనిషత్తుల కాలంలో అరణ్యాల్లో నివసించే ఋషులు–మునులు కూడా అలాంటివారే. వారికి కూడా భోజన సమస్య ఉండేదికాదు. 'ఈ భౌతిక జగత్తు ఏమిటి? ఈ ఆధ్యాత్మిక జగత్తు ఏమిటి? ఈ సమస్త జగత్తు సత్యం నుంచి ఉత్పత్తి చెందిందా లేక మిథ్యనుంచా? ఈ సమస్త జగత్తు నిజంగానే ఉందా లేక లేదా? ఒకవేళ ఉంటే అది స్వప్నంతో సమానమైందా? లేక జాగ్రతావస్థలో మనకు అనుభవమయ్యే లోకంతో సమానమైందా? ఒకవేళ ఈ జగత్తు మౌలికంగా బ్రహ్మస్వరూపమైందే అయితే ఆ బ్రహ్మరూపం ఎలాంటిది? ఇలాంటివే అనేక ప్రశ్నలు ఋషులను మునులను చిక్కుముడుల్లో కట్టి ఉంచేవి.

ప్రజలు ఇలాంటి బ్రహ్మజ్ఞానులను చాలా గౌరవించేవారు. వారికి అన్నపానాల చింతలు లేకుండా చేసేవారు. సాలెపురుగు ఏ విధంగా తన పట్టు అల్లుకుంటుందో, సరిగ్గా అదేవిధంగా చింతనా జగత్తులో ఇలాంటి పడుగు పేకలు నేసుకుంటూ ఉండడమే మన ఋషుల, మునుల అన్వేషణగా సాగింది. అంతేకాక అదే వారి వృత్తి కూడా అయింది.

## పరమార్థ సత్యం, వ్యవహార సత్యం

వారు పరమార్థ సత్యాన్ని గురించి యోచించేవారు. కానీ వ్యవహార సత్యానికి చెందిన జీవితమే జీవించేవారు. ఈ పరమార్థ సత్య, వ్యవహార సత్యాల వర్గీకరణ భారతీయ చింతనా జగత్తుకు బౌద్ధధర్మం ఇచ్చిన కానుకే! ఆ తర్వాత వచ్చిన శంకరాచార్యుడు మొదలైన ఆచార్యులు ఎవరెవరైతే దీన్ని ఎంచుకున్నారో, వారంతా ఇందుకుగాను బౌద్ధధర్మం నుంచి పొందిన ఋణాన్ని అంగీకరించాలి.

## చారిత్రక మహామానవుడు

బుద్ధభగవానుడు క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో జన్మించాడు. దీనికి మునుపటి కాలాన్ని ప్రాగైతిహాసిక యుగం అని అంటారు. అంటే ఆ యుగంలో జరిగిన ఏ సంఘటన విషయంలోగానీ, అది ఫలానా తిథి, నెల, సంవత్సరంలో జరిగినట్లు ఖచ్చితంగా, నిస్సందేహంగా, వివాదం లేకుండా చెప్పలేము. అన్ని సంఘటనల చారిత్రక పూర్వాపరాలు అంచనాపైన ఆధారపడినవే.

బుద్ధభగవానునికి ముందు ఉండిన ఋషి-మునులందరి నామావళులు తప్ప ఎవరి గురించి కానీ రాతమూలకమైన వివరాలు ఏవీ లేవు. ఎందరి ఋషులు, మునులు పుట్టిన తిథులు మనకు తెలుసు? ఎందరు ఋషులు, మునులు పుట్టినచోటు గురించి మనం చెప్పగలం? మా ఋషులు, మునులు చాలా-చాలా ఏండ్లు జీవించారు, అని చెప్పడానికి మించి ఎందరి ఆయువు గురించి మనం ఖచ్చితంగా చెప్పగలం? ఎందరి చనిపోయిన తిథి మనం చెప్పగలం? ఎందరి మరణ స్థలం గురించి మనకు తెలుసు?

ఇవన్నీ మనకు తెలిసిన మొట్టమొదటి మహా పురుషుడు బుద్ధభగవానుడే. ఆయన జన్మ తిథి మనకు తెలుసు - వైశాఖ పూర్ణిమ. ఆయన జన్మస్థానం మనకు తెలుసు - కపిల వస్తుప్రాంతంలోని లుంబినీవనం. ఇల్లు వదలివెళ్ళినప్పటి ఆయన వయసుకూడా మనకు తెలుసు - 29 సంవత్సరాలు. ఆయన బుద్ధత్వం పొందినచోటు ఏదోకూడా మనకు తెలుసు - బుద్ధగయలోని వజ్రాసనం. ఆయన ధర్మచక్ర ప్రవర్తన చేసిన చోటుకూడా మనకు తెలుసు - సారనాథ్‌లోని మృగదాయవనం. నిర్వాణ సమయంలోని ఆయన వయసు కూడా మనకు తెలుసు - పూర్తిగా ఎనభై సంవత్సరాలు. ఆయన మహాపరినిర్వాణం పొందిన చోటు గురించి కూడా మనకు బాగా తెలుసు - కసియాజిల్లా (ఉత్తరప్రదేశ్)లోని కుసీనారా.

## యుగప్రవర్తనకుడైన మహర్షి

అందువల్ల మహామానవుడైన బుద్ధుడు ఋషి మాత్రమే కాదు, 'మహర్షి' అనే పదానికున్న నిజమైన అర్థంలో మహర్షి. సాధారణ మహర్షి కూడా కాదు, యుగప్రవర్తకుడైన మహర్షియే బుద్ధుడు! సమ్యక్ సంబుద్ధుడు!

వైదిక ఋషులు మునులు సాధారణ ప్రజలను వేదాల బానిసత్వంలో బిగించి ఉంచేశారని ఆయన చూసి ఉంటాడు. దేవతల స్తుతి, పూజ, ప్రార్థన చేయడంవల్ల ఈ లోకంలో, పరలోకంలో ఐశ్వర్యం ప్రాప్తిస్తుందని ఒక వర్గం అంటూంటే, మరోవర్గం వైదిక నియమ-నిబంధనలననుసరించి పశువధ ప్రధానమైన 'మహాయజ్ఞాలు' చేయడం ద్వారా అవి ప్రాప్తిస్తాయని చెప్పేది. ఇదంతా తమ పూర్వీకులు రచించిన ఋక్కుల, వారు పాడిన గీతాల దురుపయగం కాక మరేమీ కాదు. ఆ యుగంలో దేవతలపైన నమ్మకం ఒక విధంగా సామాన్య ప్రజల సహజ విశ్వాసంగా ఉండడంవల్ల బుద్ధభగవానుడు దేవతల అస్తిత్వాన్ని నిరాకరించలేదు. ఆయన అంతకంటే కూడా పెద్ద పని చేశాడు. వేదకాలం నాటి దేవతల స్తుతులు, ప్రార్థనలు వ్యర్థమని ప్రకటించాడు, దేవతల ప్రీతికోసం చేసే యజ్ఞాలు సమస్త ప్రాణులకు హానికరమని నొక్కిచెప్పాడు.

## బుద్ధి యొక్క ప్రాధాన్యం

ఆయన వేదాలపట్ల ఉన్న అసత్యపు నమ్మికను సమూలంగా పెకలించాడు. వేదాల బానిసత్వ శృంఖాలను తెంచిపారేశాడు. ఆయన శబ్దప్రమాణం స్థానంలో బుద్ధి ప్రమాణాన్ని ప్రతిష్ఠింపచేశాడు. అంతేకాదు, తన బోధనలను కూడా బుద్ధి అనే గీటురాయిపైన పరీక్షించిన తర్వాతే స్వీకరించమని తన శిష్యులను ఆదేశించాడు. తన మాటలు బుద్ధిసంగతమైనవని, వ్యవహార యోగ్యమైనవని ఎవరికైతే నమ్మకం ఉంటుందో, వాళ్ళు తమ మాటలను ఇతరులపైన రుద్దే ప్రయత్నం ఎన్నడూ చేయరు.

## బుద్ధుడు - బ్రహ్మ

ఉపనిషత్తులు బుద్ధునికంటే మునుపటివని చెప్పడానికి మన వద్ద సాహిత్యక ఆధారాలేవీ లేకపోయినా కొన్ని ఉపనిషత్తులు మాత్రం బుద్ధునికి మునుపటివని భావించినప్పుడు ఈ ఉపనిషత్తుల్లో ఎక్కువ భాగం 'బ్రహ్మ'నే కేంద్రంగా చేసుకొని ఆ బ్రహ్మ చుట్టే ప్రదక్షిణలు చేస్తున్నాయనే విషయం మనం చూశాం. ఈ 'బ్రహ్మ' ఏమిటి? అది 'అన్నం' మొదలుకొని 'బ్రహ్మ'దాకా అన్నీ కూడా. అంతవరకే కాదు, చివరకు అది 'అనిర్వచనీయ'మైంది కూడా. బుద్ధుడు ఈ 'అనిర్వచనీయ'మైన బ్రహ్మను తీవ్రంగా పరిహసించినట్లు తెలుస్తోంది.

ఈ రోజుల్లో అందాల పోటీలు జరిగినట్లే ప్రాచీనకాలంలో కూడా జరిగేవి. అందరినీ మించిన అందగత్తెను 'జనపద కళ్యాణి' అనేవారు.

బుద్ధుడనేవాడు- కొందరు "ఫలానా జనపద కళ్యాణి అంటే మాకు చాలా ఇష్టం" అని అంటూ ఉంటారు. ఈ "జనపద కళ్యాణి ఎలా ఉంటుంది? ఎర్రగా ఉంటుందా? లేక నల్లగా ఉంటుందా? గోధుమరంగుతో ఉంటుందా? ఎలా ఉంటుంది?" అని వారినడిగితే వాళ్ళు "ఆ జనపద కళ్యాణి ఎర్రగా ఉందో, నల్లగా ఉందో లేక గోధుమ రంగుతో ఉందో, ఎలా ఉందో మాకు తెలియదు. అయితే ఆమె అంటే మాత్రం మాకు చాలా ఇష్టం" అని అంటారు. వాళ్ళను మళ్ళీ "ఆమె పొడుగ్గా ఉంటుందా? లేక మధ్యరకంగా ఉంటుందా లేక పొట్టిగా ఉంటుందా? ఎలా ఉంటుంది?" అని అడిగితే వాళ్ళు మళ్ళీ మునుపటిలాగే "ఆమె పొడుగ్గా ఉంటుందో, మధ్యరకంగా ఉంటుందో లేక పొట్టిగా ఉంటుందో ఎలా ఉంటుందో మాకు తెలియదు. అయితే ఆమె అంటే మాత్రం మాకు చాలా ఇష్టం" అని అంటారు. మళ్ళీ వాళ్ళను "ఆమె బ్రాహ్మణ కులానికి చెందిందా లేక క్షత్రియ కులానికి చెందిందా లేక వైశ్యకులానికి చెందిందా లేక మరే కులానికైనా చెందిందా?" అని అడిగితే "ఆమె బ్రాహ్మణ కులానికి చెందిందో, క్షత్రియ కులానికి చెందిందో, వైశ్యకులానికి చెందిందో లేక మరే కులానికి చెందిందో, మాకు తెలియదు. అయితే ఆమె అంటే మాత్రం మాకు చాలా ఇష్టం." అని అంటారు. భిక్షువులారా! బ్రహ్మ వెనక వ్యర్థంగా తిరిగే మనుషుల పరిస్థితి ఇలాగే ఉంటుంది. "ఈ బ్రహ్మ స్వరూపమేమిటని వీళ్లనడిగితే 'నేతి, నేతి' (బ్రహ్మయొక్క అనంతత్వాన్ని సూచించే ఉపనిషద్వాక్యం. దీని అర్థం 'అంతం లేదు' అని. అంటే బ్రహ్మ మహిమ అపారమైంది, అని) అనో లేక 'అనిర్వచనీయ'మనో అంటారు.

బుద్ధభగవానుడు ప్రజల దృష్టిని ఈ 'బ్రహ్మ' వైపునుంచి తొలగించి సమస్త దుఃఖాల సంపూర్ణ నిరోధం అంటే నిర్వాణ ప్రాప్తివైపుకు మళ్ళించాడు. ప్రజలు చనిపోయిన తర్వాత సచ్చిదానంద స్వరూపుడైన 'బ్రహ్మ'లో లీనం కావడాన్నే జీవిత పరమార్థంగా భావించేవారు. బుద్ధభగవానుడు ఇక్కడే, ఈ భూమిపైనే, ఆరడుగుల ఈ శరీరంలోనే దుఃఖక్షయం కలిగించుకోవచ్చు అని ప్రకటించాడు, దాన్నే జీవితోద్దేశ్యంగా నిర్ణయించి చెప్పాడు. 'ఈ దుఃఖం అహేతుకమా?' అనేది ఒక లోతైన దార్శనిక ప్రశ్న. 'దుఃఖం' అహేతుకం కాదు' అని బుద్ధభగవానుడన్నాడు. మరి 'ఈ దుఃఖం దైవకృతమా? అనేది మరో ప్రశ్న. ఆయన ఈ దుఃఖం దైవకృతం కాదన్నాడు. ఆయన 'కొందరు ఈ సృష్టి అంతా భగవంతుడు నిర్మించిందని అంటారు. అలాంటప్పుడు ఇలాంటి దుఃఖమయమైన సృష్టిని నిర్మించిన ఆ భగవంతుడు చాలా నిర్దయుడై ఉంటాడు" అని అన్నాడు.

## ప్రతీత్య సముత్పాదం

సృష్టి 'అహేతుకము'కానీ 'భగవత్కృతము' కానీ కానప్పుడు దీని యథార్థ స్వరూపం ఏమిటి? "ఈ సృష్టి అంతా ప్రతీత్య సముత్పన్నము, అంటే ప్రతీత్య సముత్పాద నియమానికి అధీనంలో ఉంది" అనేది తథాగతుని గగన భేది అయిన ప్రకటన.

ప్రతీత్య సముత్పాద నియమంలోని సూత్రం ఇది- ఇలా ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది, ఇలా లేనప్పుడు ఇలా జరగదు. ఉదాహరణకు- నీళ్ళు ఉంటే ఆవిరి పుడుతుంది, నీళ్ళు లేనప్పుడు ఆవిరి పుట్టదు. లేదా నీళ్ళు ఉంటే మంచు పుడుతుంది, నీళ్ళు లేకుంటే మంచు పుట్టదు. నూనె ఉన్నప్పుడు దీపం వెలుగుతుంది. నూనె లేనప్పుడు దీపం వెలగదు. ప్రతీత్య సముత్పాద నియమాన్ననుసరించి "మనకు కనిపించే ప్రతి వస్తువుకు, ప్రతిక్రియను ప్రతి 'ధర్మా'నికి ఒక పూర్వస్థితి లేక మునుపటి ఉనికి ఉంటుంది. దాని పూర్వస్థితి లేనప్పుడు దాని తర్వాతి స్థితి ఉండదు. ఎందుచేతనంటే దానికి పూర్వస్థితి ఉండింది కాబట్టే దాని తర్వాతి స్థితి ఏర్పడింది కాబట్టి.

మి

# శ్రమణ సంప్రదాయం

*- డి. చంద్రశేఖర్*

ప్రముఖ బౌద్ధ పండితుడు ప్రొఫెసర్ టి.బ్ల్యు. రీస్ డేవిడ్స్ 1894 లో బుద్ధుని జీవితాన్ని మదింపుచేస్తూ యిలా అన్నాడు: "గౌతముడు హిందువుగా పుట్టి, హిందువుగా పెరిగి, హిందువుగా జీవించి, హిందువుగానే మరణించాడు; (బుద్ధిజం, పేజి:83). ఈ అభిప్రాయాన్ని మరింత నొక్కిచెబుతూ "...బౌద్ధం హిందూమతానికి పుట్టిన బిడ్డ, దాన్నుండే యిది రూపొందింది" అని అన్నాడు (బుద్ధిజం, పేజి: 85). పాళీ బౌద్ధగ్రంథాల అధ్యయనం, అనువాదం, వాటి ప్రచారం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఒక మహాపండితుడు బుద్ధుని జీవితం, ఆయన బోధనల గురించి యిటువంటి అభిప్రాయం కలిగివుండటం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే, మరో రెండు సంవత్సరాలు తరువాత యిదే అంశంపై చేసిన ప్రసంగంలో, ఆయన పై అభిప్రాయాన్ని మరోరకమైన మాటల్లో చెప్పాడు: "స్వతస్సిద్ధమైన, విస్తృత పర్యవసానాలు గల ఆయన బోధన నిజానికి ఆకాలపు మతం మీద తిరుగుబాటు అయినప్పటికి, అది మొదటినుండి చివరి వరకు భారతీయమైనదే...బౌద్ధం తప్పకుండా ఒక భారతీయ (ఇండియన్) సిద్ధాంతం. బుద్ధుడు తన జీవితాంతం స్వభావ సిద్ధంగా భారతీయుడు" (*హిస్టరీ అండ్ లిటరేచర్ ఆఫ్ బుద్ధిజం,* పేజి 62). ఇక్కడ "హిందువు" అనేదానికి బదులు "ఇండియన్" అనే పదాన్ని వాడినట్లు స్పష్టంగా తెలుస్తుంది. అయితే వెంటనే మళ్ళీ "... ఆయన (బుద్ధుడు) హిందువుల్లో అత్యంత ప్రజ్ఞావంతుడు" అని అన్నాడు.



సిద్ధార్థుని శుష్క తపశ్చర్య

పై రెండు సందర్భాల్లో ప్రొఫెసర్ డేవిడ్స్ వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిశీలిస్తే, ఆయన "ఇండియన్స్, "హిందూ" అనే పదాలను ఒకే అర్థంలో వాడినట్లు తెలుస్తుంది. బ్రిటిష్‌వారి నుండి స్వాతంత్ర్యం పొందక ముందు భారతదేశానికి "హిందుస్థాన్" అనే పేరు ఎక్కువగా చెలామణిలో వుందనేది తెలిసిందే. ఆ కాలంలో జీవించిన ప్రొఫెసర్ డేవిడ్స్ సహజంగానే "ఇండియన్", "హిందూ" అనే వాటిని సమానార్థంలో వుపయోగించాడు. అయితే ప్రొఫెసర్ డేవిడ్స్ వెలిబుచ్చిన అభిప్రాయాలకు యిదొక్కటే కారణం అని చెప్పటం సరి కాదు. 'బుద్ధుని ముందుకాలంలో భారతదేశంలో ఒకే ఒక బౌద్ధిక-తాత్త్విక లేక ధార్మిక స్రవంతి వుంది, యీ రంగంలో దానికి భిన్నమైంది మరేమి లేదు' అనే ఒక దురవగాహన కూడా, ఆయన పైవిధంగా చెప్పటానికి కారణం. ఈ విషయాన్ని మరింత వివరంగా చర్చించే ముందు మరో వుదాహరణ చూద్దాం.

బుద్ధుని బోధనల్లో ఒక ప్రత్యేకమైన లక్షణం వుందని గుర్తించిన ఆధునిక బౌద్ధ పండితుడు స్టీఫెన్ బాచెలర్ 2010లో వెలువరించిన తన పుస్తకంలో యిలా అన్నాడు. "తనకు పూర్వం భారతదేశ సంస్కృతిలో వున్న (ఉదాహరణకు ఉపనిషత్తుల్లో) తత్త్వ చింతన, వ్యక్తీరకణకు పూర్తిగా భిన్నమైన తత్త్వచింతనను, వ్యక్తీకరణలో విలక్షణమైన స్వరాన్ని సిద్ధార్థ గౌతముడు ఎలా పొందగలిగాడు?" (*కన్ఫెషన్ ఆఫ్ ఎ బుద్ధిస్ట్,* పేజి 245). ఎంతో ముఖ్యమైన యీ ప్రశ్నను లేవనెత్తిన బాచెలర్, దీనికి సమాధానం వెదికే క్రమంలో, "జ్ఞానో దయానికి ముందు ఆయన (బుద్ధుడు) బ్రాహ్మణేతరమైన ఒక గొప్ప సంస్కృతి ప్రభావంలో జీవించాడు". అనే ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. కాని ఆ "బ్రాహ్మణేతర గొప్ప సంస్కృతి" ఏమిటో తెలియక, "సిద్ధార్థుడు జ్ఞానోదయానికి

డి. చంద్రశేఖర్, ఫోన్ : 9290091232

ముందుకాలంలో తక్షశిల (విశ్వవిద్యాలయం) లో గడిపి వుండవచ్చు" అని వూహించి, దీన్ని నిరూపించటానికి విఫలయత్నం చేశాడు. చివరకు 'తక్షశిలలో స్వయంగా అడుగు పెట్టక పోయినా, అక్కడ శిక్షణ పొందిన వారి సహచర్యంలో గౌతముడు జీవించి వుంటాడు', ఉపఖండానికి ఆవల నుండి వచ్చిన 'భారతేతర భావజాల ప్రభావం ఆయన మీద వుందని చెప్పవచ్చు' అని అన్నాడు.


గౌతమ బుద్ధుడు జీవించిన బౌద్ధిక-తాత్త్విక-ధార్మిక వాతావరణం ఎటువంటిది? ఆయన వారసత్వంగా పొందిన తాత్త్విక స్రవంతి ఏమిటి? ఆయన బోధనల్ని వాస్తవికంగా అర్థం చేసుకోటానికి అవసరమైన, వాటి నేపథ్యం ఏమిటి? అనే విషయాలను అనేకమంది బౌద్ధ, బౌద్ధేతర పండితులు చర్చించారు. బుద్ధుడు అసలు చారిత్రక వ్యక్తి కాడు అని చెప్పినవారు వున్నారు. ఆయన వైదిక సంస్కృతికి వారసుడని కొందరు, కాదు వైదిక సంస్కృతిపై తిరుగుబాటు ఫలితంగానే బౌద్ధం ఆవిర్భవించిందని మరికొందరు వాదించారు. మనం పైన చెప్పుకున్న రెండు సందర్భాలను పరిశీలిస్తే, యీ విషయంలో ఎంతో సందిగ్ధత, అస్పష్టత నెలకొనిదీర్ఘకాలంగా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.

అమరావతిలో జరిగిన కాలచక్ర ఉత్సవాలకు హాజరైన సందర్భంగా (జనవరి 2006) వజ్రయాన బౌద్ధ గురువు దలైలామా "బౌద్ధం, హిందూమతం అక్క చెల్లెళ్ళు" అని వ్యాఖ్యానించటం యిందుకు తాజా వుదాహరణ. ఈ సందిగ్ధతకు, అస్పష్టతకు కారణం ఏమిటి? బుద్ధుని బోధనల వాస్తవ చారిత్రక నేపథ్యం ఏమిటి? అనే విషయాలను అర్థం చేసుకోవాలంటే, గత 150 సంవత్సరాలుగా భారతదేశ చరిత్రను, ముఖ్యంగా, దాని ప్రాచీన చరిత్రను గ్రంథస్తం చేసిన తీరును లోతుగా పరిశీలించాలి. భారత ఉపఖండంలో పాశ్చాత్య పాలన మొదలుకాక ముందు యీ దేశ చరిత్ర గురించి ప్రత్యేకంగా జరిగిన కృషి, రాసిన గ్రంథాలు చాలా అరుదు. బ్రిటిష్ పాలనలోనే భారతదేశ చరిత్రను క్రమబద్ధంగా నమోదుచేసే పని మొదలైందని మనకు తెలుసు. చరిత్ర రచనకు రూపకల్పన జరుగుతున్న తొలిదశలో, ఆనాటి మేధోరంగంలో ప్రబలమైన శక్తిగా (నిజానికి ఏకైక శక్తిగా) వున్న వైదిక సంప్రదాయ వాదులు దానిపై తీవ్రమైన ప్రభావం చూపగలిగారు. ఈ దేశ చరిత్ర రచనను అంతర్లీనంగా వుండి నియంత్రించే ఒక 'నమూనా'ను వారు విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారు. దాన్ని క్లుప్తంగా యీ విధంగా చెప్పవచ్చు. భారత ఉపఖండంలో ఆర్యులు ప్రవేశించక ముందు అదొక 'చీకటి ఖండం', అంటే, చరిత్రకారులు 'నాగరికత' అని గుర్తించదగింది ఏదీ ఆనాటికి యిక్కడ లేదు. ఆదిమ మానవుని తొలి నాగరికతకు చిహ్నాలైన స్థిరనివాసం, వ్యవసాయం, చేతివృత్తులు, లిపి, పనిముట్లు మొదలైనవన్నీ ఆర్యులు అనాగరిక ఆదిమ భారత వాసులకు అందించినవే. అలాగే తాత్త్విక - ధార్మిక చింతన, నైతికత, సహజీవనం, శాంతి కాముకత, సోదరభావం - క్లుప్తంగా చెప్పాలంటే, గత కొన్నివేల సంవత్సరాలుగా యీ నేలపై వికసించి, 'భారతీయ' మైనవని పిలవబడే ప్రతిదీ ఆర్యుల ద్వారా 'దిగుమతి' అయిందే, వారిద్వారా సృష్టించ బడిందే. ఫలితంగా యీ దేశంలో ఒకే సాంస్కృతి స్రవంతి కొనసాగుతూ వచ్చింది. పై 'నమూనా'ను వూహాజనితమైన ఒక ప్రతిపాదనగా చెప్పివుంటే అది అంత వరకే పరిమితమై వుండేది. కాని, వేదాలు క్రీ.పూ.7,000 లేదా 10,000 సంవత్సరాల ముందునాటివని కాకి లెక్కలు జోడించి, యీ 'నమూనా'ను చారిత్రక సత్యంగా స్థిరపరచాలనే కుటిల ప్రయత్నం జరిగింది. ఫలితంగా, చాలా మంది భారత, పాశ్చాత్య చరిత్రకారులు, పండితులు యీ వుచ్చులో చిక్కుకున్నారు. ఆర్యులు ఉపఖండంలో ప్రవేశించక ముందు, సుదీర్ఘ కాలంగా భారతదేశంలో నివశిస్తున్న ప్రజల జీవన స్థితిగతుల గురించి, అసలు ఏమీ తెలియని కాలంలో ఈ దేశ చరిత్ర రచనకు అంకురార్పణ జరిగింది. చరిత్రను నిగ్గుతేల్చటంలో మౌలికంగా ఆధారపడదగిన పురావస్తు పరిశోధన ఆనాటికి యింకా మొదలు కాలేదు.

బౌద్ధ, జైన సంప్రదాయాలకు చెందిన సాహిత్యం యింకా వెలుగులోకి రాలేదు. అందువల్ల తొలి తరానికి చెందిన చరిత్రకారులు వైదిక సంప్రదాయ సాహిత్యం పైనే పూర్తిగా ఆధారపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో 'ఏకమూస ఆర్య సంస్కృతి' సిద్ధాంతాన్ని చరిత్రకారులు కూడా ఆమోదించారు. ఫలితంగా, వైదిక సంప్రదాయ వాదులు రూపొందించి, ప్రచారం చేసిన 'నమూనా'లోనే భారతదేశ చరిత్ర రచనకు పునాదులు ఏర్పడ్డాయి. ఈ నమూనాతో సరిపోలని, లేదా పూర్తిగా విభేదించే ఆధారాలు చరిత్ర కారులకు లభించినా, వాటిని అప్పటికే ఏర్పర్చుకున్న చట్రానికి అనుకూలంగా మలచటమో లేదా పూర్తిగా మరుగున పడెయ్యటమో జరిగింది.

(ఇటువంటి ప్రయత్నాలు యీ నాటికీ జరుగుతుండటం మనం చూడవచ్చు). ఈ విధంగా వైదిక లేక ఆర్య 'నమూనా' చాలాకాలం పాటు తన 'సాధికారతను' శక్తివంతం చేసుకుంటూ ముందుకు సాగింది. 20వ శతాబ్దం మూడవ దశకంలో సింధూనది ఒడ్డున గల హరప్పా, మొహెంజదారో (యివి నేటి పాకిస్తాన్‌లో వున్నాయి) అవే ప్రాంతాలను తవ్వినప్పుడు అత్యంత పురాతన నగరాలకు చెందిన శిథిలాలు బయటపడ్డాయి. వీటి ఆధారంగా 1931లో సర్ జాన్ మార్షల్, ఆయన సహచరులు ప్రచురించిన *మొహెంజొదారో అండ్ ది ఇండస్ సివిలిజేషన్* అనే గ్రంథం భారత ఉపఖండంలో విలసిల్లిన అత్యంత ప్రాచీనమైన సింధూనదీ నాగరికతకు సంబంధించిన వివరాలు వెలువరించటంతో చరిత్రకారులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఈ శిథిలాలు అందించిన ఆధారాలు భారతదేశ చరిత్ర రచనను గొప్ప మలుపు తిప్పాయి.

పురాతన భారత చరిత్ర గురించి చీకట్లో పెనుగులాడుతున్న చరిత్రకారుల చేతికి వెలుగుదివ్వె దొరికినట్లయింది. ఆర్య సంస్కృతి క్రీ.పూ. 7,000 లేదా 10,000 సంవత్సరాలకు ముందునాటిదని స్వామి వివేకానందుడు, తదితర ప్రఖ్యాత వైదిక సంప్రదాయ వాదులు ప్రచారం చేసిన కట్టుకథలకు, పుక్కిటి పురాణాలకు తెరపడింది. ఆనాటి వరకూ చెలామణిలో వున్న ఆర్య-వైదిక ఏకమూస 'నమూనా' యిక ఏమాత్రం చెల్లుబాటు కాదని తేలిపోయింది. హరప్పా, మొహెంజ దారోల్లో బయల్పడిన శిథిలాలు ఏమి చెబుతున్నాయి? వాటి ఆధారంగా చరిత్రకారులు స్థూలంగా అంగీకరించిన ముఖ్యమైన విషయాలు ఏమిటి? అనేవాటిని



మొహెంజదారో కుడ్యాలు

క్లుప్తంగా నయినా చెప్పుకోవటం అవసరం. క్రీ.పూ. 2,600 సంవత్సరాల నాటికి సింధూనది పరీవాహక ప్రాంతంలో రెండు పెద్ద పట్టణాలు, నెలకొని కొనసాగాయి. భవన నిర్మాణం, నగరాల రూపకల్పన (town planning)కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యీ నాగరికతలో వుంది. ఇటుకలతో నిర్మించిన మురికినీటి కాలువలు, పెద్ద ధాన్యాగారాలు, విశాలమైన రహదారులు యీ నగరాల్లో వున్నాయి. మట్టి, ఇత్తడి తదితర లోహాలతో చేసిన పాత్రలు, పనిముట్లు, రంగురాళ్ళు పూసలు పొదిగిన ఆభరణాలు, పింగాణి వస్తువులు ఆనాటి ప్రజల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచాయి. ఈ ప్రాంత వాసులు సుదూర ప్రాంతంలోని (నేటి ఇరాక్) ప్రజలతో వ్యాపార సంబంధాలు కలిగి వున్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఇక్కడ దొరికిన రాతి శాసనాలు, లోహఫలకాలు, ముద్రికలను బట్టి ఆనాడు లిపి విస్తృతంగా వాడుకలో వున్నట్లు నిర్ధారించబడింది. ఆనాటి ప్రజల్లో ధార్మిక చింతన బలంగా వుందని రుజువు చేసే అనేక చిహ్నాలు లభించాయి. వీటితోపాటు, అనేక యితర ఆధారాలను బట్టి, యీ రెండు నగరాలు కేంద్రాలుగా సింధూనది ఒడ్డున అత్యంత ప్రాచీనమైన నాగరికత నెలకొని, దీర్ఘ కాలంపాటు కొనసాగినట్లు చరిత్రకారులు నిర్ధారించారు. భారత ఉపఖండంలో అనాదిగా వస్తున్న ప్రజలు యీ నాగరికతకు మూలపురుషులని, దీనికి ఆర్యులతో ఏ విధమైన సంబంధం లేదని తేల్చి చెప్పారు. దీనితో, క్రీ.పూ. 1750 ప్రాంతంలో ఉపఖండంలో ప్రవేశించిన మొరటు సంచార తెగల వారయిన ఆర్యులకంటే, ఆనాడు స్థానికంగా నివసిస్తున్న ప్రజలు నాగరికతలో వేల సంవత్సరాలు ముందున్నారని నిర్ధారించబడింది.

గత 80 సంవత్సరాలుగా అటు పాకిస్తాన్‌లో, యిటు భారతదేశంలోని పంజాబ్, హార్యనా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో జరిపిన పురావస్తు పరిశోధనల్లో సింధూనాగరికతను పోలిన చిహ్నాలు అనేకం లభించాయి. క్రీ.పూ. రెండవ సహస్రాబ్దిలో ఉపఖండంలో ప్రవేశించిన ఆర్యులు స్థానికంగా వున్న అనేక మంది రాజులను హతమార్చి, వారి పట్టణాలను ధ్వంసం చేసినట్లు ఋగ్వేదం చెబుతుంది. పురాలను ధ్వంసం చేశాడు కాబట్టి ఇంద్రునికి పురందరుడనే బిరుదు వచ్చిందని అంటారు. ఆర్యుల దేవుడయిన ఇంద్రుడు, మిత్ర, చమురి, ధుని, సంబర, పిప్ప, శశ్న మొదలైన ద్రవిడ రాజులను చంపి

వారి కోటలను ధ్వంసం చేశాడని ఋగ్వేదం సాక్ష్యం చెబుతుంది. శిథిలమైన 'పురాతన నగరం' గురించిన వర్ణన బౌద్ధ గ్రంథాల్లో (సంయుక్త నికాయం, నిదాన వగ్గ 65) వుంది. సింధూ నాగరికత స్థలకాలాల్లో చాలా విస్తృతమైందని తెలియజేసే యిటువంటి ఆధారాలు యింకా ఎన్నో వున్నాయి. కాబట్టి, సింధూనాగరికతకు కేంద్ర స్థానాలైన ముఖ్యపట్టణాలు అంతరించినంత మాత్రాన, అవి అందించిన నాగరికత అంతరించిందని చెప్పటానికి వీలులేదు.

భారత ఉపఖండంలో ప్రాచీన కాలపు ప్రజల భౌతిక జీవనం, ఆర్థిక కార్యకలాపాల గురించి అనేక విషయాలు యీనాడు మనకు అందుబాటులోకి వచ్చాయి. ప్రత్యేకించి సింధూనాగరికతకు సంబంధించిన సమాచారం పాఠ్య పుస్తకాల్లో కూడా లభిస్తుంది. కాని, ఆనాటి ప్రజల బౌద్ధిక-తాత్త్విక చింతన గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. ఆర్య సంస్కృతి మూల గ్రంథాలైన వేదాల్లో ఆర్యేతరులైన చింతనాపరుల గురించిన ప్రస్థావనలు అక్కడక్కడా వున్నాయి. ఋగ్వేదంలో (X-136) కనిపించే 'పసుపు వస్త్రాలు ధరించిన మునులు' ఆర్యులు కారని పండితులు నొక్కిచెబుతున్నారు.

క్రీ.పూ. 6వ శతాబ్దానికి ముందే రూపొంది, భారత తాత్త్విక చింతన పై చెరగని ముద్ర వేసిన "ఆరు దర్శనాలు" వైదిక సంప్రదాయానికి చెందినవి కావు. వీటన్నిటినిమించి క్రీ.పూ. 6వ శతాబ్దిలో అనేక వైదికేతన బౌద్ధిక-తాత్త్విక చింతనలు విరివిగా ప్రచారంలో వున్నట్లు జైన, బౌద్ధ సంప్రదాయ గ్రంథాల్లో స్పష్టమైన సాక్ష్యాలు వున్నాయి.

*త్రైరాశిక* అనే పేరుగల ఆర్యేతర సాహిత్యం మౌఖిక సంప్రదాయంగానే అంతరించి పోయినట్లు తెలుస్తుంది. బుద్ధుని సమకాలికులైన 'ఆరుగురు గురువులు' వైదిక సంప్రదాయానికి చెందిన వారు కారు. వీరు వేదాలను జ్ఞాన ప్రమాణంగా స్వీకరించటానికి తిరస్కరించారు. మహావీరుడు ఇరవైనాలుగో తీర్థంకరుడని, ఆయనకు ముందు యిరవై ముగ్గురు తీర్థంకరులు వున్నారని జైన గ్రంథాలు చెబుతున్నాయి. అంటే, ఆరవ శతాబ్దానికి చాలా కాలం ముందునుండే యీ వైదికేతర సంప్రదాయం అస్తిత్వంలో వున్నట్లు చెప్పవచ్చు. అలాగే, బుద్ధునికి ముందుకాలంలో అనేకమంది జ్ఞానోదయం పొందిన బుద్ధులు వున్నారని బౌద్ధగ్రంథాలు చెబుతున్నాయి. వీటన్నిటిని బట్టి చూస్తే,



హరప్పాలో శిథిలమైన 'పురాతన నగరం'

భారతదేశంలో సుదీర్ఘకాలంగా ఒక వైదికేతర బౌద్ధిక-తాత్త్విక ప్రవంతి అస్థిత్వంలో వున్నట్లు కనిపిస్తుంది. దీని మూలాలు సింధూ నాగరికతలో వున్నాయని చెప్పటానికి రేఖామాత్రమైన ఆధారాలు వున్నాయి. దీన్ని నిరూపించటానికి యింకా చాలా కృషి జరుగవలసి వుంది. అయితే, క్రీ.పూ.6వ శతాబ్దానికి కనీసం కొన్ని వందల సంవత్సరాల ముందు నుండి వైదికేతర ప్రవంతి జాడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జైన, బౌద్ధ సంప్రదాయాలు నెలకొన్న క్రీ.పూ. 6వ శతాబ్ది నుండి యిందుకు తిరుగులేని సాక్ష్యాలు లభించాయి. అయినప్పటికి, యీ వైదికేతర చింతనా ప్రవంతి ఒక స్వతంత్రమైన బౌద్ధిక ధారావాహికగా గుర్తింపు పొందలేదు.

ఈ దేశపు ప్రాచీన తాత్త్విక చరిత్రకు సంబంధించి యీ నాటికీ ఎంతో అయోమయం, అస్పష్టత కొనసాగుతూనే వుంది. ఇందుకు కారణం ఏమిటి? దీర్ఘకాలంగా భారతదేశంలో కొనసాగుతున్న చింతనా ప్రవంతి గురించి మనకు లభించిన, పైన చెప్పుకున్న, సాక్ష్యాలన్నిటిని, వైదిక 'నమూనా' అందించిన 'ఏకమూస సంస్కృతి' సిద్ధాంతం పరిధిలోనే అధ్యయనం చెయ్యటం యీ అయోమయానికి, అస్పష్టతకు ఒక ముఖ్యకారణం. (సింధూనాగరికత శిథిలాల్లో లభించిన లిపిని ఆర్య భాషల ఆధారంగా చదవాలని చేసిన ప్రయత్నం యిందుకు ఒక ఉదాహరణ). దీనితోపాటు స్టీఫెన్ బాచ్‌లర్ తదితర పండితులు రేఖామాత్రంగా గమనించిన 'బ్రాహ్మణేతర గొప్ప సంస్కృతి' పూర్తిగా వెలుగు చూడక పోవటం కూడా అంతే ముఖ్యమైన కారణం. వైదిక

‘నమూనా’లోని డొల్లతనాన్ని, అలాగే, దీర్ఘకాలంగా మరుగున పడివున్న వైదికేతర తాత్త్విక స్రవంతిని అర్థం చేసుకోవటమే యీ వ్యాసం ముఖ్యవుద్దేశం.

* * *

బుద్ధుని బోధనల్ని యథాతథంగా అందించాయని చెప్పే త్రిపిటకాల్లో, ఆనాడు తాత్త్విక-ధార్మిక రంగంలో కృషిచేస్తున్న వారిని వుమ్మడిగా సూచించటం లేదా సంబోధించటం కోసం “శ్రమణ-బ్రాహ్మణ” అనే జంటపదాలు వుపయోగించారు. ఈ పదబంధం ఎక్కడో అరుదుగా గాక, పాళీ గ్రంథాలంతటా పరుచుకున్నట్లు తరచూ కనిపిస్తుంది. బ్రాహ్మణేతరులైన సత్యాన్వేషకులను సూచించటానికి లేదా సంబోధించటానికి “శ్రమణ” అనే పదం అంతే తరచుగా వుపయోగించబడింది. గౌతమ బుద్ధుణ్ణి *మహా శ్రమణుడు* అని సంబోధించారు.

అలాగే, జైన గ్రంథం, *ఆచారాంగ సూత్రం,* తమ గురువును *వర్ధమాన మహావీరుడు, శ్రమణ మహావీరుడు* అని సంబోధించింది. బుద్ధుని తదనంతరం శతాబ్దాలపాటు బౌద్ధ భిక్షువులను *శ్రమణులు* అని పిలిచినట్లు స్పష్టమైన సాక్ష్యాలున్నాయి.

క్రీ.శ. 629 నుండి 645 వరకు భారతదేశంలో పర్యటించిన చైనాకు చెందిన బౌద్ధ భిక్షువు, హుయాన్‌త్సాంగ్ తన రచనల్లో బౌద్ధ భిక్షువులను *శ్రమణులు* అని సంబోధించాడు. భారతదేశం అంతటా ఆనాడు బౌద్ధ భిక్షువులు తమను తాము *శ్రమణులు* అని చెప్పుకొన్నట్లు ఆయన రచనలు తెలియజేస్తున్నాయి. వైదిక సంప్రదాయ గ్రంథాల్లో కూడా, వైదికేతరులను *శ్రమణులు* అని సంబోధించిన దాఖలాలు వున్నాయి. వైదిక సంప్రదాయానికి విడిగా, నిజానికి, దానికి ప్రత్యామ్నాయంగా శ్రమణులు ఒక స్రవంతిగా కొనసాగారని చెప్పటానికి ఎన్నో ఆధారాలు కనిపిస్తున్నా, బౌద్ధజైన సంప్రదాయాల మూలాల కోసం అన్వేషించిన పండితులు చాలామంది దీన్ని ఒక తాత్విక స్రవంతిగా లేదా సంప్రదాయంగా గుర్తించలేక పోవటం శోచనీయం. మనం పైన చెప్పుకున్న వైదిక ‘నమూనా’ లోని ఏకమూస సంస్కృతి సిద్ధాంతం వారిపై బలమైన ప్రభావం చూపిందని చెప్పటానికి యిదొక నిదర్శనం.

1942లో ప్రముఖ అమెరికన్ ఇండాలజిస్టు ఫ్రాంక్లిన్ ఎడ్జెర్టన్ శ్రమణులను ‘బ్రాహ్మణేతర మూలాలు గల ఒక అసాధారణమైన సంప్రదాయం’గా గుర్తించాడు. అయినా, చాలా మంది చరిత్రకారులు, బౌద్ధపండితులు యీ విషయానికి తగిన ప్రాధాన్యత యిచ్చినట్లు కనిపించదు. జి.సి.పాండే వంటి కొందరు పండితులు శ్రమణ సంప్రదాయం పై ప్రత్యేకించి కృషిచేశారు. (శ్రమణ ట్రెడిషన్, 1978). భారతదేశంలో మూడువేల సంవత్సరాలపాటు ఎడతెగకుండా సాగిన బౌద్ధిక-తాత్త్విక పరంపర వుందని గుర్తించి ప్రొఫెసర్ రీస్ డేవిడ్స్, యిది ప్రపంచ చరిత్రలోనే సాటిలేని తాత్త్విక పరంపర అని కొనియాడాడు.

ఆయన ఏమన్నాడో చూడండి: “ధార్మిక విషయాల పట్ల యింతటి చిత్తశుద్ధి లేదా అంకిత భావంతో చేసిన యింతటి నిరంతరమైన కృషి (ప్రపంచంలో) మరెక్కడా కనిపించదు. ఇంతటి చింతనా స్వేచ్ఛ, బాహ్య ప్రభావానికి యింత తక్కువగా గురయిన మత పరిణామం మరెక్కడా లేదు…ఆదిమ విశ్వాసాల ముతక వూహల నుండి మహోన్నతమైన భావనలకు బాటలువేసి, సర్వాంగ సుందరమైన భారతీయ సత్యసౌధపు చిత్రాన్ని తీర్చిదిద్దిన, స్వతస్సిద్ధమైన మేధావుల విభిన్న ధోరణులు మరియు ప్రేరణలలో కూడిన యింతటి పరిపూర్ణ స్వరూపం మరెక్కడా కనిపించదు.” (*ది హిస్టరి అండ్ లిటరేచర్ ఆఫ్ బుద్ధిజం,* పేజి 3-4).

దీనిలో వైదిక, శ్రమణ సంప్రదాయాలు అనే తేడాను గుర్తించకపోయినా, భారత తత్త్వచింతనా స్రవంతి గురించి ప్రొఫెసర్ డేవిడ్స్ చాలా సమగ్రంగా, శక్తివంతంగా చెప్పగలిగాడు. సింధూనాగరికత యింకా వెలుగుచూడని రోజుల్లో వైదిక, శ్రమణ సంప్రదాయాలను, వేరుగా గుర్తించలేకపోవటం అసమంజసం కాదు. నిజం చెప్పాలంటే పైన చెప్పిన వర్ణన శ్రమణ సంప్రదాయానికి అన్నివిధాలా సరిపోతుంది. ప్రపంచ ధార్మిక చరిత్రలోనే మహోన్నతమైన యీ శ్రమణ సంప్రదాయాన్ని అధ్యయనం చెయ్యటం, భారత తాత్త్విక చింతనను వాస్తవికంగా అర్థం చేసుకోటానికి మాత్రమేగాక, మొత్తం మానవజాతి తాత్త్విక చింతనను సమగ్రంగా సవ్యంగా అర్థం చేసుకోటానికి వుపకరిస్తుంది, నిజం చెప్పాలంటే, అది అనివార్యమైంది కూడా. శ్రమణ సంప్రదాయాన్ని ఒక స్వతస్సిద్ధమైన, పరిపూర్ణమైన బౌద్ధిక-తాత్విక-ధార్మిక స్రవంతిగా గుర్తించటంతో పాటు, దాని విశిష్టతను, విస్తృతిని, లోతును అర్థం చేసుకోవాలంటే శ్రమణ, వైదిక సంప్రదాయాలను తులనాత్మకంగా పరిశీలించక తప్పదు.

1. క్రీ.పూ. 17వ శతాబ్దిలో భారత ఉపఖండంలో ప్రవేశించిన సంచార తెగలకు చెందిన ఆర్యులు వైదిక సంప్రదాయానికి మూలపురుషులు. ఆర్యుల తొలి గురువులైన ఋషులు రూపొందించారని చెప్పే వేదాలు జ్ఞానానికి సత్యానికి ప్రమాణం అని, వాటి తదనంతరం పెంపొందిన జ్ఞాన మంతటికి కూడా వేదాలే ఆధారం అని యీ సంప్రదాయం చెబుతూంది. కనుక దీనికి వైదిక సంప్రదాయం అనే పేరు వాడుకలోకి వచ్చింది. దీనికి సనాతన ధర్మం, ఆర్యధర్మం అనే పేర్లుకూడా వున్నాయి.

మొదటి దశలో యిది ఆర్యుల కోసం, ఆర్యులు రూపొందించిన, ఆర్యులకే పరిమితమైన ధర్మంగా కొనసాగింది. కాలక్రమంలో ఆర్య, ద్రవిడ సంపర్కం ఫలితంగా ఆర్యేతరులు కూడా గణనీయ సంఖ్యలో దీన్ని అనుసరించారు. ఆర్యుల రాకకు అనేక వేల సంవత్సరాల ముందునుండి ఉపఖండంలో నివసిశిస్తున్న ప్రజలు శ్రమణ సంప్రదాయానికి ఆద్యులు అని చెప్పవచ్చు. ఆర్యుల రాకకు ముందు శతాబ్దాల తరబడి కొనసాగిన సింధూలోయ నాగరికతలో శ్రమణులకు చెందిన భావాల మూలాలు వున్నాయని చెప్పటానికి తగిన ఆధారాలు వున్నాయి. తదనంతర కాలంలో దీనిలో స్థిరమైన శాఖలు రూపొందిన నాటినుండి దీన్ని ఒక స్రవంతిగా గుర్తించగలిగే సాక్ష్యాలు పుష్కలంగా వున్నాయి.

మనిషి అనుభవం, అన్వేషణ, పరిశీలన, సాధన, స్వయం నిర్ణయం అనేవి జ్ఞానానికి, సత్యానికి మార్గాలని శ్రమణులు విశ్వసించినట్లు తెలుస్తుంది. అందువల్ల వారు 'వేదం సత్యప్రమాణం' అనే నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. తాత్త్విక చింతనలోనే గాక వారి జీవన విధానంలో కూడా వైదిక వాదులకు, శ్రమణులకు ఎంతో భేదంవుంది. ప్రధానంగా ఆర్యేతరులకు చెందిన శ్రమణ సంప్రదాయంలో, కాలక్రమంలో, వైదిక సంప్రదాయాన్ని కాదని బ్రాహ్మణులు కూడా గణనీయమైన సంఖ్యలో వచ్చి చేరారు.

2. వైదిక సంప్రదాయానికి పర్యాయపదంగా మారిన "వర్ణాశ్రమ ధర్మం" (తరువాత కాలంలో యిదే కులవ్యవస్థ) నిజంగానే యీ సంప్రదాయానికి జీవగఱ్ఱ అని చెప్పవచ్చు. పుట్టుకతోనే సమాజంలో మనిషి స్థానం, జీవిత గమనం నిర్ణయించబడి వుంటాయి, కనుక, దీనిలో మార్పుకు అవకాశం లేదని యీ ధర్మం చెబుతుంది. వర్ణధర్మంలో తమకు తామే ఆపాదించుకున్న అగ్రస్థానాన్ని నిలుపుకోవటం కోసం, తమ స్వప్రయోజనాలను పరిరక్షించుకోవటం కోసం వైదిక బ్రాహ్మణులు సత్యాన్వేషణను, ధార్మిక చింతనను సైతం పణంగా పెట్టి, వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడేటందుకు తమ శక్తియుక్తులన్నీ ధారపోశారని చెప్పటం అతిశయోక్తి కాదు. పుట్టుక ప్రాతిపదికగా మనుషుల్ని విభజించే ఏరకమైన ధర్మాన్నీ శ్రమణులు బోధించలేదు. వారి తాత్త్వికచింతన ఏదయినప్పటికి, వారంతా వర్ణాశ్రమధర్మాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు.

కర్మను "నియత్తి వాదంగా" బోధించిన శ్రమణులు కూడా వర్ణధర్మాన్ని అంగీకరించలేదు. మానవుడిగా పుట్టిన ప్రతి ఒక్కరూ జ్ఞానం పొందటానికి, పరివర్తన చెందటానికి,



శ్రమణులు

పరిపూర్ణ మానవుడిగా రూపొందటానికి అర్హులేనని, అయితే, అందుకు సరైన అవగాహన, తగిన కృషి అవసరమని శ్రమణులు చెప్పారు. మనిషికి పుట్టుకతో ఆపాదించబడిన వర్ణం లేదా కులం సత్యాన్వేషణలో అతని గమనాన్ని, గమ్యాన్ని, నిర్దేశించజాలదని శ్రమణులు ఆచరణాత్మకంగా నిరూపించారు.

శ్రమణ సంప్రదాయాన్ని అనుసరించి మానవులుగా శిఖరాగ్రాన్ని చేరుకున్న వారిలో అన్ని కులాలకు చెందిన వారు వున్నారు. అయితే, కొందరు పండితులు భావించినట్లు యిది బ్రాహ్మణేతర కులాలకు పరిమితమైన సంప్రదాయం కాదు. అంటే, శ్రమణ సంప్రదాయం బ్రాహ్మణులను తన నుండి మినహాయించలేదు. అందుకే దీన్ని నిజమైన కులాతీత సంప్రదాయంగా చెప్పవచ్చు. వైదికవాద బ్రాహ్మణుల్లో తమ వర్ణాధిక్యతను చాటుకోవాలనే తపన అడుగడుగునా కనిపిస్తుంది. (ఆధునిక మనోవిశ్లేషణలో ఆధిక్యత కోసం తపించటాన్ని న్యూనతా భావానికి చిహ్నంగా చెబుతారు.) శ్రమణులు కులాధిపత్యం కోసం పాకులాడిన దాఖలాలు లేవు, అలాగని వారు బ్రహ్మణుల ఆధిపత్యాన్ని అంగీకరించలేదు.

3. వైదిక సంప్రదాయక తొలి గ్రంథమైన ఋగ్వేదంలో సంపద, సంతానం, ఆహారం, దీర్ఘాయుష్షు, యుద్ధాల్లో విజయం కోసం దేవతలను ప్రార్థించటం ప్రధానాంశంగా వుంది. దీనిలో లోకీయ అనుభవాలను ఆస్వాదించటానికి మించి ధార్మిక చింతన ఏదైనావుంటే, అది పై లక్ష్యాలకు లోబడి రెండవ స్థానంలోనే వుంది. మత్తుపానీయాలు, మాంసభక్షణ కోసం పారవశ్యంతో చేసిన ప్రార్థనలు వేదాల్లో పుష్కలంగా వున్నాయి. ఈ సంప్రదాయపు మలిదశల్లో అలౌకిక ధార్మిక చింతన పెంపొందినట్లు కనిపించినా, దీనిలో అంతర్లీనంగా లోకీయ లక్ష్యాలే ప్రధాన పాత్ర పోషించాయి. అందుకే యీ సంప్రదాయంలో ధార్మికత నీడన కొనసాగే వృత్తులు – పౌరోహిత్యం, పంచాంగ రచన వ్యాఖ్యానం, వాస్తు శాస్త్రం మొ॥ విరివిగా పెంపొందాయి. వైదిక బ్రాహ్మణులు తమ బోధనలకు, సలహాలకు, కర్మకాండల నిర్వహణకు ప్రతి ఫలంగా, పశువులు, వెండి, బంగారం, పంటభూములతో నిండిన గ్రామాలు తదితర విలువైన కానుకలు స్వీకరించేవారు. కాలక్రమంలో యీ కానుకలు రుసుముగా వసూలు చేయ్యటం మనం ఈనాటికీ చూడవచ్చు. గురుదక్షిణ యీ పౌరోహిత్య సంప్రదాయంలో విడదీయరాని అంశం.

లోకీయ అనుభవాలను అదుపు చేసుకోవటం, లేదా పూర్తిగా త్యజించటం ధార్మిక జీవనంలో, సత్యశోధనలో అత్యవసరమైందని శ్రమణులు భావించారు. అందుకే వారు సత్రాల్లో, అడవుల్లో వూరి వెలుపల చెట్ల నీడన, కొండ గుహల్లో తలదాచుకుంటూ సంచార జీవితం గడిపారు. భిక్షాటనతో కడుపు నింపుకుంటూ, ప్రతిఫలం ఆశించకుండా, వీరు అందరికి తమ తత్త్వాన్ని బోధించారు. లోకీయ భోగాలను ఆస్వాదించటం తప్పుకాదని వాదించిన 'భౌతిక వాదు'లైన శ్రమణులు కూడా నిరాడంబరమైన జీవితం గడిపినట్లు తెలుస్తుంది. ఇంద్రియానుభవాల వెంట పరుగులు తీయటం దుఃఖానికి దారితీస్తుందని, వాస్తవిక జ్ఞానం, అంతరపరివర్తన, సహనశీలత, సోదరభావం ద్వారానే మానవుడు నిజమైన స్వేచ్ఛను, సుఖశాంతులను పొందగలడని శ్రమణ సంప్రదాయంలో అగ్రగణ్యులైన బుద్ధుడు, మహావీరుడు బోధించారు.

4. సృష్టి–స్థితి–లయ కారకుడైన పరమాత్మ లేక బ్రహ్మ తదితర మానవాతీత శక్తుల్లో విశ్వాసం వైదిక సంప్రదాయ చింతనలో కేంద్రబిందువు. వేదకాలంలో ప్రకృతి శక్తుల రూపాలైన అగ్ని, వాయువు, వరుణుడు ప్రముఖ స్థానం వహించారు. ఈ సంప్రదాయంలో యీనాడు ప్రముఖ స్థానంలో వుండి పూజలందుకుంటున్న దేవుళ్ళు వేదాల్లో కనిపించరు. కాలక్రమంలో అనేకమంది కొత్త దేవుళ్ళు, దేవతలతో పరమాత్మ భావన మరింత విస్తృతమై వ్యవస్థీకృతం చెయ్యబడింది. ఈ భావనలో జరిగిన పరిణామానికి అనుగుణంగానే తొలిదశలో యజ్ఞాలు, యాగాలు తదుపరి కాలంలో రకరకాల కర్మకాండలు, దైవస్తుతి, ప్రార్థన, ఉత్సవాలు నిర్వహించడం మొదలైనవి పెంపొందాయి. ఇవే యిహపర సుఖాలను, మోక్షాన్ని పొందే సాధనాలుగా గుర్తించబడ్డాయి. అస్థిత్వపు మూలాన్ని, దాని గమనాన్ని, మానవజీవిత పరమార్థాన్ని అర్థం చేసుకోవటానికి, మానవ జీవితంలో అనివార్యంగా కలుగుతున్న దుఃఖం నుండి విముక్తి పొందటానికి శ్రమణులు భిన్న మార్గాల్లో అన్వేషణ సాగించారు.

పరిపూర్ణ మానవ వికాసాన్ని పొందటానికి వీరు, ప్రపంచ చరిత్రలోనే మరెక్కడా లేనన్ని భిన్నమైన పద్ధతుల్లో శోధన, సాధన చేశారు. ఇలా బహుముఖమైన ఆలోచనలు, సాధనారీతులు కలిగి వుండటం శ్రమణ సంప్రదాయపు

ప్రత్యేకలక్షణం. అయినప్పటికీ, విశ్వాన్ని సృష్టించి నడిపిస్తుందని భావించే మానవాతీత శక్తికి రూపం కల్పించిన దాఖలాలు శ్రమణ సంప్రదాయంలో కనిపించవు. అందుకే వారు యజ్ఞయాగాలను, కర్మకాండలను నిరుపయోగమైనవని కొట్టిపారేశారు. ధ్యానం, తపశ్చర్య, నైతిక వర్తన, అన్వేషణ, కొన్ని సాధనా విధానాలు శ్రమణుల కార్యకలాపాల్లో ప్రధాన పాత్ర వహించాయి.

5. రెండు సంప్రదాయాలను తులనాత్మకంగా అధ్యయనం చెయ్యటానికి పరిశీలించదగిన మరో ముఖ్యమైన అంశం, నైతికత పట్ల వారి వైఖరి. వైదిక సంప్రదాయం వర్ణవ్యవస్థ పరిధిలోనే నైతికతను నిర్వచించింది. కనుక దీని నైతికతకు సార్వత్రిక లక్షణం లేదు. ఏ వర్ణం నైతికత దానిదే అని చెప్పినట్లు పైకి కనిపిస్తూనే, వాటన్నిటి అంతిమ లక్ష్యం మాత్రం అగ్రవర్ణ ప్రయోజనంగా వుంటుంది. అగ్రవర్ణాల, ప్రత్యేకించి బ్రాహ్మణ వర్ణ ప్రయోజనాలకు అనువుగా ఎప్పటికప్పుడు నైతికతను మలచటం, దీన్ని తిరుగులేని 'విధి'గా స్థిరీకరించటం వైదిక సంప్రదాయపు ప్రత్యేక లక్షణం. ఉదాహరణకు, మహాకవిగా ప్రసిద్ధి చెందిన బమ్మెర పోతన రచించిన యీ కింది పద్యం చూడండి:

**వారిజాక్షులందు, వైవాహికములందు**
**ప్రాణ విత్త మానభంగములందు**
**చకిత గో కులాగ్ర రక్షణములందు**
**బొంకవచ్చు, అఘము పొందదు అధిపా.**

*(భాగవతం, అష్టమ స్కందం)*

(స్త్రీల విషయంలో, వివాహాల్లో, ప్రాణం, ధనం, గౌరవం కోల్పోయే సందర్భాల్లో, భయపడిన గోవులను బ్రాహ్మణులను రక్షించటంలో అబద్ధాలు చెప్పవచ్చు. అలా చెయ్యటం వల్ల పాపం కలుగదు.)

ఈ విధంగా అబద్ధాలు చెప్పటానికి సాకులు వెదుకుతూ, ఎవరికి అనువుగా వారు నైతికతను నిర్వచిస్తూ పోతే, చివరకు నైతికతకు అర్థం లేకుండా పోతుంది. జీవహింస, మాంసభక్షణ విషయంలో కూడ వైదిక సంప్రదాయం నీతి ఒక స్థిరమైన సూత్రాన్ని పాటించదు. యజ్ఞంలో బలిగా అర్పించిన జంతువు మాంసం ఆహారంలో అత్యుత్తమమైనదని (పరమం అన్నాద్యమ్ యం మాంసం), దాన్ని తిన్న వ్యక్తి విమోచనం పొందుతాడని సతపత బ్రాహ్మణం (అధ్యాయం 7-1) చెబుతుంది. పాప పరిహారం కోసం జీవహింస చెయ్యాలనే యిటువంటి బోధనలు వైదిక సంప్రదాయంలో సుదీర్ఘకాలం పాటు కొనసాగాయి. జైనం, బౌద్ధం జీవహింసను నిర్ద్వంద్వంగా తిరస్కరించటంతో, ప్రజల్లో తమ పట్ల కలుగుతున్న వ్యతిరేకతను నివారించటానికి వైదిక వాదులు మాంసభక్షణ విషయంలో తమ వైఖరిని మార్చుకున్నారు. అయినా ఏదో రూపంలో మాంసాన్ని తినవచ్చనే బోధనలు మనుధర్మశాస్త్రంలో కనిపిస్తాయి.

బ్రహ్మచర్యం పట్లకూడా వైదిక సంప్రదాయం యిటువంటి వైఖరినే అవలంబించింది. వేదకాలంలో వీరికి బ్రహ్మచర్యం ఒక నియమంగా లేదు. వైదిక శాస్త్రాల్లో పురాణాల్లో మనకు తారసపడే ఋషులు, దాదాపు అందరూ, భార్యాపిల్లలతో కలిసి జీవించిన వారే. శ్రమణ సంప్రదాయ ప్రభావం కారణంగా, తదుపరికాలంలో వైదిక వాదులు బ్రహ్మచర్యం అవసరాన్ని గుర్తించారు. అప్పుడు కూడా సత్యాన్వేషణకు దాన్ని ఒక అవసరమైన నియమంగా పాటించలేదు. ఎన్నో మినహాయింపులతో, చివరకు, సన్యాసాన్ని తమ చతురాశ్రమ ధర్మాల్లో చివరిదానిగా చేర్చారు.

శ్రమణ సంప్రదాయంలో బ్రహ్మచర్యానికి అత్యధిక ప్రాధాన్యత యివ్వబడింది. దీనిలో బ్రహ్మచర్యం జీవితంలో ఒక పరిమిత కాలపు నియమంగా గాక, సత్యాన్వేషకులకు యిది ఒక సంపూర్ణ జీవిత విధానంగా స్వీకరించబడింది. అందుకే బ్రహ్మచర్యం శ్రమణులకు సత్యాన్వేషణకు పర్యాయపదంగా మారింది. ఈ సంప్రదాయంతో బ్రహ్మచర్యం వదిలి గృహస్తులుగా మారిన వారిని యిక శ్రమణుడు అని పిలవరు. అలాగే, యీ సంప్రదాయంలో నైతికతకు అగ్రస్థానం యివ్వబడింది. మనిషిగా పుట్టిన ప్రతివారికి ఒకే విధంగా వర్తించే సార్వత్రిక నైతికతను వీరు బోధించారు.

బౌద్ధం బోధించిన పంచశీల సార్వత్రికమైనది కనుకనే, అది ఖండాంతరాలకు సులభంగా వ్యాపించగలిగింది. అయితే, బౌద్ధంలో నైతికత ఒక 'విధి'గా గాక, మానసిక ఏకాగ్రత ప్రజ్ఞలను పెంపొందిచుకోటానికి ఒక అత్యవసరమైన సాధనంగా చెప్పబడింది.

6. వైదిక సంప్రదాయ తొలి దశలో ఆత్మభావన కనిపిస్తుంది. కాని అది ఆనాటికి యింకా ఒక స్థిరమైన వాదంగా రూపొందలేదు. ఉపనిషత్తుల కాలం నాటికి వీరు ఆత్మ, కర్మ, పునర్జన్మ, భావాలను కలిగి వున్నట్లు ఖచ్చితంగా

చెప్పవచ్చు. ఆనాటి నుండి పరమాత్మ, జీవాత్మ, భావనలతో అంచెలంచెలుగా ఆత్మవాదాన్ని శిఖరాగ్రానికి చేర్చారు. దీనిలో కూడా వర్ణాశ్రమ ధర్మాన్ని చొప్పించటంలో, యిది కూడా సార్వత్రికతను కోల్పోయింది. కాని ఆధునిక వైదిక పండితులు కొందరు దీనిలో వర్ణాశ్రమ ధర్మాన్ని మరగు పర్చి తమ ఆత్మవాదాన్ని సార్వత్రిక ధర్మంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే వీరి ఆత్మవాదం భారతదేశంలో ఒక రకంగాను, విదేశాల్లో మరోరకంగాను ప్రచారంలో వుంది.

శ్రమణ సంప్రదాయంలో పరమాత్మకు రూపం కల్పించలేదని ముందే చెప్పుకున్నాం. కాని, జీవాత్మ మరియు లౌకిక వ్యక్తి వాదంతో కూడిన ఆత్మవాదాలకు శ్రమణులే ఆద్యులు అని చెప్పవచ్చు. దీని ఆధారంగానే వీరి కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలు రూపొందాయి. ఆత్మవాదం మొత్తం అరవైరెండు రూపాల్లో వుండే అవకాశం వుందని దీఘనికాయంలోని బ్రహ్మజాల సుత్తం చెబుతుంది. ఇటువంటి భిన్నమైన ఆత్మవాదాలు కలిగి వుండటం శ్రమణ సంప్రదాయంలోని వైవిధ్యానికి ఒక చక్కని వుదాహరణ. చివరకు ఆత్మవాదాలన్నిటిని ఛేదించి అనిత్య, అనాత్మ వాదాలను ఆవిష్కరించిన బౌద్ధం శ్రమణ సంప్రదాయంలోని వైవిధ్యాన్ని మరింత సంపన్నం చేసింది.

ప్రపంచంలోని అన్ని సంస్కృతుల్లో ఏదో ఒక రూపంలో ఆత్మవాదం కనిపిస్తుంది. కాని, బౌద్ధం తన అనాత్మవాదంతో ప్రపంచ ధార్మిక చరిత్రలోనే విశిష్ట స్థానాన్ని పొందింది. ఆజీవక, జైన, బౌద్ధ తదితర శాఖలుగా విస్తరించిన శ్రమణులందరూ నైతికతను అత్యంత నిష్ఠతో పాటించినందువల్లే వారు ప్రజల నుండి గొప్ప ఆదరణ పొంది, ప్రజలపై ఆధారపడి జీవించగలిగారు. బౌద్ధ సంఘం ఏర్పడక ముందే తూర్పు-ఉత్తర భారతదేశంలో పరివ్రాజకుల నివాసం కోసం సత్రాలు, చర్చల కోసం సమావేశభవనాలు నిర్మించబడి వున్నట్లు త్రిపిటకాల ద్వారా తెలుస్తుంది. ఇవన్నీ, ఆనాటికే శ్రమణులు, ప్రజలనుండి పొందుతున్న ఆదరణకు చిహ్నాలుగా చెప్పవచ్చు. వీటన్నిటిని మించి, జీవితాంతం బ్రహ్మచారులుగా బ్రతికే శ్రమణులకు తమ సంప్రదాయాన్ని కొనసాగించే అనువంశిక వారసులు లేకుండానే, వారి సంప్రదాయం శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా కొనసాగటం మానవజాతి చరిత్రలోనే ఒక అద్భుతం.

* * *

పైన చెప్పుకున్న విషయాలను బట్టి, శ్రమణ సంప్రదాయం ఒక స్వతస్సిద్ధమైన, స్వతంత్రమైన బౌద్ధిక-తాత్త్విక-ధార్మిక స్రవంతి అనేది నిస్సందేహం. అది వైదిక సంప్రదాయం నుండి పుట్టిందని, దానిలో అంతర్భాగమని లేదా దానికి ప్రతిస్పందనగా వచ్చినదని చెప్పటానికి వీల్లేదు. శ్రమణ సంప్రదాయం ఆర్యుల రాకకు పూర్వమే యిక్కడ మొదలయింది. ఆర్యసంప్రదాయం మొదలయిన తరువాత, శ్రమణ సంప్రదాయం తన అస్తిత్వాన్ని కోల్పోకుండా మనగలిగింది. అంతేగాక, శతాబ్దాల తరబడి వైదిక సంప్రదాయం కంటే బలమైన శక్తిగా కొనసాగింది. ఈ రెండు సంప్రదాయాల సుదీర్ఘ సంపర్కంలో, వైదిక సంప్రదాయం నుండి శ్రమణులు స్వీకరించిన దానికంటే, శ్రమణుల నుండి వైదిక వాదులు నేర్చుకున్నది ఎంతో ఎక్కువ. కనుక, ప్రాచీన భారత బౌద్ధిక-తాత్త్విక చింతన గురించి వైదిక వాదులు సృష్టించి, ప్రచారం చేస్తున్న ఏకమూస సంస్కృతి సిద్ధాంతాన్ని, దీనికి మాతృకయిన వైదిక 'నమూనా'ను పూర్తిగా తిరస్కరించాలి. భారతదేశ చరిత్ర అధ్యయనాన్ని వక్రమార్గం పట్టించిన వైదిక 'నమూనా' అనే చట్రాన్ని ఛేదించాలంటే శ్రమణ సంప్రదాయాన్ని నిర్దిష్టంగా, లోతుగా అధ్యయనం చెయ్యాలి. అప్పుడు మాత్రమే భారతదేశ చరిత్రను, ప్రత్యేకించి దాని బౌద్ధిక-తాత్త్విక చింతనా పరిణామాన్ని వాస్తవిక దృష్టితో అర్థం చేసుకోవటం సాధ్యమౌతుంది.

ప్రపంచ చరిత్రలోనే సాటిలేని శ్రమణ సంప్రదాయం భారత ప్రజానీకానికే గాక, మానవజాతి అంతటికి ఎన్నో అమూల్యమైన ఫలాలను అందించింది. వాటిలో కొన్ని మన జీవన విధానంలో అంతర్భాగమై నేటికీ కొనసాగుతున్నాయి, కొన్నిటిని కాలక్రమంలో మనం కోల్పోయాం. కొనసాగుతున్న అంశాలు కూడా యితర సంప్రదాయాలతో కలగలసి వాటి స్పష్టతను, గంభీరతను కోల్పోయాయి. శ్రమణ సంప్రదాయానికి చెందిన శాఖలు కొన్ని పూర్తిగా అంతరించి పోయాయి. దానిలోని ఉత్తమ లక్షణాలన్నిటిని వారసత్వంగా పొందిన బౌద్ధం, వాటిని ఆచరించటంతో ఆదర్శప్రాయంగా నిలిచింది. కాని, కాలక్రమంలో బౌద్ధ సమాజం (గృహస్తులు, భిక్షువులు) తన స్వాభావికమైన కొన్ని లక్షణాల నుండి పక్కదోవ పట్టటం శోచనీయం. జాగ్రత్తగా పరిశీలిస్తే, శ్రమణ సంప్రదాయం నుండి తాను స్వీకరించిన కొన్ని మౌలిక లక్షణాల నుండి బౌద్ధం దూరమైనట్లు కనిపిస్తుంది. వీటిని తిరిగి అందిపుచ్చుకోకుండా నిజమైన బౌద్ధ పునరుద్ధరణ సాధ్యం కాకపోవచ్చు. ⓜ

# బౌద్ధం కోర్కెల్ని చంపుకోమంటుందా ?

- శ్రీకృష్ణార్జున బోధి

"బౌద్ధం మంచిదే కానీ ఆచరించడానికి పనికిరాదు. ఎందుకంటే బౌద్ధం కోర్కెల్ని చంపుకొని జీవించమంటుంది. మనిషి కోర్కెలు చంపుకొని జీవించటం అసంభవం.

కోర్కెలను చంపుకొని జీవించితే నేను, నా కుటుంబం ఆర్థికంగా- సామాజికంగా అభివృద్ధి కాలేము. కనుక నేను బౌద్ధాన్ని స్వీకరించలేను" దాదాపు ఇలాంటి అర్థం వచ్చే మాటలు అక్కడక్కడా వినిపిస్తుంటాయి.

బౌద్ధులు వారి వారి అవగాహన స్థాయిని బట్టి పై సందేహాలకు సమాధానం ఇస్తుంటారు. బౌద్ధం కోర్కెరహిత జీవితాన్ని ప్రబోధిస్తుందనే అభిప్రాయం గూడు కట్టుకున్న వారికి ఎంత వివరణ ఇచ్చినా రుచించదు ; చెవికెక్కదు. బౌద్ధం పట్ల ఇలాంటి దురభిప్రాయం చాలా కాలం నుండే ఉండి వుండవచ్చు.

కొంతమంది బౌద్ధాభిమానులు "మాకు బౌద్ధం అంతా నచ్చింది కానీ కోర్కెలు చంపుకొని జీవించమనే ప్రబోధం మాత్రం నచ్చలేదు. ఎందుకంటే - మేము సామాజిక దౌష్ట్యం, అణచివేతల నుండి బయటపడాలనే కోరికలతో ఉన్నాం.

బౌద్ధం చెప్పినట్లు కోర్కెలను వదిలి వేయడమంటే మా అభివృద్ధి, అస్థిత్వాల కోసం చేసే ప్రయత్నాలను వదులుకోవటమే కదా? అందుకే బౌద్ధం చెప్పే కోర్కె రాహిత్యాన్ని మేము అంగీకరించలేము" అంటుంటారు.

ఇలాంటి అభిప్రాయాలన్నీ బౌద్ధం పట్ల సరైన అవగాహన లేని ఫలితంగా వచ్చేవే కానీ వేరు కాదు. ఇలాంటి అపార్థాలను తొలగించుకుంటేనే బౌద్ధ వ్యాప్తి నిరాటంకంగా సాగగలదు.

**బౌద్ధంపై దుష్ప్రచారం :**

బౌద్ధం కోర్కె రాహిత్యాన్ని ప్రబోధిస్తుందనీ, బౌద్ధం స్వీకరించిన వారందరూ భిక్షువులుగా మారతారనే దుష్ప్రచారం జరిగింది. దీనికి సంబంధించి ఒక ఉదాహరణ చూద్దాం. కవి సార్వభౌముడిగా కీర్తిగాంచిన విశ్వనాథ సత్యనారాయణగారు, సాహితీ సంద్రంలో ఈదులాడిన గొప్ప పండితునిగా గౌరవించటంలో తప్పులేదు. కానీ అతని మతబుద్ధి ఎంత వక్రంగా ఉండేదో తెలుసుకోవటం అవసరం. ముఖ్యంగా చరిత్ర పట్ల జిజ్ఞాస కలిగిన వారు విశ్వనాథ వారికి చరిత్ర పట్ల వున్న సవతి ప్రేమను తప్పక తెలుసుకోవాలి. ఆయన తన నవల నాగసేనుడు (157వ పేజీలో) బౌద్ధం గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా రాశారు.

"మతమును తర్కించు విధానములో నందరూ.. సన్యాసులైనచో భిక్ష పెట్టెడి వారెవరు?" బౌద్ధంలో భిక్షువులు, గహపతులు (ఉపాసికా, ఉపాసకులు) ఇద్దరూ ఉంటారనే విషయం విశ్వనాథ వారికి తెలియక రాశారని ఎవ్వరూ అనుకోలేరు. ప్రపంచ చక్రవర్తులలో చిరకాలం సూర్యునిలా భాసిల్లే సమ్రాట్ అశోకుడు బౌద్ధ ఉపాసకుడే గాని భిక్షువుకాదు. అలాగే మరో గొప్ప బౌద్ధ చక్రవర్తి కనిష్కుడు కూడా ఉపాసకుడేగాని భిక్షువు కాదు. ఇలా భారతదేశంలోను బయటి దేశాలలోను ఎందరో రాజులు, చక్రవర్తులు, గొప్ప ధనవంతులు, అతి పెద్ద వ్యాపారులు, వివిధ చేతివృత్తుల వారు, వివిధ సామాజిక వర్గాలకు చెందినవారు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి ఉపాసకులుగా, ఉపాసికలుగా జీవించారు - జీవిస్తున్నారు.

బౌద్ధం ఉచ్ఛదశలో ఉన్న కాలంలో కూడా మొత్తం జనాభాలో భిక్షువుల శాతం ఒకటి, రెండుకి మించి వుండేది కాదని చరిత్రకారుల అంచనా, అప్పుడే కాదు, నేటి బౌద్ధ దేశాలలోని భిక్షువులను చూసినా మొత్తం జనాభాలో వారి శాతం చాలా అల్పంగానే వుంటుంది. కనుక విశ్వనాథ సత్యనారాయణగారి లాంటి సాహితీ ప్రముఖులు ఉద్దేశ పూర్వకంగానే బౌద్ధంపై అసత్య ప్రచారం చేశారు.

శ్రీకృష్ణార్జున బోధి, ఫోన్: 9848199098

బౌద్ధంలోకి వెళ్ళితే కోర్కెలు చంపుకోవాలి అనే దానికి, బౌద్ధంలోకి వెళ్ళితే భిక్షువుగా మారిపోతారు అనే దానికి పెద్దగా తేడా ఏమీ లేదు. ఎందుకంటే బౌద్ధ భిక్షువులు ఉపాసికా, ఉపాసకుల (గృహస్తుల) కంటే ఎంతో నిష్టగా వుండాలి. సాధారణ ప్రజలకు ఉండే ఇంద్రియ లాలసత్వాన్ని వదిలించు కోవాలి. కోర్కెలను నిగ్రహించుకుంటూ తమ మనోవాక్కాయ కర్మలను శుద్ధి చేసుకొంటూ నిర్వాణ మార్గం వైపు సాగిపోవాలి.

బౌద్ధ భిక్షువుగా వుండాలంటే ఇంద్రియ రుచులకు వెంపర్లాడటంగానీ, కీర్తి ప్రతిష్టలకు, ప్రాకులాడటం గానీ ఉండకూడదు. అందుచేత "బౌద్ధ భిక్షువుగా వుండటం అంటే కోర్కెలను చంపుకోవటం" అనే దానికి కొంత వరకు అర్థం వుంటుంది.

వాస్తవంగా భిక్షువులు చేసే పని ఏమిటంటే కోర్కెలు కలిగినప్పుడు తమ మనోదేహాలలో ఉత్పన్నమయ్యే సంవేదనలను తటస్థ భావంతో చూస్తూ కోర్కెలను జయిస్తారు. కోర్కెలను చంపుకోవడానికి, కోర్కెలను జయించడానికి చాలా తేడా వుంది. బౌద్ధం శత్రువును ఓడించటం ద్వారా గెలవ మంటుందే తప్ప చంపటం ద్వారా గెలవమని చెప్పదు. అలాగే కోర్కెలను ఓడించటం ద్వారా గెలవాలే తప్ప కోర్కెలను చంపటం ద్వారా కాదు. (ఇక్కడ చంపటం అంటే అణచివేయటం – అణచివేసినవి మళ్ళీ ఎప్పుడైనా పైకి విజృంభించవచ్చు)

**అసలు బౌద్ధం చెప్పిందేమిటి ?**

బౌద్ధం తృష్ణను తొలగించమందే తప్ప కోర్కెలను చంపుకోమని చెప్పలేదు. పైగా ఉపాసిక, ఉపాసకులు బహుముఖమైన కోర్కెలు కలిగి, వాటిని తీర్చుకొనే యత్నం తీవ్రంగా చేయమని కూడా చెప్పింది. దీనికి కావలసినన్ని ఉదాహరణలు అనేక బౌద్ధ గ్రంథాల నుండి మనకు లభిస్తాయి. కోర్కెలు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో కూడా బౌద్ధం చెప్పింది. అవి కుశలంగా వుండాలే తప్ప అకుశలంగా వుండకూడదని చెప్పింది. కుశల కోర్కెలు శాంతిని, సౌఖ్యాన్ని కలిగిస్తాయని, అకుశల కోర్కెలు అశాంతిని, దుఃఖాన్ని తెచ్చిపెడతాయని నొక్కి చెప్పింది.

మనిషి కోర్కె కుశలంగా వుంటే అతడు కుశల కర్మలను ఆచరిస్తాడని, అతడి కోర్కె అకుశలంగా ఉంటే అకుశల కర్మలను పాటిస్తాడని చెప్పింది. అందుచేత మనిషి తన దుఃఖానికి హేతువు కాగల అకుశల కోర్కెలను విడనాడి తన సౌఖ్యానికి కారణమగు కుశల కోర్కెలను నింపుకోమని చెప్పింది. బౌద్ధుల ధర్మాచరణకు మార్గదర్శిగా ఉపకరించే *ధమ్మపదం*లో చాలా ఎక్కువ భాగం మంచి కర్మలను ఆచరించమని, దుష్కర్మల నుండి వైదొలగమనే ప్రబోధాలు వున్నాయి.

*ధమ్మపదం* ప్రారంభంలోనే మంచి కర్మలు ఆచరించితే సుఖం నీడవలే వెంట వస్తుందని, చెడ్డ కర్మలు అనుసరించితే (బండికి కట్టిన) ఎద్దు కాలిగిట్టలను వెంబడించే బండి చక్రం వలె దుఃఖం వెంబడిస్తుందని హెచ్చరిస్తుంది. దాదాపు *ధమ్మపదం* అంతా ఇలాగే సాగుతుంది. *ధమ్మపదం* మంచి పనులు చేయమని ప్రేరేపిస్తుందంటే మంచి కోర్కెలు కలిగి వుండమని చెప్పటమే తప్ప వేరుకాదు. అలాగే చెడ్డ పనులు విడనాడమని హెచ్చరిస్తుందంటే చెడ్డ కోర్కెలు విసర్జించమని చెప్పటమే తప్ప వేరు కాదు.

అలాగే బౌద్ధ సాహిత్యంలో ఉత్తమ ప్రబోధ సుత్తాలు అసంఖ్యాకంగా వున్నాయి. వాటిలో *మహామంగళసుత్త, సిగాలోవసుత్త, వసలసుత్త,* చాలా ప్రధానమైనవి. *మహామంగళ సుత్త, సిగాలోవ సుత్త*లో వ్యక్తి ఎలాంటి కోర్కెలు కలిగి వుండాలి, ఎలాంటి పనులు నిర్వహించాలి, ఎలాంటి పనుల వల్ల మనిషికి శాంతి, సుఖం, ఆరోగ్యం, లాభం, కీర్తి, ప్రశంస లభించి జీవితం ఆనందంగా సాగుతుందో చెప్పటం జరిగింది.

ఇక *వసలసుత్తం*లో వ్యక్తికి ఎలాంటి కోర్కెలు వుండకూడదో, ఎలాంటి పనులు చేయకూడదో, ఎలాంటి పనులు చేయటం వల్ల మనిషికి అశాంతి, అనారోగ్యం, దుఃఖం, నష్టం, అపకీర్తి, నింద కలుగుతాయో హెచ్చరించటం జరిగింది. అందుచేత బౌద్ధం కోర్కె రాహిత్యాన్ని ప్రబోధించిందనేది నిరాధారమైనదే కాక అది దురుద్దేశంతో కూడిన వ్యాఖ్యానమని కూడా చెప్పవచ్చు. అటువంటి దురుద్దేశాలతో గత 2500 సంవత్సరాల నుండి బౌద్ధంపై పలు రూపాలలో దాడి జరిగింది.

బౌద్ధులపైన, బౌద్ధ భావజాలంపైన బౌద్ధ సంస్కృతి నాగరికతలపైన, ప్రత్యేకించి బౌద్ధారామాలపైన పాశవికమైన దాడులు జరిగాయి. అయినా వాటన్నింటినీ తట్టుకొని బౌద్ధం నిలబడింది. భారతదేశంలో మళ్ళీ బహు రూపాలలో చిగురించి వృద్ధి చెందుతుంది.

**బౌద్ధంపై సాహిత్యదాడి :**

విశ్వనాథ సత్యనారాయణ గారి కలం బౌద్ధంపై విషం గక్కిన మరో ఉదంతం వుంది. 1962లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ప్రచురించిన 5వ తరగతి తెలుగు వాచకంలో ఆయన ఒక కథ రాశారు. ఆ కథ సారాంశం ఈ విధంగా వుంటుంది. యమలోకంలో యముడు చాలా దిగాలుగా కూర్చుని వుంటాడు. అప్పుడే అక్కడకు వచ్చిన నారదముని యముని దీనవదనం చూసి "నీ దిగులుకు కారణం ఏమిటి"? అని అడుగుతాడు.


అప్పుడు యముడు 'మునీంద్రా యమలోకంలో పాపుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. పాపుల హాహాకారాలతో, ఆర్తనాదాలతో కోలాహలంగా ఉండే యమపురిలో నేడు నిశ్శబ్దం తాండవిస్తుంది. ఏంచేయాలో అర్థం కావటం లేదు" అని వాపోతాడు. అప్పుడు నారదుడు "నువ్వు ఆలస్యం చేయకుండా శ్రీమహావిష్ణువుని శరణువేడి నీగోడు వినిపించుకో" అని చెప్పి వెళ్ళిపోతాడు. వెంటనే యముడు హుటాహుటీగా వైకుంఠం వెళ్ళి శ్రీమన్నారాయణుని శరణువేడి రక్షించమంటాడు.

అప్పుడు విష్ణుమూర్తి "యమా ఎందుకింతగా బెంబేలెత్తి పోతున్నావు. ఇప్పుడు ఏ ఆపద నీకు ముంచుకొచ్చింది" అని అడుగుతాడు దానికి యముడు "ప్రభో భూలోకం నుండి పాపులెవరూ యమపురికి రావటం లేదు. కత్తులు, శూలాలు తుప్పుపడుతున్నాయి. కాగిన నూనెలు ఆరిపోయాయి. యమభటులు పనేమీ లేక ఊరికే కూర్చొని గోళ్ళు గిల్లుకుంటున్నారు. ఇలా అయితే యమపురికి శాశ్వతంగా తాళాలు వేసుకోవటమే జరుగుతుంది. కాబట్టి తరుణోపాయం ఏదో మీరే శెలవీయాలి" అని వేడుకొంటాడు.

అప్పుడు విష్ణుమూర్తి "దిగులుపడకు యమరాజా త్వరలోనే భూలోకంలో జంబూద్వీపం ఉత్తరాపథంలో గౌతమ బుద్ధుడు పుడతాడు. అతడు ప్రజలను తండోపతండాలుగా పాపకూపంలోకి పడవేస్తాడు. జంబూద్వీపమంతా పాపుల సంచారంతో అపవిత్రమైపోతుంది. అప్పుడు యమపురికి వచ్చే పాపులకు కొదువ వుండదు. మళ్ళీ యమపురి పాపులతో కళకళ లాడుతుంది" అని చెప్పటంతో యముడు సంతోషించి తిరిగి వెళ్ళిపోతాడు. ఆ కథను రాయటం ద్వారా విశ్వనాథ సత్యనారాయణగారు బౌద్ధంపై ఎంత విషంగక్కారో అర్థమవుతుంది. దీనిపై ప్రముఖ న్యాయవాది ఆవుల గోపాలకృష్ణమూర్తి గారి నాయకత్వంలో అనేకమంది హేతువాదులు, అన్నపరెడ్డి బుద్ధఘోషుడు (అప్పటి వెంకటేశ్వరరెడ్డి) నిరసనోద్యమం నడిపి ఆ పాఠ్యాంశం ప్రభుత్వం తొలగించేలా చేశారు.

పైన చెప్పిన యముడి కథ ఈ వ్యాసానికి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా బౌద్ధంపై జరిగిన సాహిత్య దాడి ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుందని చెప్పటం జరిగింది. బౌద్ధంపై కసి పెంచుకొన్న కొంతమంది సాహితీ మేధావులు మంచిని చెడుగా, చెడును మంచిగా, ఉన్నదానిని లేనట్లుగా, లేని దానిని ఉన్నట్లుగా చిత్రించి ప్రచారం చేయడంలో ఏ మాత్రం వెనుకాడలేదు.

అందుకే వారు తృష్ణను వదిలివేయమని చెప్పిన బౌద్ధాన్ని, కోర్కెలు చంపుకోమంటుంది బౌద్ధమని ప్రచారం చేసి ఉంటారు. ఆ ప్రచారమే ఇప్పటికీ జనం నోళ్ళలో నానుతూ వుంది. ఈ అభిప్రాయం బౌద్ధేతరులలోనే కాక బౌద్ధాన్ని సరిగా అర్థం చేసుకోని కొంతమంది బౌద్ధ ఉపాసకులలో కూడా ఉంది.




మారుని కుమార్తెలు

**తృష్ణకు – కోరికకు భేదం :**

బౌద్ధం వదిలివేయమని చెప్పిన తృష్ణ భౌతికమైనది కాదు. అది మానసికమైనది. తృష్ణ అనేది బుద్ధుని అతి ముఖ్య ప్రబోధమైన ప్రతీత్య సముత్పాదం (కార్యకారణ సిద్ధాంతం) లోనిది. ఈ ప్రతీత్య సముత్పాదం పన్నెండు అంగాలతో పరస్పర ఆధార సహితమై కొనసాగుతుంది. దుఃఖ కారకము మరియు నిరోధము ఉన్న ఈ పన్నెండు అంగాలు ఒక దానితో మరొకటి అంతసంబంధాన్ని కలిగి ఉన్నాయి. దీనిని "ద్వాదశాంగ భవచక్రం" అని కూడా పిలుస్తారు. ఈ భవచక్రంలో ఏ కారణంతో ఏ కార్యం జరుగుతుందో చెప్పటమేగాక ఏ కార్యాన్ని నిరోధించితే ఏ కారణం నిరోధమవుతుందో కూడా చెప్పటం జరిగింది. ఈ భవచక్రంలో "తృష్ణ" అనేది ఎనిమిదవ అంగం.

తృష్ణకు కోరికకు బేధం ఎంతో వుంది. కోరికలనేవి బాహ్య ప్రపంచం నుండి వ్యక్తి పొందాలనుకునేవిగా వుంటాయి. తృష్ణ అనేది తన అంతః ప్రపంచం నుండి బయటకు తీసివేయవలసినదిగా ఉంటుంది. స్పష్టంగా చెప్పుకోవాలంటే కోరిక పొందదగినది. తృష్ణ తీసివేయదగినది. మనసు నిరంతరం తృష్ణతో జ్వలిస్తూ వుంటుంది. మనసు తనకు నచ్చినది కావాలని, రావాలని, వుండాలని, వృద్ధి చెందాలని, శాశ్వతమవ్వాలని భావిస్తూ తృష్ణను ఉత్పన్నం చేసుకొంటూ వుంటుంది. అలాగే తనకు నచ్చనిది వద్దని, రాకూడదని, వుండకూడదని, వెళ్ళిపోవాలని, నశించాలని తృష్ణను ఉత్పన్నం చేసుకుంటుంది.

ఒకటి రాగపూరిత తృష్ణ. మరొకటి ద్వేషపూరిత తృష్ణ. రాగంలోను, ద్వేషంలోను ఉండేది తృష్ణే. అందుచేత దుఃఖానికి కారణమైన రాగద్వేషాలు తొలగాలంటే బౌద్ధం తృష్ణను జాగ్రత్తగా పరిశీలించి, దానిని తీసివేయమంటుంది. అనేక మానసిక సమస్యలకు, బాధలకు తృష్ణ కారణమవుతుంది. తృష్ణా క్షయం మనిషికి పరిపూర్ణ ఆనందాన్ని ఇస్తుందని చెబుతుంది. అంతేగాని వ్యక్తి భౌతిక వికాసానికి, సమాజ అభివృద్ధికి తోడ్పడే కోర్కెలను విసర్జించమని బౌద్ధం ఎన్నడూ చెప్పలేదు. తృష్ణకు, కోరికలకు, అవసరాలకు భేదం వుంటుంది. అవసరాలు అనేవి కోరికలు కావు. అవి తప్పనిసరి. అంటే గాలి, నీరు, తిండి, బట్ట, ఇల్లు, చదువు, ఆరోగ్యం, పెళ్ళి లాంటివి మనిషికి తప్పనిసరి. ఇక ఉద్యోగం, వ్యాపారం, సంపాదన, పరిశోధన, పదవి, పరపతి, కీర్తి లాంటివి కోరికలు. మనిషికి ఈ కోరికలు అవసరమైనవే తప్ప ఆక్షేపణమైనవి కావు. తనకు తన కుటుంబానికి మేలు చేసేవి సముచితమైన కోర్కెలు. కేవలం తనకు మాత్రమే కాక ఇతరులకు కూడా మేలు కలిగించే కోర్కెలను బౌద్ధం కుశల కోర్కెలు అంటుంది. ఇక తన సుఖం కోసం, తన అభివృద్ధి కోసం ఇతరులకు కష్టాలు, నష్టాలు కలిగించే కోర్కెలను బౌద్ధం అకుశల కోర్కెలు అంటుంది. బౌద్ధం తన ఉన్నతికి, పరుల ఉన్నతికి తోడ్పడే కోరికలను ఎన్నడూ నిరాకరించదు. అంటే సవ్యమైన, సహజమైన, సహేతుకమైన కోర్కెలను అది నిరాకరించదు. అలాగే తన పతనానికి ఇతరుల పతనానికి దారితీసే కోరికలను అది ఎన్నడూ అంగీకరించదు. అంటే అపసవ్యమైన, అసహజమైన, అహేతుకమైన కోర్కెలను అది అంగీకరించదు.

**కోరికలపై అష్టాంగ మార్గం !**

మానవ కల్యాణం కోసం భగవాన్ బుద్ధుడు ప్రబోధించిన *అష్టాంగ మార్గం*లో రెండవ అంగం *సమ్యక్ సంకల్పం* వుంది. సమ్యక్ సంకల్పం అంటే సంకల్పం శ్రేష్ఠంగాను, ధృఢమైనదిగాను వుండాలని దాని భావం. ఒక వ్యక్తికి మంచి సంకల్పం వుండాలంటే ముందుగా అతనికి మంచి కోరిక ఉండాలి. మంచి కోరిక ఉన్నప్పుడే మంచి సంకల్పం అవసరమవుతుంది. మంచి కోరికలేనప్పుడు మంచి సంకల్పం అవసరం ఉండదు. సిద్ధార్థ గౌతమునికి మానవాళి దుఃఖానికి నివారణ కనుగొనాలనే కోరిక కలగటం వల్లనే అతను సమ్యక్ సంకల్పం తీసుకున్నాడు. ఆయన తీసుకున్న మహా సంకల్పమే ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆయనను సమ్యక్ సంబుద్ధునిగా మార్చింది. కాబట్టి మంచి సంకల్పానికి ముందు మంచి కోరిక పునాదిగా ఉంటుంది.

ఇక *అష్టాంగ మార్గం*లోని నాల్గవ అంగం *సమ్యక్ కర్మాంత*. సమ్యక్ కర్మాంత అంటే సరియైన కర్మలు (పనులు) ఆచరించటం. వ్యక్తి తన మనోవాక్కాయములతో చేసే పనులు కుశలంగా ఉండాలనే కోరికను అమలుచేయుటం పంచశీలాచరణకు తన కర్మలు భంగం కలిగించకుండా ఉండేలా గమనించుకుంటూ ఉండటం. తరవాత *అష్టాంగ మార్గం*లోని అయిదవ అంగం *సమ్యక్ ఆజీవ*ను చూద్దాం. సమ్యక్ ఆజీవ అంటే సరియైన జీవన విధానం. బుద్ధుడు అకుశలమైన అయిదు రకాల జీవన వృత్తులను విడనాడమని చెప్పాడు. మనువు రాసిన వర్ణాశ్రమ ధర్మాలలో ఎవరెవరు

ఏఏ వృత్తులు చేయాలో శాసించినట్లు, బుద్ధుడు ఫలానా కులంవారు ఫలానా పనులు మాత్రమే చేయాలని శాసించలేదు. ఎవరికి నచ్చిన వృత్తులను వారు చేసుకొనే స్వేచ్ఛను బుద్ధుడు కల్పించాడు. *సమ్యక్ ఆజీవ* ప్రకారం అకుశలమైన వృత్తుల జోలికి పోకుండా కుశలమైన వృత్తులను చేపట్టాలంటే, కుశల వృత్తులపట్ల బలమైన కోరిక వుంటేనే గానీ అది సాధ్యపడదు. పై విషయాలను గమనించినప్పుడు కోరిక లేకుండా మనం ఏ పనీ చేయటం సాధ్యపడదని తెలుస్తుంది. అసలు అష్టాంగమార్గాన్ని ఆచరించాలన్నా అష్టాంగమార్గాన్ని సాధన చేయాలనే కోరిక గాఢంగా ఉంటేనే తప్ప దానిని ఆచరించడం సాధ్యపడదు.

కోర్కెలు అంటే గొంతెమ్మ కోర్కెలు, మితిమీరిన కోర్కెలు, దుష్ట కోర్కెలు అనే అర్థంలో చెప్పుకోవాల్సి వచ్చినప్పుడు ఖచ్చితంగా వాటిని తిరస్కరించవలసిందే. కోర్కెలు మానసిక వికాసానికి, భౌతికాభివృద్ధికి తోడ్పడేవిగా భావించినప్పుడు తప్పనిసరిగా వాటిని స్వీకరించవలసిందే.

**కోరికలే అభివృద్ధికి మూలం :**

మనిషి జంతు దశ నుండి ఆటవిక దశకు, ఆటవిక దశ నుండి ఆధునిక దశకు పరివర్తన చెందాడంటే తనలోని కోర్కెలను సాఫల్యం చేసుకోవడం వల్లనే తప్ప వేరు కాదనేది స్పష్టం. క్రూర మృగాల నుండి, ప్రకృతి విపత్తుల నుండి రక్షణ పొందాలనే కోరికే అతనిని నాగరిక సమాజం వైపు నడిపించింది. తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం, జ్ఞానం కావాలనే కోరికలు - సామాజిక ఆశయాలుగా మారి నిరంతరాన్వేషణ, పరిశోధనలతో నూతన యుగాలకు నాంది పలికింది. విజ్ఞాన శాస్త్రాల పుట్టుక, శాస్త్ర, సాంకేతిక రంగాలలో జరుగుతున్న అభివృద్ధి అంతా కోరిక వల్లనే జరుగుతుంది తప్ప, కోరిక రాహిత్యం వల్ల కాదు.

బహుజన హితాన్ని, బహుజన సుఖాన్ని, విశ్వమానవాళి క్షేమాన్ని కాంక్షించే బౌద్ధం కోరికలను చంపుకోమని ఎక్కడా చెప్పలేదు. అయితే అవి కుశలంగా వుండాలని చెప్పటంలో అది ఎన్నడూ వెనుకాడలేదు. సహేతుకమైన కోర్కెలనే బౌద్ధం కుశల కోర్కెలు అంటుంది. అసాధ్యమైన కోర్కెలు నింపుకొని సతమతమై పోకూడదని చెబుతుంది. ఉదాహరణకు- ఈ ప్రపంచాన్ని ఒక నెలలోనో, ఒక సంవత్సరంలోనో మార్చేయాలనే కోరిక పెట్టుకోవడం, ఈ ప్రపంచంలో అందరికంటే ఎక్కువ ధనం సంపాదించి, ఆ ధనం పేదలకు పంచి పేదరికమన్నదే లేకుండా చేస్తానని భావించడం అహేతుకమైన కోర్కెలే తప్ప ఆచరణ సాధ్యమైన కోర్కెలు కావు. ఆచరణ సాధ్యం కాని కోర్కెలు, వ్యక్తి సామర్థ్యాన్ని దెబ్బ తీస్తాయే కానీ బలపడేలా చేయవు. కోర్కెల స్వభావాన్ని బట్టి వాటిని ఆకాంక్షలు, లక్ష్యాలు అని కూడా చెప్పుకోవచ్చు.

**కోరికల గురించి మతాలు :**

లోకంలో చాలా మతాలు వున్నాయి. వాటిలో ఒక్క బౌద్ధం మినహా మిగతా మతాలు అన్నీ కోరికల్ని విసర్జించమనే ప్రబోధిస్తున్నాయి. మతాలకు వుండే సాధారణ దృక్పథం ఏమిటంటే ఒక వ్యక్తి తన ఉన్నతికి తాను ఏమీ చేయనవసరం లేదు. అతను దేవునిపై విశ్వాసం ఉంచితే చాలు. తనకు కావలసినవన్నీ దేవుడే చూసుకుంటాడు. దేవుడే సమకూరుస్తాడు. కానీ బౌద్ధ దృక్పథం మాత్రం అందుకు భిన్నంగా నీ ఉన్నతికి నీవే శ్రమించు. నీవు నీ పైనే ఆధారపడు. మరెవరిపైనా ఆధారపడకు. నీకు కావలసినవి నీవే కోరుకో. నీకు అవసరమైనవి నీవే సాధించుకో. బుద్ధుడు మార్గం చూపించువాడు మాత్రమే. నీకు కావలసినవి శ్రమించి నీవే సాధించుకోమని ప్రబోధిస్తుంది.

విచిత్రం ఏమిటంటే కోరికలు వద్దని చెప్పే మతాలను కోర్కె ప్రబోధ మతాలుగాను, కోర్కెలను ప్రబోధించిన బౌద్ధాన్ని కోర్కె రాహిత్యంగాను అర్థం చేసుకోవటం. భగవాన్ బుద్ధుడు తన ధర్మాన్ని బోధించిన కాలంలో తృష్ణకు, కోరికకు ఉన్న బేధం తెలియక తికమక పడినవారు వుండి వుండకపోవచ్చు. కానీ నేటి కాలంలో ఈ విషయంపై కలుగుతున్న గందరగోళాన్ని నివారించడానికి బౌద్ధంపై సాధికారిత కలిగిన పండితులు సరైన వివరణ ఇవ్వవలసిన అవసరం ఎంతైనా వుంది. లక్ష్య రహితంగా పరుగులు తీసే మానవ ప్రపంచాన్ని లక్ష్యం వైపు నడిపించడమే బౌద్ధ లక్షణం; లక్ష్యం. ఏది ఏమైనా బౌద్ధం కోర్కె ప్రబోధమే కానీ, కోర్కె రాహిత్యం కాదని మనం రూఢిగా చెప్పవచ్చు.

గమనిక:- ఈ వ్యాసంలో విశ్వనాథ సత్యనారాయణగారి ఉదంతాలు అన్నపరెడ్డి బుద్ధఘోషుడు గారి *నేటి ప్రపంచానికి బౌద్ధం* అనే వ్యాసం నుండి సేకరించటమైనది. అన్నపరెడ్డిగారి ఆ వ్యాసం *సమాగమం-2010 ఆంధ్రప్రదేశ్ బౌద్ధ సమ్మేళన సంచిక*లో ప్రచురితమైంది. మి

# బుద్ధుని మౌనం

*- వేదాంతం లక్ష్మీప్రసాదరావు*

**కొ**న్ని సమయాలలో కొందరు బౌద్ధులు / శ్రమణులు, తాత్త్విక విషయాలను గురించి ప్రశ్నించినప్పుడు, బుద్ధుడు సమాధానం యివ్వక, మౌనంగా వున్నట్లు బౌద్ధ గ్రంథాలు పేర్కొంటున్నాయి. కొన్ని తాత్త్విక విషయాలపై తథాగతుని ఉత్తమమైన మౌనానికి గల కారణం తెలుసుకునేముందు ఆనాటి మత, తాత్త్విక నేపథ్యాన్ని, సాంఘిక, రాజకీయ పరిస్థితులను గుర్తుచేసుకోవాల్సి వుంటుంది. బుద్ధుని సమకాలీన కాలంలో అరవై రెండు తాత్త్విక శాఖలు ప్రచారంలో వున్నట్టు బ్రహ్మజాల సుత్తం తెల్పుతోంది. ఆనాటి తాత్త్వికులలో కొందరు మనసే ఆత్మ అని నమ్మారు. ఇంకొందరు మనసు వేరు, ఆత్మ వేరని భావించారు. ఇంకా మరికొందరు ఆత్మకు సంబంధించి ఏదీ నిశ్చయజ్ఞానం కాదని సిద్ధాంతీకరించారు. పరలోకం వుందని కొందరు వాదిస్తే, అలాంటిది ఏదీ నిశ్చయంగా లేదని ఇంకొందరు ప్రచారం చేశారు. దేవుడే సర్వకర్తయని ఒక వర్గం వారు భావిస్తే దానిని వ్యతిరేకిస్తూ ఇంకొందరు మానవుడే అన్నిటికి మూలం అని



ప్రసన్న బుద్ధుడు

వాదించారు. ఈ విధంగా తాత్త్విక వాతావరణం, బుద్ధుని కాలానికి, విచిత్ర వాదాలతోనూ, విరుద్ధ సిద్ధాంతాలతోనూ, భావసాంతర్యాలతో అలజడికిలోనయి వున్నది. ఇంకా మతపరంగా క్షుద్ర మంత్రోపాసనలు, నాస్తికుల విచ్చలవిడి ప్రవర్తన దినచర్యగా మారింది. వీటన్నిటి ఫలితంగా సమాజంలో ధర్మ దృష్టి దారితప్పి, నైతిక విలువలు పతనమైనాయి. మోక్షానికి సూక్ష్మోపాయాలపై ఆత్రుత హెచ్చింది. రాజకీయ పరిస్థితులు అరాచకంగా వుండేవి.

ఇలాంటి పరిస్థితుల్లో బుద్ధుడు నిరర్థక తాత్త్విక ఆలోచనలను, వాదోపవాదాలను నిరసించాడు. వాటిని దూరంగా నెట్టివేయటానికి ప్రయత్నం చేసేవాడు. ప్రాచీన బౌద్ధం యొక్క లక్ష్యం, ప్రధానంగా ధర్మాచరణమేగాని, తాత్త్విక భావాల ప్రచారం కాదు. శుష్క ఉపదేశమూకాదు. బుద్ధుని మౌనానికి కారణం అయిన కొన్ని ప్రశ్నలు ఈ విధంగా వున్నాయి.

1. ఈ లోకము శాశ్వతమా? 2. ఈ లోకము పరిమితమయినది కదా? శాశ్వతం కాదు కదా? 3. ఆత్మవేరు, శరీరం వేరు, అవునా? 4. ఆత్మ, శరీరం రెండూ ఒకటే కదా? 5. తథాగతుడు నిర్వాణం / మరణం తర్వాత కూడా వుంటాడా? 6. తథాగతుడు నిర్వాణం తరువాత వుంటాడు, వుండడు ఒకే సమయంలో, అవునా?

కేవలం పరిమిత జ్ఞానంతో వున్నవాడు, అహంభావి ఈ సందేహాలను తీర్చడానికి సంసిద్ధుడవుతాడు. కాని బుద్ధునికి ఈ విషయాలమీద సంపూర్ణమైన అవగాహన వుండటం వలనను, వాటియొక్క నిష్ప్రయోజనం దృష్టిలో వుంచుకొని ప్రత్యుత్తరం యివ్వక మౌనం వహించాడు. చాల సందర్భాలలో మానవ భాష యొక్క పరిమితులను గురించి బుద్ధుడు హెచ్చరించటం జరిగింది. యదార్థ సత్యాన్ని గురించి వివరించటంలో ఆ జ్ఞానం అనుభవంలోకి రావాల్సిందేగాని, మాటల్లో చెప్పలేము. చెప్పటానికి చేసే ప్రయత్నం అపార్థాలకు దారి తీస్తుంది. అది ఎలా వుంటుందంటే ఏడుగురు గుడ్డి

వేదాంతం లక్ష్మీప్రసాదరావు, ఫోన్ : 98480 54288

వాళ్ళు, ఏనుగును వర్ణించినట్లుంటుంది. సుస్థిర నిశ్చయంలేని విజ్ఞానం నైతిక ప్రవర్తనకు ప్రమాదహేతువని బుద్ధుని నిర్ణయం. అందువలననే కొన్ని తాత్త్విక విషయాలను గురించి, ముఖ్యంగా పృచ్ఛకుని యొక్క మానసిక పరిమితిని బట్టి మౌనందాల్చేవాడు. అయితే బుద్ధుడు విమర్శ యొక్క ప్రాముఖ్యతను విస్మరించలేదు. కాని కొన్ని మినహాయింపులు చేశాడు. ఒక విధంగా బుద్ధుడు హేతువాదియే. ఎందువలనంటే దైవప్రోక్తాలతో సంబంధం లేకుండా, మానవసహజమైన ప్రయత్నాలచే బుద్ధుడు సత్యాన్ని పరిశీలించాలని భావించాడు. సంప్రదాయాలను నాశనం చెయ్యాలని బుద్ధుడు సత్యాన్వేషణకు బయల్దేరలేదు. పాక్షిక భావాలను మనసులో వుంచుకోకుండా, నిష్పక్షపాతంగా సత్యాన్ని తెలుసుకోవాలని కాంక్షించాడు.

తన ధ్యానం యొక్క అనుభవాలను బౌద్ధుల ఎదుట వుంచి తాను సంబోధి పొందటాన్ని వివరించాడు. బౌద్ధులను కూడా ఆవిధంగానే కృషిచేసి, పరీక్షించుకొన్న పిదపనే తన మార్గాన్ని అనుసరించవలసిందిగా ధర్మ ప్రబోధంగావించాడు. స్వయంగా తెలుసుకొన్న సత్యాన్ని అన్వయించుకొని దుఃఖమయమైన లోకానికి అష్టాంగ మార్గదీపికను ప్రపంచానికి చూపించాడు. ఆత్మ ఏదికాదో బుద్ధుడు స్పష్టంగా చెప్పాడు. కాని ఆత్మ ఏదో నిశ్చయంగా వివరించలేదు. పరివ్రాజకుడు, దేశద్రిమ్మరి, అయిన "వచ్ఛగోత్తుడు" బుద్ధుని వద్దకు వచ్చి, ''పూజనీయుడా గౌతమా! ఏమని నిశ్చయించితిరి?" "మరి ఆత్మ అనేది లేదా?" వచ్ఛగోత్తుడు తిరిగి ప్రశ్నించాడు. మరల బుద్ధుడు మౌనం వహించాడు. వచ్ఛగోత్తుడు అక్కడనుంచి, లేచి, వెడలిపోయాడు. ఆ సన్యాసి వెళ్ళిన తరువాత ప్రియశిష్యుడైన ఆనందుడు బుద్ధుని అడిగాడు.

''వచ్ఛగోత్తుని ప్రశ్నలకు ఎందుకు సమాధానం యివ్వలేదు?'' బుద్ధుడు ఆనందునికి ఈ విధంగా తెలియచేశాడు. "ఆనందా, వచ్ఛగోత్తుడు" ఆత్మ వున్నదా?, అని ప్రశ్నించి నప్పుడు, నేను కనుక "ఆత్మవున్నది" అని సమాధానం యిచ్చివుంటే, శ్రమణులు, బ్రాహ్మణులు ఆత్మవున్నది. శాశ్వతమైనదని వారు చేసే సిద్ధాంతాలను, నేను అంగీకరించి నట్లవుతుంది. "వచ్ఛగోత్తుడు ఆత్మ అనేది లేదా?" అని అడిగినప్పుడు, 'లేదు' అని నేను కనుక చెప్పినట్లయితే అతని మనసులో ఎంతో గందరగోళం ఏర్పడి వుండేది. ఎందుకంటే అతడు యిప్పటి వరకు తనలో ఆత్మ వున్నదని విశ్వసిస్తున్నాడు. అయ్యో యిప్పుడు నాలో ఆత్మ లేదా అని ఇంకా మరింత కంగారు అనుభవించే వాడు. అందుకని నేను మౌనంగా వుండి పోయాను. **(సంయుక్తనికాయ).**

"అజ్ఞానము, భ్రమవలన ఆత్మ వేరని శరీరం కంటే, అది స్వయంసిద్ధమని కొందరు భావిస్తారు. వారి హృదయాలు ఆత్మని అంటిపెట్టుకుని వుంటాయి. వారికి స్వర్గసుఖాల యందు మక్కువ. ఈ వాదోపవాదాల వలన జరిగే పరిణామం ఏమంటే సత్కార్యాచరణపైన, సంపూర్ణ సచ్ఛీలతపైన వారు దృష్టి కేంద్రీకరించలేరు. అందు వలననే ఆత్మ, మొదలయిన తాత్త్విక విషయాలను గురించి బుద్ధుడు మౌనం పాటించాడు.


ప్రాచీన బౌద్ధంలో మూడు ప్రధాన లక్షణాలు మనకు గోచరిస్తాయి. 1. ధర్మం ఎడల దీక్ష, 2. దైవికమైన వాటి గురించి జిజ్ఞాస లేక పోవడం, 3. తాత్త్విక వాదోపవాదాలలో ఆసక్తి లేక పోవడం. బుద్ధుడు ఆనాటి కాలానికి అనుగుణంగా ఆత్మవున్నదని గాని, లేదని గాని స్పష్టంగా చెప్పలేదు. ప్రశ్నించే వారి అర్హతను బట్టి, మానసిక సామర్థ్యాన్ని బట్టి, కొన్ని సార్లు ఆత్మవున్నదన్న భావన కలుగచేసి వుండ వచ్చు. అయితే దాని ప్రయోజనం వేరు. అయితే, బుద్ధుని యొక్క ఈ వైఖరి కొంత అపార్థానికి అవకాశం కలిగిందని ప్రాచీన బౌద్ధులే అంగీకరించినట్లు గ్రహించగలం.

ప్రజ్ఞా పారమిత సూత్రానికి వ్యాఖ్య రచిస్తూ ఆచార్య నాగార్జునుడు ఈ విధంగా తెలుపుతున్నాడు. ''కొన్ని సందర్భాలలో ఆత్మవున్నదని, ఇంకొన్ని సార్లు ఆత్మలేదని తథాగతుడు చెప్పాడు. ఇపుడీ రెండు భావములలో ఏది సత్యమైనది? నిశ్శంసయముగా ఆత్మ లేదనుటయే. ఈ సిద్ధాంతము బోధపడుట సులభంకాదు. అపరిణిత బుద్ధులకును, యోగ్యత లేని వారికిని, ఈ ఉపదేశము బుద్ధుడు ఉద్దేశించలేదు. ఎందుచేత? ఆత్మ లేదనినచో, మూర్ఖులు నిజమని తలచి, నాస్తికులతో పాటు, దుర్మతిని అనుసరించుదురు". "బుద్ధుడు తన రెండు భావములను రెండు భిన్నమైన ఉద్దేశాలతో చెప్పెను. ఆత్మవున్నదని సంకేతమిచ్చినప్పుడు శ్రోతలకు సంప్రదాయధర్మమును ఉపదేశించెను. ఆత్మలేదని చెప్పినప్పుడు శ్రోతలకు అతీతధర్మమును ఉపదేశించెను". నాగార్జునుని ప్రధాన శిష్యుడైన ఆర్యదేవుడు కూడ, తన మాధ్యమిక శాస్త్రభాష్యంలో ''బుద్ధిశక్తులు పరిణితి పొందకుండా నిర్వాణము

పొందజాలడు. దుఃఖము ఎందుకు నిర్మూలింపవలెనో తెలిసి కొనలేడు. ఈ ఉన్నతదశలో లేనివారికొరకే బౌద్ధులు ఆత్మయున్నదని చెప్పుదురు." అని వివరించాడు. బుద్ధుడు ఉపదేశించిన తత్త్వము – మితి లేని రాగాన్ని, శ్రుతిమించిన వైరాగ్యాన్ని వ్యతిరేకించాడు. కఠోర నియమాలను అనుష్ఠించి, శరీరాన్ని హింసించటంగాని, లేదా కేవలం ఇంద్రియ లోలత్వం, సుఖలాలసత్వం – ఈ రెండు విపరీత పద్ధతులను, సత్యాన్వేషణకు ఉపయోగపడవని బుద్ధుని ఉద్బోధ.

తథాగతుడు తన అనుభవంతో తెలుసుకున్న మధ్యేమార్గాన్ని – అష్టాంగమార్గాన్ని – నిర్వాణాన్ని పొందడానికి లోకానికి అందించాడు. అర్థం లేని మూఢనమ్మకాలను బుద్ధుడు నిరసించాడు. బ్రాహ్మణుడొకడు, బుద్ధునితో "ఒకసారి బాహుదా నదిలో స్నానం చేస్తే సర్వపాపాలు హరిస్తాయి" అని చెప్పగా, బుద్ధుడు యిలా జవాబిచ్చాడు. "ఎన్నిసార్లు స్నానం చేసినా, మూర్ఖుని పాపాలు బహుదానది పోగొట్టలేదు. అన్ని జీవుల యెడ దయకల్గివుండటం, స్వార్థం లేకుండా వుండటం, అబద్ధం చెప్పకుండా వుండటం – వీటివలననే మనిషి పవిత్రుడవుతాడు. అప్పుడు ఎచ్చటి నీరైనా గంగోదకమే!"

"సచ్ఛీలము, దానము లేని యోగధ్యానం నిరర్థకం" అని తథాగతుని నిర్ణయం. సిద్ధాంత రాద్ధాంతాలు ద్వేషాన్ని, దుఃఖాన్ని కలిగిస్తాయి. సరియైన జ్ఞానాన్ని పొందటానికి దోహదం చెయ్యవు. కేవలం తమ తెలివి తేటలు



మహాపరినిర్వాణం

ప్రదర్శించటానికి ప్రశ్నించే వారి ఎడల బుద్ధుడు మౌనమే పాటించేవాడు. "పరీక్షస్య భిక్షవో గ్రాహ్యం మద్వచొ న, తు, గౌరవాత్" "మీరు పరీక్షించిన తరువాతే, నేను చెప్పిన విషయాన్ని విశ్వసించండి. కేవలం నామీద గౌరవంతో కాదు" అని బోధించాడు శాక్యముని.

బుద్ధుడు విశ్వమానవుడు. అద్భుతమైన వ్యక్తిత్వం ఆయన సొంతం. అన్ని యుగాల్లోనూ, కాలాల్లోనూ బుద్ధుడు సమకాలీనుడే. ఆయన అష్టాంగమార్గం అజరామరం. బుద్ధుడు నలభై సంవత్సరాల జీవితానంతరం, తన ఎనభై సంవత్సరాల వయసులో వైశాలి నుంచి, కుశినగరానికి బయల్దేరి వెళుతూ, మార్గమధ్యంలో అనారోగ్యానికి గురి అయ్యాడు. తాను దేహత్యాగం చేసేసమయం ఆసన్నమైనదని గ్రహించి, దారిలో కొండ మీద రెండు సాల వృక్షాల నడుమ పడక ఏర్పాటు చేయవలసిందిగా శిష్యులకు ఆదేశించాడు. కొండ మీద నుంచి క్రిందుగా వున్న వైశాలి నగరాన్ని–చివరగా తనకు ఆతిథ్య మిచ్చిన నగరాన్ని – చూసి ఆనందపడ్డాడు. "చిత్రం జంబూద్వీపం, మనో రమమ్ జీవితం మనుష్యా ణామ్." "ఎంతో శోభాయమైనది, సంపదలతో కూడుకున్నది ఈ భారతదేశం, మధురమైనది, ప్రేమాస్పదమైనది మానవుల జీవితం." అన్నాడు శాక్యముని.

ఆయన భౌతిక దేహానికి చివరి క్షణాలు చేరువయినాయి. శిష్యులు దుఃఖంలో మునిగి పోయారు. ప్రియ శిష్యుడైన ఆనందుడు దుఃఖంతో విలవిల్లాడు తున్నాడు. అప్పుడు బుద్ధుడు శిష్యులతో ఈ విధంగా చెప్పాడు. "దుఃఖించకండి. పుట్టిన ప్రతిదీ గిట్టక తప్పదు. ఏదీ శాశ్వతంకాదు. చివరకు మనం అన్నీ విడిచి వెళ్లాల్సిందే.

**"హందదాని భిక్ఖవే ఆ మంతయామి వో**
**వయధమ్మా సంఖారా అప్పమాదేన సంపాధేతి"**

ఓ భిక్షువులారా! ఈ లోకంలో అన్నీ నశించేవే. నేను యిన్నాళ్ళూ అదే బోధిస్తూ వచ్చాను. మీరు దీక్షతో మీ లక్ష్యం కోసం ప్రయత్నించండి." ఇదే తథాగతుని చివరి సందేశం.

ఆ ప్రశాంత వాతావరణంలో, బుద్ధుని వదనం శాంతంగా, నిర్మలంగా వున్నది. అన్ని ఆలోచనలు, అన్ని భావనలు, వ్యక్తిత్వం తాలూకు చైతన్యం మార్మికమైన లోతుల్లో విలీనం అయింది. ఆ చైతన్యం మహాపరినిర్వాణం పొందింది.

# బౌద్ధంలో స్త్రీల ప్రతిపత్తి

– ఇల్లిందల సరస్వతీ దేవి

గౌతమబుద్ధుడు జన్మించి, జీవించి, నిర్వాణ మొందిన భారత దేశములోను, బౌద్ధమతమనిన అభిమానముగల బర్మా, చైనా, ఇండోచైనా, జపాన్, జావా సుమత్రా, శ్రీలంక మొదలయిన ఇతర దేశాలలోను ఈ వైశాఖ పౌర్ణిమనాటికి **అనగా మే నెల 24 వ తేదీకి గౌతమసిద్ధార్థుడు నిర్వాణంపొంది 2500 సంవత్సరాల కాలమయినదని** చారిత్రకులు నిర్ణయించారు. వీరాధివీరులూ లోకోద్ధారకులూ జన్మించిన పుణ్య భారతదేశములో, గౌతమ బుద్ధుడు క్రీస్తుకు పూర్వము 563లో ఉద్భవించాడు; క్రీస్తుకు పూర్వము 483లో నిర్వాణమందినాడు. ఆయన జీవిత కాలము ఎనభై సంవత్సరములు. సరిగా ఇరవై తొమ్మిదవ ఏట, తొలి యౌవన ఆరంభముననే భార్యా పుత్రులను, రాజ్యాన్ని విడిచి, సర్వ సంగపరి త్యాగము చేసి, ధర్మ తత్త్వాన్వేషణ గావించి, ఆశయసిద్ధి పొందిన పురుషోత్తముడు గౌతమ బుద్ధుడు.

బుద్ధదేవుని పరిశుద్ధ జ్ఞాన ప్రభావము చేత మానవసంఘం సత్యపథాన్ని సమీపించ గలిగింది. బుద్ధా చార్యుడు దార్శనిక త్వానికీ, పాండిత్యానికీ స్వీయకర్తవ్య క్షేత్రమున స్థాన మొసంగక, సర్వజన గ్రాహ్య మయిన ఆత్మీయ తత్త్వము యొక్క వ్యాఖ్యానము గావించటము చేత, మానవాంతః కరణ, బుద్ధి, విచారణశక్తి నిస్సంకోచ భావముతో ఆ ప్రబోధానికి శిరము వంచినవి. ఈ కారణము చేత బౌద్ధధర్మము సాంఘిక విప్లవానికి అవకాశ మివ్వక అల్పకాలములోనే ఆసియా ఖండ మందంతటా వ్యాపించి పోయింది. బౌద్ధమత స్వీకారం చేసినవారిలో స్త్రీలు ఎంతోమంది ఉన్నారు. బౌద్ధ మతము ఆ కాలపు సనాతన హిందూ సంఘములో స్త్రీల సాంఘిక ప్రతిపత్తిలో కొంత మార్పు తేగలిగింది. ప్రాచీనభారతములో మానవసేవకు బద్ధకంకణులయిన స్త్రీలు బౌద్ధంలో తప్ప మనకు కనబడరు. స్త్రీలు సదా ఇతరుల ఆధీనములో ఉండటమే హైందవుల ఆదర్శము కనుక, స్వతంత్రంగా ముందుకు వచ్చి, తమ ఆశయాలను సాధించిన ఉదాహరణము ప్రాచీనభారతములో తక్కువ. ఆ కాలములో స్త్రీలు పండితురాండ్రు కావచ్చు–కవయిత్రులు కావచ్చు – మైత్రేయివలె బ్రహ్మవాదినులు కావచ్చు – కాని సంఘములో తమ మేధాశక్తినీ ప్రతిభనూ చాటటము ఆదర్శముగా భావింపబడలేదు.



స్త్రీ ప్రతిభ పత్నిగా, మాతగా, భర్త చాటున, కుమారుని చాటున ప్రకాశించిన ఆదర్శాలు తప్ప స్వతంత్రముగా స్త్రీలు తమ శక్తిని ప్రదర్శించిన ఉదాహరణలు తక్కువ. కాని బౌద్ధధర్మం స్త్రీల సాంఘిక ప్రతిపత్తిలో కొంతవరకు మార్పు కలగటానికి అవకాశము ఏర్పడ్డది. 'పురుషుడివలెనే స్త్రీ తన కర్మకు తానే బాధ్యురాలు. మోక్షముగానీ, నరకముగానీ ఆమె కర్మ ననుసరించి ప్రాప్తించగలిగినదే కాని, తల్లిదండ్రులూ, గురువులూ తోడ్పడలేరు. ఎవరి కర్మకు వారే బాధ్యులు. కనుక కుమారుడు తల్లిని నరకమునుండి తప్పించటమన్నది లేదు' అని బౌద్ధం బోధించినందువల్ల కుటుంబములో మగబిడ్డ పుట్టినప్పుడు ఆనందించటమూ, ఆడబిడ్డ పుట్టినప్పుడు విచారపడటమూ తగ్గినది. క్రమముగా కుటుంబములోనూ సంఘములోనూ ఆడపిల్ల ప్రతిపత్తి పెరుగుతూ వచ్చింది. క్రతుకలాపాలలో హిందూ ధర్మశాస్త్రాన్ననుసరించి వితంతువులకు, పుత్రులు లేని స్త్రీలకు, సంతానములేని స్త్రీలకూ పాల్గొనే అధికారము లేదు. బౌద్ధం ఈ విధమైన బ్రాహ్మణ కర్మలను నిషేధించినందువల్ల వితంతువులను, సంతానము లేని స్త్రీలను సంఘములోను, కుటుంబములోను లోకువగా చూసే అవకాశము తగ్గిపోయింది. హిందూ మతములో ఆధ్యాత్మిక రంగంలో పురుషులతో సమానంగా స్త్రీకి స్థానములేదు. కొన్ని కర్మలు, మంత్రాలు స్త్రీలకు నిషేధింపబడ్డాయి. కాని– బౌద్ధం ఆధ్యాత్మిక రంగంలో స్త్రీ పురుషులకు భేదము చూపలేదు. స్త్రీ పురుషులిద్దరూ ఈ రంగంలో తమ ప్రయోజనాలనూ, ఆశయాలనూ సాధించు కోవటానికి అవకాశము ఉన్నది. కనుకనే

బౌద్ధమతంలో స్త్రీ పురుషులు సమానముగా కృషి చేయ కలిగారు. ఎంతోమంది స్త్రీలు ఈ మతసూత్రాల ననుసరించి తాము కోరిన పరమ ప్రయోజనాన్ని (జన్మరాహిత్యం) సాధించినట్లుగా, ఉదాహరణలు ఉన్నాయి.

బౌద్ధధర్మం కుటుంబములోని స్త్రీ పురుషులను సన్యాసం స్వీకరించవలసినదని శాసించలేదు. సన్యాసాన్ని హృదయ పూర్వకముగా ఆహ్వానించి నప్పటికీ, గృహస్థాశ్రమాన్ని కూడా సమ్మానించింది. బుద్ధ భగవానుని ధర్మసిద్ధాంతాలలో గృహస్థాశ్రమావాసినుల ప్రయోజనార్థము వ్రాయబడిన ధర్మోపదేశాలు అనేకం ఉన్నాయి.


"ఓ గృహిణులారా! మీ రాత్మీయ నికేతనములను శుభోజ్వల ప్రకాశముచే ప్రదీప్తములు కావించుడు. గృహములను చతుర్దిక్కులనుండి మంగళ పరంపరలచే సురక్షితములు గావించుడు. సత్యశూన్యములైన బాహ్యకర్మ కలాపములచే మీ సదనము లెంత మాత్రము రక్షింపబడజాలవని గుర్తెరుగుడు" అని బౌద్ధం ప్రబోధిస్తున్నది. బౌద్ధ సంఘములో భిక్షుణులుగా చేరటానికి స్త్రీలందరికీ అధికారము ఉన్నది. వివాహితలూ అవివాహితలూ చేరవచ్చు. సంతానవతులు, నిస్సంతులు, వితంతువులూ పతితురాండ్రూ చేరవచ్చు. పతితలను నిరసించటమూ, బహిష్కరించటమూ బుద్ధుని మతముకాదు. వారిని ఆదరించి, సానుభూతి చూపి, వారిలోవున్న కల్మశాన్ని క్షాళితము చేసి, ఆత్మసంస్కారము కలిగించటమే ఆ ధర్మం తలపెట్టిన పరమ ప్రయోజనం. ఈ దృష్టితోనే బుద్ధభగవానుడు ఆమ్రపాలి అను గణిక ఆతిథ్యాన్ని స్వీకరించ గలిగాడు; బౌద్ధ సంఘానికై ఆమె దానము చేసిన మామిడితోటను గ్రహించగలిగాడు. విద్యార్థులలో కూడా స్త్రీ పురుష భేదము లేదు. విద్య, బౌద్ధమత, సిద్ధాంతాలూ వారికి సమానముగా బోధింపబడేవి. బౌద్ధసంఘములో స్త్రీ పురుషులను సమానముగా పరిగణించి, హిందూమతములో కంటే స్త్రీల ప్రతిపత్తిని అభివృద్ధి పరచినప్పటికీ, స్త్రీ పురుషుల సమాన ప్రతిపత్తికి కొన్ని ఆటంకాలు కలిగేవి. దానికి స్త్రీల శరీరదౌర్భల్యమే కొంతవరకు కారణమని ఊహించబడ్డది. బౌద్ధమతములో చేరిన గృహిణులను ఉపాసికలనీ, సన్యాసినులను భిక్షుణిలనీ వ్యవహరిస్తారు. వారందరూ విధిగా పంచశీలము లాచరించవలసినదే. నైష్టికులు అష్టశీలము లాచరించవలసి ఉంటుంది. గృహస్థులు భిక్షువులు కాబోవునప్పుడు శరణత్రయాన్ని (బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, దీనిని బౌద్ధరత్నత్రయమని కూడా అంటారు) పొందవలసి ఉంటుంది. భిక్షువులు భవబంధనాల నన్నిటిని విడనాడవలసి ఉంటుంది. అలంకారలను కోరరాదు. శరీరము కప్పుకోవటానికే కాషాయాంబరాన్ని ధరించాలి. కేవలము శరీరాన్ని నిలుపుకోవటానికే భుజించాలి. తృష్ణను విసర్జించాలి. అకాలములో భిక్షకుపోరాదు. పరుల కథలు ఇతరులతో ప్రస్తావించరాదు. సర్వదా జీవకారుణ్యము కలిగి ఉండాలి. బ్రహ్మచర్య దీక్ష నవలంబించాలి. దశశీలము లాచరించాలి. ఆహార నియమాలను పాటించాలి. స్త్రీలను బౌద్ధంలో భిక్షుణిలుగా చేర్చుకోవటానికి మొదట గౌతమ బుద్ధుడు అంగీకరించలేదు. 'ఎవరి కర్మకు వారే బాధ్యులు. ఎవరి మోక్షానికి వారే యత్నించాలి' అన్న ప్రాథమిక సూత్రాన్ననుసరించి తప్పనిసరిగా స్త్రీలను చేర్చుకొనవలసి వచ్చినది.

భిక్కుణిలుగా స్వీకారము చేసిన స్త్రీలలో మహా ప్రజాపతి గౌతమి ప్రథమురాలు. ఈమె సుభూతుని పుత్రిక. సిద్దార్థుని కన్నతల్లి మాయాదేవికీమె సోదరి; సపత్ని. మాతృ విహీనుడయిన సిద్దార్థుని కన్నబిడ్డ వలె పెంచినది. మాయాదేవి మరణానంతరము ఈమె పట్టపురాణి అయినది. ఈమెకు నందుడను కుమారుడూ, సుందరీనంద అను కుమార్తె కలిగారు. వారినిద్దరినీ దాదులకు ఒప్పగించి సిద్దార్థుని పెంచినది. గౌతముడు బుద్ధుడయిన తరువాత, సవతి తమ్ముడయిన నందుడినీ, పుత్రుడయిన రాహులుడినీ భిక్షు సంఘంలో చేర్చుకొన్నాడు. శుద్ధోదనుడి మరణానంతరం దేశములో అరాచకం ప్రబలింది. పొరుగు రాజ్యముతో యుద్ధము ప్రారంభమయినది. ఆ కల్లోలపరిస్థితులలో మరణించిన వీరుల భార్యలతో, గౌతమి బౌద్ధధర్మ దీక్షను స్వీకరించవలెనని బయలు దేరింది. బుద్ధుడపుడు వైశాలీ నగరములో ఉన్నాడు. స్త్రీలను చేర్చుకోవటాని కాతడు అంత సుముఖుడుగా లేడని గ్రహించిన ఈ స్త్రీలు, కాషాయవస్త్రాలను ధరించి, శిరోజాలను కత్తిరించుకొని, బుద్ధుని అనుమతికై వైశాలీ నగరానికి చేరుకున్నారు. బుద్ధుడు వారి దీక్షను గమనించి, నిరాకరించలేక పోయినాడు. గౌతమీదేవి బుద్ధుని వద్దనే ఉండి ఉపదేశముపొంది తన ప్రయోజనాన్ని సాధించుకొన్నది. ఆమె 120 సంవత్సరాలు జీవించింది. వయస్సులోనే కాక, అనుభవములో కూడా ఆమె అందరి కంటె వృద్ధురాలని బుద్ధునిచే స్వయంగా ప్రశంసల నందుకొన్న పుణ్యవతి. క్షేమ ఒక రాజకుటుంబములో పుట్టినది. బంగారు వంటి దేహచ్ఛాయతో మెరుపుతీగవలె ఉన్న ఈమెను బింబిసార మహారాజు వివాహము చేసుకొన్నాడు. ఈమె సౌందర్య గర్విత,

పట్టపురాణిగా ఈమె రాజాంతఃపురములో నివసించింది. బౌద్ధ సంఘానికి కానుకగా మహారాజు సమర్పించిన వేణువనములో ఆ సమయాన బుద్ధుడు నివాసమేర్పరుచుకొన్నాడు. శరీర సౌందర్య పోషణను ఆయన విమర్శించగలడని బుద్ధుని సందర్శనానికి ఆమె భయపడేది. బింబిసారుడు బౌద్ధాభిమాని. తన దేవేరి బుద్ధుని సందర్శించి ఉపదేశము పొందక పోవటముచేత ఆయనకు మనసులో బాధ కలిగింది. వేణువన సౌందర్యాన్ని పరిచారికలచే ఆమె ఎదుట ప్రశంసింప చేసినాడు. పట్టపుదేవికి వెంటనే వనప్రవేశము చేయాలని కుతూహలము కలిగి, మహారాజు అనుమతినర్థించింది. వనముతోపాటు అక్కడ నివాసమేర్పరచుకొన్న మహాత్మునికూడ సందర్శించి రమ్మని మహారాజు షరతుపెట్టాడు. ఇష్టములేక పోయినప్పటికీ, ఆమెను బుద్ధుని సాన్నిధ్యానికి తీసుకొని పోవలసినదని పరిచారకులకాజ్ఞయిచ్చాడు.

క్షేమ ఆ వనములో దినమంతా గడపిన తరువాత, పరిచారకులు బలవంతము చేయగా, బుద్ధుని సన్నిధికి చేరవలసి వచ్చినది. ఈమె సంగతి గ్రహించిన బుద్ధుడు, క్షేమ తనను చేరుకొనే సమయానికి తనకు తాటియాకు విసనకర్రతో విసరు ఒక చక్కని యువతిని సృష్టించాడు. ఆమె సౌందర్యము క్షేమ సౌందర్యాన్ని మించినది. అంతటి సౌందర్యవతికి తాను దాసిగా ఉండటానికయినా తగనని గ్రహించి, తన సౌందర్య గర్వానికి క్షేమ విచారించింది. ఆ సౌందర్యమూర్తి నామె ఆశ్చర్యముతో పరికించుతుండగానే, ఆ మూర్తి యౌవనము దాటి వృద్ధురాలై తుదకు ఆ వీవనతోనే నేల కూలిపోతుంది. పూర్వజన్మ సుకృతముచేత కలిగిన జ్ఞానమువల్ల, క్షేమ ఆలోచనలో పడిపోతుంది.

అంతలో బుద్ధుడు ఈ భావముగల శ్లోకాన్ని చదివాడు: 'సాలీడు తన గూటిలో తానే చిక్కుకొన్నట్లు మమకారము కలవారు ఈ జన్మ పరంపర ప్రవాహములోనే పాతుకొని పాతారు. తృష్ణ లేనివారు ఈ బాధలనుండి విముక్తి నొంది, భవబంధాలను తెంచుకోగలరు.' ఇది విన్న తరువాత ఆమె భిక్షుణి కావటానికి భర్త అనుమతి కోరింది. మహారాజు సంతోషముతో అనుమతించాడు. తరువాత ఆమె శాస్త్రములలో ప్రావీణ్యము గడించుకొన్నది. బుద్ధుడు భిక్షుణులలో ఆమెకు ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు. ప్రసేనజిత్తను రాజు ఆమె పాండిత్యాన్ని గురించి విని, తత్త్వశాస్త్రము చర్చించటానికి ఆమెను దర్శించి సమాధానాలను బడిసినాడు. పటాచారా, బద్ధకుండలకేశ, సుబద్ధ, ఆమ్రపాలీ బుద్ధుని కాలపు భిక్షుణిలలో



బుద్ధుడు సృష్టించిన యువతి

ఎన్నదగినవారు. సిద్ధార్థుని భార్య యశోధర కూడా ధర్మ స్వీకారము చేసినది. బుద్ధుని తరువాత అనేకమంది భిక్షుణులు ధర్మ స్వీకారముచేసి బౌద్ధ ధర్మ వ్యాప్తికి కారకురాండ్రయినారు. సంఘమిత్ర ఇతర దేశాలకు వెళ్ళి ప్రచారముచేసి ప్రఖ్యాతిగన్నది. బుద్ధభగవానుడి కాలపు స్త్రీల ప్రశంస వచ్చినపుడు సుజాత ప్రస్తావన ముందుగా జరుగవలసినది.

సిద్ధార్థుడు ఆనంద పథాన్ని గురించి విచారించు కాలములో ఒకనాడు ఆయన నిమీలిత నేత్రాలతో ధ్యానము చేస్తూండగా, సుజాత చూడటము తటస్థించింది. ఆ దివ్యపురుషుని సందర్శనార్థము ఆమె పతిని వెంటతీసుకొని, ఒక సువర్ణ పాత్రలో క్షీరాన్నము పోసి సిద్ధార్థుని ఎదుట ఉంచి వందన మాచరించింది. ఆ క్షీరాన్నము గ్రోలిన తరువాత ఆమె సత్కర్మల చర్చకు పూనుకొన్నది. ఆమె వాగ్ధరి ఆయనను విస్మయపరచినది. ఆమెతో చర్చించిన తరువాత తన జిజ్ఞాసలో నిర్దిష్టమయిన మార్పు కలిగినదని ఆయన గ్రహించగలిగాడు.

"శాశ్వతానంద పథము నన్వేషించుట యందు విజేతలగు వారలే నిర్వాణమును బడయుట కర్హులు. ఆనందమునకు యథార్థమయిన మార్గము నన్వేషించి నీ వనతి కాలంబునందునే జీవన్ముక్తిని బడయగలిగినావని" ఆమెను బుద్ధుడు ప్రశంసించాడు. బుద్ధుని దృష్టిలో స్త్రీ పురుషుని కామమునకు దాసికాదు. తన సత్సాంగత్య సౌభాగ్యముచే పురుషుని వశముచేసుకొని, అతడి హృదయమునకు ఏలికయై పరిపాలన చేయగలది.

# పునర్భవం

– *వల్లభనేని అశ్వినీకుమార్*

పునర్భవం – పునర్జన్మ ఒకటేనా? ఈ విషయం చర్చించాలంటే మనం ముందుగా పరిశీలించవలసిన కొన్ని అభిప్రాయాలు, పదప్రయోగాలు – తెలుసుకో ప్రయత్నం చేయాలి.

ముఖ్యంగా మొదటిది – ఈ జీవితానికి మూలమెక్కడ అనే ప్రశ్న ఉదయించక మానదు.

"ఈ జీవనయానానికి ఆది తెలియదు. తృష్ణా బద్ధులై అవిద్యలో కూరుకుపోయిన ఈ జీవుల పయనానికి ఆరంభ బిందువు తెలియదు." ఇదీ సంయుత్త నికాయలో బుద్ధుడు శిష్యులతో అంటున్నది.

అంటే ఆరంభబిందువు గతం కదా, అది స్మృతి వలన తెలియవలసినదే. వర్తమానానికి రుజువు, అంటే వర్తమాన వాస్తవికతకు రుజువు అవసరం లేదు. దానికదే ప్రమాణం.

అలాగే భవిష్యత్తు, భావి, ఊహ మీద లేక అనుమానం, అదృష్టం మీద ఆధారపడవలసిందే!

అంటే వర్తమానం గతానికి భావి అని, అదే వర్తమానం భావికి మాతృక లేక గతమనీ అనుకోవచ్చు.



ఇప్పుడు గతం, వర్తమానం, భావి జీవితం ఉందని మనం అంగీకరిస్తే, మనం ఇప్పుడున్న స్థితి "అసలు ఈ జీవితానికి ఆరంభం ఎక్కడ?" అనే ప్రశ్న, అందుకు సమాధానం వెంటనే వెదకాలి కదా!

ఈ జీవితానికి మూలం:

ఇప్పుడు అసలు చర్చ మొదలవుతుంది.

పై ప్రశ్నకు ఒక ధర్మం వారు అందుకు సమాధానంగా ఒక "ప్రథమ కారణాన్ని" ప్రతిపాదిస్తారు. అది విశ్వశక్తి, ఒక మహాశక్తి అయిన 'దేవుడు' అని అంటారు. మరోధర్మం వారు ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తారు. వారి వాదన అనుభవంలో కారణం ఎప్పుడూ క్రియ అవుతూనే వుంటుంది కదా, అలాగే క్రియ కారణమవుతుంది. ఇటువంటి కార్యకారణ శృంఖలంలో ప్రథమ కారణం (శక్తి) ఎక్కడ ఉంటుంది? మొదటి ప్రతిపాదన ప్రకారం జీవితానికి ఒక ఆరంభం వుంటే రెండవ వాదన ప్రకారం జీవితానికి ఆది, మొదలు అంటూ వుండటానికి అవకాశం లేదుకదా? గుండ్రని త్రిభుజం వుంటుందా?

ఇక్కడే ఒక్కవిషయం గమనిద్దాం – జీవితం ఎప్పుడో ఎక్కడో అనంతకాలంలో ప్రారంభమైందనీ, దానికి బ్రహ్మ లేక సృష్టికర్తే ప్రారంభకుడు అని చాలా ప్రచారంలో వున్న విశ్వాసం కదా – మరి ఇదే నిజమైతే అది ఆ సృష్టికర్తకూ అన్వయించాలి కదా? అతనికి మొదలేది?

ఈ ప్రథమ కారణాన్ని మరింత లోతుగా చూస్తే పరమాత్మగా, బ్రహ్మగా, ఈశ్వరునిగా, యహోవాగా, అల్లాగా, పరమపురుషునిగా, స్వర్గంలోని తండ్రిగా, ప్రారంభ బాలకునిగా, కారణరహిత కారణంగా, ఆదిమధ్యాంత రహితునిగా, దివ్యశక్తిగా, అదృష్టంగా, ప్రకృతిగా, వికృతిగా ఇలాంటి పదాలతో దార్శనికులు – మతవిశ్వాసాలు ఘోషిస్తున్నాయి. వీటిని ప్రమాణాలు చూపలేనివాటిగానే భావించాలి. ఎందుకంటే విశ్వాసానికి ప్రమాణం అవసరం లేదు.

హిందూమతం ప్రకారం అది పరమాత్మ. పరమాత్మ నుంచే ఆత్మ వస్తుంది. ఈ ఆత్మ ఒక శరీరం నుంచి మరో శరీరానికి వలస పోతుంది. అలా కర్మ సంచయాన్ని మోసుకుంటూ చివరకు పరమాత్మలో లీనమవుతుంది. ఇలా పరమాత్మలో కలిసిన ఆత్మ మళ్లీ వలస పయనం ప్రారంభించే అవకాశం, అవసరం ఏర్పడుతుందా లేదా అన్న ప్రశ్నకు సమాధానం వెతకాలి.

ఆత్మ నిప్పు వలన కాలదు, నీటి వలన తడవదు, వాయువు వలన ఆరదు. ఇంకా శస్త్రం వలన నాశనం కాదు– అని ఉద్ఘాటించిన ఆ పరమాత్మ ఈ ఆత్మ ఒక శరీరం నుంచి మరో అస్తిత్వానికి వలసపోయేటప్పుడు ఈ జన్మ కర్మ సంచయాన్ని, పాపపుణ్యాలను ఎలా మోసుకుపోతుంది? పోనీ ఏమీ అంటని ఈ ఆత్మకు ఈ గతానుభవం – గతస్మృతి లేకపోతే భావిలో పరమాత్మలో ఎలా లీనమైపోతుంది? ఈ లెక్క తేలేది ఎప్పుడు– ఎక్కడ? ఈ చిట్టా ఎవరు సరిచేస్తుంటారు?

ఇక పారమార్థిక ప్రారంభం ఉందని అంటూనే ప్రతిదానికీ దేవుని ఆజ్ఞయే అంటుంది మరోనమ్మకం. ఈ దేవునికి ఆది ఖచ్చితంగా నిర్ణయించిన అదే విశ్వాసం, ఆ ఆది ఎవరు నిర్ణయించారో చెప్పలేదు? మీరు అడగరాదు.

అసలు ఈ చర్చమీద కొందరు మేధావుల అభిప్రాయం కూడా విందాం.

షోపన్ హూవర్ "శూన్యం నుంచి వచ్చానని అనుకుంటే మళ్లీ శూన్యం అవుతాననే అనుకోవాలి. ఏమంటే, తాను లేకముందు ఒక అనంత కాలం గడిచింది. తరువాత మరో అనంతకాలం ఆరంభమైంది. ఈ అనంతకాలంలో తాను మరణించననే ఆలోచనే అసంబద్ధం. జననం కనక వాస్తవమైతే మరణం కూడా వాస్తవం కావాలి. శూన్యం నుంచి వచ్చామనే ఆలోచన, అస్తిత్వాంతం లేక మరణం అనే భావనకే దారితీస్తుంది." ఇది హేతువుతో నిరూపణకు నిలవకపోయినా ఆలోచనకు అందేదే. స్పెన్సర్ లూయిస్ వాదన "ఇప్పటి భౌతిక సూత్రాల ప్రకారం 'మనిషి' అతని ఇష్టాయిష్టాలతో పనిలేకుండా ఈ భూమిమీద పడ్డాడు. పుట్టినప్పటి నుంచీ గిట్టేవరకు అతని వాంఛలు ఆశంసలు, పెనుగులాటల ప్రార్థనలు, వేదనలతో నిమిత్తం లేకుండా అతడు మంచివాడో, చెడ్డవాడో అదృష్టవంతుడో, దౌర్జన్యుడో అని నిర్ణయమైంది" ఇది దైవాధీన వాదము. ఇంకా, "మానవులంతా పాపులం. అందరిలోనూ ఆడమ్ చేసిన పాపం మౌలికంగా సాగుతున్నది" ఇది మీరు అంగీకరిస్తారా?

హాక్స్‌లీ అంటాడు "ఈ విశ్వాన్ని ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా నడుపుతున్నాడని మనం అంగీకరిస్తే అతడు ఏ మాత్రం హితైషి, ధర్మాత్ముడు కాడని అనుకుంటాను."

ఇక ఐన్‌స్టీన్ "ఈ దేవుడే సర్వశక్తివంతుడైతే ప్రతి సంఘటన, ప్రతి మానవచర్య, ఆలోచన, అనుభూతి అన్నీ శక్తివంతుని పనే అయివుండాలి. మరి ఇందులో మన ప్రమేయం ఏముంటుంది? మన చేతలకు మన బాధ్యత కూడా వుండదు కదా? ఫలితాలివ్వటంలో, శిక్షించటంలో కొంతవరకు తనమీద తానే తీర్పు చెప్పుకుంటున్నాడనుకోవాలి. మరి ఆయన దయ, ధర్మపాలనను దీనితో ఎలా కలిపి చూడటం?"

చార్లెస్ బ్రాడ్ లాఫ్ ఏమంటాడు "దేవుడు సర్వశక్తి సంపన్నుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞాని అని వాదించేవారికి బాధ,



దుఃఖం, నేరం, హింస, ముఖ్యంగా పేదరికం ఇవన్నీ సమాధానం లేని సవాళ్లు."

**ఆత్మ :**

జె.బి.ఎస్. హల్డేన్ –" రెండు విషయాలు చూద్దాం. ఒకటి మానవుని శీలం సంపూర్ణం కావాలంటే దుఃఖం ఉండాలి. కర్మ అనుభవించాలి, అలా కాకపోతే ఆ దేవుడు సర్వశక్తివంతుడు కాదన్నమాట.

రెండోది: కొంతమంది మంచి వంశంలో పుట్టడంతో, విద్యావంతులవడం వల్ల వారు చాల తక్కువ కష్టాలు పడవచ్చు. అంటే దేవుడు సర్వశక్తి సంపన్నుడు కానపుడే ఇది జరుగుతుంది.

విశ్వాన్ని ఏకంగా చూసినపుడు బౌద్ధికంగా ఏర్పడే ఖాళీని నింపడానికి దేవుణ్ణి ప్రతిపాదించే ఆలోచనే అసందర్భం, అలా కాకపోతే మరి సృష్టికర్త తనకు కావలసింది సృష్టించగలడని అనుకోవచ్చా?"

లార్డ్ టెనిసన్ తన వృద్ధాప్యంలో రాసిన నిస్పృహలో ఏమిటి? అంతగా మనం సేవించిన ప్రేమమూర్తికి మన వినతి కావాలా?

"నిజం చెప్పాలంటే, నిరంతరం నరకాన్ని సృష్టించిన ఆ నిర్దాక్షిణ్యమేగా మనలను పుట్టించింది. ముందుగా మనలను తయారు చేసి – అభిశంసించి మళ్లీ తనకు కావలసిందేదో చేసుకుంటోంది! అంతకంటే, ఎప్పుడూ మన మూల్గులు వినని మరణించిన మనమాతృమూర్తే నయం..."

**బుద్ధుని దర్శనం :**

ఇదే విషయం ఈ సృష్టి అంతా బ్రహ్మ లేక ఒక సర్వశక్తి సంపన్నుని కార్యమనే విషయాన్ని బుద్ధుడెలా దర్శించాడు?

బుద్ధుడు ఎప్పుడూ కూడా ఒక లోకాతీత పరమాత్మను మనిషిపైన నిలబెట్టలేదు.

"ఏ రకమైన సుఖమూ బాధ తటస్థ అనుభూతులు ఈ మనిషి అనుభవించినా అవన్నీగూడా పరమ దేవుని సృష్టే. అయితే

సృష్టికర్త మనలను ఎలా చేశాడో అదే మనం. అప్పుడు అతని సృష్టికి ఉందనుకున్న స్వేచ్ఛా సంకల్పం అబద్ధమే కదా..." అలాగే పరమ దేవుని సృష్టి కారణంగానే మనుషులు, హంతకులు, దొంగలు, వదరబోతులు, తిరుగుబోతులు, దుర్మార్గులు తయారు అయ్యారనుకోవాలి, దైవసృష్టి కారణంగానే జీవులు బాధ–సుఖాలు అనుభవిస్తున్నట్లయితే అప్పుడు వీరిని ఒక క్రూర దైవం సృష్టించిందని భావించాలి. బోధిసత్త్వుడు సృష్టికర్త దివ్యన్యాయాన్ని ఇలా ప్రశ్నిస్తాడు: "కన్నులున్న వాడెవడైనా జుగుప్సాకర దృశ్యాలు కూడా చూడగలడు. మరి బ్రహ్మ తన సృష్టిని ఎందుకు సరిగా చూడడు? ఈ జీవులన్నీ బాధలకు ఎందుకు గురవుతున్నాయి?

ఎందుకు అనృతం జయిస్తుంటుంది? న్యాయం ఓడిపోతుంటుంది? అతడు అధర్మాశ్రయ ప్రపంచాన్ని ఎందుకు నిర్మించాడు? దేవుడు అన్నిటికీ మూలమని భావించేవారికి, ఈ పనిచెయ్యాలి – ఇది అవసరం లేదు అవి ఆలోచించే ఆవశ్యకత లేదు."

ఈ మేధావుల చింతన అంతా మానవుని వేదన గురించే.

సనాతన, సూత్రకారులు దేవుడు తన ప్రతిమకు అనుగుణంగా మనిషిని సృష్టించాడని సాధికారికంగా ప్రకటించారు.

దీనికి భిన్నంగా ఆధునిక చింతనాపరులు మనిషే దేవుణ్ణి తన రూపంలో ప్రతిష్ఠించాడని ప్రతిపాదించారు.

నాగరకతా వికాసంతో, సమాచార సంబంధాలతో దేవుని భావన నిగ్గు తేలుతూ వచ్చింది. ఆధునిక యుగంలో విగ్రహదేవుని స్థానంలో రూపాతీత శక్తిని ప్రతిష్ఠించాలనే ప్రవృత్తి పెంపొందింది. ఇది దైవభావనకు ఒక పార్శ్వం.

వాల్టేరు ''మానవుడు ఎన్నో సృష్టించాడు. అందులో మహోన్నతమైనది 'దేవుడు' " అంటాడు.

స్టీఫెన్ హాకింగ్ "ఈ విశ్వానికి వెలుపల గాని లోపల గాని సర్వశక్తి, సర్వవ్యాపకుని గుర్తించే అవకాశం లేదు" అని పోప్ ముందే ఖచ్చితంగా చెప్పగలిగాడు.

విజ్ఞానశాస్త్రం ప్రకారం మనం పూర్తిగా తల్లిదండ్రుల నుంచే వచ్చాం. అంటే మనకు ముందు మన తల్లిదండ్రులు వున్నారు. వారికి వారి తలిదండ్రులు, వారికి వారి తల్లీతండ్రీ ఇలా జీవానికి ముందు జీవంగొలుసు మొదటి జీవపదార్థం (ప్రోటో ప్లాజం) వరకూ వెళ్లి ఆగిపోతుంది. ఎందుకంటే ఆ జీవపదార్థం ఎక్కడ నుంచి వచ్చిందనే ప్రశ్నకు శాస్త్రవేత్తల చెంత సమాధానం లేదు.

ఇప్పుడు అసలు విషయానికి వద్దాం.

ఈ జీవారంభం గురించి బుద్ధుడేమంటాడు?

ముందుగా ఒక విషయం మనవి చేయాలి. 'బుద్ధుడు ఎప్పుడూ మానవాళిని వేధించిన తాత్త్విక, నైతిక సందేహాలను పరిష్కరించాలని ప్రయత్నించలేదు. ఆయనెప్పుడూ జ్ఞానాభివృద్ధికి దారితీయని ఊహాజనిత శుష్కసిద్ధాంతాలను చర్చించలేదు. ఏదో ఒక ప్రథమ కారణాన్ని ప్రతిపాదించి దాన్ని గుడ్డిగా నమ్మమనీ చెప్పలేదు. ఆయన జ్ఞానోదయ అనుభూతి పొంది ముక్కుమూసుకొని కూర్చోకుండా మానవాళి దుఃఖాన్ని ఒకే ఒక ఆచరణాత్మకమైన ప్రణాళిక ద్వారా ఆ దుఃఖ వినాశనానికి దారి చూపాడు. మిగతా ఊహాజనిత ప్రశ్నలను ప్రక్కనపెట్టాడు.

*ఈ సంఘటన చూడండి :*

పవిత్ర జీవితంతో క్రమక్రమంగా విముక్తిని సాధించే విధానంతో అసంతృప్తుడైన మాలుంక్యపుత్ర ఒకసారి అసహనంతో బుద్ధుని వద్దకువచ్చి తన సమస్యలకు వెంటనే సమాధానం చెప్పవలసిందిగా కోరి లేకపోతే చీవరాలు వదలివేస్తాను అని అన్నాడు.

"దేవా, ఈ ప్రపంచం శాశ్వతమా, సాంతమా, అనంతమా? మీరు నాకు సమాధానం చెప్పండి. లేదా నేను మళ్లీ కుటుంబినైపోతాను" అని భీష్మించాడు. "ఈ విషయాలు మీకు తెలుసా? తెలియదా? అది కూడా స్పష్టం చెయ్యండి" అనికూడా అన్నాడు.

"భిక్షు జీవితానికి అటువంటి ప్రశ్నలకు – సమాధానాలకు ఏమి సంబంధం?" అని ప్రశాంతంగా బుద్ధుడు ప్రశ్నించాడు.

"సంబంధం ఏమీ లేదు దేవా!" అన్నాడు భిక్షు. నైతిక ప్రగతికి ఏవిధంగానూ పనికిరాని అటువంటి విషయాల మీద కాలాన్ని వృథా చేస్తూ శ్రమకు లోనుకావొద్దని బుద్ధుడన్నాడు.

"నీ ప్రశ్నలకు సమాధానం లభించే వరకు భిక్షు జీవనం గడపనంటే ఆ ప్రశ్నలకు సమాధానం దొరికేదాకా జీవించి ఉండవు సుమా–

"ఇదెలావుందంటే విషపూరితమైన బాణం దిగబడిన ఒకని దగ్గరకు అతని బంధువులు ఒక వైద్యుని బాణాన్ని వెలికి తీయటానికి తీసుకు వచ్చారట. అతడేమో 'నా ఒంటిలో ఈ బాణం నాటిందెవరు? నాలో దిగబడిన ఈ బాణం స్వభావం ఏమిటి? ఈ విషప్రకృతి ఏమిటి'? ఇవన్నీ చెప్పేవరకు బాణం పెరకవద్దని అన్నాడట. కాని అవన్నీ తేలేవరకు అతడు జీవించి ఉంటాడా?"

"అలాగా ఉంది 'ప్రపంచం శాశ్వతమా, అనంతమా, అనే ప్రశ్నలకు సమాధానం వచ్చేవరకు భిక్షు జీవితం గడపనని మొండిగా ఉండడం.

ప్రపంచం శాశ్వతమని విశ్వసిస్తే పవిత్ర జీవితం పాటించడం ఉంటుందా? లేక కాదని అనుకుంటే అపుడో? ప్రపంచం శాశ్వతమైనా, అశాశ్వతమైనా జరామరణా లుంటాయి.

ఈ జీవితంలోనే వాటి ఉచ్ఛేదాన్ని తెలుపుతాను.

"మాలుంక్యపుత్రా, ప్రపంచం శాశ్వతమా కాదా, సాంతమా అనంతమో నేను ఎరుక పరచలేదు. అవి పవిత్ర జీవితానికి దారి తీయవు. అవి విరాగానికి లోభరాహిత్యానికి ఉచ్ఛేదానికి,

ప్రశాంతతకు, జ్ఞానోదయానికి లేదా నిర్వాణానికి తగినవికావు. అందుకని వాటి ప్రసక్తి తీసుకు రాలేదు."

బౌద్ధం ప్రకారం మనం కర్మమూలం నుంచి పుట్టాము. అదుగో మీరు కర్మ సిద్ధాంతంలోని పోకండి.

తల్లితండ్రులు అన్నమయ కోశాన్ని ఇస్తారు. కనుక జీవికి ముందు జీవి ఉంటుంది. గర్భధారణ సమయంలో పిండానికి ఊపిరిపోసేది ప్రథమ విజ్ఞానం (consciousness) దీన్ని నిబద్ధించేది 'కర్మ'యే. ఈ విధంగా పూర్వజన్మ నుంచి వచ్చిన అదృశ్య కర్మ శక్తి అంతకు ముందే వున్న అన్నమయ కోశంలో ప్రాణాన్నీ, మనస్సునీ జనింపచేస్తుంది. ఈవిధంగా జీవి తయారు కావడానికి అవసరమైన మూడు పదార్థాలు పూర్తి అవుతాయి.

ఈ అదృశ్య కర్మశక్తిని శాశ్వతాత్మగా అర్థం చేసుకోరాదు. పై మూడు పదార్థాలు ఒక ప్రత్యేక అదృశ్య కర్మశక్తి అనే గర్భంలో జన్మించడానికి సిద్ధంగా వున్న జీవిని సూచిస్తాయి. ఈ అదృశ్య కర్మశక్తి అనే పదాన్ని ఒకే ఒక ప్రత్యేక సందర్భంలో మాత్రమే వాడారు. అందుకని దానిని శాశ్వతాత్మగా అపార్థం చేసుకోకూడదు.

ఏ విధంగా, సాధారణ వ్యవహారంలో ఒకచోట సూర్యుడు ఉదయించాడనీ, మరోచోట అస్తమించాడనీ అంటామో ఆ విధంగా ఒక జీవి ఇక్కడ పుట్టాడంటే మరోచోట ఎక్కడో ఒక జీవి మరణించాలి. ఈ జన్మ ఆ మృత్యువుకు అనుసంధానం చెందుతుంటుంది. జన్మ అంటే స్కంధాల ప్రాదుర్భావం. అంటే నామరూపాల ఆవిర్భావం మాత్రమే.

జీవితాన్ని సరళరేఖగా కాక ఒక తరంగంగా అర్థం చేసుకుంటే ఈ చిక్కుముడి విడిపోతుంది.

జననమరణాలు ఒకే ప్రక్రియలో రెండు దశలు.

మరణానికి ముందు జననం వుంటుంది. అంతేకాక మరణం జననానికి ముందుంటుంది.

**సంసారం :**

జనన మరణాల నిరంతర అనుక్రమణనే సంసారం అన్నారు. అంటే మరల–మరల సాగేపయనం.

అయితే జీవితమూలం ఎక్కడ? బుద్ధుడు "ఈ సంసారానికి గుర్తింపదగిన ఆది అంటూ ఒకటి లేదు. అవిద్య అనే అంధకారంలో చిక్కుకుని, తృష్ణాబద్ధులై తిరుగాడే జీవుల మొదలు తెలియరానిది."

"సంసారం అంటే నిరంతర గమనం. సంసారమంటే తెంపులేని స్కంధాల మూలకాల ఇంద్రియ భూమికల ప్రవాహం."

అవిద్య–తృష్ణల మురికి నీటితో కూడినంతవరకు ఈ జీవిత ప్రవాహం ఆనంతంగా సాగుతూనే వుంటుంది. ఈ రెండింటిని పూర్తిగా తొలగించినపుడు మాత్రమే ఆ ప్రవాహం ఆగిపోతుంది. అర్హంతల పునర్భవం అంతమవుతుంది.

ఈ జీవశక్తి – అవిద్య తృష్ణలతో నిండని సందర్భం కనిపించదు కనుక ఈ జీవితానికి మూలాన్ని నిర్ణయించలేము.

ఇది బుద్ధుడు ప్రాణుల జీవిత ప్రవాహం గురించి మాత్రమే చెప్పాడని గుర్తించాలి. ఈ విశ్వం పుట్టుక, శాశ్వతత్వం శాస్త్రవేత్తలే పరిశోధించాలి.

పునర్భవం గురించి సాధికారంగా బుద్ధుడే చెప్పాడు. ఆయనకు జ్ఞానోదయం అయిన మొదటి రాత్రి మొదటి జాములో పూర్వజన్మల స్మరణ జ్ఞానాన్ని పెంపొందించు కున్నాడు. దర్శించగలిగాడు. అనేక భవాలను స్మృతిలోకి తెచ్చుకోగలిగాడు. రెండవ జాములో తన యోగదృష్టితో అనేక లోకాలలో జీవుల జనన హననాలను పరికించాడు. వాటి కర్మలను (చేసిన పనుల) అనుసరించి గతించి జన్మిస్తున్న జీవులను చూడగలిగాడు.

పునర్భవ సత్యాన్ని బుద్ధుడు అంతకు ముందున్న ఏ దర్శనాల నుంచి ఏ మూలాన్నుంచి గ్రహించలేదు. తాను పొందిన జ్ఞానంతోనే దర్శించాడని రుజువ్వవుతుంది.

బుద్ధుని ఉపదేశం మేరకు ఆయన శిష్యులు కూడ పూర్వజన్మ జ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. పరిమితంగానే అయినా తమ గతజన్మల స్మృతులను పొందగలిగారు.

బుద్ధునికి ముందుకూడ కొందరు ఋషులు దూరశ్రవణము – అతీంద్రియ దర్శన శక్తులు కలిగి భావప్రసారం, ఇంద్రియాతీత సంస్పర్శ లాంటి అసాధరణ ప్రక్రియలను చూపారు.

తన మొదటి జయధ్యానంలో బుద్ధుడంటాడు "ఈ గేహ నిర్మాతను అన్వేషిస్తూ నేను ఎన్నో జన్మల్లో తిరిగాను. మరల–మరల పుట్టడం ఎంతో దుఃఖదాయకం" ఆ తర్వాత ఆర్యసత్యం గూర్చి చెపుతూ బుద్ధడంటాడు "ఈ తృష్ణయే పునర్భవానికి దారితీస్తుంది. ఇది నా చివరి జన్మ. ఇంక నాకు పునర్భవం లేదు" అని ఆయన ముగిస్తాడు.

మనం తరచు ఎంతోమందిని చూస్తుంటాం. ఎప్పుడూ కలిసి వుండని వారిని ఎక్కడో ఎప్పుడో చూసినట్లు ఎప్పుడూ వెళ్ళని ప్రదేశానికి వెళ్ళినపుడు అక్కడకు ఎప్పుడో వచ్చిన స్మృతులు కలుగుతుంటాయి.

ఎప్పుడూ ఫిన్‌లాండ్ వెళ్లని నా మిత్రుని అనుభవం: ఆయన అక్కడి ఒక సరస్సు దగ్గరకు వెళ్లి ఆగిపోతాడు. ఆయన మిత్రుడు ఏమిటని అడిగితే ఉండండి అని ఆ ఎండిపోయిన సరస్సులో ఎంతోసేపు తిరిగి ఇది నాకు తెలిసిందే. ఇక్కడకు నేను వచ్చాను, అని అంటుంటే ఆయన మిత్రుడు ఆశ్చర్యపోయాడు. ఇలాంటి అనుభవం కొంతమందికి ఎదురవడం మనం వినేవుంటాం. కాని ఏ శాస్త్రవిజ్ఞానం దీనికి సమాధానం చెప్పలేదు. దీనికొక పేరు వ్రాసిపెట్టారు (వాల్టర్‌స్కాట్) ప్రాగస్తిత్వ జ్ఞానం అనవచ్చు. బుల్వర్ విటన్ ఈ మార్మిక అనుభూతులను "అవొక అపూర్వ అంతరంగ ఆధ్యాత్మిక స్మృతులు. వీటిని తీరని కోర్కెలు, గత జన్మ చేతనలుగా ప్లేటోవాదులు చెబుతారు."

బుద్ధునికి కూడా ఇటువంటి అనుభవం ఎదురయినట్లు 'ధమ్మపదం'లో చెప్పబడింది. వృద్ధులయిన భార్యాభర్తలు బుద్ధునిచూసి "ప్రియపుత్రా! ముసలివారైన తలిదండ్రులను చూసుకోవలసిన బాధ్యత లేదా? ఇంతకాలం మాకు ఎందుకు కనిపించలేదు?" అని వాపోతారు.

బుద్ధుడు ఈ పొంగిన ప్రేమకు, వీరు గతజన్మలో తనకు తండ్రులు కావటమేనని చెప్పి గత సంసర్గం – ప్రస్తుత పరిస్థితుల ప్రభావంతో ఉద్వేగం నీటిలో పద్మంలా ఎగసి వస్తుంది" అంటాడు. బుద్ధునివంటి పరిపూర్ణ పురుషులు ఆకస్మికంగా అలా ఆవిర్భవించగలరా?

వారు ఒకే జన్మ, ఒక అస్తిత్వంలో పరిపూర్ణులు కాగలరా? గత జన్మల అనుభవాలను పొందగలగడం కేవలం యాదృచ్ఛికం, అదృష్టం కాగలదా?

బాలమేధావులు శాస్త్రవేత్తలకు కొత్త చిక్కులే తెచ్చారు. వారి మేధోశక్తికి గ్రంథులే కారణమయితే అవి అందరిలో ఎందుకు లేవు? అవి పైతృకమైతే మరి అందరి బిడ్డలకు ఎందుకు అటువంటి లక్షణాలు రావు? ఇది కూడా చిక్కుముడే. పునర్భవానికి అనువంశిక లక్షణాలను అనుసంధానం చేస్తే ఈ ముడి వీడిపోవచ్చు.

సుఖదుఃఖాలనే రెండు స్థిరత్వాలమధ్య ప్రస్తుత జీవితకాలం ఒక్కటేనా అస్తిత్వం? ఇంకా ఏమయినా అన్యతలున్నాయి?

ఇక్కడ ప్రస్తుతం మనం గడిపేకాలం 80–90 సంవత్సరాల కాలం శాశ్వతత్వానికీ, నిర్వాణానికీ సంసిద్ధం అయ్యేందుకు ఎలా సరిపోతుంది?

మనం వర్తమానాన్నీ, భవిష్యత్తునూ నమ్మితే మరి గతాన్ని తప్పక నమ్మాలి.

మనం గతంలో ఉన్నామని నమ్మితే ప్రస్తుత జీవితం గతించిన తర్వాత ఈ జీవితం కొనసాగింపునూ కూడా నమ్మాలి కదా.

"ఈ ప్రపంచంలో మంచివాళ్లకు దురదృష్టం ఎదురవుతుంది. చెడ్డవాళ్లు సుఖసంతోషాలు, సంపదలతో అనుభవిస్తుంటారు" అని ఎడిసన్ అన్నాడు. దీనికి ఏ హేతువు సమాధానం చెప్తుంది? ఇది పూర్వ, భావి జన్మలనే సమర్థిస్తున్నది.

దుర్యోధనుడు చెడ్డవాడనీ, దుర్మార్గుడనీ, స్వార్థపరుడనీ కదా, మనం భారతంలో చదువుకున్నది. అంతటివాడు సర్వసుఖాలు అనుభవించాడు. రారాజుగా సింహాసనం అలంకరించాడు. సర్వాధికారాలు చెలాయించాడు. స్నేహితులకు సహాయ సహకారాలు అందించాడు (తనను నమ్మిన వారికి సంపదలిచ్చాడు). రాజ్యాన్ని నిలుపుకోవడానికే యుద్ధం చేశాడు. క్షత్రియుడిలాగానే వీర మరణంతో వీర స్వర్గం పొందాడు.

మరి ధర్మరాజు అన్ని ధర్మాలు తెలిసినవాడు, ధర్మానికి మారు రూపం. జూదం ఆడాడు. తమ్ములను, భార్యను పణంగాపెట్టి దారుణంగా ఓడిపోయాడు. అవమానాల పాలుచేశాడు. తమ్ముడు గెలిచి తెచ్చిన కన్యను పెళ్లి చేసుకోవడానికి వెనకాడలేదు. తనను నమ్మిన వారిని అష్టకష్టాలు పెట్టాడు. అడవుల పాలు చేశాడు. అడ్డమైనచోట ఊడిగం చేశాడు, చేయించాడు. గతిలేక యుద్ధం చేశాడు. అదీ అడుగడుగునా అధర్మయుద్ధమే. చివరకు అబద్ధం కూడా చెప్పాడు. వీరమరణం కూడా దక్కకుండా నడుచుకుంటూ స్వర్గారోహణ చేశాడు. అదీ కథ. ఏ విధంగా ఈ సంఘటనలను వివరించాలి? ఇది గతజన్మలోని చెడుకర్మ ఫలితమేనా?

మనం తయారు చేసుకున్న స్థితిలోనే మనం పుడతాం! ఇప్పుడు మనం మంచిగా వున్నా దురదృష్ట జీవితాన్ని గడపవలసివస్తే అది గతజన్మలోని చెడుకర్మ అనుకోవాలి.

ప్రకృతి, మంచి–చెడు పనులు మొదటి అవకాశంలోనే వాటి ప్రభావాన్ని చూపుతాయి. మనం గతజన్మలను నమ్మినా, నమ్మకపోయినా దైనందిన జీవిత అనుభవాల జ్ఞానంలో మనకు ఎదురైన ఖాళీలను వివరించటానికి అదొక్కటే న్యాయమైన భూమిక అనుకోవాలి.

కవలల మధ్య తేడాలు ఎందుకు ఉంటున్నాయి?

షేక్స్పియర్ లాంటివారు తన పాత్రలవాస్తవ జ్ఞానం ఏ మాత్రం లేకపోయినా తన పరిమిత అనుభవంతోనే అంత అద్భుతమైన సన్నివేశాలను ఎలా చిత్రించగలిగాడు?

ఒక మేధావి తన అనుభవం దాటి ఆవలకు ఎలా వెళ్లగలగుతున్నాడు? ఒక రచయిత పూర్వ రచయితల (వారి రచనల విషయంలో) ఆలోచనలను ఎలా అందుకోగలుగు తున్నాడు.

అంటే మన కర్మలు, జన్మలు ఎక్కడో కాస్మిక్ స్పేస్‌లో విశ్వాంతరాళపు నిశ్శబ్దంలో నిక్షిప్తమై ప్రసారమవుతుంటాయి. అవి మాత్రమే వివరించగలుగుతాయి.

**కర్మ, పునర్భవాలు:**

అవి దుఃఖ సమస్యలు వివరిస్తాయి. మనమే బాధ్యులమని తెలుపుతాయి.

మనుష్యుల తారతమ్యాన్ని అసమానతలను తెలుపుతాయి.

అద్భుతశక్తిమంతులైన బాలమేధావుల పుట్టుక కారణాలు తెలుపుతాయి.

కొంతమందిలో వుండే అంతస్సిద్ధి సామర్థ్యాలకు కారణాలను అవి తెలియజేస్తాయి.

ప్రథమ వీక్షణంలోనే కలిగే యిష్టాయిష్టాలను ఎరుకపరుస్తాయి.

మనలోని చెడ్డతనం చెత్తకుప్పలు, మంచితనం బంగారు రాశులు ఎలావున్నాయో తెలుపుతాయి.

ఇప్పటి మనం, గతంలోని మనకు వారసులం.

అలాగే రేపటి మనం ఇప్పటి మనకు వారసులం.

కాని ఒక్కోసారి ఇది పూర్తిగా కాదు కూడా. ఇలా ఎందుకు జరుగుతుందో కర్మ, పునర్భవం తెలుపుతాయి.

అకాలమరణాన్ని అనూహ్యమైన పరివర్తనలు తెలుపుతాయి.

అనుపమానమైన దైహిక, మానసిక లక్షణాలున్న బుద్ధునిలాంటి సంపూర్ణులు గాంధీలాంటి మహాత్ములు ఎన్.టి.ఆర్. లాంటి కారణజన్ములు రమణమహర్షి, సాయిబాబా లాంటి హేతువుకు అందని పుణ్యాత్ముల జన్మలను కూడా వివరిస్తాయి.

**భవచక్రం :**

'ఈ భవచక్రానికి ఏ బ్రహ్మపదార్థం లేదు. అన్ని ప్రత్యయాల ఆధారం కేవలం దృగ్విషయం మాత్రమే పరిభ్రమిస్తుంది' అని బౌద్ధం చెబుతుంది.

ప్రతీత్యసముత్పాదం సూత్రంతో బుద్ధుడు ఈ ప్రక్రియను వివరించాడు.

ప్రతీత్య అంటే 'ఆధారపడి' అని. సముత్పాద అంటే 'ఆవిర్భావం' అని. అంటే ఆధారంగా ఆవిర్భవించడం. ఇది కార్యకారణ సూత్రానికే అనుప్రయుక్తం. అంటే దీనివలన అది జన్మిస్తుంది. దాని వలన మరొకటి జన్మిస్తుంది. ఆ మరొకటి లేకపోతే అది లేదు. అది లేకపోతే దాని ముందుది లేదు. "ఇది ఇలా వుంది కనుక అది వుంది. ఇది ఇలా లేదు కనుక అది లేదు" అని.

ప్రతీత్యసముత్పాదన జనన-మరణాల వివరణే కాని ప్రపంచ పరిణామాన్ని వివరించే తాత్త్విక సిద్ధాంతం కాదు.

బాధామయ జీవితం నుంచి బయటపడటానికి మార్గంచూపే ఉద్దేశ్యంతో అది పునర్జన్మ దుఃఖాల గురించి పరిశీలిస్తుంది. కాలానికి మూలం. లేక జీవం ఎప్పుడు పుట్టిందనే రహస్యాన్ని విప్పేందుకు అది ప్రయత్నించదు. ఒక స్థితి దాని పూర్వ స్థితిమీద ఎలా ఆధారపడి వుంటుందో అని మాత్రమే వివరిస్తుంది. దుఃఖం, దాని కారణం, నివారణ, నివారించే విధానం ఈ నాలుగింటికి చెందిన అవిద్య, భవచక్రాన్ని నడిపే ముఖ్యకారణం. ఉన్న విషయాలను, తనను తాను యథాతథంగా తెలుసుకోలేక పోవడమే అవిద్య.

"అవిద్య అనేది గాఢ మోహం. దానిలో పడి చాలా కాలంగా అక్కడే పరిభ్రమిస్తున్నాము" అంటాడు బుద్ధుడు.

అవిద్య నాశనమై తెలివిడిగా మారినపుడు అర్హంతల లాగా కారణత చెదిరిపోతుంది.

"మోహాన్ని నాశనంచేసి చీకటిని చీల్చుకు వచ్చిన వారు పరిభ్రమించే పని లేదు, వారికి కారణత ఇక ఉండదు" అంటూ అవిద్యను చీకటిగా చెప్తాడు బుద్ధుడు. అవిద్య కారణంగానే సంసార నిబద్ధకర్మలు పుడతాయి.

బుద్ధుడంటాడు "కన్నూ రూపాల కారణంగా చూపు కలుగుతుంది. చెవి, శబ్దం కారణంగా వినికిడి జ్ఞానం వస్తుంది. వాసన-నాసికద్వారా, జిహ్వ రసాల కారణంగా జిహ్వేంద్రియ, జ్ఞానం-శరీరం వస్తువుల కారణంగా స్పర్శజ్ఞానం, మనసు ద్వారా వస్తువుల జ్ఞానం కలుగుతుంది. ఈ మూడింటి సంయోగమే సంస్పర్శ".

ఇంకా వివరంగా చెప్పాలంటే వస్తువు ఇంద్రియాలతో సంస్పర్శ చెందినపుడు అనుభవంలోకి వచ్చేదే వేదన లేక అనుభూతి. ఈ వేదనలకు గత కర్మల వాసనలతో ఫలాన్ని పొందే మానసిక స్థితి ఒక్కటే - అంతే. వేరే ఆత్మ అంటూ లేదు, కర్తా లేదు. ఇదీ బౌద్ధం చెప్పేది.

ఇక్కడ బాధతోపాటు ఉండేది ఒక చిత్త స్థితి మాత్రమే. అలాగే సుఖంతోపాటు కూడా. చిత్త స్థితులను చాలా రకాలుగా గుర్తించినా ఒక అనుభూతిగాని, ఒక తటస్థ వేదనగాని ఉంటాయి. నిర్వాణానందం మాత్రం ఏ రకమైన వేదనతో కలిసి ఉండదు. అది దుఃఖ విముక్తి వలన కలిగిన ఆనందం. అది సంతోషకరమైన వస్తువులు గాని, స్పర్శలుగాని అనుభవించడం వలన వచ్చేది కాదని గ్రహించాలి.

రాగద్వేషాలవలన గ్రహణం లేదా ఉపాదానం జనిస్తుంది. నేను, నాది అనే అభిప్రాయాలకు నాంది. ఈ గ్రహణాలను మిథ్యా దృష్టికి లేక ఆత్మకు, కర్మకాండకు ముడిపెట్టడం కూడదు.

ఉపాదానం వలన 'భవం' జనిస్తుంది. అదే 'Becoming' భవం వలన తరువాతి జన్మ, జాతి వస్తుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే మానసిక-దైహిక విషయాలు రూపొందడమే. అదే 'Becoming' జన్మ. జాతి, జర-మరణాలు పుట్టుకవల్ల వచ్చే అనివార్య ఫలితాలు. ఒక కారణం వల్ల ఫలితం వుంటే ఆకారణం లేనప్పుడు ఆ ఫలితం కూడా వుండదుకదా.

ఇప్పుడు బుద్ధుని ప్రతీత్యసముత్పాద సూత్రాన్ని పరిశీలించితే ఇలా వుంటుంది:

అవిద్య వలన కర్మలు పుడతాయి. వాటినుండి విజ్ఞానం, దాని నుండి నామరూపాలు, తద్వారా షడాయితనాలు (ఆరు ఇంద్రియాలు), దానివలన సంస్పర్శ, అందునుండి వేదన, దానివల్ల తృష్ణ జన్మిస్తుంది. అప్పుడు ఉపాదాన, దాని నుండి కర్మ - కర్మభావం నుండి జాతి, అక్కడనుండి జరామరణాలు, దుఃఖం, విలాపం, బాధ జనిస్తాయి. ఇది దుఃఖస్కంధం స్వరూపం.

అవిద్య పూర్తిగా నాశనమైతే పుణ్య-పాప కర్మలు నశిస్తాయి. వాటితో పునస్సంధి ఎరుక నశిస్తుంది.

అందుమూలంగా మనసు పదార్థాల నామరూపాల నాశం జరుగుతుంది. తద్వారా ఇంద్రియ, దాని ద్వారా సంస్పర్శ నాశం జరుగుతుంది. సంస్పర్శ నిర్మూలనతో వేదన, వేదనతో తృష్ణ, తృష్ణ నాశంతో గ్రహణ నాశం, అందుతో కర్మల నాశం, తద్వారా

జన్మనాశం జరుగుతుంది. జన్మరాహిత్యం, జరామరణాల బాధ నశిస్తాయి. ఇది దుఃఖసమూహ నిరుద్ధం.

ఇక్కడ మనం గుర్తించవలసినది గతానికి చెందిన అవిద్య, తృష్ణ మొదలైనవి ప్రస్తుతానికి చెందిన సంస్పర్శ వేదనలు, భవిష్యత్తుకు చెందిన 'గ్రహణ' ఫలితాలు ఇవన్నీ కూడా కార్యకారణ శృంఖలంలో అనంతంగా సాగుతుంది. దీని ఆదిని నిర్ణయించడం అసంభవం. అవిద్యా పరివేష్టితమైన ఈ జీవన ప్రవాహానికి ఒక నిర్దుష్ట దశను ఊహించటం అసాధ్యమే. ఈ ప్రవాహం నిర్వాణ ధాతువును సత్యీకరించుకున్నపుడు మాత్రమే ఈ ప్రక్రియ (పునర్భవం) అంతమవుతుంది.

"ఈ విసగట గలిగించే అవిద్యాచక్రంలో ఎక్కడెక్కడో లెక్కలేనన్ని జనన మరణాలుంటాయి కాని జ్ఞానికోసం అనంతకాలం లేచి వుండదు."

**జనన మరణాలు :**

"మళ్లీ మళ్లీ చావుపుట్టుకలు వస్తాయి. మనలను మళ్ళీమళ్ళీ మరుభూమికి మోస్తారు."

వయోపరిమితిలో జరిగే పరిణామాలు తప్పవు- కర్మతో పనిలేకుండా పునరుత్పత్తి శక్తి బలంగా వున్నపుడు అదే భూమికలో తిరిగి పదార్థీకరణ చెందుతుంది. పునర్భవానికి కారకమైన కర్మశక్తి ఖర్చుయిపోయినపుడు మరణం కలుగుతుంది. అకాల ఆకస్మిక మరణాలకు కర్మ, విరుద్ధ కర్మలే కారణమవుతాయి. వేగంగా వెళ్లే బాణాన్ని మరో బలమైన అయుధం ఛేదించినట్లుగానే.

నూనెలో వెలిగే దీపం ఈ నాలుగు కారణాలలో దేనివలనైనా ఆరిపోవచ్చు.

వత్తి అయిపోవడం – నూనె అయిపోవడం లేదా రెండూ ఒకేసారి అయిపోవడం లేదా గాలి వీచడం. గాలివీచడం అనేది బాహ్య కారణమే.

అలాగే అస్తిత్వ లోకాల గురించి!

"గమనంతో ప్రపంచాంతాన్ని చేరలేవు" బౌద్ధం ప్రకారం వాసయోగ్యమైన ఈ విశ్వంలో ఈ భూమి చిన్న శకలమే. మనుష్యులొక్కరే ప్రాణులు కారు. విశ్వం అనంతం. ప్రాణులు అనేకం. అంతే ప్రయాణించటం ద్వారా ప్రపంచం అంచులకు ఎవ్వరు చేరలేరు. బౌద్ధం దర్శించిన లోకాలు – వేరు వేరు అస్తిత్వలోకాలు ముప్పయి ఒకటి ఉన్నాయి. వీటిలో రూప అరూపలోకాలు. పదార్థ జీవులు, రూపరహిత జీవులు వుంటాయనే దర్శించారు. కాని జగత్సిద్ధాంతాన్ని దేనిని బుద్ధుడు వివరించడానికి ప్రయత్నం చేయలేదని గమనించాలి. ఈ లోకాలు వుండడం ఉండకపోవడం వలన ఒరిగేది ఏమీ లేదు. తన అనుభంలోనికి రాని దేనినీ ఎవ్వరూ నమ్మవలసిన పనిలేదు. అలాగే తన పరిమిత జ్ఞానానికి అందనిది, లేదని దేనినీ నిరాకరించవలసిన అవసరం లేదు.

మరణం అంటే జీవిపూర్తిగా నాశనం కావటం కాదు. ఒకప్రత్యేక జీవితావధి అంతమైనా, ఇంతకుముందు దానిని ప్రోత్సహించిన శక్తి అంతంకావడం లేదు. బౌద్ధం ప్రకారం మరణమంటే, ఒకే వైయక్తి భవానికి సంబంధించిన మానసిక శారీరక జీవితం అంతం కావడం. ఆయువును, ఉష్ణ ఇంద్రియాన్ని కోల్పోవడం.

బండి చక్రం భూమిని ఎప్పుడూ ఒక్కస్థానంలోనే తాకుతుంది. అలాగే మనం ఒక్క ఆలోచనా క్షణంలోనే జీవిస్తాం. ఎప్పుడూ వర్తమానంలోనే ఉంటాం. అది ఎప్పుడూ తిరిగిరాని గతంలోనికి జారిపోతుంటుంది.

జీవిత ప్రక్రియలోని గతించిపోయే విజ్ఞానపు శక్తి, తన చెరగని ముద్రలను మరుక్షణపు జ్ఞానానికి ప్రసారం చేస్తుంది. అంటే ఈ క్రొత్త విజ్ఞానం దాని పూర్వ వాసనలను కలిగి వుండటమేగాక మరికొంత క్రొత్తదాన్ని కూడా తెలిసి వుంటుంది. మరణ సమయంలో విజ్ఞానం అంతరిస్తూ మరోజన్మలో మరోదానికి జన్మనిస్తుంది. వాస్తవానికి ప్రతిక్షణం మరణిస్తూ నవీకృతం చెందుతుందనే చెప్పాలి.

బౌద్ధం ప్రకారం జీవులు అసంఖ్యాకులు, లోకాలు అంతే. గర్భధారణ జరిగినపుడు గుడ్డుఒక్కటే పునర్భవానికి మార్గంకాదు.

ఈ అనంత విశ్వంలో ఒక శకలమైన భూమి ఒక్కటే నివాస స్థలం కాదు. మానవులొక్కరే ప్రాణులు కారు. అందుకని అంతిమాలోచనా ప్రకంపనలో గ్రహించటానికి ఎప్పుడూ తగిన సమయం, స్థానం ఉంటుందని నమ్మటంలో అసంబద్ధత ఏమీలేదు.

పడుతున్న రాతిని స్వీకరించటానికి ఎప్పుడూ ఒకస్థలం ఉండనే వుంటుంది.

బౌద్ధం ఆత్మను (శాశ్వతాత్మను) అంగీకరించదు. ఆత్మ– అదే శస్త్రంచేత ఛేదింపబడనిది, నిప్పుచేత కాలనిది, నీటిచేత తడవనిది, గాలిచేత ఆరనిది, అయిన శాశ్వతాత్మకు,

ఈ జన్మనుంచి సంచితకర్మలను మరోజన్మకు మోసుకు పోవటానికి ఈ మూట ఎలా అంటుతుంది, మరి కర్మలను మోసుకుపోలేకపోతే మరోజన్మకు అర్థమూ పరమార్థమూ ఏమిటి? మరి ఈ ఆత్మకు విముక్తి ఎప్పుడు? శాశ్వతాత్మలో ఎదుగుబొదుగులుండేందుకు అవకాశం ఏది? ఈ వలసకు అంతెక్కడ? వీటికి హేతుబద్ధమైన సమాధానాలు అంతుబట్టవు. కేవలం విశ్వసించటం తప్ప.

మరి బౌద్ధం చెప్పే పునర్భవంలో ఈ శాశ్వతాత్మ ఏదీలేదు...

తిరిగిపుట్టే ఆత్మలేకపోతే పునర్జన్మ ఎలా సాధ్యమవుతుంది?

బౌద్ధం ప్రకారం: పుట్టుక అంటే సమాహారాలు కనపడటమే. భౌతిక అస్తిత్వానికి దానిముందు స్థితి ఎలా కారణమో మానసికస్థితి దాని పూర్వకారణాలతో బద్ధమవు తుంది. ఈ భవ ప్రక్రియ

ముందరి భవతృష్ణ ఫలితం– 'భవ' సహజాత తృష్ణ భావి జన్మను నిబద్ధిస్తుంది.

ఒక ఆలోచనా క్షణం నుంచి తరువాతి ఆలోచనా క్షణానికి శాశ్వతత్వ (ఆత్మ) ఏదీ లేకుండా, జీవిత ప్రవాహం సాగడం సంభవమే. అలాగే ఒక అస్తిత్వం నుండి మరో అస్తిత్వానికి గమించేది ఏదీ లేకుండా గమనం సాధ్యమే.

ఈ పునర్భవ ఆలోచనను పునర్జన్మ వాదన నుంచి వేరుగా చూసినపుడే అవగాహన అవుతుంది. ఆత్మతో పునర్జన్మ–పరివర్తన లేనిది. అది భౌతికమే బౌద్ధంలో అటువంటి ఆత్మకు స్థానంలేదు.

ఒక జీవితం నుంచి మరో జీవితానికి వలస పోయేది ఏదీ లేదు. ఒక దీపం నుంచి మరో దీపాన్ని వెలిగిస్తే ఇక్కడ వలస పోయినది ఏదీలేదు. పునర్భవం అంటే అటువంటిదే. ఒకజ్వాలను ఒక సమూహం నుండి మరోదానికి కారణం కావడమే. మరణ సమయంలో పైకి ఆగినట్లు కనపడినా జీవనజ్వాల సాతత్యమే. అలాగే జ్ఞానం. ముందు తరాల నుంచి తర్వాత తరాల వారికి సంక్రమించే జ్ఞానంలో సముత్పాదనే వుంటుంది. మృత జీవి తాలూకు ఆలోచనా క్షణం నూతన జీవి ఆలోచన క్షణాన్ని అంటిస్తూ పోతుంది. ఇది నూతనమే అయినా పాతవాసన వుంటుంది. అంటే అది మారింది, అలా అని పూర్తిగా కొత్తది కాదు.

కేవలం ప్రత్యేక జీవన ప్రవాహ సాతత్యం (సంతతి) మాత్రమే ఉంటుంది. అంతకంటే వేరైనదేదీలేదు. నిరంతరం భవం చెందుతూ గతించే మానసిక శారీరక ప్రక్రియ బుద్ధుడు చెప్పింది ఈ ప్రక్రియనే కాని సత్వాన్ని కాదు.


ఇదీ పునర్భవ ప్రక్రియ. ఇది దుఃఖాంతంతోనే – విద్యా – జ్ఞానంతోనే అర్హంతలకు నిర్వాణ స్థితిలో అంతమవుతుంది.

**ముగింపు:**

పునర్భవాన్ని అంగీకరిస్తే తరువాత ఉత్పన్నమయ్యే ప్రశ్న: అయితే తిరిగి భవాన్ని పొందేది ఏది? అని. ఆత్మలేదనే మన ప్రమాణంలో ఈ తిరిగిపుట్టేది ఏదో మరి వివరించాలి కదా–

"అది అదీ కాదు – మరొకటి కాదు" అని విశుద్ధమగ్గలో బౌద్ధులు చెప్తారు. శాశ్వతాత్మను బౌద్ధం బలపరచదు గనుక – అందుకు భిన్నంగా దీని వివరణ ఏమిటో తెలుసుకుందాం–

మిళింద – నాగసేన సంవాదం లో ఇలా వుంది. ఒక దీపం నుంచి మరో దీపం వెలిగించినపుడు మొదటి దీపజ్వాల మరోదానిలోకి ఎలా వెళ్ళిపోదో గురువు నుంచి శిష్యునికి పద్యం ఎలారాదో ఏది గమించకుండానే పునర్భవం సంభవం అని



ఈ దేహ గేహాన్ని విచ్ఛిన్నం చేశాను

నాగసేనుడు అంటాడు. అటువంటప్పుడు తర్వాత జన్మలో పుట్టిందేది? అప్పుడు నాగసేనుని సమాధానం: 'మనసు–శరీరాలు లేదా నామ–రూపం తర్వాత అస్తిత్వంలోకి వస్తాయి' అని. అలాంటప్పుడు ఇదే మనసు, ఇదే శరీరం తరువాతి జన్మలో వుంటాయా?

లేదు, తరువాత అస్తిత్వంలోకి వచ్చే మనసు, శరీరం వేరు. అది పూర్వకర్మననుసరించి వుంటాయి. ముందున్న మనసు, శరీరం తరువాతి (పునర్భవంలో) జన్మలో లేకపోతే అతడు విముక్తుడేకదా? పునర్భంలోనే ఈ కర్మసంకెల వుంది. పునర్భవం చెందాడు అంటే కర్మబద్ధుడైనట్లే. దీనికి వివరణ: ఒకచెట్టు మామిడి పండు మీరు తీసుకున్నారనుకోండి, అప్పుడు ఆ చెట్టు సొంతదారుడు మీరు అతనికి చెందిన పండు తీసుకున్నారని అంటాడు. అయితే "నేను అతని పండుని తీసుకోలేదు, అతను నాటిన పండువేరు, నేను తీసుకున్న పండువేరు" అని తప్పించుకోలేరు కదా!

అంటే మీరు తీసుకున్న పండు మూలం అతను నాటిన పండులో వున్నట్లే.

చేతనమంతా కాలికం, అంటే మారిపోయేది. ఏదీ మారకుండా కొనసాగదు – అది అంతరించకుండా జరిగే మార్పు. మార్పు అంతరించినపుడు అదీ అంతరిస్తుంది. పునర్భవం వుండదు. దానికై అది మార్పు. ఇది మార్పులోని అస్తిత్వం.

ఇప్పటి ఆలోచన (ఈ క్షణంలోని ఆలోచన) ముందటి ఆలోచనకు భిన్నమైనదే. అన్నీ గతిస్తున్న ఆలోచనలే లేదా మానసిక స్థితులే అంతే.

"The Thoughts them -selves are the thinkers" అని హెన్రీబర్గ్‌సన్ అన్న విషయం, రెండున్నర సహస్రాబ్దాల క్రితం బుద్ధుడు చెప్పినదే. 'నీవే ఆలోచనలు కావు. నీవు లేకపోయినా లోచనలుంటాయి' అని. అంచులు లేని తరంగాల లాగా నిరంతర చలనం పొందేవి – ఆలోచనలు!

మనం మనసు–శరీరంతో చేసే కర్మల (అది మంచిగాని చెడ్డగాని) కారణంగా మరో మనసు, మరో శరీరం అస్తిత్వంలోకి వస్తున్నాయి. అందుకని 'పునర్భవం' చెందుతున్నాయి. ఈ పునర్భవంలోంచి తప్పించుకోవాలంటే సత్కర్మలు చేస్తూ పోవటమే. దుఃఖహరణం, నిర్వాణ స్థితిని సాధన చేయడమే! మి


# బోధిధర్మ

– ఫజులుల్లా ఖాన్

బోధిధర్మ జెన్ బుద్ధిజానికి మూల పురుషుడు. షావోలిన్ మార్షల్ ఆర్ట్స్ రూపకర్త బోధిధర్ముడే. చైనా, జపాన్ తదితర తూర్పు ఆసియా దేశాలలో జెన్ బౌద్ధానికి ఆదరణ ఎక్కువ. ఆయా దేశాల్లో బోధిధర్ముడు ఆరాధ్య దేవుడు. నిత్య స్మరణీయుడు. ఆయన చూపించిన ధ్యానమార్గంలో నడిచే వారెందరో...

కానీ దీనికి భిన్నమైన సంస్కృతి మన భారతదేశంలో కన్పిస్తుంది. ఇక్కడ బోధిధర్మ అంటే ఎవరో చాలా మందికి తెలియదు. ముఖ్యంగా మన తెలుగు వాళ్లకి అస్సలు తెలియదు. బోధిధర్మ గురించి తెలుగు వాళ్లకి ఎందుకు? ఆయన ఎక్కడో అరవ నేలలో పుట్టిన వాడు కదా అని పక్కకు తప్పుకుంటే సరిపోదు.

ఎందుకంటే బోధిధర్మ తెలుగువాడు. మన పల్లవ వీరుడు. పల్లవరాజు రెండో సింహవర్మకు మూడో కుమారుడు బోధిధర్మ. క్రీస్తుశకం 440లో కాంచిపురంలో బోధిధర్మ జన్మించాడు. ఆయన జన్మనామం బోధితార. బోధితారను బోధిధర్మగా మార్చింది ఆయన గురువు ప్రజ్ఞాతార. క్రీ.శకం 1004లో దియాన్ అనే భిక్షువు రచించిన ట్రాన్స్‌మిషన్ ఆఫ్ ది లాంప్ అనే గ్రంథం ద్వారా ఈ వివరాలన్నీ తెలుస్తున్నాయి.



షావోలిన్ ఆలయం

బోధిధర్మ ఇతివృత్తంపై మాస్టర్ ఆఫ్ జెన్ అని 1994లో చలన చిత్రాన్నీ నిర్మించారు. ఇందులో చైనాకు బౌద్ధమతాన్ని తీసుకువచ్చింది బోధితారే అని చూపించారు. బోధిధర్మ చైనాలో పుతితార అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. మాస్టర్ ఆఫ్ జెన్ సినిమాలో బోధిధర్మ దక్షిణ భారతదేశం నుంచి చైనా వెళ్లాడని చూపించారు. చైనీస్, జపనీస్, కొరియన్, ఇలా ఏ భాషలోని గ్రంథాలలో చూసినా ఆయన పల్లవరాజు కుమారుడని, దక్షిణ భారతీయుడని ఉంది. కానీ ఎందుకు తెలుగువాడు అని లేదు. దీనికి కారణం లేక పోలేదు.

అసలు పల్లవులు ఎవరు? తెలుగువాళ్లా? లేక అరవవాళ్లా? ఈ అస్పష్టతే బోధిధర్మ చరిత్ర మీద కన్పిస్తుందా? పల్లవులు నూటికి నూరుపాళ్లు తెలుగువాళ్లు. 1959లో తెలుగు భాషా సమితి ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం పల్లవులకు సంబంధించి నాలుగు అంశాలను గుర్తు పెట్టుకోవాలని తెలియజేస్తోంది.

1. పురాణాలలో పల్లవులు ఆంధ్రులతో జోడింపబడ్డారు. 2. వారి చరిత్ర ప్రథమ దశలో పల్లవులు ఆంధ్రదేశమునందు రాజ్యము చేయుట. 3. వారి వంశములకు చెందిన నాలుగు కోవల వారును ఆంధ్ర దేశమునందే ఉత్పత్తియగుట 4. ప్రాచీన తమిళ గ్రంథములు వారిని అరవలకంటే భిన్నమైన విజాతీయులు అని పరిగణించుట.

తమిళ సంగం సాహిత్యం చోళ.. చేర.. పాండ్య రాజ్యాలనే తమవిగా పేర్కొంటుంది. ఇక్ష్వాకుల తరువాత అంటే క్రీ.శ. 300 ప్రాంతం నుంచి 630 దాకా తొలి పల్లవులు దక్షిణ, పశ్చిమ ఆంధ్రదేశంలో మూడు శతాబ్దాలు పాలించారు. ఏడో శతాబ్దం దాటాక కూడా నెల్లూరు ప్రాంతంలో పాలించారని ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర – సంస్కృతి 2లో ప్రముఖ పరిశోధకులు పి.వి.పరబ్రహ్మశాస్త్రి పేర్కొన్నారు.

ఈ గ్రంథాన్ని 2008లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రచురించింది. పల్లవులు పరిపాలనా సౌకర్యం కోసం, రక్షణ సహకారం నిమిత్తం రాజ్యాన్ని మూడు భాగాలుగా విభజించారు. 1. కాంచిపురం, దాని పరిసర ప్రాంతాలు, 2. ధాన్యకడ, దర్శి రాజధానిగా ఉన్న దక్షిణాంధ్ర, పశ్చిమాంధ్ర, 3. కడప జిల్లాలోని పెదముడియం రాజధానిగా ఉన్న తూర్పు కర్నాటక. పల్లవుల మూల పురుషుడు వీరకూర్మవర్మ. ఇతడు శాతవాహన సామంతరాజు స్కందనాగుడి కుమార్తెను వివాహమాడాడు. శాతవాహనుల రాజ్యం విచ్చిన్నం కావడంతో స్కందనాగుడు స్వతంత్రరాజయ్యాడు. అతనికి మగ సంతానం లేకపోవడంతో ఆయన తదనంతరం వీరకూర్మవర్మ రాజ్యాధికారాన్ని చేపట్టి పల్లవ సామ్రాజ్యానికి తెరతీశాడు. వీరు ద్రోణ, అశ్వత్థామ వంశీయులుగా తమని తాము పేర్కొన్నారు. జన్మతహః బ్రాహ్మణులు, కానీ క్షత్రియ ధర్మాన్ని చేపట్టారు. ఈ వివరాలన్నింటినీ కూడా ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్రలో స్పష్టపరిచారు. గుంటూరు జిల్లా పల్నాడు నుంచి కంచికి వెళ్లిన వాళ్లు కాబట్టి వీరికి పల్లవులు అని పేరు వచ్చింది. ప్రముఖ భాషావేత్త, అధికార భాషా సంఘానికి మాజీ అధ్యక్షులు ఏబీకే ప్రసాద్ పల్లవులు తెలుగు వాళ్లేనని అభిప్రాయం వ్యక్తం చేశారు.

పల్లవులు తెలుగు నేలకు దక్షిణాన ఉన్న అరవ నేలను కంచి రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఈ ప్రాంతానికి తొండ మండలం అని పేరు. ఈ పేరుకి తెలుగు నేలకీ సంబంధం వుంది. ఆ కాలంలో ప్రతి రాజ్య సైనికులు తమ గుర్తింపు కోసం ఒక్కో పద్ధతిని అవలంభించేవారు. పల్లవ సైనికులు యుద్ధ సమయాల్లో తమ గుర్తింపు కోసం దొండ తీగలను చుట్టుకునేవారు. దొండ అనే పదం అక్కడ తొండగా మారిందని క్రమంగా ఆ ప్రాంతానికి తొండమండలం అని పేరు వచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. ఈ నాటికీ గంజాం నుంచి చీరాల వరకు ఉన్న సముద్ర తీరంలో పల్లెకారులు అనే మత్స్యతెగవారు జీవిస్తున్నారు. అంటే ఇప్పటికీ ఆనాటి ఆనవాళ్లు కొన్ని మిగిలున్నాయన్నమాట.

ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్రలో పల్లవుల వంశ నామావళిని ఓ పట్టికగా ఇచ్చారు. బోధిధర్మ తండ్రి రెండో సింహవర్మ పేరు ఇందులో ఉంది కానీ బోధిధర్మ పేరు మాత్రం లేదు. ఈ వంశ నామావళిని తెలుగునేలపై లభించినటువంటి




అంకుర్ వాట్

తామ్రశాసనాల ఆధారంగా రూపొందిం చారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. బోధిధర్మ యుక్త వయసులోనే భిక్షువుగా మారాడు. గురువు కోరిక మేరకు ధర్మాన్ని ప్రబోధించడానికి చీనా దేశం వెళ్లాడు. అతడు రాజు కాలేదు కాబట్టి అతడి పేరున ఎటువంటి తామ్రశాసనాలు లభ్యం కాలేదా? లేక మరే ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా? బౌద్ధమతానికి ఇంతటి సేవ చేసినటువంటి బోధిధర్మ గురించి ఆధారాలు మన నేల మీద ఎందుకు లభించలేదు?

యజ్ఞయాగాదులను బౌద్ధం ఖండించింది. అయితే జ్ఞానవంతమైన కులానికి చెందిన వారుగా బ్రాహ్మణులు బౌద్ధ మతానికి నాయకులయ్యారు. ఆ తర్వాత క్రతువులతో విగ్రహాలతో బౌద్ధాన్ని భ్రష్టుపట్టించారు. సంఘారామాలనూ, భిక్షువులను నాశనం చేశారు. అప్పట్లో బ్రాహ్మణుల చేతిలో బౌద్ధ వినాశనం ఎంత దారుణంగా కొన సాగిందంటే బౌద్ధ పవిత్రగ్రంథాలను ఆసియాలోని అన్ని ప్రాంతాల నుండీ సేకరించగలిగిన చరిత్ర కారులు భారతదేశం నుంచి ఒక్క విలువైన పుస్తకాన్నీ సంపాదించలేకపోయారు. మన దేశంలో ఆరో శతాబ్ది నుంచి బౌద్ధానికి క్షీణ దశ మొదలైంది. శైవ, వైష్ణవం పుంజుకున్నాయి. దీని వల్లే బోధిధర్మ గురించి మన దేశంలో ఎక్కువగా ఆధారాలు లభించలేదు. చైనాలో భిన్నమైన పరిస్థితులున్నాయి. బుద్ధుడు జన్మించిన వెయ్యేళ్లకు బోధిధర్మ చైనాలో అడుగుపెట్టాడు. తనతో రెండు వేల ఏళ్ల భారతీయ జ్ఞాన సంపదను చైనా తీసుకువచ్చాడని చైనీయుల నమ్మకం. బోధిధర్మ గురించి చైనాలో కథలు కథలుగా చెబుతారు. అక్కడ అతడో పురాణ పురుషుడు. జ్ఞాన ప్రదాత. యుద్ధతంత్రాన్ని నేర్పించిన మహాయోధుడు. బోధిధర్మ ప్రవచనాలను రికార్డు చేశారు. గత శతాబ్దిలో తున్‌హువాంగ్ గుహలలో ఏడు,

ఎనిమిదో శతాబ్దికి చెందిన బోధిధర్మ ప్రబోధనల కాపీలు లభించాయి. మహాబలిపురం నుంచి సముద్ర మార్గాన మలై ద్వీపకల్పం మీదుగా మూడు ఏళ్ళు ప్రయాణించి బోధిధర్మ దక్షిణ చైనాలో 520లలో అడుగుపెట్టాడు. ఆనాడు దక్షిణ చైనాలో 2000, ఉత్తర చైనాలో 6,500 బౌద్ధ ఆలయాలు ఉన్నాయి. కానీ ఉత్తర చైనాలో సామాన్యుల దాకా బౌద్ధం పాకలేకపోయింది. బోధిధర్మ చైనా వెళ్లిన సమయంలో అక్కడ లియాంగ్ డైనాస్టీకి చెందిన చక్రవర్తి వూ పరిపాలన చేస్తున్నాడు. బౌద్ధమత వ్యాప్తికి తను చేస్తున్న సేవలను తెలుసుకుని బోధిధర్మ పొగడుతాడని వూ భావిస్తాడు. అతని సేవలు పరిగణలోకే రావని బోధిధర్మ తేల్చిచెబుతాడు. తక్షణం అక్కడి నుంచి వెళ్లిపొమ్మని వూ ఆదేశిస్తాడు. బోధిధర్మ తమకు జ్ఞానబోధ చేస్తాడని చైనీయులు తలచారు. కానీ ఆయన దీనికి భిన్నంగా ప్రవర్తించే వాడు.

కొందరు అతన్ని హేళన చేశారు కూడా. యాంగ్జీ నదిని దాటేందుకు అతడిని నావలో ఎక్కించుకోలేదు. అందరూ ఆశ్చర్యపోయేలా బోధిధర్మ ఓ కర్ర సహాయంతో నదిని దాటాడని చైనాలో ఓ ఐతిహాస్యం ఉంది. ఉత్తర చైనాలోని షావోలిన్ బౌద్ధారామానికి చేరుకుని ధ్యానం చేయడం ప్రారంభిస్తాడు బోధిధర్మ. అస్సలు మాట్లాడకుండా భోజనం లేకుండా నీళ్లు తీసుకోకుండా ఓ గోడను చూస్తూ ఆయన తొమ్మిదేళ్ళు ధ్యానం చేశాడట. అక్కడ భిక్షువులకు తన బోధలను మాటల ద్వారా కాకుండా అనుభవ పూర్వకంగా తెలియ జేయడానికి ఆయన ప్రయత్నించేవాడు. ఆయన బోధనలు చాలా సూక్ష్మంగా ఉండేవి, కానీ అనంతమైన సందేశాన్ని అందించేవి. కనిపించని దానిని కూడా చూడడానికి ప్రయత్నించాలి. ధ్యానం అంటే మనలోకి మనం ప్రయాణించే ఓ తీర్థయాత్ర.



దరుమా బొమ్మ

షావోలిన్ ఆలయానికి బందిపోట్ల బెడద ఉండేది. అక్కడి భిక్షువులకు కొన్ని యుద్ధ విద్యలని నేర్పించాడు బోధిధర్మ. ఇవే షావోలిన్ మార్షల్ ఆర్ట్స్‌గా పేరు తెచ్చుకున్నాయి. కాళ్లూ చేతులను ఆయుధాలుగా చేసుకుని పోరాడడం ఈ విద్యలో ప్రధాన అంశం. ఇదే కుంఫూగా ఆ తరవాత రూపుదిద్దుకుంది. పాళి భాషలోని ఝూ చైనాలో చెన్‌గా మారింది. చైనా నుంచి వియత్నాం, కొరియా, జపాన్ ఇలా ఆసియాలో ఇతర దేశాలకు పాకింది. జపాన్ తదితర దేశాలలో ఇది జెన్ బుద్ధిజంగా ప్రసిద్ధిచెందింది. మహాయాన బుద్ధిజంలో ఓ శాఖగా జెన్‌ను పేర్కొనవచ్చు.

శాఖ్యముని బుద్ధుడు తరవాత 28వ బౌద్ధ గురువుగా బోధిధర్మ పేరు తెచ్చు కున్నాడు. జపాన్, కొరియాల్లో బోధిధర్మ ప్రభావం అంతా ఇంతా కాదు. జపాన్‌లో ఎంతో ప్రసిద్ధి చెందినవి దరుమా బొమ్మలు. బోధిధర్మ ప్రతి రూపాలుగా వీటిని అక్కడ నమ్ముతారు. తొమ్మిదేళ్లు కదలకుండా కూర్చోవడంతో బోధిధర్మ కాళ్లు, నడుముతో కలిసిపోయి ఇలాంటి రూపం వచ్చిందని వారు భావిస్తారు. ఈ బొమ్మలు ఉన్న ప్రతి చోటా అదృష్టం పొంగిపొర్లు తుందని జపనీయుల విశ్వాసం. అక్కడి పాపులర్ గిఫ్టులలో ఇవి కూడా ఉండడం విశేషం.

ఎప్పుడో 1600 సంవత్సరాల క్రితం బోధిధర్మ తొమ్మిదేళ్లు ధ్యానం చేసిన గుహను ఈ నాటికీ చైనాలో చూడవచ్చు. ఎందరో ఇక్కడికి వచ్చి ప్రతి రోజూ దర్శించు కుంటూనే ఉంటారు. మోకాళ్ల మీద కూర్చుని ధ్యానం చేస్తుంటారు. ఇక బోధిధర్మ సమాధి దర్శనానికి ఓ పుణ్యక్షేత్రంలా వెళతారు. ఈ సమాధి 1990లో బయటపడింది. పక్కనే బోధిధర్మ ఆరామం కూడా ఉంది. ఇక్కడ బోధిధర్మ నిలువెత్తు విగ్రహానికి ప్రతినిత్యం ప్రార్థనలు జరుగుతూనే ఉంటాయి.

ఇలా బోధిధర్మలా ప్రపంచ బౌద్ధాన్ని ప్రభావితం చేసిన ఎందరో ఆచార్యులు తన తెలుగువాళ్లే అన్నది నగ్నసత్యము. ఆసియాలో అత్యంత ప్రముఖ బౌద్ధగురువుగా నిలిచిన బోధిధర్మ గురించి మనం మరచిపోయాం. కానీ పక్క దేశాలన్నీ ఆయనని ఆరాధిస్తున్నాయి. ఇలా చరిత్ర పుటల్లో మరుగున పడిపోయిన తెలుగు వాళ్లెందరో. వాళ్లందరినీ గుర్తించే రోజు ఎప్పుడు వస్తుందో. తెలుగు జాతి తరతరాల తన ఘనకీర్తిని ఏనాటికి తెలుసుకుంటుందో. అలాంటి రోజు అతి త్వరలో రావాలని ఆశిద్దాం.

# అట్టమీది బొమ్మలు

### *ముఖచిత్రం :* ధర్మచక్ర ప్రవర్తన



గౌతమ బుద్ధుడు సారనాథ్‌లో నున్న పంచవర్గీయ భిక్షువులకు బుద్ధుడు ధర్మాన్ని బోధించుట. బుద్ధుని పీఠానికి ఇరువైపులా ఉన్న జింకలు. ఇది మృగదావనంలో బుద్ధుని ప్రథమ ప్రవచన సందర్భాన్ని సూచిస్తుంది.

### *నాలుగవ అట్ట :* మహాభి నిష్క్రమణ

ఆ రోజు వైశాఖ పౌర్ణమి. సిద్ధార్థ గౌతముని 29వ పుట్టిన రోజు. పుట్టిన రోజు సంబరాలు జరిగాయి. కానీ ఇవేమీ గౌతమునికి ఆనందం కలిగించ లేకపోయాయి. మానవ జీవితంలో నున్న దుఃఖం ఆయనను తీవ్ర వేదనకు గురిచేసింది. దీని నుండి మానవాళిని విముక్తపరిచే సంకల్పం తో సత్యాన్వేషణ చేయాలను కున్నాడు. ఆ



అర్ధరాత్రి కంఠకం అనే అశ్వాన్ని అధిరోహించి చన్నుడు వెంటరాగా అనోమా నదిని దాటి పరివ్రాజకుడైనాడు.

రాహుల్ సాంకృత్యాయన్ రచించిన *బుద్ధచరియ* అనే గ్రంథంలో గౌతముడి నిష్క్రమణ అద్భుతంగా ఆవిష్కరించ బడింది. దీనిలో గుఱ్ఱపుడెక్కల చప్పుడుకు ఎవరైనా మేల్కొని గౌతముని ఆపి తిరిగి అంతఃపురానికి తీసుకుని వెళ్ళే సందర్భం రాకుండా దేవతలు గుఱ్ఱపు డెక్కల క్రింద తమ అరచేతులను ఆన్చి ఎవరికీ నిద్రాభంగం కలుగకుండా చూసుకున్నారని ఉంది.

పై రెండు శిల్పాలు 1956లో నిర్మితమైన కృష్ణాబేరేజి పై గుంటూరు నుంచి విజయవాడకు వచ్చే మార్గంలో ఆహ్వానం పలుకుతున్నట్టు కనిపించే దీని రూప శిల్పి **పెరుమాళ్ రాజు,** చుండూరు. ఇది అమరావతీ చిత్రకళా సంప్రదాయం.



### *రెండవ అట్ట :* తార

తార వజ్రయాన దేవతా మూర్తి. ఈమె మానవునికి స్వేచ్ఛ ప్రసాదించిన మాతృమూర్తిగా, కరుణకు మరో రూపం. ఈమె విగ్రహాలు అనేక రంగులలో కానవస్తాయి. ఆకుపచ్చ వర్ణం కలిగిన తార వైజ్ఞానిక దృక్పథానికి, శ్వేత వర్ణం తార కరుణ, దయ లాంటి సాత్విక గుణాలకు, అరుణ వర్ణం తార మంచిని ఆకర్షించే స్వభావానికి ప్రతీకలుగా భావిస్తారు. పసుపు వర్ణపు తార అష్టైశ్వర్యాలకు, నీలపు వర్ణపు తార ఆగ్రహానికి – కొందరికామె చదువుల తల్లిగా, ఇలా ఎన్నోరూపాలు. ఈ విధంగా ఆమెకు 28 రూపాలున్నట్లుగా చెబుతుంది వజ్రయానం.

టిబెటన్ బౌద్ధంలో తార ఒక ముఖ్యపాత్ర వహిస్తుంది. బోధిసత్వుని కన్నుల నుండి జాలువారిన ఒక కన్నీటి చుక్క భూమిపైపడి తారగా రూపుదిద్దుకుంది అని నమ్ముతారు. సంసార కష్టాల నుండి విముక్తులను చేసే దేవతగా పూజలందు కుంటుంది. తాంత్రిక బౌద్ధంలో ఆమెది ఒక ముఖ్యభూమిక.

### *మూడవ అట్ట :* ఆమ్రపాలి




క్రీస్తు పూర్వం 500 సం॥ క్రితం వైశాలి నగరంలోని ఒక మామిడి (ఆమ్ర) తోటలో లభించిన బాలిక ఆమ్రపాలి. ఈమెను అంబపాలి అనికూడా పిలుస్తారు. తొలి యౌవన దశలో ఎందరో ప్రముఖులు ఆమెను పొందాలని పోటీ పడ్డారు. పోటీ తీవ్రం కావటంతో పుర ప్రముఖులు ఆమెను 'నగర శోభిని'ని చేశారు. ఆమె సౌందర్యం గురించి విని మగధ రాజాధీశుడైన బింబిసారుడు మారు వేషంలో వైశాలి వచ్చి తన సంగీత, కవితా ప్రావీణ్యంతో ఆమెను మెప్పించి, ఆమె ప్రేమను పొందగలిగాడు.

వైశాలి, మగధ దేశాలమధ్యనున్న వైషమ్యం తీవ్రం కావటంతో, ఆమ్రపాలిని సొంతం చేసుకునే ఉద్దేశంతో మగధాధీశుడు వైశాలిపై దండయాత్రచేసి, దానిని జయించాడు. అప్పుడు వైశాలిలో జరిగిన నరమేధానికి విచలితమైన ఆమ్రపాలి, తన సర్వసంపదలను బౌద్ధ ఆరామాలకు, సమర్పించి భిక్షుణిగా మారింది. ఇది స్థూలంగా ఆమ్రపాలి కథ. చారిత్రికంగా ఇదీ యదార్థ విషయం అంటూ ఏమీ చెప్పలేము.

చిత్రకారుడు గిరిధర్ గౌడ్ రాబోయే బుద్ధపూర్ణిమ కోసం ప్రత్యేకించి బౌద్ధానికి సంబంధించి రంగులలో వేసిన చిత్రాలలో ఇదొకటి.

ఈ చిత్రం సర్వసంపదలను, భౌతిక సుఖాలను విసర్జిస్తూ బౌద్ధం వైపు మార్గం నిర్దేశం చేసుకున్న ఆమ్రపాలిని మన ముందుంచుతుంది.



# మేధావుల దృష్టిలో బౌద్ధం

**- ఎస్.టాంగ్**

**బు**ద్ధుడు ఇప్పటికి (2012 నాటికి) 2556 సంవత్సరాల క్రితం ఒక రాజ కుటుంబంలో పుట్టి, సామాన్య మానవుడుగా జీవించి, బుద్ధత్వం పొంది, ధర్మ స్థాపకుడై, ప్రజలకు ఆ ధర్మాన్ని బోధించి విశ్వవిఖ్యాతిగాంచిన వ్యక్తి.

ధర్మము అనగా ధరించునది. ఇది ఒక నీతిశాస్త్రము (Moral Philosophy). ఆయనకు మానవాతీత శక్తులు, అతీంద్రీయశక్తులున్నాయని చెప్పలేదు. అద్భుతాలు (Miracles) ప్రదర్శించలేదు. వైదికానికి ఆయువుపట్టయిన మూఢనమ్మకాలను పారద్రోలటానికి ధర్మాన్ని బోధించారు. మానవులను మూఢనమ్మకాల బంధనాల నుండి విముక్తులను చేయుటకుద్యమించినందువలన, శాస్త్రీయ మతమైనందు వలన నాగరీకులు, మేధావులు, ఏ మతం వారైనా బౌద్ధం యెడల చాలా గౌరవం చూపించారు. ఏ మతానికి సంబంధంలేని ఆలోచనాపరులు, జిజ్ఞాసులు కూడా బౌద్ధానికి అత్యంత గౌరవం చూపించారు. చారిత్రకపరంగా చూసినప్పుడు బౌద్ధం ఇచ్చినంత మత స్వాతంత్ర్యము ఏ మతమూ ఇవ్వలేదు. బుద్ధునికి పూర్వం మతం అనేది సమాజంలో ఒక వర్గానికి గుత్తాధిపత్య మయ్యింది. మతం గేట్లు బార్ల తెరిచి మార్గం చూపించింది బుద్ధుడు. కనుకనే ఆయనను మార్గదాత అని అభివర్ణించారు.

విశ్వాసం పేరుతో, సంప్రదాయం పేరుతో తెలియని వానికి బానిసగా వర్థిల్లటం కంటే వివేచనాత్మకంగా, మతం ముసుగు లేకుండా జీవన విధానాన్ని నేర్పినది బౌద్ధం. ఇలాంటి బౌద్ధ ధర్మంపై గొప్ప తత్త్వవేత్తలు, విద్యావేత్తలు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, రచయితలు, మతప్రవక్తలు, సామాజిక సంస్కర్తలు మొదలగు వారు, మేధావులుగా పరిగణింప బడుతున్నవారు బౌద్ధంపై వెలిబుచ్చిన అభిప్రాయాలను వెలికి తీయడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. ఇందులో బౌద్ధులు కానివారున్నారు, స్వేచ్ఛా ఆలోచనాపరులు ఉన్నారు.

ఎవరు ఏ విధంగా చెప్పినా అందరి అభిప్రాయం ఒక్కటే. బౌద్ధం శాస్త్రీయ పరిజ్ఞానంతో కూడి, ఆచరణకు సాధ్యమై మతంలో బంధింపబడియది కాదు. కాబట్టి మానవాళికి మహోపకారిగా ఉంటుంది. అందుకు బౌద్ధం ఆచరించాలి. ఇతర మతాలను కించపరిచే విషయం ఇందులో ఏమీలేదు.

**మేధావులు ఏమన్నారో చూద్దాం.**

బెర్ట్రాండ్ రస్సెల్ (Arthur Willeam Bertrand Russel) ఈయనకు 3 వ ఎర్న్ రస్సెల్ అనే పేరు కూడా వుంది. (1872–1970) బ్రిటిషర్. తత్త్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు, రచయిత. ఆయన క్రైస్తవం స్వీకరించలేదు.

ఆయన మాటల్లో: "నేను క్రైస్తవుడను ఎందుకు కాదు? (Why I am not a Christian?) చరిత్రకు అందినంతవరకు జ్ఞానంలోగాని, నీతి, సచ్ఛీలత, సన్మార్గము, సుగుణములలో ఇతరుల కంటే ఉన్నత స్థానంలో క్రీస్తు నిలబడినప్పటికీ, బుద్ధుడు క్రీస్తుకంటే ఉన్నత స్థానంలో నిలబడతాడు. ఇది బుద్ధుని యొక్క గొప్పతనం (The Buddha's Greatness) గురించి తెలియజేస్తుంది. ఇంకా ఏమన్నాడంటే: "ప్రపంచానికి తెలిసిన గొప్పమతాలన్నింటిలోకి ఉన్నత స్థాయిలో ఉన్న బౌద్ధాన్ని ఎన్నుకుంటాను. ఎందుకంటే బౌద్ధస్వీకారానికి ఒక్క రక్తపు చుక్క కూడా విదల్చలేదు.

**సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్** (Sir Edwin Arnold) :

1885 లో *ది లైట్ ఆఫ్ ఏషియా* (The Light of Asia) అనే గ్రంథాన్ని రచించిన ప్రఖ్యాత రచయిత. బుద్ధగయలోని మహాబోధి మహావిహారను బౌద్ధులకు స్వాధీనపరచవలసినదిగా తొలుత అధికారికంగా అడిగినది సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్. ఆయన స్వయంగా మహావిహారను దర్శించి బ్రిటిష్ ప్రభుత్వానికి, భారత ప్రభుత్వానికి, బౌద్ధం అవలంబించిన ఇతర దేశాలకు మహాబోధి మహావిహార

ఎస్.టాంగ్, ఫోన్ : 9290413847

విషయంలో జోక్యం చేసుకోవలపినదిగా వినతిచేశాడు. అనగారిక ధర్మపాల (1864–1933) స్పందించి 1891 లో విచ్చేశారు.

తూర్పు దేశపు కాంతి ప్రాచ్య (పశ్చిమ) దేశాలకు ఎలా వ్యాప్తి చెందిందో చెబుతూ బౌద్ధధర్మ గుబాళింపును చాలా సొగసుగా, తియ్యగా ఆయన మాటల్లో:

**"మానవ వృక్షంలో పువ్వు పూసింది**
**పదివేల సంవత్సరాలయినా వికసిస్తూనే వుంటుంది**
**ప్రపంచానికి సుగంధం వెదజల్లుతోంది**
**తేనెలొలుకు తియ్యని ప్రేమ"**

ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి బౌద్ధానికి గల సంబంధం గురించి: "నేను పదే పదే చెప్పాను. మళ్ళీ చెబుతున్నాను. ఇక ముందుకూడా చెబుతాను. ఆధునిక విజ్ఞానశాస్త్రానికి, బౌద్ధానికి, మేధోపరమైన బంధం వుంది," అంటారు.

అబ్దుల్ అతాహియా అనే ఉర్దూకవి బుద్ధుడ్ని గూర్చి ఇలా అంటాడు: "ఒక మానవతావాదిని" చూడాలని కోరిక కలిగితే చింపిరి బట్టలతో సామాన్య మానవుడుగా వున్న రాజకుమారుడుని దర్శించండి, ఆయన మానవులలోకెల్లా గొప్ప పవిత్రమూర్తి."

**ఒక ముస్లిమ్ విద్వావేత్త అంటాడు:** "బుద్ధుడు ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఆయన మానవులందరి ఆస్తి. ఆయన బోధనలు సర్వజనులకు సమానంగా వర్తిస్తాయి. బుద్ధుని తర్వాత వచ్చిన మతాలన్నీ బౌద్ధం నుంచి దొంగిలించినవే, అప్పుగా తీసుకున్నవే.

**ప్రొఫెసర్ రీజ్ డేవిడ్స్** (T.W. Rhys Davids): పాలీ టెక్స్ట్ సొసైటీ, లండన్ అధ్యక్షుడు. 1881 లో Pali Text Society (PTS) స్థాపించి, ఆ సంస్థ ద్వారా గ్రంథాలను ఆంగ్లంలోకి అనువదింపచేసి ప్రపంచమంతటా ఇంగ్లీషు భాషానురక్తులకు బౌద్ధం తెలియజేసిన ఘనత దక్కింది. ఇప్పటికీ తన సేవలను కొనసాగిస్తూనే వుంది. ఆయన ఇలా అంటాడు: "సుదీర్ఘ చరిత్ర కలిగి వందల సంవత్సరాలు ప్రముఖ బౌద్ధులు గాని, బౌద్ధాభిమానులు గాని, ఇతర మతస్థులుగాని, బౌద్ధాభిమానులుగా పరివర్తన చెందటానికి రక్తపు మరకల జాడలు లేవు. ఇది నాకు తెలిసిన చరిత్ర." ఆయన ఇంకా ఏమంటారంటే, "మానవ చరిత్రలో తొలుతగా, మొట్టమొదటిసారిగా జీవహింస చేయరాదని, ఏ ప్రాణికి హాని తలపెట్టరాదని, భగవంతుని పేరుతో ప్రార్థనలు, బలులు ఇవ్వరాదని ప్రజలకు బోధించాడు, విన్నవించాడు, నిరసించాడు. వాక్చాతుర్యంతో, వాక్పటిమతో దేవుళ్ళు కూడా తమంతట తాముగా ముక్తి పొందాలని బహిరంగంగా తెలియజేశాడు."

**భదంత వాల్పోల శ్రీరాహుల :** శ్రీలంకకు చెందిన పండిత భిక్షువు. ఈయనను అగ్గమహాపండిత గౌరవనీయులు (Venerable) ప్రొఫెసర్, డాక్టర్ వాల్పోల శ్రీరాహుల మహాథేర అంటారు. 1907 లో జననం. 13 వ ఏట బౌద్ధ సంఘ ప్రవేశం. 1950 లో శ్రీలంక విశ్వవిద్యాలయ కళాశాల నుంచి డాక్టర్ పట్టా తీసుకున్నాడు. ప్రసిద్ధ బోధకుడు. సామాజిక, ఆర్థిక విషయాల మీద ఆసక్తి కనబరచాడు.

1950 లో ఫ్రాన్స్ ప్రభుత్వ ఉపకారవేతనం మీద సార్‌బోన్ విశ్వ విద్యాలయం (పారిస్) లో మహాయాన బౌద్ధం మీద పరిశోధన చేశాడు. ముఖ్యంగా అసంగుని రచనల మీద పరిశోధన చేశాడు. అమెరికా, జపాన్‌లలో విస్తృతంగా పర్యటనలు జరిపి బౌద్ధం మీద ఉపన్యాసాలిచ్చాడు. ఇతడి ప్రఖ్యాత గ్రంథం *What the Buddha Taught.*

"బౌద్ధం వాస్తవికత ప్రజలకు, ప్రపంచానికి వాస్తవ దృక్పథాన్ని తీసుకెళుతుంది. మూర్ఖుల స్వర్గధామం చిత్రించి ఆ దిశగా నడిపించారు. అభూత కల్పనలతో, తప్పుడు నడకలతో భయాందోళనలను కల్పించారు. మనము ఏమిటి? మన చుట్టూవున్న ప్రపంచం ఏమిటి అనే విషయాలపై నిర్దిష్ట భావాలు కలిగి స్వేచ్ఛ (Freedom), శాంతి (Peace), సంతోషం (Happiness) కలిగించి ప్రశాంతతను (Tranquility) చేకూరిస్తుంది" అంటారు వాల్పోల శ్రీ రాహుల. ఇంకా "సత్యాన్వేషణకు వ్యాకులత, దుఃఖము, పాప పశ్చాత్తాపము, వ్యసన చింతనలు కలిగిన మనస్సు నిరోధాలు. తెలుసుకుంటే సంతోషాన్ని మించినది లేదు.

నిర్వాణానికి ఇది ఒక ముఖ్య భూమిక" అంటారు. "బుద్ధుని బోధనలు" "ఏహి పస్సికో" అంటే "రా వచ్చి చూడు". అంతే కాని మూఢనమ్మకంతోనో, విశ్వాసంతోనో రావటం కాదు. (Knowing and seeing and not that of believing). సామాజిక సంక్షేమం గురించి "బౌద్ధం కేవలం మాటల డాంబికం కాదు. ప్రజల సామాజిక, ఆర్థిక సంక్షేమం వారి సుఖ సంతోషాల గురించి తెలియజేయటమేగాక, ఆధ్యాత్మిక

సాధనకు కొన్ని నిత్యావసరాలను పరిగణలోకి తీసుకోవాలని బౌద్ధం గుర్తించింది." అంటారాయన. "బుద్ధుడు నిర్వాణం అనే ముక్తికి దారి చూపి రక్షకుడైనాడు. అయితే ఆయన చూపిన మార్గంలో నడిచి, కృషిచేసి ఆయనను 'మార్గదాత'గా మనస్సులో నిలుపుకోవాలి.'' ''ఆత్మ అనే విషయాన్ని మూఢత్వంతో నమ్మి ప్రజల మధ్య కుమ్ములాటలు, ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలకు కారణమైంది. చచ్చిన తర్వాత పుట్టుక ఉందా అనే విషయాంపై తర్జన భర్జన వద్దు" అంటుంది బౌద్ధం.

**అల్బర్ట్ ఐన్‌స్టీన్:** (Albert Einstein) 1879–1955 జర్మనీలో పుట్టి అమెరికాలో స్థిరపడిన సైంటిస్ట్, పదార్థ విజ్ఞాన శాస్త్రజ్ఞుడు. మేధావి అనటానికి ఐన్‌స్టీన్ అని పిలవడం వాడుకలోకి వచ్చింది. ఐన్‌స్టీన్ పేరు తెలియని విద్యాలోకం వుండదు. The Theory of relativity కి సృష్టికర్త. "బౌద్ధం ఒక శాస్త్రంతో సరితూగటమే గాక పోటీపడుతుంది అని చెబుతూనే నూతన విజ్ఞాన శాస్త్రానికి బౌద్ధం వెలుగు చూపించింది" అని అంటారాయన.

**అనగారిక ధర్మపాల:** గౌరవనీయ ధర్మమిత్ర ధర్మపాల (ధమ్మమిత్ర ధమ్మపాల) గా లోక పరిచితుడు. శ్రీలంకలో ఒక ధనిక బౌద్ధకుటుంబంలో 1864 లో జన్మించాడు. దావిద్ హేవవితరణ అతని అసలు పేరు. తండ్రి డాన్ కరోలిన్ మొదలియార్, తల్లి మల్లిక. కుర్చీలు, బల్లలు (Furniture) తయారుచేసే వ్యాపారం.

హేవవితరణ పుట్టిన కాలంలో సింహళీయులు తమ సంస్కృతిని గురించి చెప్పుకోవడానికి సిగ్గుపడేవారు. బౌద్ధ కుటుంబాలలో పుట్టిన పిల్లల జననాన్ని నవోదు చేయించడానికి చర్చికి తీసుకు వెళ్ళవలసి వచ్చేది. అక్కడ వారు బిడ్డపేరుకు ఒక క్రైస్తవ (బైబిల్) నామాన్ని జోడించేవారు. ఆ విధంగానే హేవవితరణ దావిద్ వితరణ అయ్యాడు. ఇతడు జన్మతః క్రైస్తవుడు కాడు. అతడు క్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత 1880 లో 'థియోసఫీ' లో పరిచయం ఏర్పడింది. అప్పుడు తన ఐరోపా (బైబిల్) నామాన్ని వదలి మద్రాస్ (చెన్నై) లోని థియోసాఫికల్ సొసైటీలో చేరాడు. H.P. బ్లావిట్ స్కీ ప్రేరితుడై అక్కడే బౌద్ధాన్ని అధ్యయనం చేసి పాళీని నేర్చుకున్నాడు. ఆ తరువాత ఈ సొసైటీని వదలి, ఆసియా దేశాలన్నీ తిరిగి, ఆయా దేశాలలోని బౌద్ధులను ఒకరి గురించి మరొకరికి పరిచయం చేస్తూ వారి మధ్య సంబంధాలు పెంచాడు. పాశ్చాత్య దేశాలకు గూడ బౌద్ధాన్ని పరిచయం చేశాడు. ఇతడు 1891 లో మహాబోధి సొసైటీని స్థాపించాడు. 1925లో లండన్ బ్రిటిష్ మహాబోధి సొసైటీని స్థాపించాడు. అతడు 1933 ఏప్రిల్ 29న మరణించాడు. ఒక విధంగా ఆధునిక కాలంలో బౌద్ధం పునరుద్దీపనం పొందడానికి అతడు చేసిన కృషి అనితర సాధ్యం.

ఆయన ఇలా అన్నాడు.''భారతదేశంలో పునర్జన్మ ఎత్తడానికి నన్ను తిరిగి పుట్టనీయండి. (బౌద్ధంలో పునర్జన్మలేదు – నామాట). ఆ సమ్యక్ సంబుద్ధుడు జన్మించిన భారతదేశంలో నేను 25 సార్లయినా సిద్ధం – ప్రపంచమంతటా ఆ ధర్మాన్ని వ్యాపింపజేయడానికి.'' ఈ ప్రపంచం బుద్ధుడికి ఋణపడివున్నదని చెబుతూ "ఇరవై అయిదు శతాబ్దాలు క్రితం మేధోపరమైన ఆధ్యాత్మిక విప్లవం ద్వారా వైదికాన్ని అనగా భగవంతుడున్నాడనే వాదాన్ని, మౌఢ్యాన్ని, బ్రహ్మణీక కుటిల స్వార్థపరత్వాన్ని రూపుమాపి, జీవితాల్లో కొత్త వెలుగును ప్రసరింపజేసి, సమ్యక్ ఆలోచనను ప్రేరేపింప చేసిన ఘనత బౌద్ధ ధర్మ ప్రవేశంతో జరిగింది. అదే ధమ్మ–అదే శాస్త్రీయ తత్వ జ్ఞానం" అంటారు ధర్మపాల.

**లక్ష్మీనరసు:** ఆచార్య పోకల లక్ష్మీనరసు మద్రాసు (చెన్నై) లో స్థిరపడిన వారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో 1897 లో ఫిజిక్స్, కెమిస్ట్రీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అనతి కాలంలోనే ఆ కళాశాలకు ప్రిన్సిపల్ అయ్యారు.

ఈయన బౌద్ధాభిమాని. వారాంతాలలో బౌద్ధం మీద ఉపన్యాసాలిస్తుండే వారు. అనగారిక ధర్మపాలకు ఈయన తెలుసు. మహాబోధి సొసైటి మద్రాసు (చెన్నై) శాఖను స్థాపించాడు. ద్రవిడ బౌద్ధ పిల్లల కోసం పెరంబూర్‌లో స్కూలు నడిపాడు. తరువాత South India Buddhist Association ప్రెసిడెంట్ అయ్యారు. ఈయన 1907లో వ్రాసిన *The Essence of Buddhim* చాలా గొప్ప గ్రంథం. ఈ గ్రంథాన్ని బాబాసాహెబ్ అంబేడ్కర్ అమితంగా మెచ్చుకొని దానికి ముందుమాట వ్రాసి, రచయిత జీవితాన్ని గురించి వ్రాసి 1948 లో పునర్ముద్రణగావించాడు.

ఈయన సంఘ సంస్కర్త. వర్ణవ్యవస్థను, వితంతు వివాహ నిషేధాలను వ్యతిరేకించినవాడు. బుద్ధుని ఆదర్శంగా తీసుకున్నాడు. దేశభక్తి స్ఫూర్తితో ఆంగ్లేయుల దర్పాన్ని,


ఛాందస హిందూ నమ్మకాలను నిశితంగా విమర్శించి ఎదుర్కొన్నాడు. ఆచార్య నరసు మరో గ్రంథం కూడా రాశాడు. అది *What is Buddhism* ఆచార్య లక్ష్మీనరసు. 1934 లో తుది శ్వాస విడిచాడు.

ప్రొఫెసర్ లక్ష్మీనరసు అంటారు– "ప్రపంచం అనే గుడిసె తగలబడుతోంది. అందులో పిల్లలు ఆడుకుంటున్నారు. అనేక విధాలుగా ప్రయత్నించి పిల్లలను అందులోనుంచి తీసి సుఖప్రదమైన నిర్వాణానికి చేర్చారు." అంటే బుద్ధుడు పిల్లలను ప్రాణాపాయాలనుండి కాపాడిన తెలివైన తండ్రి అని అర్థం చేసుకోవచ్చు. లక్ష్మీనరసు మరోచోట అంటారు– "విముక్తికి ముఖ్యమైన మార్గం జ్ఞానోదయం అని బౌద్ధం చెప్పటం వల్ల బౌద్ధం కీర్తి పతాక ఎగురుతూనే వుంది. మేధోమథనం, వికాసంతో కూడిన శీల(ం) రెండూ విడదీయలేని జంట. ప్రతీత్య సముత్పాద సిద్ధాంతం అర్థం చేసుకుంటే మానవుడి అంతర్ దృష్టి సాధిస్తాడు". ఈ సిద్ధాంతం ఏ ఇతర మతాలలో లేదు. అందుచేతనే ఇతర మతాలతో విభేదిస్తుంది.

**అంబేద్కర్:** బౌద్ధం ఊహాప్రపంచంలో విహరించదు. సత్యాన్నే ప్రకాశింపజేస్తుంది. "దుర్మార్గమైన హిందూమతం, పరాన్న భుక్కులయిన బ్రాహ్మణులు తమ ఆధిపత్యం కోసం దేశ సంపదని అధికారాన్ని అనుభవించేందుకు ఏర్పాటుచేసిన నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ, అంటరాని తనానికి, దోపిడీకి, అణచివేతకు కారణమైనదని హిందూమత వ్యవస్థను తీవ్రంగా అంబేద్కర్ విమర్శించారు. 1956 అక్టోబర్ 14వ తేదీన నాగపూర్‌లో బౌద్ధభిక్షుణి 'చంద్రమతి' నుంచి బౌద్ధదీక్షను స్వీకరించారు.

అదే రోజు అంబేద్కర్ అనుచరులు లక్షలాదిమంది (సుమారు 5 లక్షల మంది) బౌద్ధధర్మాన్ని స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక మంది దళితులు అంబేద్కర్ అనుచరులుగా బౌద్ధాన్ని స్వీకరించి ఆయన మార్గంలో కొనసాగారు. బౌద్ధ చరిత్రలో ఇది ఒక గొప్ప మలుపు. ఒక్క రోజున ఒకే చోట లక్షలాది మందిని బౌద్ధం స్వీకారం చేయించిన ఘనత అంబేద్కర్ చెప్పిన మాటలు, రాతలు అంబేద్కర్ సుభాషితాలుగా బహుళ ప్రచారంలో ఉన్నాయి.

ప్రజాస్వామ్యాన్ని గురించి డా॥బాబాసాహెబ్ అంబేద్కర్: బౌద్ధ ప్రజాస్వామ్య ఉద్యమం తద్వారా ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామ్యం (సామాజిక న్యాయం), ప్రజాస్వామ్య రాజకీయాలను బౌద్ధం ఎత్తి



పట్టుకుంది (Upholds)అంటారు. ఆర్య అష్టాంగ మార్గంలోని 'శీలం' సమ్యక్ వాక్కు, (Right Speech) సమ్యక్ కర్మ (Right Action), సమ్యక్ జీవనంను (Right Livelihood) గురించి చెబుతూ అంబేద్కర్ అంటారు "ప్రతి విద్యార్థి 'శీలం' ను ఆచరించాలి. అందులో ఐదు అంశాలు చాలా ప్రధానమైనవి. అవి:

(1) విద్య (Eduction) అనగా చతురార్య సత్యాలు, పంచశీల, ఆర్యఅష్టాంగ మార్గం తెలియడం, అధ్యయనం చేయడం, ఆచరించడం. (2) కరుణ (Sympathy) అంటే ఆర్ద్రహృదయం కలిగివుండటం. (3) నమ్రత (Humility) అనగా అణకువ, వినయము కలిగి ప్రవర్తించడం. (4) ప్రజ్ఞ (Wisdom) అనగా సమ్యక్ దృష్టి (Right view and Right Thinking). (5) మైత్రి (Friendship) అనగా ప్రేమ, స్నేహము, ఆసన్న హస్తం అందించడం.

విద్యార్థిలోకం సభ్యతగల సమాజంగా రూపొందాలి. వారు వచ్చేతరానికి వెలుగునిచ్చే కాంతి శిఖరాలుగా బౌద్ధం ద్వారానే తయారవుతారు.

బౌద్ధంలో కులంలేదు. "కులం పునాదులమీద నిలబడి మాట్లాడేవారు జాతిని నిర్మించలేరు, నిలబెట్టలేరు" అంటారు బాబాసాహెబ్ అంబేద్కర్.

# యథాభూత జ్ఞానదర్శనం

**– అన్నపరెడ్డి బుద్ధఘోషుడు**

బుద్ధుడు Judge ye not అన్నాడు. అంటే ప్రపంచాన్ని చూసేటప్పుడు దేనిని వినిశ్చయం (Judge) చేసి చూడకు అని అర్థం. క్రీస్తు కూడా Judge ye not అన్నాడు. కాని, Let Ye be Judged అనే షరతును జోడించాడు.

బుద్ధుని లక్ష్యం ఏమంటే ప్రపంచాన్ని యథాభూతంగా అంటే ఉన్నదానిని ఉన్నట్లుగా చూడడం. కాని మనం ఉన్న వస్తువులను ఉన్నట్లుగా చూడం. వాటికి విలువ కట్టి చూసాం. అసలు "వస్తువు"కు ఏ విలువ ఉండదు. అది మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, విలువైనదీ కాదు, విలువ లేనిదీ కాదు. ఆ వస్తువు ఆ వస్తువే; అది మరేదీ కాదు. బంగారం వట్టి మట్టి మాత్రమే. అది బంగారం మట్టి. దానికి ఏ విలువ లేదు. దానికి ఉన్న విలువంతా మనం ఆపాదించిందే. అంటే బంగారపు మట్టి ముద్ద మీద "విలువ" అనే "ముద్ర"ను గుద్ది, అప్పుడా ముద్దను "విలువైన ముద్ద"గా చూసాం. కాని విలువను దానిమీద ముద్రించక ముందు, అదేమిటో దానిని అదిగా మనం ఇప్పుడు చూడలేము. లౌకిక వ్యవహారాలలో "విలువ" అంటే ఏమిటి? అసలు విలువలు ఎలా ఏర్పడతాయి, అవి మానవ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి? అనే మనోవైజ్ఞానిక శాస్త్రం జోలికి పోను. కాని మనం చర్చించే ఈ విలువ ముద్రణ ఇంక గాఢమైంది, ఇంకా లోతైంది. అదేమిటో ఇప్పుడు చూద్దాము:

బుద్ధుడు చెప్పినట్లుగా ప్రపంచ యథాభూత దర్శనానికి అడ్డు వచ్చేవి మనిషిలో అనేక అంశాలున్నాయి. మనిషి కేవలం రక్తమాంసాల ముద్దకాదు. అతనికొక శీలం (Character) ఉంది. ఇష్టాయిష్టాలున్నాయి. రాగద్వేషాలున్నాయి, మతం ఉంది. మంచి చెడ్డలు ఉన్నాయి. సిద్ధాంతాలు (Doctrines) ఉన్నాయి, దృష్టులు (Views) ఉన్నాయి. వీటన్నింటికితోడు పచ్చ కామెర్లవ్యాధి ఉంది– అంటే ప్రవృత్తులు (Tendencies) ఉన్నాయి. అనారోగ్యం ఉంది (అనారోగ్యుడు సరిగా ఆలోచించలేడు, చూడ లేడు). ఈ సత్యాన్ని బుద్ధుడు ఆర్యసత్యాలను కనుక్కోకముందే, శుష్క తపస్సును మాని, మితాహారాన్ని తీసుకొని ఆలోచించినప్పుడే కనుగొన్నాడు)– ఇన్ని అవలక్షణాలున్నప్పుడు మనిషి మనస్సు మసక బారుతుంది. దానికి మబ్బులు పడతాయి. ఫలితంగా ప్రపంచాన్ని యథాభూతంగా చూడ లేడు. ఇవి చాలవన్నట్లు మన వినిశ్చయాలను (Judgements) ప్రభావితం చేస్తాము. పైగా ఆశ (Greed), భయా (Fear)లు ఉన్నాయి. ఇవి మనిషిని మరింతగా దిగజారుస్తాయి. అసలు ఈ రెండింటి కారణంగానే మతం పుట్టింది. మతం అతనికి, ఆశ, భయాల నుంచి విముక్తిని, రక్షణనుకల్పించ లేక పోగా, వాటిని మరింతగా పెంచింది. స్వర్గ నరకాలను సృష్టించి, స్వర్గం మీద ఆశను, నరకం అంటే భీతిని సృష్టించింది. అపరాధ భావనను సృష్టించి, మతాన్ని నమ్ముకొన్న వానికి నిద్ర లేకుండ చేసింది. అసలు మతంలేని వానికి ఈ అపరాధ భావనే లేదు, భయమూ లేదు.

Judge ye not అని బుద్ధుడన్నాడంటే నీవు ప్రపంచాన్ని చూడబోయే ముందు, దాని మీద ముందుగా "లేబిల్స్" (Labels) అంటించి, "ముద్రలు" గుద్ది, ఆ లేబిల్స్‌లోంచి, ఆ ముద్రల లోంచి ప్రపంచాన్ని చూడకు. నీవు ఒకనికి "మంచి వాడు" అని అతనికి ఒక లేబిలు అంటించి, ముద్ర వేసి అతనిని చూసి నప్పుడు, నీవు నిజంగా "అసలైన అతనిని" చూడడం లేదు. అతనిని "మంచి" అనే ఒక చట్రంలో బిగించి ఆ చట్రంలోని, ఆ గూట్లోని మనిషిని మాత్రమే చూస్తున్నావు. అలాగే ఒకని మీద "చెడు" అని ముద్ర గుద్దిన తరవాత నీవు అతని ముఖంలోకి చూడ గలవా? అసలు ఈ రెండు సందర్భాలలోను నీవు "అసలు అతనిని" చూడడం మానివేసి ఆ "లేబిల్స్", ఆ "ముద్రల"తోనే వ్యవహరిస్తున్నావు. నీకు ఆ ముద్రలతోనే పని, అతనితో పని లేదు. ఆ తరవాత ఆ "మంచి మనిషి" చెడ్డ వాడుగా మారవచ్చు. ఆ "చెడ్డమనిషి" మంచి వాడుగా మార వచ్చు. ఈ మార్పును నీవు గుర్తించవు. ప్రొద్దుట మంచి వాడు సాయంత్రం చెడ్డ వాడు కావచ్చు. ప్రపంచం ప్రవాహం. మనిషి అలాగే శిలగా ఉంటాడని

అన్నపరెడ్డి బుద్ధఘోషుడు, ఫోన్ : 9441274960

ఎవడూ చెప్పలేడు. కా ముద్రలు, లేబిల్స్ మారవు. జీవించి ప్రవాహంగా కొనసాగుతున్నప్పుడు ఏదైనా సంభవమే. కాని నీవు ఎప్పుడైతే ఒకని మీద "మంచి", "చెడు", "విశ్వాసి", "అవిశ్వాసి", "ఆస్తికుడు", "నాస్తికుడు" ముద్రలు గుద్దావో – ఇహ అప్పటి నుంచి నీవు అతనిని ''మృతు''నిగా పరిగణిస్తున్నావు. మనం మన దైనందిన జీవితంలో మన పిల్లల మీద "మా అబ్బాయి వట్టి అల్లరి వెధవ", "మా పిల్లవాడు చాల మంచివాడు" అని లేబిల్స్ అంటిస్తుంటాము. ఈ ''ముద్ర''లకు అనుగుణంగా నడుచుకొని తలిదండ్రుల నమ్మకాన్ని రుజువు చేయాలని ప్రవర్తించే పిల్లల సైకాలజీ గురించి అందరికీ తెలుసు. దాని మీద నేను ఇక్కడ చర్చించను. ఈ లేబిల్స్ గురించి ఒక్కమాట చెప్పి ముగిస్తాను. ఎవరైన ఇద్దరు ఎదురెదురుగా మాటాడుకొంటున్నారంటే, వారు ఇద్దరు కాదు, నలుగురు అని గమనించాలి. అసలు మనుషులు ఇద్దరు, వారు ఒకరిమీద ఒకరు అంటించిన లేబిల్స్ – ఈ విధంగా మొత్తం నలుగురు. Judge ye not అన్నాడు బుద్ధుడు ఎందుకని? Judgements అంటే వినిశ్చయాలు అంటే లేబిల్స్ అసలు ప్రపంచాన్ని చూడ నీయవు. అందుకని మరి వాటిని తొలగించుకోండి. తొలగించుకోవాలంటే ఏమి చేయాలి? మనస్సుకు మబ్బులు పట్టాయని రంగుటద్దాలున్నాయని చెప్పుకొన్నాము. ఈ మరకలు మచ్చలు మనస్సు నుంచి తొలగించుకోవడం ఎలా? దానికి బుద్ధుడు విపశ్యనా ధ్యానాన్ని చెప్పాడు. దీని సారాంశాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే Moment to moment non judgemental observation of ever changing objects of perception అని చెప్పాలి. అంటే "అనుక్షణమూ, సతత పరివర్తితమవుతున్న, సంజ్ఞా ప్రపంచాన్ని వినిశ్చయం (Judge) చేయకుండ ఎరుక కలిగి ఉండు" అని. ఇంతకు ముందు చెప్పిన ముద్రలు గుద్దడం, లేబిల్స్ వేయటం లాంటివి లే కుండ చూడడమే Non Judgmental observation అంటే. అలా చూసినప్పుడు ప్రపంచం యధాభూతంగా కనిపిస్తుంది. ఒక ఉదాహరణ: "నా చేతిలోని ఈ జేబు గుడ్డను నేను జేబుగుడ్డగానే చూస్తున్నాను. దీనిని ఏ చెట్టుగానో పుట్టగానో, మంచంగానో చూడడంలేదు. జేబుగుడ్డను జేబుగుడ్డగానే చూస్తున్నాను" అని అనవచ్చు. కాని ఇక్కడ నేను జేబుగుడ్డను జేబుగుడ్డగా కాక, నా ప్రియురాలు ప్రేమతో నాకిష్టమైన గులాబి రంగు దారంతో పూలను కుట్టి, నాకిచ్చిన కానుక. నేను దానిని వట్టి నూలుగుడ్డగా చూడలేను. పైగా అది ఎక్కడో పెట్టి మరిచి పోయి నప్పుడు ఆమె చేసిన యాగీ అంతా ఇంతా కాదు. పైగా దానిని బంగారు బరిణెలో దాచాను. పైగా ఆ గుడ్డ బెంగాల్ కాటన్‌తో నేసింది. నేను ఈ లేబిల్స్ లోంచి దానిని చూస్తున్నాను. పూర్తిగా నా యిష్టాయిష్టాలను, అవసర అవనవసరాలను, నా తోడి దానికి ఉన్న అనుబంధాలను తొలగించి, అది నిత్యపరివర్తిత మవుతున్న, ప్రవహిస్తున్న, అనత్త, దుఃఖహేతువు అయిన జేబుగుడ్డగా నేను దర్శించడం లేదు. అది నాకు ప్రవాహంగా కాక, నిత్యమైన దానిగా కనిపిస్తుంది." అంటే ప్రపంచాన్ని యథాభూతంగా అంటే ప్రవాహంగా, ఆత్మరహితమైన దానిగా, దుఃఖమైన దానిగా చూడా లంటే, పైన నే చెప్పిన ఏకవాక్య విపశ్యనను సాధన చేస్తే, అది కుదురుతుంది. అలా విపశ్యన చేస్తే ఏమి జరుగుతుంది? నీవు వర్తమానం (present)లో నివసిస్తావు. గతాన్ని తెంచుకొంటావు. గతంలో నీవు మనస్సులో ఏర్పరచుకొన్న నిర్మితులు, కట్టడాలు, అనుభవాలు, నేర్చినవి – అన్నీ వర్తమానంతో (present moment) తెగిపోతాయి. అలాగే భావికి సంబంధించిన ఊహలు, ఆశలు, ఆశంసలూ ఉండవు. అప్పుడు నీవు గతానికి అనుగుణంగా గాని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గాని నివసించవు. నీవు అనుక్షణమూ, జీవిస్తావు. ఎలా జీవించాలి? అనే ఆలోచనే నీకు ఉండదు. అప్పుడు నీకు కేవలం "ఎరుక" (Awareness) "మాత్రమే" ఉంటుంది. నీకు అప్పుడు ఒక శీలం అంటూ ఉండదు. నీకు సహజ సిద్ధత (spontaneity) మాత్రమే ఉంటుంది.

ఇక్కడ రెండు పదాలను మనం అర్థం చేసుకోవాలి. ఒకటి ప్రతిస్పందన (Response) రెండోది ప్రతిచర్య (Reaction) నేను చెప్పేదానికి అతడు ప్రతిస్పందిస్తున్నాడంటే, అతడు తన పూర్వ జ్ఞానం మీద, అనుభవం మీద, లోగడ నేర్చిన దాని మీద ఆధారపడి ప్రవర్తించడం లేదు. అయత్న సిద్ధంగా ప్రవర్తిస్తున్నాడు అంటే అతడు ప్రతిచర్య (Reaction) చేయడం లేదు. ప్రతిచర్య జరపడం అంటే లోగడ నేర్చిన, అభ్యసించిన, అనుభవం మీద ఆధారపడి ప్రవర్తించడం. విపశ్యన ధ్యానంలో నిమగ్నమై ఉన్న వాడు కేవలం అతడు ప్రతిస్పందన (Response) మాత్రమే చేస్తాడు, ప్రతిచర్య (Reaction) చేయడు. ప్రతిచర్య జరపడం అంటే ఆలోచించి చేయడం. మనం ఎప్పుడైతే ఆలోచించ

మొదలు పెడతామో మనం సత్యాన్ని (Reality)ని వాచ్యం (Verbalise) చేస్తాం. అంటే పదాలలోకి మాటలలోకి మారుస్తాం. బుద్ధిని ఉపయోగించి బౌద్ధీకరణం (Intellectialise) చేస్తాం. అప్పుడు ఆ సత్యాన్ని ఆ తథత (Suchness)ను దృగ్విషయంగా (Phenomenal World)గా మార్చివేస్తాం.. మరి ఇలా జరగకుండ వాస్తవాన్ని వాస్తవంగా, తథతను తథతగా అనుభవించాలంటే– ఇలా విభేదీకరించబడిన గోచర ప్రపంచంగా అనుభవించకుండ ఉండాలంటే మనం ఆలోచనలు దాటి, బుద్ధిని (Intellect) దాటి, పదాలను దాటి ఆవలకు పోవాలి. అప్పుడు ఆలోచన లేని "ఎరుక" మాత్రమే ఉంటుంది. కేవలం ప్రతిస్పందన మాత్రమే ఉంటుంది.

ఆలోచనల కావలి తథతను (Suchness)ను చేరడానికి జెన్ బౌద్ధులు "కో అన్" (Koän)లు ఆశ్రయిస్తారు. కో అన్ అంటే ఒక ప్రహేళిక, ఒక చిక్కు ప్రశ్న. దీనిని మామూలుగా బుద్ధితో, హేతుబద్ధంగా, అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఉదాహరణకు: 1. నీవు పుట్టక ముందు నీ ముఖం ఎలా ఉంది? సమాధానం చెప్పు. 2. రెండు చేతులతో చప్పట్లు కొడతాము. ఒక చేతితో చప్పట్లు కొట్టులాంటివి. ధ్యానంలో ఒక దశ "ఎరుక"కు చేరుకొన్న సాధకుణ్ణి ఇటువంటి కో అన్‌ల మీద మనస్సును లగ్నం చేయమంటారు. మామూలుగా ఇలాంటి ప్రశ్నలతో "మతి" (Intellect) పోతుంది కనుక, అడ్డదారిన సతోరి (తథత)ని యథార్థీకరించుకోవచ్చని భావించబడుతుంది. అప్పుడతడు ఆలోచన, బుద్ధి, హేతువులు లేని ఎరుకతో సతోరి (Satori = Enlightenment)ని అనుభవిస్తాడు. ఇక్కడ మనం బుద్ధుడు మహా కాశ్యపునికి పద్మం ఇచ్చిన సందర్భంలో పలికిన పలుకులు. ఈ సందర్భానికి సరిపోతాయని గుర్తిస్తాము. ఆరోజు బుద్ధుడు చేతిలో ఒక పద్మంతో భిక్కు సంఘానికి వచ్చాడు. భిక్షువులంతా రిక్కించి చూస్తున్నారు. ఆయన ఏమీ "మాటాడ" లేదు. నిముషాలు గడిచాయి, గంట గడిచింది. బుద్ధుడు ఏమీ మాటాడ లేదు. బుద్ధుడు ఏమి చెప్పనున్నాడు? భిక్షువులలో ఉత్కంఠ పెరిగింది. ఆరాటం పెరిగింది. అవిశ్రాంతు లయ్యారు. తన్యత (tension) పెరిగింది. అయినా ఆయన ఏమీ మాటాడ లేదు. ఆయన తదేకంగా పద్మాన్ని చూస్తున్నాడు. పద్మంలోకి పోతున్నాడు – భిక్షు సదస్సు నంతా మరిచి పోయిన రీతిలో. గంట గడుస్తోంది. మహా కాశ్యప చిరునవ్వు నవ్వాడు. అప్పుడు బుద్ధుడు ఆయన్ను పిలిచి ఆ పుష్పాన్ని ఆయనకు ఇచ్చి ఇలా అన్నాడు: "నేను మాటలతో (Words) ఏది ఇతరులకు ఇవ్వ గలనో అది వారికి ఇచ్చాను. నేను మాటల ద్వారా ఇతరులకు ఇవ్వ లేని దానిని నీకు ఇస్తున్నాను మాహాకాశ్యపా. దీనిని నీ దగ్గరే ఉంచు, నిశ్శబ్దం (Silence) ద్వారా, మౌనం ద్వారా "సందేశాన్ని" అందుకోగల మరొకడు నీకు కనిపించే దాకా."

ఒక భిక్షువు మరో భిక్షువును అడిగాడు: "ఆ పూవుద్వారా బుద్ధుడు చెప్పిన రహస్యం ఏమిటి? ఆ క్షణంలో ఏమి జరిగింది? – శిష్యులలో ఒకడు నాట్యం చేసి బయటకు పరుగెత్తాడు.

గురువు అన్నాడు: "అదే సరైన ప్రతిస్పందన." మళ్ళీ తరవాత రాత్రికి గురువు శిష్యులను అదే ప్రశ్న వేశాడు. శిష్యుడు మళ్ళీ నాట్యం చేసి బయటికి పరగు తీశాడు. అప్పుడు గురువు ఆ శిష్యుని చెంప చెళ్ళుమనిపించాడు, ఇది తప్పు అంటూ. అప్పుడు శిష్యుడు గురువుతో – "మీరు ఉదయం సరే అన్నారు. ఇప్పుడు కాదంటున్నారు. మీరు అదే ప్రశ్న అడిగారు. నేను అదే సమాధానం చెప్పాను. ఉదయం రైటన్నారు, ఇప్పుడు తప్పు అంటున్నారు." అప్పుడు గురువు అన్నాడు: "ఉదయం అది రైటే, సాయంత్రం అది తప్పు. ఉదయం నీ ప్రవర్తన ప్రతిస్పందన, ఇప్పటి నీ ప్రవర్తన ప్రతిచర్య. ఉదయం నుంచి సాయంత్రానికి ఎంతో ప్రవహించింది. క్షణక్షణమూ ప్రపంచం మారుతుంది. ఉదయ ప్రపంచం వేరు. సాయంత్రం ప్రపంచం వేరు. ప్రశ్న అదే, భాషారూపం అదే. గురువు మారాడు. శిష్యుడు మారాడు. ఇద్దరు గోచారాల (Pastures)ను దాటారు. "కొత్త నేలల" మీద పాదాలు మోపారు. వారికి శీలం (Charecter), మారని సిద్ధాంతం, దృష్టి లేవు. ఎప్పుడూ మార్పుకు లోనయ్యే వారికి, అదే ప్రశ్నలు, అదే భాషలు ఎదురైనా, సమాధానాలు ఒకేరకంగా ఉండవు. వారి సమాధానాలు ప్రతిస్పందనలు, ప్రతిచర్యలు అవి కావు. మరి అలాంటి శీలం, సిద్ధాంతం, ఆలోచన లేని ప్రతిస్పందనలు మనిషిని గందర గోళంలో పడవేయవా? అని అడగవచ్చు. పడేయవు. ఎందుకంటే ధ్యానంలో అంతో జ్ఞానం, సహజ జ్ఞానం (Intuition), అధిగమన జ్ఞానం ఉప్పతిల్లుతుంది. దానితో "ఇది చెయ్యి, ఇది మంచి, ఇది చెడు, ఇది చెయ్యకు" అని చెప్పే అంతరాత్మ (Conscience), ఫ్రాయిడ్ చెప్పిన సూపర్ ఈగో, కాక

విజ్ఞాన లేదా చేతన (Conscience) కలుగుతుంది. "విజ్ఞాన" అంటే ఒక అద్దంలా ఉండి కేవలం ప్రతిస్పందించడం. ఎరుకతో ఉండడం, క్షణక్షణం మారుతూ ఉండే ప్రపంచానికి ఎరుకతో ఉండడం. ఈ మారే ప్రపంచం విరోధాభాసా (Paradox) ప్రపంచం. వైరుధ్యాల సంయోగమే జీవితం. మన అస్తిత్వం, కదిలే తిరుగలి కల్లు, కదలని కల్లు మీద ఆధారపడుతుంది. పెనుతుఫాను కేంద్రంలో మహా నిశ్శబ్దం. సముద్ర గర్భంలో బడబాగ్ని, జీవగర్భంలో మృత్యువు, స్త్రీ పురుషులు, రేబవలు, ఆవిరి నీరు మంచులు – ఇవన్నీ వేరు వేరా? వైరుధ్యాలా? అసలు మన అస్తిత్వమే (Existence) తనను తాను విరోధించుకొంటుంది. అవి మనకు అలా కనిపిస్తాయేకాని అవి నిజంగా విరోధలా. మనం బ్రతికి ఉన్నామా? చచ్చిపోయామా? ఆవిరి, నీరు, మంచు మూడు వేరువేరా, విరుద్ధాలా? వాస్తవంలో అవి విరోధాలు కావు. అవి ఒకటే వాటిని క్షణంక్షణం మారే ప్రవాహంగా చూడక, విభజించి, ముక్కకు ముక్క, తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదంగా చూస్తున్నాము. ప్రవాహంగా, ప్రతీత్య సముత్పాదంగా, కార్యకారణ బంధంగా ఎందుకు చూడ లేక పోతున్నాము? ఎందుకు చూడ లేక పోతున్నామో, అలా చూడడమెలాగో, మనకు బుద్ధుడు వివరించాడు.

**సిద్ధార్థుడికి ఆనాటి రాత్రి ఏమైంది?**

"నేను కనుగొన్న ధర్మం గంభీరం, చూడతరంగానిది, ఎరుకకు కష్టమైంది, ఆలోచనకందేది కాదు. సూక్ష్మతరం, విజ్ఞులు మాత్రమే గ్రహించగలిగింది. కాని జనం తమ "ఆలయాన్ని" (Place) (దీనిని మునుముందు వివరిస్తాను) – ప్రేమిస్తారు: తమ ఆలయాన్నే ఆనందిస్తారు, సుఖిస్తారు (Revel). తమ ఆలయాన్ని (గూటిని) ఆనందించే, ప్రేమించే, సుఖించే జనులకు ఈ ఠాన (Ground)ను – ఈ సంఖతత్వాన్ని (Conditionality), ప్రతీత్య సముత్పాదాన్ని చూడతరం కాదు." అతడు కనుగొంది అపూర్వం, అపరిచితం, భావన చేయడం కష్టమైంది. మాటలలో చెప్పడానికి వీలు కానిది. అయినా ఆయన చెప్పిన ప్రతీత్య సముత్పాదం అందరికీ తెలిసిందే – ఒక అర్థం: గుడ్డునుంచి పిల్లవస్తుందనీ, విత్తనం నుంచి మొలకవ స్తుందనీ. అయినా ఆయన నొక్కి చెప్పాడు– ఈ ప్రతీత్య సముత్పాదాన్ని చూడడం అత్యంత కష్టతరం అని. ఎందుకని కష్టతరం? ఎందుకని అంటే మనం మన "ఆలయాల" (Places = గూళ్ళు, ఆవాసాల)కు అంటుకు పోతాం. ఇక్కడ "ఆలయం" అంటే దేనికైతే మనం అత్యంతంగా "అతుక్కు" పోతామో అది – అంటే దేని మీద అయితే మన "గుర్తింపు" (Identity) ఆధారపడి ఉంటుందో, దేని ఆధారంగా అది నిర్ణయమవుతుందో అది గూడు (Place). మరి మన గుర్తింపు దేని మీద ఆధారపడి ఉంటుంది? మనం ఉన్న "చోటు", (పలాన ఊరు), మన సామాజిక "అంతస్తు, హోదా", "మత విశ్వాసం", "రాజకీయ సిద్ధాంతం", "నాకు ఒక శాశ్వత ఆత్మ ఉంది." "నేనొక వ్యక్తిని" అనే భావన – ఒక్కమాటలో చెప్పాలంటే నీవు పలాన వ్యక్తివి అని ఇతరులు గుర్తించడానికి అవసరమైన గుర్తులన్నీ – వీటి మీద నీ మూర్తిమత్వం ఏర్పడుతుంది. ఈ గుర్తింపును, మూర్తిమత్వాన్ని నీ ఇల్లుగా, ఆలయంగా (Place) భావించి, దానికి అతుక్కు పోతావు. ఇలా నీవు నీ ఆలయానికి అతుక్కుపోయి ఆనందిస్తున్నప్పుడు, ఈ ఆలయానికి వెలుపలిది అంతా నీకు పరాయిది అవుతుంది. పరాయి ఆలయంలో నీకు ఆనందం ఉండదు. నీ గూట్లో ఉన్నంత సేపు నీకు భద్రత, ఆనందం ఉంటాయి. గూడు చెదిరితే, అంటే "గుర్తింపు" పోతే, భయం, ఆందోళన నిన్ను ముంచెత్తుతాయి. నీవు నీవు కాకుండా పోవడాన్ని ఒక్కసారి ఊహించు.

గౌతముని సత్యాన్వేషణలో అతడు తన సామాజిక స్థానాన్ని, మాతృభూమిని, కుటుంబంలో తన స్థానాన్ని, తన విశ్వాసాలను, తన శరీరాన్ని నడిపే ఒక శాశ్వతాత్మ తనకు ఉందనే నమ్మకాన్ని – అన్నింటినీ – అంటే తన "గుర్తింపు"ను, తన మూర్తిమత్వాన్ని – వదిలివేశాడు. అయినా ఆయనకు పిచ్చెక్క లేదు. ప్రపంచంలో భార్యాబిడ్డలను, సింహాసనాన్ని తలిదండ్రులను వదిలి వేసిన వారు ఎంతోమంది ఉండవచ్చు. కాని తన గూటిని, ఆలయాన్ని, తన "గుర్తింపు"ను, తన లోపల ఉండి తనను నడుపుతుందని భావించబడిన "ఆత్మ"ను వదిలి వేసిన వారు మనకు చరిత్రలో మరొకరు కాన రారు.

బుద్ధుని అసలు "త్యాగం" ఇక్కడే ఉంది. కాని అతడు "గూటి"ని వదిలి వేసి "ఠాన" (Ground)ను పట్టుకొన్నాడు. ఇది ఒక అవినిశ్చిత (Contingent), అస్పష్ట (Ambious) ముందుగా ఊహించరాని (Un predictable), మోహనమైన (Fascinating), భయానకమైన "జీవితం" (Life) అనబడే భూమి. అది భూమి కాని భూమి. ఆధారం కాని ఆధారం. కనిపించీ కనిపించక ముందే మాయ మవుతుంది. ఎందుకు? పునర్నవీకరించు (Renew) కోవడానికి. వెంటనే ముక్కలై

అంతర్ధానమవుతుంది. అది అనంత ధారా ప్రవాహం. అది ఆధారం కాని ఆధారం, అంటే అసలు ఆధారం లేదని కాదు. ఇది నీకు మరోవిధంగా ఆధార మవుతుంది. గూడు, ఆలయం నిన్ను చుట్టు కొని బంధించివేస్తే, ఇది తెరుచుకొని నిన్ను బయటకు పోనిస్తుంది. నీవు అక్కడ "గూటి"లో రెండు చేతులు పట్టుకొని, కాళ్ళు నిలదొక్కుకొని గట్టిగా నిలబడితే, ఇక్కడేమో "ప్రవాహాని"కి అడ్డంగా పొడుగు కాళ్ళు ఈగ నీటి మీద అనీ ఆనకుండా గెంతుతూ పోయి నట్లుగా నీవు వేగంగా చలించాలి. ఈ రకంగా ప్రవాహాన్ని ఈదడాన్ని బుద్ధుడు "ప్రవాహ ప్రవేశం" (స్రోతాపన్నం) అన్నాడు. ఈ "నదీ ప్రవేశం"తో ఆయన దృష్టికోణం సమూలంగా మారింది – ఈ మార్పును చెప్పడానికి ఆయన "తెలియడం" (Know) "సత్యం" (Truth) అనే పదాలను వాడ లేదు. ఆధారం లేని భూమికి – ఈ సంఖతత్వాన్ని, ప్రతీత్య సముత్పాదానికి మేల్కొనడం, "జాగరితం" (Waking up), అప్రమత్తం కావడం మాత్రమే చెప్పాడు. అప్పటి దాక ఆయన ఒక స్థిర బిందువులో కూరుకు పోవడం వలన, దీనికి అంధు డయ్యాడు. అటువంటి మేలుకొలుపు వలన ఒకడు తనకు "తెలిసిన దాని నంతా'' పునర్నిర్మించుకోవలసి వస్తుంది. అయితే ఈ మేలుకొలుపు (awakening = ఎరుక) సంజ్ఞానాత్మక (Cognitive) చర్య కాదు. జ్ఞాన సంబంధమైనది కాదు. అది ఒక పెను మార్పు. భూకంపంలో భూమి సర్దుబాటు చేసుకొన్నట్లు ఒకని అంతః కుహరంలో జరిగే మార్పు – సర్దుబాటు. తన లోపల, ఇతరుల తోడి, ప్రపంచంతోడి ఉన్న సంబంధాలలో జరిగే ''అస్తిత్వ సర్దుబాటు'' (Existential adjustment). జీవితానికి సంబంధించిన మహా పెద్ద ప్రశ్నలకు ముందుగా సిద్ధం చేసుకొన్న సమాధానాలతో ప్రతిచర్య (React) జరప కుండ, ఈ నూతన కోణం నుంచి ఆయన ప్రతిస్పందనలు (Responses) మాత్రమే చేశాడు. ఈ కదిలే ప్రపంచంలో ఉండా లంటే గతంలో ఏమి జరిగింది, అనాగతంలో ఏమి జరగనుంది అనేదానిని ఆలోచించ రాదు. ప్రస్తుత క్షణంలో జరిగే దానికి సచేతనులమై (Conscious) ఉండాలి. అంటే గత, అనాగతాల వాస్తవికతను మనం కాదనడం లేదు. ప్రకృత క్షణంలో ఉండడం – అంటే జీవిత అనిత్యతతో "నూతన సంబంధం"లోకి ప్రవేశిస్తున్నాము. గౌతముడు మనలను కాలాతీత లేదా అకాలిక స్థితికి, మార్మిక దృష్టికి పొమ్మని చెప్పడం లేదు. బదులుగా అనుక్షణం వివృతమయ్యే (Open) అవినిశ్చిత, ఆగంతుక (Contingent) ప్రపంచంతో తలపడ మన్నాడు. ప్రకృత క్షణంలో ఏమి జరుగుతున్నదీ ఎరుక పరుచుకోవడానికి గౌతముడు మనకు ''సతి'' (Mindfulness) ధ్యాన పద్ధతిని అందించాడు. దీనిని నేను వివరించను. ఒక శాశ్వత, ఆధార రహిత మూలంలో – అది దేవుడు కాని, శుద్ధ చైతన్యం కాని – మనకు ముక్తి, మోక్షాలు లేవన్నాడు గౌతముడు. స్వేచ్ఛ లేదా ముక్తి అంటే లోభ, ద్వేష, మోహాల నుంచి స్వేచ్ఛ అన్నాడాయన. అటువంటి స్వేచ్ఛ ఎక్కడో ప్రపంచానికి దూరంగా లేదు. ఈ సంఖత, కార్యకారణ బంధిత (ప్రతీత్య సముత్పాద) ప్రపంచం లోపలికి పోయి చూడడంలో ఉంది. ఈ కలుషితమైన దేహంలో అకలుషిత మౌలిక, మారని ఆత్మ ఉండి, మనిషిని నడిపిస్తుందని ప్రాచీన ప్రపంచంలో ఇటు కాశీ నుంచి అటు ఏథెన్స్ దాక అందరు విశ్వసించారు. కఠోర తపస్సుతో, తాత్విక విచార ధారతో ఈ ఆత్మను శరీరం నుంచి విడ గొట్టి, దానిని అధిభౌతిక సత్యమైన దేవునితో సంయోగం చేయడంలో మోక్షం ఉందని వారంతా భావించారు. గౌతముడు తాను కనుగొన్న ఆధారం లేని ఆధార జీవిత భూమి, అప్పటి వారి ఆలోచనా ప్రవాహానికి "ఎదురు ఈదడ"మేనన్నాడు. ఈ ప్రపంచం నుంచి విడి పోయి ఎక్కడో ముక్తిని పొందడంకంటే, ఏ దేవునితోనే, విశ్వాతీత ఆత్మతోనో మమేకం కావడంకంటే, తన శిష్యులకు, ఈ ప్రపంచంలోనే, ఈ దృగ్విషయిక ప్రపంచంలోనే (Phenomenal world), దాని ఆటు పోటులకు, పతనోత్పతనాలకు ఎరుకతో ఉండడాన్ని బోధించాడు. బుద్ధుడు విపశ్యనా విధానం, అనూచానంగా వస్తున్న జ్ఞానాన్ని తలక్రిందులు చేసింది. సనాతన జ్ఞానం, తమ లోపలి "ఆత్మ"ను ఎరగమంటే, గౌతముడు తన శిష్యులను తమ శరీరాలను, తమ ఇంద్రియాలను వేసే ముద్రలను, లేచే పడి పోయే వేదనలను, వాటి ఆకర్షణ, వికర్షణలను, వాటి సముదయ, అంతాలను ఎరుక చేసుకోమన్నాడు. అతడు సమూల పరివర్తవాది. విగ్రహ ధ్వంసకుడు (మనిషిలోని విగ్రహాలను ఆత్మలను) పడగొట్టాడు. పూజారి, బ్రాహ్మణ మతాన్ని కాదన్నాడు. అర్థంకాని, అర్థం లేని దేవుళ్ళను, వారికి చేసే పూజా కర్మకాండలను నిరసించాడు. ఈ విషయాలను తేలికగా జనం నమ్మరు. "కళ్ళల్లో దుమ్ములేని వారు కొందైన ఉంటారు. వారైన తనను అర్థం చేసుకొంటారని" భావించి, జనాలకు బోధించడం మొదలుపెట్టాడు. మరి మనమూ కంటి అద్దాలను, దుమ్మును తొలగించి మనస్సును తుడిచిన అద్దంలా పెట్టుకొని, సతత ప్రవాహమైన అనిత్య, అనత్త, దుఃఖ ప్రపంచాన్ని దర్శిద్దాం.

# బుద్ధం శరణం గచ్ఛామి

*- కాలువ మల్లయ్య*

రెండున్నర సహస్రాబ్దుల క్రితమే భారతదేశంలో పుట్టి ఆసియా ఖండమంతటా విస్తరించిన విశిష్ఠ ధర్మం బౌద్ధం. మహమ్మద్ ప్రవక్త. ఏసుక్రీస్తులాంటి మహాప్రవక్తల కంటె చాలాకాలం ముందే బౌద్ధం విస్తరించింది. మత ఛాందసం మూఢ నమ్మకాలు, అతీంద్రియ శక్తుల మాయాజాలంలో పడి హిందూమతం కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఆవిర్భవించిన ధర్మం బౌద్ధం విగ్రహారాధనను, యజ్ఞయాగాది తంతు కార్యక్రమాలను మానవాతీత శక్తులకు ప్రాధాన్యతనివ్వకుండా మనిషిని కేంద్రంగా తీసుకొని మనిషికి గల దుఃఖ హేతువును ప్రయోగాత్మకంగా నిర్వచించిన అద్భుత ధర్మం. సామాన్య మానవుడు మొదలు రాజాధిరాజు వరకు అందరినీ ప్రభావితం చేసిన దుఃఖనివారణ మార్గం. జీవిత కాలంలో ఒకేఒక యుద్ధం చేసిన అశోకుడు లాంటి గొప్ప చక్రవర్తిని శాంతికి అంకితం చేసిన గొప్ప ధర్మం బౌద్ధం. అయితే భారతదేశంలో పుట్టి ఆసియా ఖండమంతటా విస్తరించి పుట్టిన స్థలం నుండే దూరం కావడం విషాదాల్లో కెల్లా విషాదం.

అందుకే మనదేశం నుండి ఎప్పుడయితే బౌద్ధం మటుమాయమై పోయిందో అప్పుడే భారతదేశం మత విషయకంగా ఆత్మహత్య చేసుకున్నదంటాడు గురజాడ. భారతదేశంలో బౌద్ధం మౌర్యుల కాలంలో మిగిలి ఉంటే, కొనసాగి ఉంటే మన రాజకీయాలు మతాల చుట్టే తిరిగి ఉండేవి కావు. మనిషి కేంద్రంగా కాకుండా దేవుడు కేంద్రంగా రాజకీయ వ్యూహాలు నడిచేవీ కావు. బౌద్ధం మన దేశంలో ప్రధాన మతంగా కొనసాగివుంటే మనం చైనా, జపాన్‌లలా అభివృద్ధి పథంలో పయనించే వాళ్ళం. గత చరిత్రను నిశితంగా పరిశీలిస్తే మత విషయకంగా గురజాడ చెప్పింది అక్షరసత్యమే. మనదేశంలో బౌద్ధం అప్పట్లాగే ఉండి ఉంటే కులమతరహిత సమాజం ఏర్పడటానికి అప్పుడే పునాదులు పడివుండేవి. కారణాలేవైనా బౌద్ధం మనదేశం నుండి దూరంగా పోవడం ఘోరాతి ఘోరం. విషాదాల్లో కెల్లా విషాదం.



ధర్మచక్ర ప్రవర్తన

అంబేద్కర్ మరికొంత కాలం బతికి ఉన్నా మనదేశంలోని దళితబహుజనులు చాలామంది బౌద్ధాన్ని స్వీకరించి ఉండే వారు. దాంతో ఇప్పటికీ ఉన్న అంటరానితనం అవశేషాలు మాయమయ్యుండేవి. కులభేదాలు తగ్గేవి. దళితుల్లో ఉన్న అంతర్గత కలహాలు, ఉపకులాలు వర్గీకరణ భేదాలు ఈ స్థాయిలో ఉండేవికావు. దళితబహుజన కులాల్లో ఐక్యత వర్ధిల్లి సమిష్ఠి పోరాటాలకు బాట పడిఉండేది. ఖచ్చితంగా దళితుల అభివృద్ధిరేటు ఇప్పటి కంటె మెరుగ్గా ఉండేది. బౌద్ధం ఒక ధర్మంగా లేదా మతంగా ఆసియా ఖండంలోనే విశేషంగా ఉన్నప్పటికీ ప్రపంచంలోని శాంతియుత సిద్ధాంతాలన్నింటికీ బౌద్ధమే పునాది. ఆదిమ కమ్యూనిస్టు సమాజానికి ప్రపంచం తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న సమయంలో వచ్చిన బౌద్ధం ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. యూదుల సామాజిక సంఘర్షణలోంచి వచ్చిన క్రైస్తవానికి బౌద్ధమే పునాది. శాంతి, అహింస, సహనం ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి అహింస అనే ఔషధాన్ని ప్రపంచానికి ప్రసాదించిన మహాత్మాగాంధీపై బుద్ధుని బోధనల ప్రభావం ఉంది.

బౌద్ధం రాకతో హిందూమతం తుడిచిపెట్టుకు పోయినట్టవడానికి కారణం అందులో ఉన్న కులవ్యవస్థ, కరుడు గట్టిన భావాలు. హింస పునాదులపై, ద్వేషం గోడలపై నిర్మింపబడిన అనేక సిద్ధాంతాలకు విరుగుడు బౌద్ధం. అంటరానితనం పేరుమీద, శూద్రుల పేరుమీద మనుషుల మధ్య దూరాన్ని పెంచే దుర్మార్గాన్ని ఖండిస్తూ కులాల కతీతంగా తమలో ప్రవేశం కల్పించింది బౌద్ధం. అందుకే

డాక్టరు కాలువ మల్లయ్య, ఫోన్ : 98493775578

ఖండాంతర ఖ్యాతి పొందింది. సర్వసుఖాలు అనుభవించే అవకాశం ఉన్న రాజ కుటుంబంలోంచి వచ్చిన బుద్ధుడు అన్నీ వదులుకొని ఈ ప్రపంచానికి గల దుఃఖహేతువు కనుగొనడం అతని త్యాగానికి ప్రతీక మహాత్ముడు చెప్పిన ఒక చెంప మీదినుంచి కొడితే మరో చెంప ఇవ్వాలనడం ఇందులో భాగమే. సర్వ అనర్థాలకు మూలభూతమైన ఆశ, ద్వేషాలను వదులుకుంటే తప్ప మనిషికి మోక్షం లేదని చెప్పిన ధర్మం బౌద్ధం. దుఃఖహేతువైన స్వంత ఆస్తిభావనను, దురాశను వదులుకొమ్మని ఆదిమ కమ్యూనిస్టు భావనను పరోక్షంగా ప్రచారం చేసిన ధర్మం బౌద్ధం.

ఈ రోజు కొందరు అంబేద్కర్ చాలదు .. బుద్ధుడు చాలదు.. మార్క్సు కావాలని, కాదని రకరకాల వాదాలు చేసేవాళ్ళు క్రీస్తు పూర్వమే బుద్ధుడు చెప్పి దుఃఖ నివారణ, అహింస మార్గాన్ని గూర్చి ఆలోచిస్తే మంచిది. అంబేద్కర్ పీడిత జాతుల సముద్ధరణ కోసం తన మేధస్సునంతా వినియోగించాడు. ఈ దేశంలో కులం నిర్వహిస్తున్న పాత్రను గుర్తించిన మొట్టమొదటి వ్యక్తి అంబేద్కర్ – కుల నిర్మూలన కోసం సిద్ధాంతాన్నందించాడు. మార్క్సిజం గత శతాబ్దిలో ప్రపంచాన్ని విశేషంగా ప్రభావితం చేసిందన్నమాట వాస్తవం. ఎన్నో మానవీయ విలువలను ప్రతిపదించి సమాజాన్ని పీడితవర్గాలకు అనుకూల దిశగా నడిపించిందన్నదీ వాస్తవమే. కాని మార్క్సిజం నిర్మూలించదగిన దానిని ద్వేషించు ద్వేషించు అనే ద్వేషం, హింస పునాదులపైన్నే పుట్టి పెరిగి విస్తరించింది. బౌద్ధం మాత్రం ప్రేమను బోధించింది. సహనాన్ని బోధించింది. దుఃఖ హేతువును చెప్పింది. దుఃఖ నివారణోపాయంగా అష్టాంగ మార్గాలను ఉపదేశించింది. శాంతియుత సహజీవనాన్ని బోధించింది.

కారల్ మార్క్సు చెప్పిన ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే భావంకంటె వేల ఏండ్ల క్రితమే బుద్ధుడు చెప్పిన బహుజన హితయా.. బహుజన సుఖాయ విస్తృతమైన పరిధి కలది. మార్క్సిజం ఆర్థిక సమానత్వమే అన్ని సమస్యలకూ పరిష్కారం అంటే బుద్ధిజం సంఘం శరణం గచ్ఛామి. ధర్మం శరణం గచ్ఛామి అంది. మార్క్సిజం, అంబేద్కరిజంల సమాహారంగా వేలేండ్ల క్రితమే వెలువడిన విశిష్ఠ ధర్మం బౌద్ధం. ఇలా బౌద్ధం ప్రపంచంలో అన్ని సిద్ధాంతాలకంటె ముందుగా దుఃఖ నివారణోపాయాన్ని ఉపదేశించింది. కులవ్యవస్థకు, మూఢాచారాలకు ఎదురునిలిచి హేతుబద్ధ ఆలోచనకు అప్పుడే మార్గం సుగమం చేసింది. దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందిన బౌద్ధం శంకరాచార్యులవారి రాకతో హింసాయుత చర్యలతో వెనుకడుగు వేసింది. శంకరాచార్యులవారి ఆదేశాలతో బౌద్ధులను గానుగలలో వేసి చిత్రహింసలకు గురిచేసి చంపివేసారు. అలా బౌద్ధాన్ని నేల మట్టంచేసిన బ్రాహ్మణీయ వర్గాలు బుద్ధున్ని దశావతారాల్లో ఒక్కడిగా చిత్రించి తమ కులంలో కలుపుకున్నారు. దాంతో బౌద్ధంలో అనేక అవాంఛనీయ ధోరణులు కలిసిపోయాయి. విగ్రహారాధనే లేదన్న బౌద్ధంలో విగ్రహారాధన చొరబడింది. కాలచక్రలాంటి యంత్రతంత్ర విద్యలూ ప్రవేశించాయి. దలైలామా బౌద్ధ గురువుగానూ, రాజకీయ నాయకుడుగానూ పాత్ర నిర్వహిస్తున్నాడు. టిబెట్ చైనాలో భాగమో కాదో తేల్చు కోవాల్సింది ఆయా దేశాల ప్రజలు, రాజకీయాలు కాని మతగురువులు కాదు. హిందూమతంలోని ఏ అవాంఛనీయ ధోరణులపై తిరుగుబాటుగానైతే బౌద్ధం భారతదేశంలో వ్యాపించి విస్తరించిందో ఆ హిందూమతంలోని యంత్రతంత్ర విద్యలు అందులో ప్రవేశించడం విచారింపదగ్గ విషయమే.

ఏదేమైనా పేరు ఏదైనా కొంతకాలంక్రితం మన రాష్ట్రంలోని అమరావతిలో కాలచక్ర బౌద్ధ ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించడం అందుకోసం ప్రభుత్వం విశేషంగా సహకరించడం చెప్పుకోదగ్గ విషయమే. దలైలామా టిబెట్ రాజకీయాలజోలి కాలచక్రంలో బౌద్ధంలో లేని తంత్ర విద్యలు సంగతి వదిలిపెడితే ఈ ఉత్సవాలతో బౌద్ధాన్ని మరోసారి స్మరించుకున్నట్టయింది. రాష్ట్రంలో, కొంతవరకు దేశంలో బౌద్ధం ధ్వనులు ప్రతిధ్వనించాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది బౌద్ధ భిక్షువులు అమరావతి కొచ్చారు. అమరావతి క్షేత్రం బుద్ధం శరణం గచ్ఛామి ధ్వనులతో ప్రతి ధ్వనించింది. బౌద్ధం అభిమానులను, బౌద్ధం గురించి ఆలోచించేవారిని అక్కడికి నడిపించాయి. పాలకులు కూడా గౌతమబుద్ధుడి విగ్రహం ముందు మోకరిల్లేట్టు చేసాయి.

క్షుద్ర విద్యగాల్లయిన బాబాలముందు మోకరిల్లడం కంటె ఆ తథాగతుని ముందు మోకరిల్లడం మంచిదే కదా..! ఈ ఉత్సవాలు బౌద్ధం గురించి మళ్ళీ ఆలోచించుకునేట్టు చేశాయి. అంబేద్కర్ మాటలను మననం చేసుకునేట్టు చేసాయి. ఏం కోరయితే బుద్ధుడు మానవాళి మంచి మనుగడకోసం కృషి చేసాడో దుఃఖ నివారణోపాయాన్ని కనుగొన్నాడో దాన్ని గురించి ఆలోచించేట్టు చేసాయి.

*మిగతా 71వ పుటలో....*



అశోకుడు

# ఆచార్య పరంపర

- ఈమని శివనాగిరెడ్డి

సిద్ధార్థ గౌతముడు సంబోధిలో కనుగొన్న ధమ్మ మార్గాన్ని తన 35వ ఏడునుంచి 80వ ఏడువరకూ 45 ఏళ్లపాటు వివిధ సందర్భాల్లో, వివిధ వ్యక్తులకు, సమూహాలకూ, రాజు–పేద, ఆడామగా తేడాలేకుండా బోధించాడు. సాధారణ వ్యక్తులకు సైతం సులభంగా అర్థమయేట్టు పోలికలను ఉదహరిస్తూ బోధించిన ప్రవచనాలు, సామాన్యజన సాంఘిక జీవితాలపై ఎంతో ప్రభావాన్ని చూపాయి.

తన తరువాత ధమ్మమే అందరికీ మార్గదర్శకమౌతుందని చెప్పిన బుద్ధుడు, తనకు వారసునిగా ఎవరినీ నియమించలేదు. ఆయన బోధించిన ధమ్మం, ప్రజల జ్ఞాపకాల్లో నిలిచి, నలుదిశలాపాకింది. మహాపరినిర్వాణం తరువాత, ధమ్మ విస్తరణ సాగించటానికి ముందుగా దాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని గుర్తించిన మహాకాశ్యపుడు ధమ్మం, వినయాలను పఠించి, వల్లె వేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. రాజగృహలోని సప్తపర్ణి గుహ దగ్గరున్న వెభర అనే కొండను ఎంచుకొని అక్కడ 500 మంది అర్హంతులను సమావేశపరిచాడు. ఈ రెండింటినీ పఠించిన తరువాత, విషయపరంగా వాటిని విభజించి క్రోడీకరించారు. భిక్షువులకుద్దేశించిన నియమ నిబంధనలతో కూడిన ప్రసంగాలను వినయ పిటకమనీ, జనబాహుళ్యానికి చేసిన ప్రసంగాలను సుత్త పిటకమనీ, అంతిమ సత్యాన్ని గురించి విశ్లేషణాత్మకంగా చేసిన ప్రసంగాలను అభిధమ్మ పిటకమనీ, ఈ మూడింటినీ కలిపి తిపిటకాలని అన్నారు. మహాపరినిర్వాణం తరువాత మూణ్ణెళ్ళకు జరిగిన ఈ సమావేశాన్ని మొదటి బౌద్ధ సంగీతి అన్నారు. బుద్ధ వచనాలను మొత్తంగా ఒక్కరే గుర్తుపెట్టుకోవటం కష్టం కాబట్టి, కొందరు కొన్ని భాగాలను మననం చేసి, స్మృతిలో ఉంచుకొన్నారు. బుద్ధవచనాలను గ్రంథస్తం చేసేనాటికి మొత్తం నాలుగుసార్లు జ్ఞాపకాల్లోంచి వల్లెవేయటమైంది. మహాపరినిర్వాణం తరువాత వంద సంవత్సరాలకు వైశాలిలో 700 మంది భిక్షువులతో జరిగిన రెండో సంగీతిలో బుద్ధవచనమంతా వల్లించారు. మహాపరినిర్వాణం తరువాత 228 ఏళ్ళకు అశోకుని అధ్వర్యంలో పాటలీపుత్రంలో జరిగిన మూడో బౌద్ధ సంగీతిలో వెయ్యిమంది భిక్షువులతో బుద్ధవచనాన్ని వల్లించారు.

మహాపరినిర్వాణం తరువాత, 238 ఏళ్లకు శ్రీలంకలో జరిగిన నాలుగో బౌద్ధ సంగీతిలో 68 మంది భిక్షువులు బుద్ధవచనాన్నంతా వల్లెవేశారు. మహాపరినిర్వాణం తరువాత, 433 ఏళ్లకు 'మాండలే' (బర్మా) అయిదవ బౌద్ధ సంగీతి జరిగింది. బుద్ధుని అనుచరులైన ఆనంద, ఉపాలి, సారిపుత్రులు సుత్త, వినయ, అభిధమ్మ పిటకాచార్యులుగా ఉండగా తరువాత అదే క్రమంలో త్రిపిటకాలను మననం చేసుకొని, జ్ఞాపకంలోంచి ఒక్కో పిటకం మొత్తాన్ని వల్లె వేసిన బౌద్ధాచార్యుల పరంపర కొనసాగింది.

6వ సంగీతి ప్రత్యేకంగా నిర్మించిన గుహ సముదాయంలో (Kaba Aye Pagoda in Yangon (Barma) ) జరిగింది. ఎనిమిది థేరవాద బౌద్ధ దేశాల నుంచి 2500 భిక్షువులు పాల్గొన్న ఈ సంగీతి రెండు సంవత్సరాలపాటు 1954 నుంచి 1956 వరకు జరిగి, బుద్ధుని 2500వ మహాపరినిర్వాణ సంవత్సరంలో ముగిసింది. -- బుద్ధుని బోధనలు సంరక్షించి - థేరవాద సంప్రదాయ పద్ధతిలో ఆచరణలోకి తీసుకురావటమే ఈ సంగీతి ముఖ్య ఉద్దేశ్యం.

**బు**ద్ధుని మహాపరినిర్వాణ తేదీని గుర్తించటానికి, మౌర్య చంద్రగుప్తుడు సింహాసనమెక్కిన తేదీని పరిగణనలోకి తీసుకోవటం ఒక అనవాయితీ అయింది. రిచర్డ్ గాంరిచ్ మాత్రం అశోకుని పట్టాభిషేక తేదీని లెక్కలోకి తీసుకొని బుద్ధుని మహాపరినిర్వాణం క్రీ.పూ. 422లో జరిగిందని చెప్పాడు. (ఈ విషయంలో భిన్న తేదీలున్నాయి. క్రీ.పూ. 483వ సంవత్సరాన్ని మహాపరినిర్వాణ సంవత్సరంగా తీసుకొంటున్నారు) కొందరు అశోకుని బౌద్ధసలహాదారైన మొగ్గలిపుత్త తిస్సమహిందునికి దీక్షనిచ్చి, ధమ్మవ్యాప్తికి శ్రీలంకకు పంపేకార్యక్రమంలో ప్రధాన వ్యాప్తికి శ్రీలంకకు పంపే కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించాడని, అతడు సిగ్గవ అనే ఆచార్యుని నుంచి వినయాన్ని స్వీకరించి వినయధరుడైన బౌద్ధాచార్యుడైనాడని అశోకావదానంలో నున్న వృత్తాంతం, కల్పితమని కొందరి వాదన. ఏదిఏమైనా మొగ్గలీపుత్తతిస్స క్రీ.పూ. 3వ శతాబ్దంలో పశ్చిమ లేక వాయువ్య, భారతదేశవాసి అనీ, అతడు 80వ ఏటగానీ,

ఈమని శివనాగిరెడ్డి, ఫోన్ : 98485 98446

86వ ఏటగానీ మరణించాడనీ దీపవంశంలో విభిన్న కథనాలు తెలియజేస్తున్నాయి. చంద్ర గుప్త మౌర్యుడు క్రీ.శ. 317లో గానీ, అటు తరువాత నాలుగైదు ఏళ్లకుగానీ సింహాసనాన్ని అధిష్టించాడనీ కొందరు చరిత్రకారులు పేర్కొంటుండగా, అశోకుడు మరియూ మౌర్య వంశ పతనం పై పరిశోధనలు గావించిన రొమిలాథాపర్, క్రీ.శ. 321లో చంద్రగుప్తుడు రాజ్యానికి పట్టాభిషిక్తుడైనాడని తేల్చింది. దీపవంశ, మహావంశాల్లో పేర్కొన్న దాక్షిణాత్య సంప్రదాయం ప్రకారం, బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత అశోకుని కాలం వరకూ, వినయపిటకాన్ని వరుస క్రమంలో అందించిన ఆచార్యుల్లో ఉపాలి, దాసక, సోణక, సిగ్గవ, మొగ్గలిపుత్తతిస్సలనే ఐదుగురున్నారు.

శ్రీలంక, భారతదేశ చరిత్ర, చారిత్రక సాహిత్యాల మధ్య గల సంబంధం ఈ సందర్భంగా మనకెంతో ఉపకరిస్తుంది. దీపవంశ, మహావంశాలు, గురువు నుంచి శిష్యునికి వరుసగా మౌఖిక సంప్రదాయం ద్వారా వినయ పిటకం అంది వచ్చినట్లు తెలుపుతున్నాయి. వినయపిటకంలోనూ, శ్రీలంక బౌద్ధ సాహిత్యంలోనూ పేర్కొన్న వినయపిటకాచార్యులైన వినయధరుల క్రమాన్ని బట్టి బుద్ధుని మహాపరినిర్వాణ తేదీని నిర్ణయించటానికి పూనుకోవచ్చు.

బుద్ధుని మహాపరినిర్వాణానికీ, అశోకునికీ మధ్య గల 218 సంవత్సరాల వ్యవధిపై జరిగిన పరిశోధనలు, చాలా మంది వినయప్రముఖులుగా పేర్కొనబడిన మహాథేరుల వివరాలనందిస్తున్నాయి. మరోవైపు దశవత్థూని అంశాన్ని లేవనెత్తిన ఎనిమిది మంది థేరులు, తాము బుద్ధున్ని చూచామన్న విషయాన్ని దీప, మహావంశాలు పేర్కోవటం కూడా కొంత సందిగ్ధానికి తావిచ్చింది.

ఇలాంటి విరుద్ధ సమాచార మంతా థేరవాద సాహిత్యానికే ఆపాదించబడింది. దీనిలో రాజుల పాలనా పరమైన విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వటం వల్ల కూడా, ఆచార్యుల గురించి తెలుసుకోవటానికి ఉపయోగపడే ఖచ్చితమైన సమాచారం కొంత కొరవడింది. దీపవంశంలో బుద్ధుని మహాపరి నిర్వాణానికీ, అశోకునికాలానికీ గల 218 సంవత్సరాల వ్యవధికి ప్రాధాన్యతనీయడం ఆచార్య పరంపరకు సంబంధించిన విషయాన్ని జటిలం చేసింది. దీని ప్రకారం – *'చతుసత్తీతి ఉపాలిచ చతసట్ఠిచ దాసక ఛసట్ఠి సోణకాథేరో, సిగ్గవో తు ఛసత్తతి అసీతి మొగ్గలిపుత్తో సబ్బేసం ఉపసంపదా'.*

ఉపాలికి 75 సంవత్సరాలు, దాసకునికి 64 సంవతరాలు, సోణక థేరునికి 66 సంవత్సరాలు, సిగ్గవునికి 77 సంవత్సరాలు, మొగ్గలిపుత్తతిస్సలకు 80 సంవత్సరాల, ఉపసంపదకాలంగా పేర్కొన్నా, ఈ కాలం, ఈ ఆచార్యులు జీవించిన కాలంగా తెలుస్తుంది. ఎందుకంటే ఉపాలి 74వ ఏట చనిపోయాడని ఉంది. దీపవంశంలో ఇంకా... *సబ్బకాలాంపి పామొక్ఖో వినయే ఉపాలి పంణ్డితో పణ్ణా సం దాసకోథేరో, చతుచత్తారి సంచ సోణకొ, పుత్తే సవ్యహో.*

ఉపాలి జీవించినంతకాలం వినయాచార్యునిగా ఉండగా, దాసకుడు తన ఏభైయ్యోఏట, సోణకుడు నలభైనాలుగోఏట, సిగ్గవుడు 55వ ఏట, మొగ్గలిపుత్త 68వ ఏట వినయాచార్యులైనారని చెప్పబడింది. ఈ ఆచార్యుల కెదురుగా చూపించిన సంవత్సరాలు వారు వినయపిటక (శాసన) రక్షకులుగా ఉన్న సంవత్సరాలుగా పరిగణించాలని ఒకవాదన. ఒక్క ఉపాలి విషయం తీసుకొంటే బుద్ధుని మహాపరినిర్వాణం నుంచి ఉపాలి మరణించే వరకూ వినయధరునిగానే ఉన్నాడు.

మరో వాదన ప్రకారం, దాసక, సోణక, సిగ్గలి, మొగ్గలిపుత్తతిస్సల విషయంలో దీపవంశంలో సూచించిన సంవత్సరాలు, ఆ వయసులో వారు వినయధరులైనారనేది కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| ఆచార్యుడు | మరణించిన సంవత్సరం | వినయ ప్రముఖుడైన సంవత్సరం | వినయంపై ఆచార్యత్వం వహించిన కాలం |
|---|---|---|---|
| ఉపాలి | 74 | 44 | 30 సంవత్సరాలు |
| దాసక | 64 | 49 | 15 సంవత్సరాలు |
| సోణక | 66 | 43 | 23 సంవత్సరాలు |
| సిగ్గవ | 76 | 54 | 22 సంవత్సరాలు |
| **మొత్తం** | | | **90 సంవత్సరాలు** |

ఒక్కో ఆచార్యుడు వినయధరునిగా ఉన్న కాలానికి ఒక్కో సంవత్సరం కలుపుకొంటే మొత్తం ఈ నలుగురు ఆచార్యులు కలిపి వినయరక్షకులుగా ఉన్న కాలం 94 ఏళ్ళు అని కెటిఎస్ సరయూ అభిప్రాయపడినారు.

వినయపిటకం, ధమ్మపద అట్ఠకథా, బుద్ధవంశ అట్ఠకథాలలోని వివరాలు ప్రకారం, మంగలికులంలో పుట్టి శాక్యరాకుమారుల సేవలో నున్న ఉపాలి, చాలా చిన్న వయసు లోనే సంఘంలో చేరాడు. బుద్ధుని జీవితకాలంలోనే,

కొంతమంది భిక్షువులు, ఉపాలి దగ్గర వినయాన్ని నేర్చుకోవటం ఒక చక్కటి అవకాశంగా భావించేవాళ్లు. వినయాన్ని వల్లెవేయటంలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఉపాలి, వినయధరుల్లో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకొన్నాడు. అతని ధారణ శక్తిని, శ్రద్ధ, ఆసక్తులను గుర్తించిన మహాకస్సపుడు, రాజగృహంలో జరిగిన మొదటి బౌద్ధ సంగీతిలో వినయపిటకాన్ని సంకలనం చేయటమేగాక ఒప్పజెప్పే పనిని అప్పగించాడనీ, బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత 16 సంవత్సరాలకు ఉపాలి వయసు 60 ఏళ్ళని దీపవంశంలో చెప్పబడింది. అంటే బుద్ధుని మహాపరినిర్వాణ సమయానికి ఉపాలి వయసు 44 సంవత్సరాలు. ఇంతకు ముందు పేర్కొన్నట్లుగా, ఉపాలి 74 ఏళ్లు జీవించాడు. ఈ విధంగా ఉపాలి 30 ఏళ్ళపాటు వినయధరునిగా కొనసాగాడని తెలుస్తుంది.

వైశాలీకి చెందిన దాసకుని విషయానికొస్తే, సంఘంలో చేరి, తన 64వ ఏట మరణించాడు. ఉపాలి మరణించేనాటికి, ఉదయుడు ఆరేళ్లపాలన సాగించాడు. తరువాత అతడు మరో పదేళ్ళు పాలించాడు. ఉదయుని చివరి పదిసంవత్సరాల పాలనా కాలంలో దాసకుడు వినయధరునిగా ఉన్నాడు. రాజైన శిశునాగుడు మొత్తం పదేళ్ళు పాలించగా, ఎనిమిదో పాలనా సంవత్సరంలో దాసకుడు మరణించాడు.

ఉదయునికి, శిశునాగునికి మధ్య అనిరుద్ధుడు కూడా ఏనిమిదేళ్ళు పాలించటాన, దాసకుడు, మొత్తం 26 ఏళ్ల పాటు వినయపిటక ఆచార్యునిగా ఉన్నాడు. సోణకుడు కాశీకి చెందిన ఒక వ్యాపారి కొడుకు. 15వ ఏట రాజగృహంలో సంఘంలో చేరిన సోణకుడు, శిశునాగుడు పాలిస్తున్న కాలంలో చివరి రెండేళ్ళు, అటుతరువాత, అతని పదిమంది సోదరులు రాజ్యంచేసిన 22 ఏళ్లలో మొదటి ఆరేళ్లూ కలిపి మొత్తం ఎనిమిదేళ్లపాటు వినయాచార్యునిగా ఉన్నాడు.


పాటలీపుత్రానికి చెందిన ఒక మంత్రి గారి కుమారుడైన సిగ్గవ, 18వ ఏట సంఘంలో చేరాడు. శిశునాగుని తరువాత పదిమంది సోదరులు పాలించిన 22 ఏళ్లలో మొదటి ఆరేళ్లు సోణకుడు వినయాచార్యుడుకాగా, తరువాతి 16 సంవత్సరాల పాటు, వారి తరువాత సింహాసనాన్ని అధిష్టించిన చంద్రగుప్తుని పాలనలో 14 ఏళ్లపాటు వినయధరునిగావుండి మరణించినట్లు వినయఅట్టకథలో ఉంది. ఇలా సిగ్గవుడు (16+14) మొత్తం 30 ఏళ్లపాటు వినయరక్షణబాధ్యతలు వహించాడు.

దీపవంశంలోని వర్ణన ప్రకారం, నందవంశానికి చెందిన పదిమంది సోదరుల తరువాత, చంద్రగుప్తుడు రాజు కాలేదనీ, పైగా వారు పాటలీపుత్రం నుంచి రాజ్యంఏలలేదనీ, శిశునాగునికి కాలాశోకుడనే కొడుకున్నాడనీ, అతడు పాటలీపుత్రం నుంచి 28 ఏళ్లపాటు రాజ్యం చేశాడు. శిశునాగుని పాలనలో 10 సంవత్సరాలపాటు రాజప్రతినిధిగానున్న కాలాశోకుడు, పాటలీపుత్రం రాజధానిగా స్వతంత్రరాజుగా పాలించాడు. సోదరులు శిశునాగుని కాలంలో రాజ్యం రెండుగా చీలగా, నందవంశపు పదిమంది కూడా అక్కడినుంచే పాలించి ఉండొచ్చనీ, లేక, పాటలీపుత్రంలో కాలాశోకుని తరువాత చంద్రగుప్తుడు రాజుకాగా, పదిమంది సోదరులు రాజగృహం నుంచి పాలించి ఉంటారన్న వాదం కూడా ఉంది.

దీపవంశంలో, చంద్రగుప్తుడు మొదటి రెండేళ్ల పాలనా కాలం పూర్తి చేసేటప్పటికి, సిగ్గవుడు 64 ఏళ్ల వృద్ధుడని చెప్పబడటాన, చంద్రగుప్తుడు క్రీ.పూ. 317లో పట్టాభిషిక్తుడైన తరువాత రెండేళ్లకు (క్రీ.పూ. 315) సిగ్గవుని వయసు 64. సిగ్గవుడు 74వ ఏట మరణించాడు గాబట్టి, క్రీ.పూ. 315తరువాత అతడు మరో 12 ఏళ్లు జీవించాడు. అంటే క్రీ.పూ. 303లో సిగ్గవుడు మరణించాడు.

చంద్రగుప్తుని 14వ పాలనాసంవత్సరంలో సిగ్గవుడు మరణించాడని పేర్కొనటాన, చంద్రగుప్తుడు క్రీ.పూ. 317లో సింహాసనాన్నధిష్టించిన విషయం నిర్వివాదాంశం. మరోసారి పరిశీలిస్తే, సిగ్గవుడు క్రీ.పూ. 303లో మరణించగా, సోణకుడు, సిగ్గవునికంటే ముప్పైఏళ్ల ముందు చనిపోయాడు. సోణకుని కంటే 8 ఏళ్లముందు దాసకుడు మరణించగా, దాసకుని మరణానికి 26 ఏళ్ల ముందు ఉపాలి మరణించాడు. ఉపాలి మరణించేనాటికి ముప్పైఏళ్ల ముందు బుద్ధుడు మహాపరినిర్వాణం చెందాడని బౌద్ధ గ్రంథాలు చెబుతున్నాయి. దీనినిబట్టి సిగ్గవుడు మరణించటానికి ముందు 94 ఏళ్లకు అంటే క్రీ.పూ. 397లో బుద్ధుని మహాపరినిర్వాణం జరిగిందని కెటియస్‌సరయూ లెక్క తేల్చాడు.

మౌర్యులకంటే ముందు పాటలీపుత్రాన్ని లేదా ఉదాయీ లేక ఉదాయి భద్ధ, ముండ, కాలశోకులు పాలించారని వినయపిటకం, అంగుత్తర నియాకాల్లో ఉంది. బుద్ధునికంటే 5 ఏళ్ల చిన్నవాడైన బింబిసారుడు 52 ఏళ్లపాటు పాలించాడు. 15వ ఏట సింహాసనాన్నిధిష్టించి జీవిత చరమాంకంలో



**సారిపుత్త - మొగ్గల్లానలతో బుద్ధుడు**

32 ఏళ్లపాటు బుద్ధపథంలో ఉండి, 67 ఏళ్ల వయసులో చనిపోయాడు. బింబిసారుని తరువాత మగధ రాజైన అజాతశత్రు 32 ఏళ్లపాటు పాలించాడు. అంటే బుద్ధుని మహాపరినిర్వాణానికి 8 ఏళ్లముందు పాలన ప్రారంభించాడు. అజాతశత్రుని ఉదాయీ, ఉదాయీభద్ధ అనిపిలువబడ్డ ఉదయుడు తరువాత బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత 24 ఏళ్లకు పాలన ప్రారంభించి 16 ఏళ్లు క్రీ.పూ. (373 నుంచి క్రీ.పూ. 357 పాలించాడు.) ఉపాలి చనిపోయేనాటికి ఉదయుడు ఆరేళ్లపాలన సాగించాడు.

అటు తరువాత అనిరుద్ధుడు 8 ఏళ్లపాటు (క్రీ.పూ. 357 నుంచి క్రీ.పూ. 349 వరకూ) పాలించాడు. దాసకుడు చనిపోయేనాటికి శిశునాగుడు రెండేళ్లపాలన చేసియున్నాడు. అతను పదేళ్లపాటు (క్రీ.పూ. 349 నుంచి క్రీ.పూ. 339 వరకూ) పాలించాడు. శిశునాగుని తరువాత కాకవర్ణ లేక కాలశోకునిగా పిలువబడిన అతని కొడుకు రాజై క్రీ.పూ. 339 నుంచి క్రీ.పూ. 317 వరకూ పాలించగా, క్రీ.శ. 317లో పాటలీపుత్రం నుంచి మౌర్య చంద్రగుప్తుడు పాలన ప్రారంభించాడు.

మహాపరినిర్వాణం తరువాత 100 ఏళ్లకు జరిగిన రెండో బౌద్ధ సంగీతిలో పాల్గొన్న సబ్బకామ, సాల్హ, రేవత, ఖుజ్జసోభిత, వాసభగామి, సుమన, సంభూత, సాణవాసి మరియు యశకానందక పుత్రులనే ఎనిమిదిమంది బుద్ధుని చూచినవారని దీపవంశం పేర్కోవటం కొంత అనుమానానికి తావిస్తుంది. ఎనిమిది మంది థేరులూ నూరేళ్ళకు మించి జీవించారా అనేది తేలాల్సిన ప్రశ్న. సింహళ బౌద్ధ గ్రంథాలు, కాలాశోకుని 11వ పాలనాసంవత్సరంలో, అంటే మహాపరినిర్వాణం తరువాత 62 ఏళ్లకు (క్రీ.పూ. 335) రెండో సంగీతి జరిగిందనీ అందులో బుద్ధుని చూచిన సారెయ్య, రేవత థేరుళ్ళు పాల్గొన్నారని పేర్కొంటున్నాయి.

మహాపరినిర్వాణం తరువాత 62 ఏళ్లకు రెండో బౌద్ధ సంగీతి జరిగిఉంటే, ఆ ఎనిమిదిమంది థేరులు బుద్ధుని చూశారని చెప్పడం వాస్తవమేఅవుతుంది. ఈ సందర్భంగా, మహాపరినిర్వాణం తరువాత 100 ఏళ్లకు రెండో బౌద్ధ సంగీతి జరిగిందన్న బలమైన వాదన పై మళ్లీ చర్చ జరగాలి.

పాళీ గ్రంథాల్లో పేర్కొన్న దాన్ని బట్టి క్రీ.పూ. 477లో సిద్ధార్థుడు జన్మించాడు. క్రీ.పూ. 472లో పుట్టిన బింబిసారుడు, క్రీ.పూ. 457లో సింహాసనమెక్కి క్రీ.పూ. 442లో బౌద్ధాన్ని స్వీకరించాడు. క్రీ.పూ. 441లో ఉపాలి పుట్టాడు. క్రీ.పూ. 399లో సోణకుడు పుట్టాడు.

క్రీ.పూ. 405 దాసకుడు పుట్టడమే కాకుండా, అజాతశత్రు సింహాసనమెక్కాడు. క్రీ.పూ. 397లో బుద్ధుడు మహాపరినిర్వాణం చెందగా, మొదటి సంగీతిలో ఉపాలి వినయ ప్రముఖుడైనాడు. క్రీ.పూ. 384లో సోణకుడు సంఘంలో చేరాడు. క్రీ.పూ. 379లో సిగ్గవుడు పుట్టాడు. క్రీ.పూ. 373లో సిగ్గవుడు సంఘంలో చేరగా, అదే సం॥ ఉదాయీ సింహాసన మెక్కాడు.

క్రీ.పూ. 367లో ఉపాలి మరణించగా, దాసకుడు వినయ ప్రముఖుడైనాడు. క్రీ.శ. 357లో అనిరుద్ధుడు సింహాసనమెక్కాడు. క్రీ.పూ. 349లో నాగదాసక, పాటలీపుత్రం నుంచి శిశునాగుడు రాజగృహంనుంచి పట్టాభిషిక్తులైనారు. క్రీ.పూ. 341లో దాసకుడు మరణించగా సోణకుడు వినయ ప్రముఖుడైనాడు. క్రీ.పూ. 339లో పదిమంది సోదరులు పాలన ప్రారంభమైంది.

క్రీ.పూ. 335లో కాలాశోకుడు రాజైనాడు. క్రీ.పూ. 333లో సోణకుడు చనిపోగా, సిగ్గవుడు వినయ ప్రముఖుడైనాడు. క్రీ.పూ. 317లో చంద్రగుప్తుడు రాజైనాడు. క్రీ.పూ. 303లో సిగ్గవుడు మరణించాడు. క్రీ.పూ. 293లో బిందుసారుడు, క్రీ.శ. 269-68లో అశోకుడు రాజైనాడు. క్రీ.పూ. 265లో పట్టాభిషిక్తుడైనాడు.

## కళావాహినికి ఊటపట్టు

# సిద్ధార్థుని జీవితం

– కృష్ణ చైతన్య

లలితకళలు ప్రకృతినుండే ఉద్భవించాయి. ప్రకృతిమయములే అయివున్నాయనే సత్యం ప్రకటమగుచున్నది. ఎంతటి ఉన్నతాశయాలైనా, యెంత ఉత్కృష్టమయిన మతతత్త్వ బోధలైనా భౌతికరూపంలో పొదగనిదే, ప్రజలకు తమ కళాత్మక సందేశాలను అందజేయజాలవు. లెక్కలేనన్ని బౌద్ధవిహారాల నిశ్శబ్దతను చీల్చుకొంటూ ధర్మం "ఎటు చూచినా జగత్తు దుఃఖమయమే, మానవునిలో నశించక నిలిచేదేదీ లేదు, వస్తువులలో శాశ్వతమైన పరమార్థం శూన్యం" అనే విషాద గీతి ప్రతిధ్వనిస్తూనే యున్నది.

అయినప్పటికీ, ఒక అంశం గమనించ వచ్చు: ప్రజాబాహుళ్యానికి బుద్ధుడు ప్రపంచ నిరాకరణము కంటె ప్రశాంతి సందేశాన్నే అందించాడనేది. తనమూలముగా మొదట్లో సంభవించిన సంక్షోభాన్ని తరువాత తాను గూడ గుర్తించి ప్రపంచగతిలో ఇమిడి యున్న నానా మార్గాలతో సమాధాన పడడానికి అవశముగా లోనైనాడు. తన కుమారుడైన రాహులుని భిక్షుమార్గములోనికి చేర్చుకొన్న తర్వాతను, ఆ తర్వాత వారసుడైన నందుడు గూడ రాజ్య పట్టాభిషేకం మధ్యలోంచి లేచివచ్చి తన్మయావస్థ స్థితిలోపడి వెడలి పోయినప్పుడు, బుద్ధుని తండ్రి, వృద్ధుడు అగు శుద్ధోదన మహారాజు బుద్ధుని గూర్చి మృదువుగా వెలువరించిన అసమ్మతి స్మరణీయము. "ఈ ప్రపంచాన్ని సిద్ధార్థుడు పరిత్యజించి వెళ్ళినపుడు దుఃఖమునకు పరిమితిలేదు; నందుడు వెళ్ళినపుడును అలాగే అయినది; రాహులుడు వెళ్ళినపుడు చెప్పనే అక్కరలేదు; పుత్రవాత్సల్యమనునది చర్మం, మాంసం, నరాలు, మేధస్సు మొదలైన సమస్త ధాతువులను క్షోభపెట్టి నమిలివేస్తుంది. భగవాన్, ఒక్క ప్రార్థన! ఇకనైనా ఆ మహామహులు లోకములో యే పుత్రునికిగూడ వాని తల్లిదండ్రుల అనుమతి లేకుండా భిక్షుకోటిలో చేరే అవకాశము ఈయకుండునట్లు నిబంధనము అనుగ్రహింపుము" అని. ప్రాణి సహజమైన ఈ ఆవేదన – ఇదికూడా పవిత్రమైనదే – బుద్ధుని హృదయమునకు వ్యక్తమయినది, అంగీకరించినాడు. అజంతా గుహల్లో చిత్రకళ, కరుణామయుడు వాత్సల్య పూరితుడు అయిన బుద్ధుని ఆశయములే తనకు ప్రాణములగుటచే, నశ్వరవస్తుజాలాన్ని కూడా నాశమెరుగని అంద చందాలతో ఒక క్రొత్తలోకంలోకి కొనిపోవునట్లుండును. రంగులతోను, రూపసౌష్ఠముతోను దర్శనీయతను పుణికి పుచ్చుకొనేశక్తి యీ కళకు కలదు. సృష్టిసౌందర్యాన్ని చిత్రంగా ఊహించి చూపగల్గిన ప్రతిభ ఒకటి, వృక్షజాలంలోను, జంతుకోటిలోను పరస్పర సహకారాన్ని భావించుకోగల్గిన విశ్వజీవసౌభ్రాతృత్వముతో సహా, ఈ కళలో గుప్తపరుచబడినది. ఉదాహరణకు : ఒక మోదుగ చెట్టు, నిండుగా పూచిన పుష్పరాశి; అంటి మెలివేసికొని ఎగబ్రాకిన ఒక లేతతీగ, వీనిపై మకరందము తాగుటకై పరువులెత్తే చీమలబారు! **విశిష్టమైన పరిణామాలతో నిండిన సిద్ధార్థుని జీవితమే చిత్రకళకు జీవముపోసే ఎడతెగని జలవంటిదై వెలసినది.** ఒక్క పురుషాంతరములో మానవచరిత్రలోని సృష్టి పరిణామ క్రమమంతా క్లుప్తపరుచబడియున్నది: మాతృ స్తన్యము తాగుచున్న ఒక పసికందు, ఆటలలో మైమరచిన ఒక బాలకుడు, వినోదములలో పొద్దుపుచ్చుచున్న ఒక జవ్వనుడు, తరువాత సర్వేంద్రియములను ఆవరించే జుగుప్స, ఆపై సురక్షితమైన గృహజీవనము నుండి పరాఙ్ముఖుమై వెడలిపోవుట, ఆత్మనుగూర్చి



బోధిసత్త్వుడు
(ఫొండుకిస్తాన్ శిల్పం: ప్రస్తుతం పారిస్‌లో వున్నది)

1956 సంవత్సరంలో ముక్త్యాలరాజా వారు ప్రచురించిన బుద్ధ జయంతి మహోత్సవ సంచిక



కేశఖండనం, బంగారు మలామాతో నిగనిగలాడే మృణ్మయ శిల్పం - (బర్మా, 11వ శతాబ్దం)

కలిగే మీమాంసల మథన, ఆ తరువాత ఒక్కసారిగా ప్రబోధము ప్రకాశించుట, దానితో మానవకూటములోనికి మరలివచ్చి చేసే ప్రచారము. కావుననే, ప్రతిచిత్రకారుని కుంచె ప్రతి శిల్పిసుత్తి విసుగు విరామాలు లేకుండా ఈ కథల్నే పునరుద్ఘాటన చేస్తూ ఉండడంలో ఆశ్చర్యమేమున్నదీ? అలా చెయ్యడంలో వేలకొలది సంవత్సరాలు ఆసియాఖండ మంతటను, దక్షిణ మహా సముద్రములోని ద్వీపద్వీపాంతరము లందునను వ్యాపించే బౌద్ధ ధర్మంలోని శాంతి సందేశానికి తోడునీడలై (ఆ కుంచెయు, సుత్తియు) మెలగడంలో వింతయేమున్నది?

ఈ బౌద్ధ ధర్మ శిల్ప, చిత్రకళను తొలుతగా గ్రహించినది బహుశా ఆఫ్ఘనిస్తాన్ దేశము. పశ్చిమాసియా ప్రాంతముపై పర్విన అలెగ్జాండరు విజయ యాత్రాప్రవాహము కొత్తకళా సంప్రదాయములను పుష్టిగా పండించగల్గినటువంటి గ్రీసుదేశపు కళామర్యాదలనే విలువగల ఒండ్రుమట్టిని పరచి ఉంచింది. సెల్యూసిడ్స్ పరిపాలనో నేటి "బాల్క్" రాజధానిగా చేసికొని వెలసిన గ్రీకోబాక్ట్రియన్ రాజ్యము, నేడు పెషావరు అని పిలువబడే పురుషపురం రాజధానిగా చేసికొని కుషాణులు పరిపాలించిన అప్పటి గాంధార రాజ్యముతో సాంస్కృతిక సంబంధాలు విశేషంగా పెట్టుకొనినది. భారతదేశానికి, గ్రీకులమధ్య ప్రాచ్యదేశాలకు మధ్య నిరంతరంగా రాకపోకలు యేర్పడసాగిన ఆ సమయంలోనే విజృంభించుతూ ఉన్న బౌద్ధ ధర్మం ఆనాటి శిల్ప, చిత్రకళకు జీవగఱ్ఱ అయినది; గ్రీసుదేశంలో రూపొందింపబడిన ఆకృతులు దానికి భౌతికోపాధిని కల్పించేందుకు ప్రాతిపదికలయినవి. ఇట్లేర్పడిన గాంధారశిల్పం కుషాణ సామ్రాజ్యపరిధులతోనే ఆగిపోలేదు. భారత-బాక్ట్రియన్ కళ అనదగిన యీ శిల్పానికి చెందే ప్రప్రథమ కళాఖండము, 1833వ సంవత్సరంలో డాక్టరు గెరార్డ్‌గారిచే కాబూల్ వద్ద ఒక శిథిలస్తూపంనుండి సంగ్రహింపబడిన వలయాకృతి బుద్ధవిగ్రహం. బౌద్ధం యొక్క సర్వతోముఖప్రాభవంలో శిల్ప, చిత్ర లేఖనం కూడా పాల్గొన్నది.

అజంతా సంప్రదాయానికి చెందిన కొన్ని చిత్తరువులు, ధర్మచక్రాసనములో కూర్చొన్న బుద్ధుడు, పైన యెగురుచున్న అప్సరసలు కల్గినవి, 'బామియన్' వద్ద నిటారుగా ఉండే గుట్టల గుహలలో గోడల మీదను పై కప్పుల మీదను వ్రాయబడి యున్నవి. అచ్చటనే రెండు మహోన్నతమయిన బుద్ధ విగ్రహములు, షుమారు 110 అడుగుల ఎత్తు ఒకటి, 160 అడుగులు మించిన ఎత్తు మరొకటి, కలిగి ప్రతిష్ఠించ బడియున్నవి. పెషావరు నుండి బాల్క్‌కు పోవుమార్గమధ్యంలో ఉన్న యీ 'బామియన్', కనిష్కుని సామ్రాజ్యానికి నడిబొడ్డున, యిటు భారతదేశంలోని సగాన్ని, అటు సిథియన్ ప్రాంతంలోని సగాన్ని కలిపి నిలిపే యిరుసులాగా వుంటూ, బేహారులకు హిందూకుష్ పర్వతశ్రేణి ఎక్కివచ్చిన శ్రమ తీర్చుకునేందుకు అనువయిన మజిలీగా ఉపయోగించేది. ఈ ధనికవర్తకుల ఆదరముతోనే యేర్పడి, బాబియన్ వద్ద హ్యూన్‌త్సాంగ్ అనే చీనాయాత్రికునికి స్వాగతమొసగిన ఆర్యసేన, ఆర్యదాసప్రభృతి బౌద్ధబోధకులతోను అతడు చూచిన వేలకొలది భిక్షువులతోను డజన్లకొలది విహారాలు వెలసి యుండెడివి.

బుద్ధుడు నిర్వాణముచెందిన తరువాత, అతడు తనను దేవునిగా కొలువరాదని స్పష్టముగా శాసించిపోయినప్పటికిని, బౌద్ధమతంలో దేవతాసంఘము వెలిసింది. ఆసియా ఖండమంతటను వ్యాపించిన బౌద్ధకళను అవగాహన చేసుకొనేందుకు, ముఖ్యంగా యీ దేవతా సంఘాన్ని గురించి

కొంచమైనా పరిచయంగల్గి ఉండటం అవసరం. ఈ దేవతా వర్గానికి అధినేతృత్వం వహించిన కూటములో ధ్యాని బుద్ధులు ఉంటారు - వైరోచనుడు, ఆమితాభుడు, ఆమోఘసిద్ధి, రత్నసంభవుడు, అక్షోభ్యుడు అనువారు - వీరు అప్రాకృతమయిన వ్యక్తులు. ఎట్టి మాలిన్యములు అంటనివారు. అనంతమయిన శక్తిశరీరము కల్గిన దివ్యులు. తరువాత తరగతిలో దయాళువయిన అవలోకితేశ్వరుడు, (ఇతనికే లోకేశ్వరుడని కూడా పేరు కలదు) అతని యర్ధాంగి అయిన 'తారా', వారి అనుయాయులు, ప్రసన్నవదనుడయిన అశోకకాంతుడు, భీషణాకృతిగల హయగ్రీవుడు మొదలయినవారు ఉందురు. వీరితో దాదాపు సమానమయిన అంతస్తునందు, నిర్వాణసంధాయకమయిన ప్రజ్ఞకు ప్రతీకమయిన 'బోధిసత్త్వ మంజుశ్రీ' యు, అతనికే స్త్రీమూర్తి అయిఉన్న 'ప్రజ్ఞాపారమిత'యు ఉందురు.

టిబెట్, నేపాల్ దేశాలలో యీ దేవీదేవగణం, 'టంకా'లు 'ప్రభ'లు అని పిలువబడే పటములమీద చిత్రించబడుతారు. లేదా, తాళపత్రగ్రంథాలలో ఉల్లేఖించబడిన చిన్న బొమ్మలలో కూడా కనబడటం కద్దు. ఈ దేవతాగణమంతటినీ, భక్తులకు ధ్యానసాధనలలో ఆలంబనంగా పనికివచ్చే 'మండలం' అనే పటంలో చిత్రిస్తారు. ఈ పటం అంతా వలయాకారమో చదరమాకారమో కల చిన్న గడులుగా విభజింపబడి ప్రతి గడిలోనూ ఒక్కొక్క దేవతను కల్గిఉంటుంది. టిబెట్, నేపాల్ దేశాలు రెండూ బౌద్ధ దేవతాగణముల మూర్తులతో అద్భుతమైన కంచులోహపు శిల్పాన్ని సృష్టించినవి.

టిబెట్, నేపాల్ దేశాలద్వారా బౌద్ధకళ చైనాకు పయనించినది. నేపాల్ దేశంలో, యాత్రాసాహసానికి మార్కోపోలోలాటివాడు అని పేరు పొందిన 'అనికో' అనునాతడు 13వ శతాబ్దంలో కుబ్లైఖాన్ ఆస్థానమందు రాష్ట్రీయ వస్తూత్పత్తి నియామకుడుగా పనిచేశాడు. అతడు మంగోలియా చక్రవర్తికి కావలసిన చిత్తరువులను, మూర్తులను యెన్నిటినో తయారుచేశాడు. అతని ప్రియ శిష్యుడైన 'యియూయాన్,' అతని నుండి శిల్పకళ నభ్యసించి తయారుచేసిన బౌద్ధ కళాఖండాలు షాంఘై, పెకింగ్ మున్నగు స్థలములలోని ప్రఖ్యాత విహారాలలో నెలకొల్పబడినవి. సముద్రమార్గమున కూడ బౌద్ధకళలు దూరదేశములకు వ్యాపించినవి. గుణవర్మ అను ఒక రాజపుత్రుడు, కాశ్మీరదేశమునుండి వెడలి, సుమత్రాదీవిలో చిరకాలము మంత్రిత్వం వహించి చీనాకుపోయి, 'కాంటన్'లో జాతక కథల చిత్తరువుల రూపముల ప్రదర్శించెనని తెలియుచున్నది. అనేకములైన పురాతన చిత్రపటములు పశ్చిమప్రాంతముల నుండే బయట పడినవి.

1906-9 సంవత్సరములలో ఆరెల్‌స్టైన్ అనే ఆయన కంసూరాష్ట్రంలో టున్‌హ్యూయాంగ్ అను ప్రదేశమందు ఒక మతసంస్థయొక్క గోడలనుండి ఎన్నో రంగు చిత్రపటాలను వెలురించినాడు. మిరాన్‌వద్ద ఒక శిథిలీ భూతమయిన దేవాలయంలో 'వెస్సంతర జాతక' కథను ప్రదర్శించే కుడ్యశిల్పం వుంది. ఇది భార్‌హాట్ సంప్రదాయాన్ని గుర్తుతెస్తుంది. 'దండన్‌ఉలిక్' లోని కుడ్య శిల్పాల్లో కనుపించే పద్మసరస్సులోని వనదేవతను చూడగా, భారతదేశములో కన్పట్టు యక్షిణి ప్రతిమను మాతృకగా తీసికొని చీనాదేశపు ప్రకృతి సౌందర్యముతో సమన్వయ పరచినట్లుంటుంది.

జపాను దేశానికి బౌద్ధం క్రీ.శ. 552లో చేరినది. జపాను చక్రవర్తి 'కిమ్మెయి'వద్దకు కొరియాలోని కుదర సంస్థానాధిపతి పంపిన సిఫారసు ఉత్తరములో ఇట్లున్నది: "లోకములోని సకలమతబోధలకన్న మేలైన అద్భుత మతము యిది... కొరియాదేశానికి యిది సుదూరమందున్న భారతదేశము నుండి వచ్చినది. ఈ రెండు దేశముల మధ్యలో



విరాగి బుద్ధుడు : లాక్షా రచిత ప్రతిమ
(చైనా, 15వ శతాబ్దం)

ఉండే యావత్ప్రజానీకము యిప్పుడు యీ మతావలంబకులు గానయినారు." ఈ ఉత్తరము వచ్చి చేరిన సంవత్సరమందు జన్మించిన రాజకుమారుడే 'ఉమయడో' అను యువరాజు– ఇతనికి ప్రజలలో 'షొటోకు' (ధర్మసిద్ధుడు) అనే బిరుదము, మరణానంతరం, వ్యాపింపజేయబడినది. నాగార్జునుని శిష్యుడై ఈ షోటొకుకు నాగార్జునుని *సద్ధర్మ పుండరీక సూత్రము*ను గ్రంథానికి వ్యాఖ్యానము రచించెను. ఇతడు తన వెనుకతరముల ప్రజానీకానికి అందిచ్చిన అమూల్యమగు బహుమతులు 'నారా' ప్రాంతంలోని హేరి యూజివద్ద స్థాపించిన కళాశాల, దేవాలయము అయియున్నవి.

'కొండొ' (అనగా బంగారు సావిడి)లోని చల్లని అంతర్భాగంలోనికి బయటి మిట్టెండనుండి అడుగిడగానే, మీకు ఒక చిత్రమైన భ్రమకలుగును. హఠాత్తుగా వేలకొలది మైళ్ళు దాటిపోయి అజంతా శిల్పసౌందర్య సన్నిధిలో చేరుకొంటిమా యనిపించును. ఇచ్చటి కుడ్య శిల్పములు, షోటోకు కాలమునకు తర్వాత 8వ శతాబ్దిలో చిత్రించబడినవై, ఖోటాన్‌లోని చిత్రములకన్నకూడ ఎక్కువ సన్నిహితంగా అజంతా శిల్పాన్ని పోలియున్నాయి.

***

చుట్టును సముద్రముచే ఆవరింపబడి, వివిధ వృక్షజాలంతో నిండిన అడవులచే కప్పబడియున్న సిలోను ద్వీపమునకు, అశోకుడు, క్రీ.పూ. మూడవ శతాబ్దిలో అతి మనోహరములైన రెండు బహుమానములను పంపించెను. అవి మహిందుడు, సంఘమిత్ర అను తన బిడ్డలను, బోధివృక్షముయొక్క కొమ్మ ఒకటియు, మహావంశము ప్రకారము అనూరాధపుర మందు క్రీ.పూ. మొదటి శతాబ్దంలో 'దుత్తగమిని' అనే మహారాజుచేత నిర్మింపబడిన 'రువాన్‌వాలీ' అనే స్మారక నిర్మాణములో అవశేషములను గుప్తపరచి యుంచిన గదిలో "వెస్సంతర జాతక" కథల చిత్తరువులు అలంకరింపబడియుండెను.

అయితే, అవి యిప్పుడు నృష్టమైనవి. కాని, కాశ్యపుడనే రాజు యొక్క ఆజ్ఞచే 5వ శతాబ్దంలో 'సిగెరియా' దుర్గము శిఖరము మీద యున్న తన ప్రాసాదమునకు పోవు మార్గము ఇరుప్రక్కల ఉండు గోడలపై చెక్కబడిన కుడ్యశిల్పములు మాత్రము నిలచియున్నవి. ఈ కుడ్య శిల్పములలో మతసంబంధమైన భావన మృగ్యము. ఇవి బహుశా రాజాంతః పురంలోని కామినుల యొుక్క మూర్తులు అయి యుండవచ్చును. దీనిని బట్టి కళా సంప్రదాయములు ఒక స్థలమునుండి ఇంకొక స్థలమునకు వ్యాపించుటలో ఎట్టి పరిణామములు పొందునది దృష్టాంతముగా చూడవచ్చును. మొదటలో మతాచారముల ఊహతో భావింపబడిన చిత్రకళాశైలి సముద్ర యానము చేసి మతసిద్ధాంతములను వ్యాపింప జేయటంలో తోడ్పడి, తరువాత కొంతకాలానికి మతసంబంధములేని ఐహిక, ప్రాకృత చరిత్రలకు రూపకల్పన చేయుటలో వినియుక్తమైనది.

జాతక కథలలో చెప్పబడినట్లు అనేక వర్తక నౌకలు గంగానది గుండా సముద్రములోనికి ప్రయాణము చేసి ఆరకాన్ తీరమునకు , ఇండో–చైనాకు, ఇండోనేషియన్ దీవులకు వెళ్ళేవి. బర్మాదేశమునకు భారతీయ మతబోధకుల వెంట భారతీయ చిత్రకారులు కూడా వెళ్ళి యుండిరి. 'తలైంగ్' దేశములో ప్రాంతీయ చిత్రకారులతో భారతీయ చిత్రకారులకు మంచి సహకారము ఉండినది. పాగన్ ప్రభువైన అనావర్తుడు థాటన్‌ను జయించినపుడు ఈ ''భారత–తలైంగ్'' సమన్వయముతో కల్గిన చిత్రకళ "పాగన్"ను కూడా ఆక్రమించి జయించెనన వచ్చును.

'పాగన్'లో దేవాలయములందు గోడలపై నున్న చిత్తరువులలో బుద్ధులు, బోధిసత్త్వులు, జాతకకథలు, ముఖ్యమైన ఇతివృత్తములుగా నున్నవి. ఇండో–చైనా దేశములో బౌద్ధధర్మం మెల్లగా స్థావరమేర్పరుచు కొన్నది. 5వ శతాబ్దంలో 'ఫ్యూనాన్' అనగా దక్షిణ కంబోడియా రాజ్యము సంఘభారుడు, మంద్రుడు అను ఇద్దరు బౌద్ధ భిక్షువులను చైనాదేశమునకు పంపినట్లు గ్రంథములలో కలదు. వారీ చక్రవర్తి ఆదేశము ప్రకారము బౌద్ధమత గ్రంథములను చైనాభాషలోనికి అనువదించిరి. కంబోడియా దేశపు భారతీయ సంస్కృతికి విశిష్టమైన వ్యక్తీకరణము 'అంకోర్ వాట్' అయి ఉన్నప్పటికిని, ఆదేశపు చిత్రకళా మర్యాదలను రూపొందించటంలో బౌద్ధం కూడ బాగాపని చేసింది.

జావాద్వీపములో బౌద్ధమే ప్రధానమైన ధర్మం. జావాను ఫాహియాన్ దర్శించినాడు. 5వ శతాబ్దములో గుణవర్మ అచట బోధించినాడు. సుమత్రదీవిలో ఒక కొండ యావత్తు బౌద్ధస్తూపంగా మలచబడినది. 'శ్రీవిజయ' అను స్థలమునకు చెందిన నౌకావర్తక ప్రధానరాజ్యమునకు అధిపతులై, మహాయాన మతావలంబకులైన రాజులచే యిది నిర్మింపబడి



బోధ ముద్ర

'బోరబోదుర్' అనే పేరుతో ప్రఖ్యాతి చెందినది. దానిలో కింద అంతస్థులనుండి పై అంతస్థులకు ఎక్కుచున్నప్పుడు చిత్రపరంపర అత్యంత వైరళ్యము పొందును.

ఇది ఒక సాంకేతిక నిరూపణము. దీనితో బౌద్ధ కళ ఆ మతమందలి లోకోత్తరమయిన అతీతభావనా నిర్వహణముతో సమన్వయమొందినదని చెప్పవచ్చును. విరళవిరళములైన అత్యున్నతస్థాయి భూమికలో తప్ప దిగువ అంతస్థులలో ప్రాకృతము, ఐహికము అయిన రూపముల సాంగత్యము దానికి గ్రాహ్యమే అయి ఉండును.

అందువలననే గతించిన మహాత్ముల చరిత్రలను శిలలమీద చిత్రవర్ణములతో నిరూపించి, అందుండి అపూర్వమైన ధైర్యమును, ఆనందమును కొనిరాగల్గిన శక్తి ఈ కళలో యిమిడియున్నది. దాదాపు తూర్పు దేశాలన్నింటి లోనూ బుద్ధుని విగ్రహశిల్పాలు, తమ జీవితకాలాన్ని వెచ్చించి మలిచారు. దీనికి సిద్ధార్థుని జీవితం, బోధనలు ప్రేరణ అని చెప్పటానికి సందేహం లేదు.

మి

---

# బుద్ధం శరణం గచ్ఛామి

*62వ పుట తరువాయి....*

నిజానికి ఏ మతమూ లేని ఆదిమ సమాజంలో ఉన్న ప్రశాంతత మతాల రాకతో దుఃఖభాజనమైంది. హింసాపూరితమైంది. ఉద్రిక్తభరితమైంది. మతాలపేరు మీద ఎన్నెన్ని రక్తపాతాలు జరిగాయో చరిత్రను తిరగేస్తే అర్థమవుతుంది. చాలా మతాలు యుద్ధాలను ప్రేరేపించాయేగాని అహింసను బోధించిన ఒకే ఒక ధర్మం బౌద్ధం మతాలకోసం రాజులు యుద్ధాలు చేస్తే బౌద్ధం స్వీకరించి అశోకుడు జీవితకాలమంతా యుద్ధం జోలికి పోలేదు. హింసకు, రక్తపాతానికి దూరంగా ఉన్న ఒకే ఒక ధర్మం బౌద్ధం.

నిజానికి బౌద్ధం ఒక మతం కాదు. అదొక ధర్మం, మతం అంటే ఇష్టం అనే అర్థంలో తీసుకుంటే బౌద్ధమూ ఒక మతమే అనుకున్నా ఏ మతంలోనూ లేని మానవాంశ బౌద్ధంలో ఉంది. అదొక పవిత్ర ధర్మం. ఓ దిక్కు సామ్రాజ్య వాద కాంక్షతో పెట్రేగిపోతున్న ప్రభుత్వాలు. ప్రపంచాధితప్యం కోసం పాకులాట ఆధిపత్య భావజాలం. దేశాల నిండా యుద్ధ సామాగ్రి నింపడం ఉద్రిక్తత. మరో దిక్కు కోట్లాది మంది ఆకలితో అలమటింపులు. ఇక శాంతెక్కడుంటుంది. పోటీపేరు మీద మానసిక ఒత్తిడి. ఇన్ని ఉద్రిక్తతల మధ్య మానవాంశను బోధించే ధర్మం ఏది? మతం లేకుండా బతకడం సాధ్యం కాదా? ఇలాంటి సమయంలో బౌద్ధం గురించి మరోసారి అందరూ ఆలోచింపజేయడానికి బౌద్ధ జయంతులు ఉపయోగపడాలి.

ఇప్పుడైనా, ఎప్పుడైనా దళితబహుజన వర్గాలు మతం గురించి ఆలోచించింది తక్కువ. అయినా దాని ప్రభావం తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బుద్ధుని బోధనలను మననం చేసుకుంటే ఎంత ప్రశాంతత? మతాల కతీతంగా బుద్ధం శరణం గచ్ఛామి. అనుకుంటే ఎంతహాయి? సంఘం, ధర్మం శరణం గచ్ఛామి కంటె ప్రశాంతత నిచ్చే మార్గమే మున్నది...? ఆలోచించండి!

మి

# అగాధం

(DE PROFUNDIS)

- ఆస్కార్ వైల్డ్
- అశ్విని.కె

*గత సంచిక తరువాయి..... (2)*

నావరకు నేను నా బాధలు గుర్తించ గలిగినపుడు - అలాగే ఈ సంఘంకూడా ఈ విషయంలో తన బాధ్యతను గుర్తించి నా సాధారణ జీవితానికి వాతావరణం కల్పించాలి కదా-

ఒక విధంగా - ఇతరుల కంటే నా విషయంలో పరిస్థితులు భిన్నంగా వుంటాయని తెలుసు- నిజానికి నా కేసు అట్లాందిదే కదా. పాపం, దొంగలు - మిగతా చిల్లర నేరస్తులు ఇక్కడే నాతో పాటు బంధించ బడ్డారు- వాళ్లు చాలా విషయాల్లో నాకంటే అదృష్టవంతులు. ఇదిగో ఈ పట్టణంలోగాని, పల్లెల్లోగాని, వీరి నేరాలు చాలా చిన్నవిగానే పరిగణిస్తారు. అంతేకాదు- ఆ నేరాలు తెలియకుండా చేసిన వాళ్లు - అమాయకులు - వాళ్ల పరిధి చాలా చిన్నది - రాత్రిపూట పక్షి ప్రయాణం చేయగలిగిన దూరమే- కాని నా విషయంలో ? అది చాలా విస్తృతమైనది. నేను ఎటు తిరిగితే అక్కడ నాపేరు చెక్కబడి వుంది- నేను శూన్యంలో నుంచి రాలేదు- అంతులేని కీర్తి శిఖరాల నుంచి అపఖ్యాతి లోయలలో పడిపోయాను. ఒక్కోసారి అనిపిస్తుంది. కీర్తికి-అపకీర్తికి ఒక్క లక్ష్మణరేఖ మాత్రమే మధ్యలో వుందని-

నేను ఎక్కడకు వెళ్లినా ప్రజలు నన్ను గుర్తుపడతారు. నా జీవితాన్ని, నా దుష్కర్మలను, దోషాలను ఎత్తిచూపుతారు. ఇదంతా మంచికే- ఈ వత్తిడిలో నన్ను నేను నిరూపించు కోవాలి. నా ప్రతిభను వెలికి తీసుకువచ్చి ఒక అద్భుతమైన సృజన చేస్తే- నా పై వ్యతిరేకతతో, నన్ను ఎగతాళిచేసే పిరికిపందలకు-నన్ను హేళన చేసే మూర్ఖులకు సమాధానం చెప్పగలను!!

నాకు జీవనం సమస్య చేస్తే నేనుకూడా వారికి సమస్యగానే తయారవుతాను. నా పట్ల ప్రజలకు నిర్దుష్టమైన వైఖరి ఏర్పడాలి. అది ఇరుపక్షాలకు న్యాయపరంగా వుండాలి. నేను మాట్లాడేది ఏ ఒక్కరో, ఇద్దరో గురించి కాదు- ఇప్పుడు నేను ప్రముఖంగా గుర్తించేది- కళాకారులు, బాధాతప్త హృదయులు, సౌందర్యోపాసకులు, దుఃఖపులోతులు తెలిసిన వారు! వారు మినహా మిగతావారితో నాకు పని లేదు. అంతేనా- ఈ శేషజీవితంలో నాకు వేరే అడగవలసిన అవసరాలేమీ లేవు. ఇప్పుడు చెప్పిన దంతా- నా జీవితం పట్ల నా మానసికస్థితే- ఈ శిక్ష అనుభవించి నందుకు నేను సిగ్గు పడటంలేదు అనే ఒకే ఒక్క కార్యాన్ని సాధించాలి- అదీ నన్ను నేను పరిపూర్ణుడుగా సంస్కరించు కోవటానికి - ఎందుకంటే నేను చాల లోపభూయిష్టుణ్ణి కదా!

ఇప్పుడు సంతోషంగా వుండడం ఎలాగో నేర్చుకోవాలి. ఒకసారి ఈ విషయం సహజంగా నాకు తెలిసి నపుడు - ఇక నా మనసులో వసంతమే! స్వభావ సిద్ధంగానే నేను సంతోషిని. ఇప్పటి వరకూ నాజీవితాన్ని ఆనందమయం చేసుకున్నాను, మధుపాత్ర నింపినట్లు! ఇప్పుడు నా దృక్పథాన్ని పూర్తిగా మార్చుకున్నాను. ఇక సంతోషమంటే ఏమిటో కూడా నాకు తెలియక పోవచ్చు!

ఆక్స్‌ఫర్డ్‌లో పీటర్ 'రినైజాన్స్' పుస్తకం చదివిన జ్ఞాపకాలు- ఆ పుస్తకం నన్ను పూర్తిగా మార్చివేసింది. వింత ప్రభావానికి లోనయ్యాను. డాంటే- 'ఇన్‌ఫెర్నో'లో స్వభావసిద్ధంగా దుఃఖంలో వుండే వారిని- ఎంత పాతాళంలో వున్నట్లు చూపాడు?

అలాగే 'డివైన్ కామిడీ'లో చివరికి 'చవిటి నేలలో వుండే వారు కూడా- చల్లటి గాలిని' ఎలా పీల్చగలరో చదివాను.

మతం అనాధ్యాత్మికతను నిరసిస్తుంది. కాని ఈ ఆలోచన చాలా కొత్తగా వుంది. ఒక మతాధికారి నిజజీవితం తెలియకుండా పాపపుణ్యాలను ఏ విధంగా నిర్ణయిస్తాడు? డాంటేని కూడా సరిగ అర్థం చేసుకోలేకపోతున్నాను- 'మనల్ని దుఃఖమే దేవుని దగ్గరకు చేరుస్తుందని' అన్నపుడు- బాధే సౌఖ్యమని ప్రేమించేవారి సంగతి ఏమిటీ అనుకొని- దీనిలో ఎంత వరకు నిజముంటుందని సంకోచించాను. కాని ఏదో ఒక రోజు అదే నా జీవితంలో అనుభవంలోకి వస్తుందని నాకెలా తెలుస్తుంది?

నేను 'వాండ్స్‌వర్త్' జైలులో వున్నపుడు-చనిపోవాలని తపించాను. అదే నా ఏకైక కోరిక!

తర్వాత రెండు నెలలు అనారోగ్యంతో వైద్యశాలలో వున్నతర్వాత, ఇక్కడకు మార్చబడ్డాను. ఇక్కడకు వచ్చిన దగ్గరనుంచి నా పరిస్థితి మెరుగుపడుతూనే ఉంది శారీరకంగా. కాని నాలో కోపం రగులుకు పోతోంది. అప్పుడే - జైలు నుంచి బైటకు విడుదలయిన రోజునే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కొంత కాలానికి ఆ దుర్మార్గపు ఆలోచన నన్ను వదిలిపోయింది. బ్రతకాలనే నిర్ణయానికి వచ్చాను. కాని దుఃఖపు కిరీటాన్ని పెట్టుకొని, ఎప్పుడు చిరునవ్వు కూడా లేకుండా, నేను అడుగుపెట్టిన చోటల్లా విచారగ్రస్తమయిన లోగిల్లా మార్చి- నా స్నేహితులను నాతోపాటు విషణ్ణ వదనాలతో నడిపించాలని- వారికి వ్యాకులతే జీవిత రహస్యమని తెలియ జెప్పాలని, వారిది

కాని దుఃఖంతో వైకల్యం కలిగించాలని, నా బాధతో వారిని చెరచాలనీ అనుకున్నాను. కాని ఇపుడు భిన్నంగా ఆలోచిస్తున్నాను. వారితో నిశ్శబ్దంగా కూర్చొని – సంతోషంగా వుండటం అలవాటు చేసుకోవాలని–అనుకుంటున్నాను.

నా స్నేహితులు నన్ను చూడటానికి వచ్చిన రెండు సందర్భాలలో వారితో వీలయినంత సంతోషంగానే వుండటానికి ప్రయత్నించాను. వారుకూడా నాపట్ల దయతో ఇంత దూరం రావటానికి తీసుకున్న శ్రమను నేను గుర్తించానని తెలిసేట్లుగానే ప్రవర్తించాను. ఇది వారికి ఆనందాన్నే కలిగించి వుండాలి. శనివారంనాడు 'R' తో ఒక గంటపాటు గడిపాను. అప్పుడే నా మానసికోల్లాసాన్ని పూర్తిగా వెలిబుచ్చ గలిగాను. అదీ నా ఆలోచనలను– ప్రవర్తనను ఎలా మార్చుకుంటున్నానో– తెలుసుకుని, ఈ జైలుగదిలోకి నెట్టబడిన తర్వాత మొదటిసారిగా జీవితంమీద ఆశ పెంచుకున్నాను.

నా ముందు–నేను నెరవేర్చ వలసిన కర్తవ్యం – ఎంతో వుంది. అందులో ఏ కొద్దిగా చేయకుండా చనిపోయినా అది ఎంతో ఎంతో విషాదకరమైన సంఘటనవుతుంది.

ఇపుడు కళాకారుల్లో, సాహిత్యంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. అవన్నీ ఒక సంపూర్ణ స్థితికి చేరుతున్నట్లని పిస్తోంది. అదిగో ఆ కొత్త ప్రపంచాన్ని చూడటానికి– బ్రతికి వుండాలని కోరుకుంటున్నాను. ఈ నూత్న ప్రపంచాన్ని నీకు తెలుసు కోవాలని వుందా? అది నీవూహించగలిగిందే– నేను ఇంతవరకు గడిపినదే – దుఃఖం– ఆవేదన ఇవి నాకు సమస్తమూ నేర్పిన ప్రపంచం!!

* * *

ఇప్పటి వరకూ కేవలం సుఖాన్వేషణలోనే గడిపాను. బాధ – దుఃఖాన్నుంచి దూరంగానే వుండి పోయాను. ఈ రెంటిని అసహ్యించుకున్నాను. వాటిని అనవసరమైనవని ఉపేక్షించాను. అవి నా బ్రతుకుతీరులో భాగం కాదనుకున్నాను. నా తత్త్వంలో వాటికి స్థానమే లేదుకూడా. అమ్మకు జీవితపు లోతులు తెలుసు. తరచూ చెప్పిన వాక్యాలు– కార్లైల్ వ్రాసిన పుస్తకంలోనివి – నాకు వినిపిస్తూండేది.

'దుఃఖిస్తూ భోజనం చేయని వాడు – శోకంతో రాత్రి గడుపుతూ – ఉదయం కోసం ఎదురు చూడని వాడు – అతనికి దేవుని శక్తి తెలియదు!' అని.

ఇవే వాక్యాలు – ప్రష్యారాణి తన ప్రవాసంలో– అవమానభారంతో వున్నపుడు చెప్తుండేది, నెపోలియన్ కాఠిన్యానికి లోనయికూడా–

ఇవే మాటలు అమ్మ తన జీవన సంధ్యాకాలంలో – కష్టమైన సమయంలోనూ వినిపిస్తుండేది – వీటిని నేను పూర్తిగా నిరసించాను. ఆ వాక్యాలలోని గూఢార్థాన్ని అంగీకరించటానికి నా మనసొప్పలేదు. అమ్మతో అనేవాడిని – నేను దుఃఖంతో తినను– రాత్రిళ్లు ఏడుస్తూ గడపనమ్మా – అని ! కాని విధి నాకోసం సరిగ్గా అటువంటి ప్రత్యేక విషయాలు దాచి పెట్టిందని నా కెలా తెలుస్తుంది. పైగా సంవత్సరం పాటు మరే పని లేకుండా ! ఆ విధంగా నా కష్టాల వాటా నాకు దక్కినట్లే – చివరి చివరికి నాకష్టాలు– కడగండ్లు అనుభవిస్తూ – ఆ వాక్యాలలోని దుఃఖార్తిని అర్థం చేసుకున్నాను. కొంతమంది మతపెద్దలు కష్టాలనుభవించ కుండానే అదొక మార్మిక విషయంగా చెప్పుకొస్తారు. ఇది తెలివి తక్కువ తనమే. బాధ అనుభవపూర్వకమే, ప్రత్యక్షంగా!

చరిత్రను వేరే కోణంనుంచి చూడాలి – సహజంగా మనకు మసక మసకగా కనిపించేవి – కళాసాహిత్యాల అవగాహన – అది పూర్తిగా అర్థం చేసుకుని స్పష్టంగా దర్శించాలి!

ఇప్పుడు నా దుఃఖానుభూతి, మనిషి భరించ గలిగిన భావోద్రేకపు తీవ్రత!, అదే కళకు అంతిమ పరీక్ష! ఒక కళాకారుడు భవ–భావాలను ఏకీకృతం చేసి చూడాలని తపిస్తుంటాడు – భౌతిక, బాహిర విశదీకరణ – అంతరంగ వేదనే. ఇలాంటివి చాలానే వుంటాయి. కేవలం కళారూపాలే కాదు. యౌవనోద్రేకాలు కూడా – ఈ విధంగానే వుంటాయి. క్లిష్టమూ సున్నితమూ అయిన ముద్రలు – భౌతికమైన దుమ్ము, గాలి, మంచుతో నిండినట్టి వాతావరణంలో ఆధునిక ప్రకృతి కళా రూపాలు – ఒకప్పుడు గ్రీకులు సాధించిన పరిపక్వతను – రంగుల మేళవింపులో – భావ వ్యక్తీకరణలో సాధించటానికే ప్రయత్నిస్తున్నాయి. అలాగే అన్నీ తనలో లీనం చేసుకోగలిగిన సంగీతం కూడా దీని నుంచి విడదీయదగినది కాదు. దీనికి తేలికగా చెప్పగలిగిన ఉదాహరణలు లేవు – కాని దుఃఖమే జీవితంలోను కళలోను తుట్టతుది గురుతు – కట్టకడపటి ఆనవాలు – చిట్టచివరి చిహ్నం!

* * *

మన నవ్వుల్లో ఒక నిర్లక్ష్యపు సంకేతం, మన సంతోషంలో ఒక మోటుదనం దాగి వుండవచ్చు– కాని వేదనకు వెనక ఎప్పుడూ దుఃఖమే వుంటుంది.

బాధ, సంతోషంలాగా, ఎలాంటి ముసుగు వేసుకోదు. సృజనలోని సత్యం – అవసరమైన ఆలోచన నుంచి హఠాత్తుగా సంభవించే ఆవిష్కరణ కాదు. అది నీడకు ఆకారం కాదు. అద్దంలో ప్రతిబింబం కాదు. లోయల నుండి ప్రతిధ్వనీ కాదు – వెన్నెల వెలుగులో చంద్రుడు కనిపించే ఒక నీటి సెల...

కళలో సత్యస్వరూపం, స్వతసిద్ధం– బాహిరంతరాల అద్వైతం! అంతరంగపుటావిష్కరణ. భవ–భావ సమీకరణ.

దీని కారణంగా – దుఃఖంతో పోల్చదగిన సత్యం లేదు. ఒక్కోసారి అన్పిస్తుంది– దుఃఖమే పరమసత్యమని. మిగతావన్ని కేవలం భ్రమలేనని. నిజానికి బాధలో నుంచే మన ప్రపంచాలన్ని నిర్మించబడ్డాయని. శిశువు జననంకానీ– నెబ్యులాలో నక్షత్రంకానీ– అన్నీ బాధ, ఘర్షణలు నుంచే జనిస్తున్నాయి కదా!

ఇంతకంటే, బాధలో ఇంకా ప్రగాఢమైన అసాధారణమైన సత్యం వుంది. ఇంతకు ముందు చెప్పినట్లు – కళా సాహిత్యాలకు అనుసంధానమైన చిహ్నంగా నేను నిలిచానని– ఎందుకంటే బాధ – వేదనే జీవితరహస్యం! ఆ రహస్యమే అన్నింటి వెనక వుంది. మనం జీవించటం తెలుసుకున్నపుడు – జీవితం మొదలయినపుడు– ఇష్టమైనవి ఇష్టంగా, కష్టమైనవి కష్టంగా తీసుకున్నా – మన ప్రయత్నాలన్నీ సుఖాన్వేషణ చేసేందుకే ఎక్కువ కాలం వుంటాయి. ఈ ప్రక్రియలో– మన అంతరంగాన్ని అణచి వేస్తుంటాము.

ఇదే విషయం– ఇంతవరకు నాకు తెలిసిన వాళ్లందరిలోకి అత్యంత మనోహర వ్యక్తిత్వం గల స్త్రీతో మాట్లాడిన గుర్తు.

ఆమె నా పట్ల ఎంతో గౌరవ పూర్వకమైన దయ చూపింది– ఈ దురదృష్టకరమైన బందిఖానాకు రాక పూర్వం– వచ్చిన తర్వాత కూడా.

నేను మాటల్లో చెప్పుకోలేని ఆమె కరుణ – ఆమె సహాయం, నా బాధలన్నింటినీ భరించగలిగిన శక్తిగల ఏకైక వ్యక్తిగా నా ముందర నిలిచింది. దీనిలో ఎంతో వాస్తవం వుంది. కొంత ప్రభావ పూరితమైన స్థితి ఉంది– ఆమె సన్నిధిలో నాకు కలిగిన సాంత్వన – అది సాధారణమైనదిగానే అనిపించినా – వెచ్చని ఎండలాంటిది – సాగర తీరం లాంటిది. సుఖదుఃఖాలు చెట్టాపట్టాలు వేసుకుని నడిచినట్లుండేది.

ఆ సమయంలోనే నేను ఆమెతో చెప్పిన జ్ఞాపకం. “చూడండి – ఈ విశాల నగరంలోని ఒక చిన్న వీధిలో ఎంత విషాదం నిండివుందో – ఇది చాలదా – దేవుడు నిర్దయుడని చెప్పటానికి, మానవుణ్ణి ప్రేమించడని వాదించటానికి –” అన్నాను.

‘ఓ చిన్ని పాప తెలిసీ తెలియక చేసిన చిన్న తప్పుకు ఏడవటం– ఈ సృష్టి మొత్తానికి మచ్చ కాదా!’ అని కూడా అన్నాను.

ఆమె కాదంది! నేను మాట్లాడేది తప్పంది! కానీ నేను నమ్మలేదు– అప్పుడు అది నమ్మే స్థితిలో కూడా లేను– కాని ఆమె మాటల్లోని సత్యం ఇప్పుడు ద్యోతకమవుతోంది. ఈ ప్రపంచంలోని వ్యాకులత అంతటినీ తెలుసు కోవటానికి ప్రేమ ఒక్కటే మార్గమని, ఇంతకు ముందన్నట్లు – బాధలోనుంచే ఈ ప్రపంచాన్ని నిర్మించామని – అవును దాన్ని నిర్మించిన హస్తాలు ప్రేమస్వరూపాలు – అదొక్కటే మార్గం – మనిషి అంతరంగపు పరిపూర్ణత సాధించటానికి – ఈ ప్రపంచం అస్తిత్వమే దాని మీద ఆధారపడివుంది.

అందమైన శరీరానికి ఆనందం – అందమైన అంతరంగానికి అనంతమైన వేదన ! –

ఇవన్నీ నేను నమ్ముతున్నానని గర్వంగా చెప్పగలను. సుదూర తీరంలో, కడిగినముత్యంలా అనంతస్వరూపుని నివాసం చూడవచ్చు, అది ఎంత అద్భుతంగా వుంది ! వేసవి వెలుగులో పసివాడు కూడా అందుకో గలడనిపిస్తుంది. నిజానికి పసిబాలుడు అందుకుంటాడు.

కాని నా పరిస్థితి వేరు. ఒక్కసారిగా తెలిసినట్లుంటుంది. కాని మొద్దుబారిన కాళ్ళతో కదలలేనపుడు – అది తెలియకుండా కాలంలో కలిసిపోతుంది.

అంతరంగం చేరగలిగిన ఉన్నతశిఖరాలను నిలుపు కోగలగటం చాలా కష్టసాధ్యమైన కార్యమే– మనం అనంతమైన ఆలోచనలు చేస్తుంటాము – కాని కాలం మెల్లగానే కదులుతుంది. అది జైలుగదిలో వున్నపుడు అసలు కదలదని వేరుగా చెప్పవలసిన పనిలేదు. ఆ జైలుగదిలాంటి మనసులోకి నిరాశానిస్పృహలు చీకటిలా అలుముకుంటాయి. వాటి ప్రవేశంకోసం, గుండెగూటిని కడిగి ముగ్గుపెట్టాలి. ఆహ్వానించని అతిథి వస్తున్నట్లు – కఠినాత్ముడైన యజమాని, అపరిచితుడైన బానిస రాకకోసం!!

ప్రస్తుతం నా వాళ్ళు ఇది నమ్మకపోయినప్పటికీ – వారు స్వేచ్ఛాజీవితంలోని సుఖాలనుభవిస్తున్నారు కాబట్టి – అవమానాలు గురించి తెలుసుకోవటం తేలికే కాని నా పరిస్థితి వేరుగా వుంది – మోకాళ్ళ మీద కదులుతూ ఈ జైలుగదిని కడగాలి ఉదయమే – ఈ జైలు జీవితం – దానిలోని పరిమితులు మనలో తిరుగుబాటు తనాన్ని రెచ్చగొడతాయి. అందులోని భయంకర విషయమేమంటే – ఇక్కడ ఎవ్వరి హృదయమూ పగల గొట్టరు – కాని హృదయాలన్ని ముక్కలయి పోతుంటాయి. అలాగే మనసు రాయిలా మారి పోతుంది కూడా. మొండి ముఖంతో – మూతిబిగించుకునే, రోజులు గడపాలి! ఎదురు తిరిగే వాడికి – దయ ఎక్కడ దొరుకుతుంది? నిజానికి – కళలో మాదిరిగానే – జీవితంలో కూడా – ఈ నిరసనస్థితి – అన్ని మానసిక మార్గాల్ని మూసివేస్తుంది– స్వర్గదారాలు మూసుకుపోతాయి! కాని ఇక్కడే నేను నేర్చుకోవాలి – ఇదే సరైన మార్గం – ఇక్కనుంచే నా అడుగులు సరైన దారిలో ప్రయాణిస్తాయి – నా చూపు ఆ ‘అందమైన ద్వారాలపై నిలిపి’ నడవాలి – దారిలో తూలిపడవచ్చు – లేదా పొగమంచులో దారి తప్పవచ్చు –

ఈ ‘కొత్త జీవితం’ దాంటే అన్నట్లు – ఇది నా కేమి కొత్తకాదు. ఇది పూర్వపు తీరుకు కొనసాగింపే – పరిణామ క్రమమే.

ఇపుడు గుర్తుకు వస్తోంది – ఆక్స్‌ఫర్డ్‌లో నా స్నేహితులతో– పక్షులతో నిండివున్న చెట్లక్రింద దారుల్లో నడుస్తున్నపుడు – నేను డిగ్రీ తీసుకునే ముందు సంవత్సరం – అపుడే చెప్పాను: ప్రపంచంలోని అన్ని మధురఫలాలను ఆస్వాదించాలని– ఆ రసహృదయంతోనే నేను ఈ విశాల ప్రపంచంలో అడుగు పెడుతున్నానని. అలాగే బయటకు వచ్చాను. ఆ విధంగా జీవించాను. కాని నా పొరపాటు – నేను వెలుతురులోనే వుండిపోయాను– దీనికి మరో కోణం వుంటుందని తెలుసుకోలేక పోయాను. అదే చీకటి నీడలని, అవే దుఃఖపు ఛాయలని!

ఓటమి, అవమానం, పేదరికం, దుఃఖం, నిరాశ, వేదన, కన్నీరు, బాధతో తెలియజెప్పే తెలివిడి – భంగపాటు, అంతులేని నిస్పృహ, పరితాపపు ముసుగులో ముడుచుకు పోయినట్లు,

చేదువిషాన్ని తాగబోతున్నట్లు – ఇవి– ఇవన్నీ నన్ను భయపెట్టినవే. వీటి గురించి తెలుసుకోకూడదని నిర్ణయించు కున్నాను కదా – ఇపుడు ఒక్కొక్కటి రుచి చూడవలసిన పరిస్థితి ఏర్పడింది– నిజానికి– ఇపుడు పూర్తిగా నా ఆహారమే అది అయిపోయింది!

నేను సుఖలాలనతో జీవించినందుకు ఏమాత్రం విచారించటం లేదు. ఆ విషయంలో పూర్తి సంతృప్తితోనే వున్నాను. మనం ఏ పనైనా పూర్తిగానే చేయాలి కదా– నేను అనుభవించని సుఖమే లేదు. నా అంతరంగపు ముత్యాన్ని మధుపాత్రలో ముంచి ఆనందించాను. వేణుగాన మాధుర్యానికి పరిమళాల పూలదారిలో ప్రయాణించాను. సౌఖ్యాల మధుసేవనంలోనే జీవించాను – కాని అదే దారిలో కొనసాగడం పొరపాటవుతుంది. దేనికయినా ఒక పరిమితి వుంటుంది కదా – ఇంక అక్కడి నుంచి కదలాలి – ఈ వెలుగులకు అవతల నా కోసం చీకటి రహస్యాలు దాగివున్నాయి. నిజానికి ఇవన్నీ చూచాయిగా నా రచనల్లో వున్నాయి. The Happy Prince; The Young King - కొన్నిచోట్ల మతాధికారి తన ముందు వంగిన కుర్రవాడితో 'దేవుడే కదా దుఃఖాన్ని మంచిగా మార్చాడు?' అని రాసినపుడు – అది ఒక వాక్యమే – కాని దీని అంతరార్థం నాకోసం ఇదిగో ఇక్కడ ఎదురు చూస్తుందని అనుకున్నానా? 'Dorian Gray' చిత్రంలోని రక్తపు జీరతో వున్న దారాలు – The Critic As Artist లో ఎన్ని రంగుల్లో వుంది, 'సలోమి'లో కూడ రాశాను. అదీ తేలికగా అర్థమయ్యే రీతిలోనే 'సలోమి' (Salome) లో సంగీతాన్ని బంధించి వుంచే తీగల్లా కూడ వినపడుతుంది. 'ఒక్కక్షణం జనించే సుఖం' అను లోహపు శిల్పం నుంచి – 'శాశ్వతంగా వుండే దుఃఖం' జన్మించటం – ఇలాగే ఇదే– జీవితంలో ప్రతిక్షణంలో జరగబోయే దాని సంకేతం ముందుగానే దర్శనమిస్తుంది.

కళ ఒక చిహ్నమే – మనిషి కూడా ఒక చిహ్నమే, సంకేతమే.

నేను దానిని సాధించవచ్చు–కళాత్మక జీవితం – కళ ఒక చిహ్నమే అయితే – నేను దానిని అందుకోగలను– అదే కళాత్మక జీవితానికి సార్థకత! అంటే నన్నునేను పరిపూర్ణుడుగా చేసుకోవాలి. అవమాన భారం– కళాకారుని అనుభవాల సారమే– ప్రేమ, సౌందర్యానికి ఎలా సంకేతమో– అదే– శరీరాన్ని అంతరంగాన్ని ప్రపంచానికి ప్రదర్శిస్తుంది. Marius The Epicurean లో పీటర్ తన కళాజీవితాన్ని – మతపరంగా అన్వయించుకుని – సాంత్వన పొందుతాడు.

కాని Marius – కేవలం ప్రేక్షకుడు కాడు – అంతకంటే జీవన సంరంభాన్ని భావావేశంతో దర్శించగల ప్రేక్షకుడు – ఇది Wordsworth కవి ఆదర్శాన్ని నిర్వచించిన విధానం! కాని ప్రేక్షకుడు తన పరిసరాలను మరచిపోలేడు– అతను చూసేది – దుఃఖాగ్నిలో పునీతమైన పుణ్యస్థలాన్ని! బాధాతప్త హృదయం సేదదీరే కరుణాలయాన్ని!

* * *

ఇప్పుడే – క్రీస్తు నిజ జీవితానికి – కళాకారుని జీవితానికి ఒక ఆత్మీయకు సంబంధం వుండటాన్ని గమనించాను.

నిజానికి – దుఃఖంనన్ను క్రమ్మివేయక ముందే – నా కాలాన్ని అది కాటువేయక మునుపే – ఈ సంబంధాన్ని The Soul of Man లో– క్రీస్తులాగా జీవితాన్ని గడపగలిగిన వాడు – అతను సంపూర్ణుడని – నా రాతలు – కొండవాలులో గొర్రెలు కాదని – జైలు గదిలో ఖైదీ కాదని – ఒక చిత్రకారునికి ప్రపంచమే కాన్వాసు అని – ఒక కవికి ఈ లోకమే సంగీతమని – చెప్ప గలిగాను.

పారిస్ కేఫేలో కూర్చున్నపుడు – Andre Gide కి చెప్పాను: మెట్టవేదాంతంలో నాకేమీ ఉత్సాహం లేదని – నైతికతలో నిజాయితీలేదని, కాని, ప్లేటో గాని, క్రీస్తుగాని చెప్పింది ఏదయినా కళారూపంగా మార్చవచ్చని – దానికి సంపూర్ణత్వం కలిగించడమేనని.

క్రీస్తు జీవితం చూస్తే మనం తెలుసుకో వచ్చు – ఆయన వ్యక్తిత్వంలోని పరిపక్వత – విశిష్టత – రమణీయత నిజమైన స్పష్టమైన – విశేషమైన వ్యత్యాసం – వున్నా– అదే కళాకారునికి అత్యంత సున్నితమైన సామీప్యంగల సహజ గుణం, అదే తీక్షణమైన అగ్నికణం లాంటి కల్పనా శక్తి వుంటుందని.

మానవ సంబంధాల పరిధిలో ఆయన అర్థం చేసుకున్నది అదే, సృజనా ప్రపంచంలోని విచారణ కళా ప్రపంచంలోని రహస్యమని – కుష్ఠురోగి రోగాన్ని, గుడ్డివాని చీకటిని, కేవలం సుఖాల పరిధిలో జీవించేవాడి దైన్యాన్ని – ధనికుల వింత పేదరికాన్ని – ఆయన పూర్తిగా అర్థంచేసుకున్నాడనే చెప్పాలి.

కష్టంలో వున్నపుడు నాకెవరో రాశారు – నీవు వున్నతంగా లేనపుడు– అది నీవు కాదు! అని – కాని ఈయనికి Matthew Arnold రాసిన 'జీసస్ రహస్యాలు' తెలిసినట్లు లేవు. కాని అతను తెలుసుకోవలసింది – 'ఇంకొకరికి ఏది జరిగిందో – అది మనకీ జరిగినట్లే' నని–

ఏదైనా శాసనం చదవాలనుకుంటే – ఉదయం కాని, రాత్రికాని, సంతోషంగానైనా– విచారంగానైనా– మీ యింటి గోడల మీద రాయండి – సూర్యకిరణాల బంగారుపూతలో మెరుస్తాయి. చంద్రకిరణాల వెండి వెలుగులోనూ కనపడుతుంది. 'ఒకరికి ఏమి జరిగినా – మరొకరికీ జరుగుతుంది' అని!

* * *

నిజానికి క్రీస్తు కవుల సరసన వుండ వలసినవాడు. ఆయన ఆలోచనలోనుంచే కదా మానవజాతి ఉద్భవించి – రూపు దాల్చింది. దేవుని మీద విశ్వాసం గలవాడే – దేవుని నమ్మకానికి పాత్రుడవుతాడు. ఆయనే కదా అన్ని జాతులను ఏకం చేశాడు. క్రీస్తుకు పూర్వం – చిల్లర దేవుళ్లు జనసమూహాలున్నాయి. తన

మార్మికమైన కరుణతోనే – సానుభూతితోనే వారికి తనలోనే జన్మనిచ్చి – తనని తాను ఒకని తనయునిగా పిలుచుకున్నాడు. ఇంతవరకు చరిత్రలో అతనే కదా మనలో ఒక అద్భుతమైన తన్యతను నిద్రలేపాడు– అది ఎంత రమణీయకమైనది!

నాకు ఇప్పటికీ నమ్మశక్యంకాని సత్యం – ఒక యువ గలీలియన్ కాపరి – ఈ ప్రపంచపు భారాన్నంత తన భుజానికెత్తుకో గలనని ఎలా అనుకున్నాడు? అందరి పాపాలను – అందరి దుఃఖాన్ని – ఇంక ముందు జరగబోయేవి కూడా – నీరో పాపాలు – సీజర్, అలెగ్జాండర్ VI, రోమ్ సామ్రాజ్యాధినేత, సూర్యుని పూజారి, జనసమూహాల వేదనలు – ఇప్పటి వరకు వున్న సమాధులలో మ్రగ్గిన మౌన దుఃఖం; అణగతొక్క బడిని జాతులు – పసివాళ్లు – దొంగలు, జైళ్లలో మ్రగ్గి పోతున్న వాళ్లు – అంటరాని వాళ్లు – (వాళ్ల నిశ్శబ్దవేదన కేవలం దేవుడు మాత్రమే వినగలడేమో?) ఇదంతా ఊహించటమే కాదు – చివరి వరకూ సాధించటం – ఇప్పటి వరకూ ఆయన గురించి తెలిసినవాళ్ళు – ఆయన శిలువకు తలవంచినా – పూజారి ముందు మోకాళ్ళపై వంగి మ్రొక్కినా, తమ తమ వికారమైన పాపాలన్ని నిర్మూలించబడి, దుఃఖపువేదన యొక్క సౌందర్యం అనుభవంలోకి రావడం తెలుసుకుంటున్నారు.

అవును నేను అన్నట్లు – క్రీస్తు కవులతో పాటు వుండవలసివాడే – షెల్లీ – సోఫోకల్స్‌తోపాటు ! అంతేనా – ఆయన జీవితమంతా కవితామయమే కదా – 'జాలికి–భయానికి' గ్రీకు విషాదంతో సరితూగేది ఏముంది? పోటాగనిస్ట్ సంపూర్ణ స్వచ్ఛత – ఈ ప్రణాళికను ఒక రమణీయకళగా మార్చి వేస్తుంది– టెబీస్, పెలాప్స్ – మరీ దారుణ భీకరత్వాన్ని వదిలి – అరిస్టాటిల్ – ఎంత పొరపాటుగా చెప్పాడో (విషాదంలో ఎవ్వరూ పవిత్రంగా వుండరని) ఎచిలన్‌గాని, డాంటేగాని, (వీరంతా సున్నితత్వంలో గొప్పవారు). షేక్స్‌పియర్ (ఈయన కళాసాహిత్యకారులు అందరిలోకి పరిశుద్ధుడు నిర్మలుడు) సెల్టిక్ మార్మికతలో – లిజెండ్ (Legend)లో ప్రపంచ సౌందర్యం – కేవలం కన్నీటి ధారలలోనే ఆవిష్కరించిన మానవుల జీవితం కేవలం పూవులాంటిదని – అంత క్షణికమని – బాధతో కూడిన విషాదం కంటే సూక్ష్మమైన ప్రభావాలేమీ వుండదని.

వీటిని, క్రీస్తు తన చివరి పాషన్ (Passion)తో పోల్చవచ్చునేమో – తన పరివారంతో చివరిగా ఆహారం తీసుకున్న సన్నివేశాలను, (అందులో ఒకరు తనను అమ్మేసినవాడు వున్నాడు) ఆ వెన్నెల రాత్రి వనంలోని విషాదం – తన మిత్రద్రోహి – దగ్గరకు వచ్చి ముద్దు పెట్టబోవడం – తనని ఇంకా పూర్తిగా నమ్మిన స్నేహితుడు, మానవునికి విశ్రాంతి గృహాన్ని నిర్మించాలని తపించినవాడు – ఉదయపు కాంతిరేఖలు, పక్షుల అరపులతో ఆగిపోయిన ప్రణాళిక – ఆ తన ఒంటరితనం – తన లొంగుబాటు – అన్నింటినీ అంగీకరించిన ఏకాకి ! ఆహ్వానించిన వానిపై సనాతన పూజారి ఆగ్రహం – అప్పటి పౌరన్యాయాధిపతి – నీళ్లలోసం (తనను తనను అమాయకుని రక్తపు మరకల జాడ కడిగేసుకునేందుకు?) అడగటం, ( ఆరక్తపు ఛాయే అతన్ని చరిత్రలో అరుణమూర్తిగా నిలిపింది) ముళ్లకిరీటపు అలంకరణ, ఇటువంటిది చరిత్రలో ఎంతో అరుదైనది కదా – అమాయకుని శిలువపై శీలలు – అదీ తల్లి సమక్షంలోనే – కొట్టి – తను ప్రేమించిన శిష్యుని ఎదురుగానే శిలువ వేయడాన్ని, తన దుస్తుల కోసం పందాలు కాస్తున్న సైనికుల ముందు తన దుఃఖసమయంలో ప్రపంచానికి శాశ్వతమైన చిహ్నాల్ని వదిలి– తరువాత ఒక ఖరీదయిన సమాధిలో – ఈజిప్టు దేశపు గుడ్డలు చుట్టిన దేహం – సుగంధ ద్రవ్యాలతో నిండిన వాసనలతో అతనొక రాజకుమారుని లాగ నిద్రించాడు కదా!

ఇదంతా కళా దృష్టితో సృజనాత్మకమైన ఊహను ఆవిష్కరించి చూడ గలిగితే – ఈ గొప్ప చర్చిం ఈ డ్రామా అంతా రక్తపాతం లేకుండా నడిపిన అద్భుతమైన విషాద మార్మిక ప్రదర్శన; సంభాషణలు, ఆహార్యం, సంకేతాలు అన్నింటిలోను తన దేవుని కరుణను, ప్రదర్శించిన తీరు నన్ను ఎప్పుడు ఆశ్చర్య పరుస్తూ ఉంటుంది.


కాని క్రీస్తు జీవితం అంతా విషాదమే – అందులోని కరుణ, దాని అంతరార్థపుటావిష్కరణలోనే సౌందర్యం నిండివుంది. ఇదంతా ప్రార్థనా మందిరాలు మూతపడటంతో – చీకటి నీడలు నేలను క్రమ్మడంతో – అంతమై పోతుంది – ఆ సమాధిగృహానికి రాతిని అడ్డు పెట్టడంతోనూ ఆగిపోతుంది. ఎక్కడో ఆయన చెప్పినట్లు – ఒక పెళ్లి కుమారుడు తన స్నేహితులతో వున్నాడు – తన గొర్రెలతో ఏదో పర్వత సానువుల్లో దారి తప్పుతున్నట్లు చల్లని నీళ్ళ కోసం వెతుకు తున్నట్లు – ఓ పాటగాడు, సంగీత ధ్వనులతో దేవునికి నగరాన్ని నిర్మించాలని తపిస్తున్నట్లు – ఒక ప్రేమికుడు – తన ప్రేమతో ఈ ప్రపంచాన్ని సూక్ష్మంగా చేసినట్లు – ఆయన మాయలన్నీ – చాలా సహజంగా, నీటిసెల లాగనే అన్పిస్తుంది. వీటిని నమ్మడంలో నా కేలాంటి సందేహం లేదు – ఆయన వ్యక్తిత్వంలోని స్వచ్ఛమైన వెలుగు – బాధతో మూలుగుతున్న జీవులకు శాంతినిస్తుందని, ఆయనకు – వారికి కేవలం ప్రేమ, ఆనందం గీతాలే వినపడతాయని, (అపోలో వేణునాదంలా) ఆయన సమక్షంలో దుర్మార్గపు ఆలోచనలన్ని అంతర్థాన మయిపోతాయని నమ్ముతాను.

ఆయన ఆ కొండల్లో మాట్లాడినపుడు విన్నవారికి ఆకలిదప్పులు మాయమయినట్లు – లేదా, అర్థంలేని జీవితాలను చాలించిన సాటి మానవులందరూ సమాధులు వదిలి ఆయన పిలుపు అందుకున్నట్లు – ఆయన మృదుభాషణ వింటూ – తమ ఆహారపు కాఠిన్యాన్ని మరిచి పోయిన ఆయన స్నేహితులు – వారు తాగే నీరు మధువులుగా మారి పోవడం – ఆ భవనమంతా పరిమళాలతో నిండి ఆనందమయంగా విరిసి పోవడం.


**ఇంకావుంది.....**

# చదవండి...

– ఎన్నార్కె




✦ **త్రిపురనేని రామస్వామి :** త్రిపురనేని రామస్వామిగారిపై ప్రముఖుల అభిప్రాయ మాలిక – పుస్తకం పేరును చూస్తేనే అందులోని విషయం మనకు తెలుస్తుంది. సంకలన కర్త కాట్రగడ్డ కృష్ణచంద్. సూక్ష్మంలో మోక్షంలా కవిరాజుపై ఎన్నో విషయాలను సంగ్రహ పరచి ప్రచురించారు. పుస్తకం చిన్నదయినా రచయిత చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. *పేజీలు 76, వెల : ₹ 40/–, లభించు స్థలం చిరునామా: కాట్రగడ్డ కృష్ణచంద్, హరిపురం పోస్ట్, దిమిలి S.O, రాంబిల్లి మండలం, విశాఖ జిల్లా.*




✦ **అరువది నాలుగు కళలు:** రచయిత ముప్వల సుబ్బరామయ్య. కళ అనే శబ్దం యొక్క అర్థాలు, నిర్వచనాలు ప్రాచీన మధ్యయుగాలలో ఒక రకంగానూ ఆధునిక కాలంలో మరొక విధంగాను వాఖ్యానించటం జరుగుతుంది. కళ శబ్దం మనదేశ భాషలలో విస్తృతంగా ప్రయోగించ బడింది. 64 మూల కళలపై విశ్లేషణాత్మకమైన దీర్ఘవ్యాసం ఈ పుస్తకం. *పేజీలు 50, వెల : ₹ 30/–. జయంతి పబ్లికేషన్స్ విజయవాడ వారి ప్రచురణ.*




✦ **భారతీయత:** శివానంద మూర్తిగారి ప్రచురిత వ్యాస సంకలనం. ప్రపంచంలోని అన్ని నాగరికతలకంటే అవి సనాతనమైనది భారతీయ నాగరికత. ఈ నాగరికతను, చరిత్రను పురాణ సాహిత్యాన్ని పరిచయం చేస్తున్న క్రమంలో వేద వాఙ్మయాన్ని, తర్వాత శాస్త్రాల్ని ఆస్తిక, నాస్తిక దర్శనాల్ని స్థూలంగా పరిచయం చేశారు రచయిత. ఇందులో 106 వ్యాసాలున్నాయి. వ్యాసాల నిడివి తక్కువగా వున్నా విషయ ప్రాధాన్యత తగ్గకుండా రచన సాగింది. *పేజీలు 330, వెల : ₹ 180/–, లభించు చోటు సనాతన సుపథ పబ్లికేషన్స్, ఆనందవనం, భీముని పట్నం, విశాఖ జిల్లా.*





✦ **అవును నిజమే:** కథల సంపుటి రచయిత. డి. రామచంద్ర రాజు, కేతు విశ్వనాథరెడ్డి వీటిని కలవరపెట్టే కథలు, బాధపెట్టు కథలు, నిజంకథలు, మనిషి తనం కోసం ఎదురు చూడమని చెప్పే కథలంటూ పేర్కొన్నారు. జీవితానుభవం, విస్తృత అధ్యయనం, గాఢమైన భావుకత, మంచితనం పట్ల మమకారం ఈ పది కథలలో కనిపిస్తాయి. *పేజీలు 115, వెల : ₹ 100/–, ప్రతులు కావలసినవారు 9908324214 ను సంప్రదించవచ్చు.*





✦ **మా యాత్ర :** తెలుగులో యాత్రాసాహిత్యం ఏనుగులవారి కాశీయాత్రతో ప్రారంభమై ఎమ్. ఆదినారాయణ భ్రమణ కాంక్షతో పాఠకులకు ఆ తరహా రచనలపై ఇష్టాన్ని పెంచింది. యాత్ర చేయటంలో ముఖ్యోద్దేశము కొన్ని స్థలాలను, సందర్శించటకు కాదు ఆ యాత్ర సాగిన ప్రయాణం వాటి వివరాలు, తోటి ప్రయాణికులు, యాత్రాస్థలాలలో కానవచ్చే మనుష్యులు, వారి మనస్తత్వాలు, వీటన్నిటినీ అనుభవిస్తూ, ఆస్వాదిస్తేనే ఆ యాత్ర సఫలమవుతుంది. ఈ రచనలో ఆధోరణి కనిపిస్తుంది. ఊరువాడ బతుకులు రచయితయిన దేవులపల్లి కృష్ణమూర్తి తాను కొందరితో కలసి బస్సులో చేసిన యాత్రా విశేషాలు మన ముందుంచటం కోసం తనతో ప్రయాణం చేసినట్లుగా ఒక ఊహావ్యక్తిని సృష్టించుకుని వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ మా యాత్రా విషయాలను ఆవిష్కరించారు. ఆద్యంతం ఒక ఆహ్లాదకరమైన ప్రయాణంలా సాగిందీ రచన. *పేజీలు 115, వెల : ₹ 60/–*


❖ **క్షేత్రయ్య పదాలు:** సంకలన రచయిత, శ్రీనివాస చక్రవర్తి క్షేత్రయ్య పదాలు పచ్చిశృంగార గీతాలనే భావాలు వ్యాప్తిలో వున్నా అందులో కూడా ఉదాత్త ప్రేమ, మంచి కవిత్వం వున్నవిగా భావించి నూరుపదాలను ఏరి కూర్చారు రచయిత. కొన్నిటిలోని అశ్లీల పదాలకు, అసభ్య శృంగారం వర్ణతమైన చరణాలను ఎత్తివేశారు. కొన్ని పదాలకు శీర్షికలు పెట్టారు కొన్నింటిలో పల్లవినే శీర్షికగా తీసుకున్నారు. ప్రతి దానికి రాగము-తాళము వివరాలు కూడా ఇచ్చారు. *పేజీలు 125, వెల : ₹ 40/-, జయంతి పబ్లికేషన్స్ ప్రచురణ.*




❖ **హంసల దీవి గోపాల శతకము:** హంసలదీవి అధిష్టాన దేవతయిన గోపాలదేవునిపై ఆంధ్రనాయక శతకకర్త శ్రీ కాసుల పురుషోత్తమ కవి రచనపై ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావుగారి విశ్లేషణాత్మక వాఖ్యానం ఈ రచన. శతకంలోని ప్రతిపదము దాని అర్థం, భావం సులభగ్రాహ్యమైన శైలిలో వాఖ్యాత మన కందించారు. *పేజీలు 115, వెల : ₹ 70/-, అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలలలో లభ్యం.*




❖ **నిత్యజీవితంలో సజీవ ధ్యానం:** అనుసరణ అన్నపరెడ్డి బుద్ధఘోషుడు. ఈ పుస్తకం విపస్సనా ధ్యానం గురించి. విపస్సనా ధ్యానం అంటే ఉపవిష్ట ధ్యానం. ఇది ఎప్పుడైనా ఎక్కడైనా చేయవచ్చు. విపస్సన సాధన ద్వారానే గౌతముడు బుద్ధుడైనాడు. బౌద్ధులైన వారు తమ నిత్య జీవితంలో రోజుకి కనీసం అర్థగంట పాటైనా విపస్సనను సాధన చేయాలి. నిత్యజీవితంలో ధ్యానసాధన ఎలా సాగించాలి అన్న విషయంపై ఈ గ్రంథంలో వివరించబడింది. *పేజీలు 100, వెల : ₹ 50/-, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆది హిందూభవన్, హైదరాబాద్-27 లో లభిస్తుంది.*




❖ **మాయమ్మ సరస్వతమ్మ:** రచన పాతూరి కుసుమకుమారి, మాతృదేవోభవ అనే పదానికి సార్థకత చేకూర్చిన తన తల్లికి రచయిత్రి అంకితంగా ఇచ్చిన వచన కవితా మాలిక. ఎంత వ్రాసినా, ఎంత చెప్పినా, తనవి తీరని మాతృత్వపు ప్రేమపై వచ్చిన చక్కని రచనిది. మొత్తం రచనలను మూడు భాగాలుగా విభజించి మొత్తం 119 గీతాలు రచించారు. *పేజీలు 35, ఈ రచనకు రచయిత్రి విలువ నిర్దేశించ లేదు. ఫోను : 040-23402436.*




❖ **శృంఖల :** నూజివీడులో లెక్చరర్‌గా పనిచేసిన దుర్గానంద్ వ్రాసిన దీర్ఘకావ్యం ఈ రచన. మానవుడు ప్రేమ స్వరూపులు. తన ప్రేమ మార్గంలో అవరోధం ఏర్పడినపుడు అది ద్వేషంగానో, కోపంగానో మారుతుంది. మానవుని ఆకాంక్ష, జీవన ధ్యేయం ఏమిటి అన్న జిజ్ఞాసయే ఈ కావ్యరచనకు ప్రేరణంటారు రచయిత. 17 వచన కవితలున్న ఈ పుస్తకం 125 పేజీలు, వెల 90/- రూ. కావలసినవారు కిరణ్‌బాబు - 040- 27222370. సంప్రదించవచ్చు.




❖ **బౌద్ధ దర్మ దర్శిని:** శాఖోపశాఖలుగా విస్తరించిన బౌద్ధధర్మంలో కాలక్రమంలో ఎన్నో అస్పష్టతలు, అపోహలు చోటుచేసుకున్నాయి. బౌద్ధ స్వధర్మం యొక్క స్వరూపాన్ని స్పష్టంగా మన ముందుంచిన వారు భదంత ఆనంద కౌసల్యాయన్. హిందీలో ప్రశ్నలు, జవాబులు రూపంలో నున్న ఈ రచనకు జనపన లక్ష్మీరెడ్డి గారు చేసిన తెలుగు అనువాదము ఈ పుస్తకం. వర్ణాశ్రమ విభజనను బౌద్ధం హేతువాద దృష్టితో ఖండించటం ఈ రచనలో స్పష్టంగా చెప్పబడింది. ఎన్నో విషయాలపై బౌద్ధం పట్ల సామాన్య ప్రజలలోనున్న అపోహలకు ఈ పుస్తకం చెక్ పెట్టింది. *పేజీలు 160, వెల : ₹ 100/-, ధర్మదీపం*

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | | |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ | " " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 11. | సిద్ధార్థ | " " | 50.00 |
| 12. | నాలో నేను | " " | 30.00 |
| 13. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 14. | కథాంజలి-2 | " " | 110.00 |
| 15. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 16. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 17. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 18. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 19. | గురవాయణం | డాక్టర్ *గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 11. | నూరేళ్ళ తెలుగు కథ - మహ్మద్ ఖదీర్ బాబు | |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని (తియ్యగూర సీతారారెడ్డి & నందం శ్రీనివాసరావు) | 35.00 |
| 12. | మిళింద ప్రశ్నలు (బోధచైతన్య) | 150.00 |
| 14. | బౌద్ధ ధర్మదర్శిని (భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మీరెడ్డి) | 100.00 |
| 15. | ప్రజ్ఞాదీపిక (తియ్యగూర సీతారారెడ్డి & నందం శ్రీనివాసరావు) | 60.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..................................................

వీధి ..................................................

పేట ..................................................

ఊరు ..................................................

పిన్ ..................................................

సెల్ ..................................................

**3. సంతకం :** ..................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |


---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్దార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



ఆమ్రపాలి

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



మహాభినిష్క్రమణ